Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ షష్ఠి రా. 1.45 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: అశ్విని మ. 12.25 వరకు, అనంతరం భరణి; అమృతకాలం: ఉ. 6.55 వరకు; వర్జ్యం: ఉ. 8.29 నుండి 10.03 వరకు, రా. 9.43 నుండి 11.15 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు;

సంపుటి:56 • సంచిక:311 • బుధవారం 21 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



రోబోలకూ మానవత్వం ఉంటుంది. మీలాగే నాకు విశ్రాంతి కావాలి. మనుషుల ఫీలింగ్స్ అర్థం చేసుకుంటా. నాకు బ్యాంక్ అకౌంట్ లేదు. ప్రపంచంలో ఫేమస్ టెక్ పర్సన్ నా సృష్టికర్త డేవిడ్ హాన్సన్

- రోబో సోఫియా

అచ్చం మనిషిలాగే మాటలు

చిరునవ్వులతో హావభావాలు

కంటి సైగలతోనూ జవాబులు

నచ్చిన ప్రాంతం హాంకాంగ్

ప్రపంచ ఐటీ సదస్సులో

సోఫియా ప్రత్యేక ఆకర్షణ

ఆద్యంతం తెలివైన

జవాబులతో అలరించిన రోబో

సోఫియా ముఖంలో 66 రకాల

హావభావాలు: హాన్సన్

నిండా నా వయసు రెండేళ్లే!

నాకిష్టమైన హీరో షారూఖ్ ఖాన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రపంచంలోనే ఓ దేశ పౌరసత్వం పొందిన యాంత్రిక మనిషి (అడ్వాన్స్‌డ్ హ్యూమనైడ్ రోబో) 'సోఫియా' మంగళవారం ఐటీ కాంగ్రెస్ సదస్సులో పాల్గొన్న ప్రముఖులందరినీ అబ్బురపరిచింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేదస్సు కలిగిన ఈ మరమనిషితో నిర్వహించిన వ్యక్తిగత ముఖాముఖి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృత్రిమ మేదస్సు అనే అంశంపై జరిగిన చర్చలో భాగంగా మానవ రోబో సోఫియాను దాని సృష్టికర్త అయిన డేవిడ్ హాన్సన్ ఇంటర్వ్యూ చేశారు. మానవత్వంతోనే మెరుగైన భవిష్యత్తు అనే అంశంపై అడిగిన అన్ని ప్రశ్నలకు సోఫియా సమాధానాలు ఇచ్చింది. చిట్టిచిట్టి మాటలతో, ముఖ కవళికలతో, మధ్యమధ్యన చిరునవ్వుతో, కంటిచూపు సైగలతో మరమనిషి చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. రోబోకు ప్రత్యేక నిబంధనలేవీ అవసరం లేదని పేర్కొంది. తన సౌదీ అరేబియా పౌరసత్వాన్ని మహిళా సాధికారత కోసం వినియోగిస్తానని సోఫియా ఈ సందర్భంగా స్పష్టం చేసింది. రోబోలకు కూడా మానవత్వం 2వ పేజీలో...



ప్రపంచ ఐటీ సదస్సులో రోబో సోఫియా

మాస్ కాపీయింగ్ చేస్తే

ఎవ్వర్నీ వదలొద్దు



5

టీచర్లను, తల్లిదండ్రులను, విద్యార్థులను ప్రాసిక్యూట్ చేయండి • కార్యాచరణ నివేదిక ఇవ్వండి • తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం



రైతుల ఆదాయం రెట్టింపుపై మంగళవారం ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సుకు వెళుతున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధా మోహన్ సింగ్

4 రైతుల ఆదాయానికి సూత్రాలు

• పాత విధానాలు పనికిరావు • 99 ప్రాజెక్టులతో తగ్గనున్న పంట వ్యయం • అన్నదాత ఆదాయం రెట్టింపే లక్ష్యంగా కేంద్రం చర్యలు • నష్టాల ఊబి నుంచి గట్టెక్కేలా ప్రణాళికలు • 22వేల గ్రామీణ మార్కెట్ల ఆధునీకరణ • పంట ఉత్పత్తి ప్రదేశాలకు 5-15 కిలోమీటర్ల పరిధిలోనే మార్కెట్లు • నిపుణులతో జాతీయ సదస్సులో ప్రధాని మోడీ

11 లో

నదులవారీ ట్రిబ్యునళ్లకు స్వస్తి

ఇక ఒకే దేశం-ఒకే ట్రిబ్యునల్

కాలయాపన, వృథా ఖర్చులతో సమస్యలు జటిలం

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు పెంచుతాం

జల జగడాలకు ఇకపై చరమగీతం

ప్రాంతీయ సదస్సులతో రోడ్ మ్యాప్

దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ సదస్సులో

కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రాల మధ్య జలజగడాలు జాతీయ అభివృద్ధికి ఆటంకమని, జలవివాదాలకు చరమగీతం పాడుదామని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ సదస్సులో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు రాష్ట్రాలతో తొలి ప్రాంతీయ సదస్సును హైదరాబాద్ నుండే ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఈ సమావేశాన్ని 2వ పేజీలో...



మంగళవారం హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ సదస్సులో కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్, రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు

పట్టిసీమ నీటివాటా మాకివ్వాలి

• ఆర్‌డిఎస్ సమస్యను కేంద్రమే పరిష్కరించాలి • సదస్సు స్ఫూర్తిదాయకం: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బచావత్ అవార్డు ప్రకారం పట్టిసీమ-కృష్ణా అనుసంధానంతో వాడుకుంటున్న వంద టిఎంసిలలో తమ వాటా వెంటనే కేటాయించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. దక్షిణభారత ఇరిగేషన్ మంత్రుల సదస్సు ముగింపు సందర్భంగా నిర్వహించిన 2వ పేజీలో...

ఆర్డినెన్స్ రెడీ

• ఈ వారంలో ప్రకటన • బడ్జెట్ సమావేశాలకు ముందే • పేద, ధనిక తారతమ్యం లేకుండా క్రమబద్ధీకరణ • చట్టంలో నిబంధనల సవరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరాధీనమైన అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు ఆర్డినెన్స్ సిద్ధంగా ఉన్నది. బడ్జెట్ సమావేశాలకు ముందుగానే ఆర్డినెన్స్‌ను తేవాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. అనుమానాలపై న్యాయశాఖ ఆమోదం రావడంతో వడివడిగా ఏర్పాట్లు చేస్తున్నది. 22.63 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై భూ దస్త్రాల పరిశీలనతో స్పష్టత వచ్చింది. ఇందులో 84,706 ఎకరాల భూమి ఇతరుల చేతుల్లో ఉన్నట్లుగా నిర్ధారించిన సర్కార్ వాటిపై సమగ్ర వివరాలను సేకరించింది. కాగా ప్రస్తుతం అసైన్డ్‌కు ఉన్న నిబంధన ప్రకారం 2007 జనవరి 29 నాటికి ఆక్రమణలో ఉన్నవారికే ప్రయోజనం దక్కేలా చట్టంలో ఉంది. ఇప్పుడు ఈ తేదీని 2014 జూన్ 2నాటికి అసైన్డ్ భూములు ఎవరి పేరిట ఉన్నాయో గుర్తించి వాటినే రీ అసైన్ చేయాలని 3వ పేజీలో...

కమర్షియల్ కోల్ మైనింగ్‌కు పచ్చజెండా

బొగ్గుగనుల వేలం ప్రక్రియలో ప్రైవేటుకు అనుమతి

జాతీయ పట్టణ గృహనిర్మాణ నిధి ఏర్పాటు

చిట్‌ఫండ్ సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: బొగ్గుగనుల వేలం ప్రక్రియలో నూతన విధానానికి కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. కమర్షియల్ కోల్ మైనింగ్‌కు తలుపులు తెరుస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు రంగానికి బొగ్గుగనుల తవ్వకాల వేలంలో అవకాశం కల్పించనున్నారు. మంగళవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నూతన ప్రక్రియతో ఈ రంగంలో పారదర్శకత, సులభతర వాణిజ్యం వీలవతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానంతో సహజ వనరులు దేశ అభివృద్ధికి ఉపయోగపడుతాయని పేర్కొంది. ఈ రంగంలోని గుత్తాధిపత్యానికి తెరపడి పోటీతత్వం పెంపొందుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అలాగే పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చి ఉద్యోగవకాశాలు పెరిగే అవకాశముందని భావిస్తోంది. బొగ్గు సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా అందుబాటులోకి వస్తుందని ఇంధన పరిశ్రమ అవసరాలు తీరుతాయని ప్రభుత్వం పేర్కొంది. బొగ్గు గనుల కేటాయింపులో జరుగుతున్న అక్రమాల నేపథ్యంలో సుప్రీంకోర్టు 204 బొగ్గుగనుల కేటాయింపులను గతంలో రద్దుచేసింది. ఈ నేపథ్యంలో పారదర్శకత కోసం, పోటీతత్వం కోసం ప్రైవేటురంగానికి, కమర్షియల్ మైనింగ్‌కు ప్రభుత్వం తెరలేపింది. దీని వల్ల విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన బొగ్గు అందుబాటులో చౌకధరకు లభించనుంది. దాని ఫలితంగా విద్యుత్ చార్జీలు కూడా తగ్గే అవకాశముందని ప్రభుత్వం తెలిపింది. సొంతింటి కలను సాకారం చేసే దిశలో కేంద్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత లేకుండా ఉండేందుకు జాతీయ పట్టణ గృహ నిర్మాణ నిధిని ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. జాతీయ పట్టణ గృహనిర్మాణ నిధిని స్వతంత్ర సంస్థ బిఎంటిపిసి ద్వారా నియంత్రించనున్నారు. 2022 కల్లా అందరికీ ఇళ్లు నిర్మించాలన్న ప్రధానమంత్రి లక్ష్యాన్ని నెరవేర్చే దిశలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల బిఎల్‌సి, ఎహెచ్‌పి, ఐఎస్ఎస్ఆర్, సిఎల్ఎస్ఎస్ లాంటి కేంద్రసాయ పథకాలకు నిధుల కొరత లేకుండా చూస్తారు. మహానది జల వివాదాల ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్రమంత్రి వర్గం పచ్చజెండా ఊపింది. కోరాపూట్ మ్ఖల్కాన్‌గిరి మధ్య 130 కి.మీ న్యూలైన్ ప్రాజెక్టుకు క్యాబినెట్ అనుమతించింది. ఈ రహదారి నిర్మాణంతో వామపక్ష తీవ్రవాదంపై సమర్ధవంతంగా పోరాడేందుకు ఉపయోగపడు తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఏపీ మధ్య రోడ్ కనెక్టివిటీ పెరుగనుంది. నియంత్రణ లేని డిపాజిట్ పథకాలను నిషేధించే బిల్లుకు ఆమోదం తెలిపింది. దీనితో నియంత్రణ లేకుండా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడంపై పార్లమెంటులో బిల్లు పాసైన తర్వాత నిషేధం అమలుకానుంది. చిట్ ఫండ్ చట్టం పలు మార్పులకు తీసుకువస్తూ రూపొందించిన చిట్‌ఫండ్ సవరణ బిల్లు -2018ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.



తెలంగాణ సీఎస్



ఏపీ సీఎస్

23న హస్తినలో విభజన పంచాయితీ

చట్టం అమలు తీరుతెన్నులపై ఉన్నతస్థాయి సమీక్ష

జాప్యంపై నిశితంగా ఆరా తీయనున్న కేంద్ర హోంశాఖ

ఉద్యోగుల విభజన, ఆస్తుల పంపిణీపై ప్రధానంగా చర్చ

ఇరురాష్ట్రాల సీఎస్‌లకు ఆదేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుపై కేంద్రం, తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దూరం పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు చట్టం అమలు జరిగిన తీరుతెన్నులపై కేంద్ర హోంశాఖ సమీక్ష జరపాలని నిర్ణయించింది. ఇందుకు ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఢిల్లీలోని హోంశాఖ కార్యదర్శి కార్యాలయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ భేటీకి హాజరు కావాలని రెండు ప్రభుత్వాలకు సమాచారం అందించింది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్ళలోని సంస్థల విభజన, ఉద్యోగుల పంపిణీ, ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్, హైకోర్టు విభజనకు సంబంధించి తెలుగు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, 13వ షెడ్యూల్‌లో చెప్పిన వివిధ హామీల అమలుతీరు ఇతరత్రా అంశాలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ బాగా ఇరు రాష్ట్రాల అధికారులతో చర్చించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన కేంద్రీయ గిరిజన 2వ పేజీలో...



చోక్సీ కంపెనీలపై ఐటీ దాడులు

• హైదరాబాద్‌లోనూ సోదాలు • డొల్ల కంపెనీలే లక్ష్యంగా కార్యాచరణ • 20 చోట్ల 110మంది అధికారుల దాడులు



న్యూఢిల్లీ: పన్ను ఎగవేత కేసులో గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ, డొల్ల కంపెనీలకు చెందిన 20 ప్రాంతాల్లో ఆదాయపన్ను శాఖ మంగళవారం దాడులు నిర్వహించింది. హైదరాబాద్, ముంబై, పూనె, సూరత్, బెంగళూరు, తదితర నగరాల్లో దాదాపు సాయంత్రం నాలుగు గంటల నుంచి దాడులు ప్రారంభమైనట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో డొల్ల కంపెనీల నిధుల మళ్ళింపు కార్యకలాపాలను తనిఖీ చేసేందుకు సోదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. డొల్ల కంపెనీలు పద్దుల్లో లేని వనరుల నుంచి భారీగా పెట్టుబడులను రుణాల రూపేణా పొందినప్పటికీ ఎలాంటి వడ్డీల చెల్లింపు లేకుండానే అవి సాగిస్తున్న నిధుల మళ్ళింపుపై సందేహాలు రావడంతో ఈ కంపెనీలపై ఐటీ శాఖ మంగళవారం దాడులు చేపట్టింది. ప్రియాంక జెమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీతో పాటు 10వ పేజీలో...


మోసగాళ్ల అంతు చూస్తాం

మోసాలను మొగ్గలోనే తుంచేయాలి • లేకుంటే దేశానికి తప్పదు భారీ మూల్యం • పీఎన్‌బి కుంభకోణంపై అరుణ్ జైట్లీ

10 లో



సీబీఐ వలలో పెద్దచేప




విపుల్ అంబానీ అరెస్ట్

• అంబానీ సోదరులకు సమీప బంధువు • మూడ్రోజులుగా ఇంటరాగేషన్ • సహాయ నిరాకరణతో అదుపులోకి • మరో నలుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నిర్బంధం

10 లో

పథకాలు బాగున్నాయ్

కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ ట్వీట్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మెనీ థాంక్స్ టూ...సీఎం కే.సీ. రావు.... అంటూ కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ రాష్ట్ర ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు, విలువైన అంశాలపై చర్చలు జరిగాయని మంగళవారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. రైతు లకు పెట్టుబడి పథకం, గర్భిణీలకు ఆర్థిక సహాయం, సాగునీటి ప్రాజెక్టులు, అడ వుల పెంపకం, సహకార సమాఖ్య తదితర అంశాలపై విలువైన చర్చలు జరిగా యని స్పందించారు. సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సుబ్రమణియన్ సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ఆయన ప్రశంసించారు. ఢిల్లీ వెళ్లిన తర్వాత చర్చలపై సుబ్రమణియన్ కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

మీసేవకు గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు

మంత్రి కేటీఆర్ సమక్షంలో ప్రదానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఇఎస్‌డి) - మీసేవ ద్వారా ప్రజలకు అందిస్తున్న విశిష్టసేవలకు గుర్తింపుగా గ్లోబల్ ఐసిటి ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. అన్ని రకాల పౌర సేవలను అనుసంధానంచేసి మీసేవ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకుగానూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటి సదస్సు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డును దక్కించుకోగా, అర్మేనియాకు చెందిన టివిఎంవో సెంటర్ ఫర్ క్రియేటివ్ టెక్నాలజీ రెండో బహుమతికి ఎంపికైంది. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ (విట్సా) ఈ అవార్డును నెలకొల్పి ప్రతి ఏటా ప్రపంచ ఐటి సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఇందులో మొత్తం పది రకాల అవార్డులను వివిధ కేటగిరిల కింద ఎంపిక చేస్తారు. ప్రపంచ ఐటి సదస్సు సందర్భంగా రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు, నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖరన్, విస్తా చైర్మన్ వయోన్నె చీయూ సమక్షంలో మంగళవారం ఈ అవార్డు ప్రదానం చేశారు. మీసేవ కమిషనర్ జిటి వెంకటేశ్వరరావు ఈ అవార్డును స్వీకరించారు.

తెలంగాణ బాటలో పాండిచ్చేరి

మిషన్ కాకతీయ స్ఫూర్తిగా అడుగులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్ కాకతీయ కార్యక్రమానికి పాండిచ్చేరి ఫిదా అయింది. ఈ కార్యక్రమాన్ని తమ రాష్ట్రంలో కూడా అమలుచేయనున్నట్లు ఆ రాష్ట్ర జలవనరుల మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాండిచ్చేరిలోని చెరువులను పునరుద్దరించడానికి మిషన్ కాకతీయను మోడల్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు డిపిఆర్‌ను సమర్పించామని, కేంద్రం ఆమోదించి నిధులు సమకూర్చాలని మల్లాడి కోరారు. తమది చిన్న రాష్ట్రమని, నిధుల కొరత ఉన్నందున కేంద్రం తోడ్పాటును అందించాలని జలవనరుల సహాయమంత్రి అర్జున్‌రామ్‌కు విజ్ఞప్తిచేశారు. కావేరి నుండి తమిళనాడుకు విడుదల చేసే నీటిలో పాండిచ్చేరికి రావాల్సిన నిష్పత్తి ప్రకారం నీటిని పంపాలని మల్లాడి కోరారు. యానాం దగ్గర గోదారి కరకట్టల నిర్మాణానికి కేంద్రం సహాయం అందించాలని పాండిచ్చేరి మంత్రి కోరారు.

ఎమ్మెల్సీల చలో కాళేశ్వరం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఎమ్మెల్సీలు కాళేశ్వరం బాట పడుతున్నారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు శాసనమండలి సభ్యులు ఈనెల 23, 24తేదీలలో పర్యటిస్తారని ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్సీలంతా ఈ పర్యటనలో పాల్గొనాలని మండలి చైర్మన్ స్వామిగౌడ్ ఇప్పటికే అందరికీ ఆహ్వానాలు పంపారన్నారు. ఎమ్మెల్సీలు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతంలో పర్యటిస్తే ప్రాజెక్టుపై వారికి అవగాహన వస్తుందని చైర్మన్ స్వామిగౌడ్ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈనెల 23ఉదయం హైదరా బాద్ నుండి ఎమ్మెల్సీలు బయలుదేరి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన ప్యాకేజీ లన్నింటినీ పరిశీలిస్తారన్నారు. రాత్రికి కాళేశ్వరంలో బసచేసి 24న ప్రాజెక్టులు జరుగుతున్న మిగతా ప్రాంతాల్లో పర్యటిస్తారన్నారు. మండలి చైర్మన్ స్వామి గౌడ్ నేతృత్వంలో ఎమ్మెల్సీలంతా స్టడీటూర్‌కు వెళ్ళడం ఇదే ప్రథమమన్నారు. పర్యటన సాఫీగా సాగేలా చూడాలని, ఎమ్మెల్సీల పర్యటన దృష్టిలో పెట్టుకుని తగు ఏర్పాట్లు చేయాలని మంత్రి హరీష్‌రావు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

మిషన్‌కాకతీయ అవార్డుల న్యాయనిర్ణేతల కమిటీ ఖరారు

మీడియాఅకాడమీ అధ్యక్షుడు అల్లం నారాయణ నేతృత్వంలో మిషన్ కాకతీయ మీడియా అవార్డుల న్యాయనిర్ణేతల కమిటీని ఏర్పాటుచేసినట్లు నీటిపారుదల శాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ కమిటీలో తెలంగాణ టుడే సీనియర్ జర్నలిస్టు బాలకోటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి సభ్యులుగా ఉంటారు.

కాళేశ్వరానికి రైతులు ఓకే



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అమయ్‌కుమార్

మహదేవ్‌పూర్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నా తరుణంలో రైతులు కూడా ప్రాజెక్టు నిర్మాణానికి భూమిని ఇచ్చేందుకు ముందుకు రావడం ఇటూ ప్రభుత్వానికి, ఇంజినీరింగ్ అధికారులకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయి. తాజాగా మంగళవారం మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన 20 మంది రైతులు 31 ఎకరాల భూమిని గ్రావిటీ కెనాల్ నిర్మాణానికి ఇచ్చేందుకు అంగీకరించారు. భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి, గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనుల కోసం ఇవ్వాలని రైతులను కోరారు. రైతులు భూమిని ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించి, అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణలో రైతులను ఒప్పించి ప్రాజెక్టు నిర్మాణానికి భూములను తీసుకున్నది అటూ అటవీ భూముల అనుమతుల విషయంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం పొందలేనంత త్వరగా అనుమతులు తీసుకొచ్చి అంతే త్వరగా పనులు చేపడుతున్నారు.

రాజకీయాల్లోనూ వర్గీకరణ అమలు చేయాలి

- జస్టిస్ రోహిణికి నాయీబ్రాహ్మణ సంఘం వినతి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఓబీసీ వర్గీకరణ జాతీయ స్థాయిలో అమలు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం నేతలు ఓబీసీ వర్గీకరణ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఢిల్లీలో కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ రోహిణిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఓబీసీలకు రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ, ఆ ఫలాలను అందరికీ సమానంగా అందడం లేదని వారు పేర్కొన్నారు. బీసీల్లో 14శాతం కులాలు మాత్రమే రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని, మిగతా 86 మంది చాలా తక్కువ మోతాదులో రిజర్వేషన్లు పొందగలుగుతున్నారని తెలిపారు. జస్టిస్ రోహిణిని కలిసిన అనంతరం వారు ఆంధ్రా భవన్లో మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో కూడా ఓబీసీ వర్గీకరణ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయాల్లో అమలు కాకపోవడం వల్ల ఓబీసీల్లో కొన్ని కులాలు మాత్రమే పదవులు పొందగల్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నాయీ బ్రాహ్మణులు అవకాశాలు అందిపుచ్చుకోలేక వెనుకబడిపోతున్నారని తెలిపారు. మరోవైపు క్రీమీ లేయర్ కారణంగా ఓబీసీలందరికీ నష్టం కలుగుతోందని, క్రీమీ లేయర్‌ను ఎత్తివేయాలని కోరుతూ తాము జస్టిస్ రోహిణిని కలిశామని వారు చెప్పారు. ఈ బ ందంలో విశ్రాంత పోలీస్ అధికారి డి. అశోక్, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ కార్యదర్శి సైదులు తదితరులున్నారు.

నిండా నా వయసు రెండేళ్లే!



(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని, మనుషుల్లానే నాకూ విశ్రాంతి అవసరమని తెలిపింది. మనుషుల అన్ని ఫీలింగ్స్‌ను నేను అర్థం చేసుకోగలను... తాను తిరిగిన అనేక ప్రదేశాల్లో హాంకాంగ్ నన్ను ఆకట్టుకుంది... ఆ ప్రాంతం నాకెంతో ఇష్టం అని సోఫియా ఐటీ ప్రముఖులకు వెల్లడించింది. ప్రపంచంలో అందరూ ప్రేమగా, సంతోషంగా ఉండాలన్నదే నా ఉద్దేశం. థ్యాంక్యూకు మించిన గొప్ప పదం లేదు అని మరమనిషి వాస్తవాలను తెలిపింది. రోబో సోఫియా అడిగిన అన్ని ప్రశ్నలకు ఖచ్చితత్వంతో సమాధానాలు ఇచ్చింది. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో తనకు అకౌంట్ ఉందనీ, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నానని ఒక ప్రశ్నకు బదులిచ్చింది. బిట్‌కాయిన్ కానీ, ఇతర ఇన్వెస్ట్‌మెంట్లుగానీ ఉన్నాయా? అన్న ప్రశ్నకు తెలివిగా స్పందించింది. తనకు ఇన్వెస్ట్‌మెంట్లతో పనిలేదనీ, తన వయసు రెండేళ్ళు మాత్రమేనని పేర్కొంది. బ్యాంకు అకౌంట్ కూడా లేదని రోబో చెప్పింది. బాలీవుడ్, హాలీవుడ్‌లో ఇష్టమైన హీరో ఎవరన్న ప్రశ్నకు సమాధానమిస్తూ షారుఖ్‌ఖాన్ తనకు ఎంతో ఇష్టమని స్పష్టం చేసింది. 'నాకిష్టమైన దేశం హాంకాంగ్, అక్కడే పుట్టినందుకు ఆ దేశమంటే ఇష్టం' అని రోబో సోఫియా తేల్చిచెప్పింది. ప్రపంచంలో ఫేమస్ టెక్‌పర్సన్ ఎవరు? అని ప్రశ్నిస్తూ నాలుగైదు పేర్లు ఉదాహరణగా చెబితే, అందులో తన సృష్టికర్త డేవిడ్ హాన్సన్ పేరును వెల్లడించింది. భారత్‌లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? అన్న ప్రశ్న అడిగిన వ్యాఖ్యాత ఆ వెంటనే ఉపసంహరించుకున్నాడు. మానవాళికి ఇచ్చే సందేశం ఏమిటని అడిగితే, లవ్ ఫర్ ఆల్ అంటూ సోఫియా సమాధానమిచ్చింది. మనిషి మాదిరిగానే 66 రకాలకు మించిన హావభావాలతో రోబో సోఫియా పనిచేస్తుందని ఈ సందర్భంగా సృష్టికర్త హాన్సన్ తెలిపారు.

నదులవారీ ట్రిబ్యునళ్లకు స్వస్తి

(మొదటిపేజీ తరువాయి)



హైదరాబాద్ డిక్లరేషన్‌గా ప్రకటిస్తున్నామన్నారు. కోర్టులు, ట్రిబ్యునళ్ళ వల్ల కాలయాపన, వృథా ఖర్చు జరుగుతోందన్నారు. ఏళ్ళతరబడి జాప్యం వల్ల సమస్య మరింత జఠిలమవు తున్నదన్నారు. సమస్య ఎంతత్వరగా పరిష్కారమైతే అంత త్వరగా అభివృద్ధికి వీలవుతుందన్నారు. జలవివాదాల పరిష్కారం ప్రధాని నరేంద్రమోడీ ప్రాధాన్యతల్లో ఒకటన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి ఆయా సమస్యల ముగింపునకు గాను కార్యాచరణ ఖరారుకు తనను కేంద్ర జలవనరుల మంత్రి గడ్కరీ పంపారని తెలిపారు. జలవివాదాలు సత్వరం పరిష్కరించాలని ప్రధాని కోరుతున్నట్లు అర్జున్‌రామ్ చెప్పారు. సంక్లిష్టమైన వ్యవహారాలను ఇంకా జఠిలం చేయవద్దని దక్షిణాది రాష్ట్రాల మంత్రులు, ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తిచేస్తున్నానన్నారు. జలవివాదాల పరిష్కారానికి జాతీయస్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటుచేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. ఈ ట్రిబ్యునల్‌కు పార్లమెంట్ ఆమోదం లభిస్తే ఇకపై రాష్ట్రస్థాయిలో ట్రిబ్యునళ్ళు ఉండవన్నారు. నదులవారీగా ట్రిబ్యునళ్ల వల్ల డబ్బు వృథా అవుతోందన్నారు. తమిళనాడు-కర్నాటకల మధ్య జలవివాదాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా ఆరువారాల్లో కావేరి మేనేజ్‌మెంట్ బోర్డు, కావేరి రెగ్యులేటర్ అథారిటీని ఏర్పాటుచేస్తున్నామని కేంద్రమంత్రి ప్రకటించారు. రాష్ట్రాలలో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచుతామన్నారు. నాబార్డు వంటి సంస్థలు లేదా ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరుచేస్తామన్నారు. దక్షిణాది రాష్ట్రాల తొలి ప్రాంతీయ సమావేశం విజయవంతంగా ముగిసిందని, త్వరలో మరో మూడు ప్రాంతీయ సదస్సులు కూడా ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు.

పట్టిసీమ నీటివాటా మాకివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు 45టిఎంసిలు న్యాయంగా రావాల్సి ఉందన్నారు. దీనినే సదస్సులో ప్రస్తావించామన్నారు. ఆర్‌డిఎస్ ఆయకట్టు రక్షణ కోసం జరుగుతున్న పనులకు సంబంధించి సమస్యలను కేంద్రమే చొరవచూపి పరిష్కరించాలన్నారు. దేశంలో ఒకే ట్రిబ్యునల్ ఉంటే మంచి జరుగుతుందని, దీనిపై సదస్సులో సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు. దేశచరిత్రలో ఢిల్లీ బయట ఇరిగేషన్ సదస్సు నిర్వహించడం తొలిసారి అని, ఇది స్ఫూర్తిదాయకమన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా, చర్చల ద్వారా స్థానిక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. స్థానిక సమస్యలు ప్రస్తావించేందుకు తమకు మంచి వేదిక దొరికిందని, దీనిని సద్వినియోగం చేసుకున్నామన్నారు. ఎఐబిపి ద్వారా 11ప్రాజెక్టులు చేపట్టారని, వీటికి సంబంధించిన నిధులు త్వరగా విడుదలచేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వమని గతంలోనే కేంద్రప్రభుత్వాన్ని కోరామన్నారు. మిషన్‌కాకతీయ పథకంకు సహాయం చేస్తామని చెప్పారన్నారు. సదస్సు స్ఫూర్తిని తాము అభినందిస్తున్నామన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లకు ఐదేళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల ఘటనను ఇప్పటికీ ఆ ప్రాంత స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. జంట పేలుళ్లు జరిగి నేటితో ఐదేళ్లు పూర్తయింది. పోలీసులు అప్రమత్తమయ్యారు. దిల్‌సుఖ్‌నగర్, ఆ పరిసరాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బందోబస్తును కూడా విస్తృతం చేశారు. 2013 ఫిబ్రవరి 21వ తేదీ రాత్రి ఏడుగంటల సమయంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియే టర్ సమీపంలో కొద్ది వ్యవధిలోనే రెండు చోట్ల బాంబులు పేలాయి. ఆ ఘటనలో 19 మంది మృత్యువాత పడగా 120 మంది గాయపడ్డారు. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్ఐఏ కూడా రంగంలోకి ఘటనపై దర్యాప్తు చేపట్టింది. ఘటనాస్థలంలో లభించిన ఆధారాలు, సీసీకెమెరాల ఫుటేజ్‌ల సహకారంతో నిందితులను ఎన్ఐఏ అధికారులు కేసు దర్యాప్తును ముందుకు తీసుకువెళ్లారు. ఈ కేసుకు సంబంధించి దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగుర్ని అరెస్టు చేసి కేసు మిస్టరీని ఛేదించారు.

23న హస్తినలో విభజన పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)



విశ్వవిద్యాలయాల పురోగతిని ఆయన సమీక్షిస్తారు. ఇప్పటికే ఈ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక, న్యాయశాఖ అధికారులు ఆమోదముద్ర వేశారు. తెలంగాణ ప్రభుత్వ అధికారులు కూడా తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలనుకున్న గిరిజన విశ్వవిద్యాలయంపై ఈ సమా వేశంలో ప్రస్తావించే అవకాశముంది. విభజన చట్టంలోని 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న 71 సంస్థల్లో ఇప్పటి వరకు 41 సంస్థల విభజనకు షీలాబీడె కమిటీ సిఫారసు చేసింది. మిగిలిన 22 సంస్థల విభజనపై సిఫారసు చేయకపోవడానికి కారణాలు అందులో ఉన్న సంక్లిష్టతల గురించి సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్టు హోంశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

పదవ షెడ్యూల్‌లో ఉన్న 142 సంస్థల్లో 123 సంస్థలు హైదరాబాద్, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ సంస్థల ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజనపై రెండు రాష్ట్రాల అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సంస్థల ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజనకు సంబంధించి నెలకొన్న సందిగ్ధతను హోంశాఖ తీర్చే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. తమ ప్రాంత ఉద్యోగులను తమ రాష్ట్రానికి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతుండగా, ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు తమ ప్రాంతానికి వెళ్ళిపోతామని ఆందోళన చేస్తున్న సంగతి విదితమే. విద్యుత్‌శాఖలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తెలంగాణలో పనిచేస్తున్న విద్యుత్‌శాఖకు చెందిన ఏపీ ఉద్యోగులను ఆ రాష్ట్రానికే పంపాలని గత కొంతకాలంగా తెలంగాణ ఉద్యోగ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. జనాభా ప్రాతిపదికనే ఉద్యోగుల పంపకం జరగాలని ఏపీ డిమాండ్ చేస్తోంది. దీని ప్రకారం ఇరు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 58శాతం ఏపీకి, 42 శాతం ఉద్యోగులను తెలంగాణకు కేటాయించవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిధుల పంపిణీ విషయంలో దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర విభజన జరిగిన నాటికి పదవ షెడ్యూల్‌లో కేవలం 107 సంస్థలే ఉన్నాయని, 2015వ సంవత్సరం మే 7వ తేదీన కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటి ఫికేషన్ ద్వారా మరో 35 సంస్థలను జత చేసిందని ఏపీ ప్రభుత్వం అంటోంది.

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌ను జనాభా ప్రాతిపదికన పంచుకోవాలని హోంశాఖ ఇప్పటికే ఇరు ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీచేసింది. ఏడాది క్రితమే ఈ ఉత్తర్వులు వెలువరించినా ఇంతవరకు కార్యరూపం దాల్చ లేదు. ఈ అంశం కూడా శుక్ర వారం నాటి సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. షీలా బేడె కమిటీతో హోంశాఖ అదనపు కార్యదర్శి టివిఎస్ఎన్ ప్రసాద్‌తో ఇప్పటికే సమావేశమై విభజన అంశాలపై చర్చించారు. ఈ మేరకు ఆయన కేంద్రానికి నివేదిక సిద్ధంచేసి అందజేసినట్టు సమాచారం. 9వ షెడ్యూల్‌లోని సంస్థల విభజన ఇంకా పూర్తి కాకపోవడంతో షీలా బేడె కమిటీ గడువును మరో ఆరు మాసాలపాటు పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి లేఖ రాసినట్టు కూడా సమాచారం. విభజన సమస్యలను సామరస్య పూర్వకంగా సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకోవాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సీఎంలు కేసీఆర్, చంద్రబాబులను ఆదేశించారు. తన అధ్యక్షతన జరిగిన కీలక సమావేశంలో ఇందుకు సంబంధించి గవర్నర్ ఇరువురు సీఎంలకు దిశానిర్దేశం కూడా చేశారు. గవర్నర్ ఆదేశంతో రెండు రాష్ట్రాలు మంత్రులతో కమిటీలు ఏర్పాటు చేసుకుని ఈ కమిటీ సమావేశాలు గవర్నర్ సమక్షంలో నిర్వహించుకునే విధంగా నిర్ణయం కూడా తీసుకున్నారు.

తెలంగాణ రాష్ట్రం నుంచి విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం, ఏపీ నుంచి అక్కడి ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు నేతృత్వంలో మంత్రుల బృందాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీలు రాజ్‌భవన్‌లో గవర్నర్ సమక్షంలో మూడు దఫాలు సమావేశమైనా సమస్య కొలిక్కి రాలేదు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ భూభాగంలో ఉన్న సంస్థలన్నీ తమకే దక్కుతాయని ఆస్తుల విషయంలోనూ ఇదే అమలు కావాలని తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ సమక్షంలో గట్టిగా వాదించింది. ఇందుకు ఏపీ ప్రభుత్వం ససేమిరా అంది. ఉన్నత విద్యామండలి కేసు విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విజభన జనాభా ప్రతిపాదికన జరగాలని చెప్పిందని ఇలా చేయడం ద్వారా తెలంగాణలో ఆస్తుల్లో తమకు 58శాతం వాటా దక్కుతుందని ఏపీ ప్రభుత్వం తెగేసి చెప్పింది. ఇలా చేయడం కుదరదని తెలంగాణ ప్రభుత్వం భీష్మించుకోవడంతో మంత్రుల కమిటీ సమావేశాలు ముందుకు సాగలేదు, ఎటువంటి నిర్ణయాలు కూడా జరగలేదు. ఆ తర్వాత కేంద్ర హోంశాఖ ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో రెండు, మూడు దఫాలు సమావేశమై విభజన విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేకుండాపోయింది.

విభజన చట్టం ప్రకారం ఇరు రాష్ట్రాలు ముందుకు సాగాలని హోంశాఖ కోరింది. తాజాగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసిన సందర్భంలో విభజన చట్టం అమలుపై జరుగుతున్న జాప్యాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని త్వరలోనే ఇరు రాష్ట్రాల అధికారులను పిలిపించి చర్చిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఈనెల 23న ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే భేటీకి హాజరు కావాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వర్తమానం కూడా పంపింది.

ఐటీలో ఈ ఏడాది లక్ష కొలువులు

- ఎగుమతుల్లో 7. 8 శాతం వృద్ధి
- ఈ కామర్స్‌లో ట్రావెల్ అగ్రస్థానం
- నాస్కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖరన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో ఐటి రంగం ఎగుమతులు 7.8 శాతం పెరుగుతాయని, ఈ ఏడాది మరో లక్ష మందికి ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తా యని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖరన్ చెప్పారు. దీంతో 40 లక్షల మంది ఐటి నిపుణులు డిజిటల్ ఇండియా లక్ష్యంలో భాగస్వాములు అవుతు న్నారని అన్నారు. ఐటి ఎగుమతులు 167 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని, దేశీయ మొత్తం ఎగుమతుల్లో ఈ రంగం 24శాతం వాటా కలిగి ఉందని మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. ప్రపంచ ఐటి సదస్సు సందర్భంగా భారత ఐటిరంగం స్థితిగతులను ఆయన వెల్లడిం చారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, సాఫ్ట్వేర్ అప్లికేషన్స్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ శాఖలన్నీ వినియోగిస్తున్నాయని, ప్రజల జీవన విధానంలో ఐటి సేవలు మిళితమయ్యాయని అన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను రూపొందించ డంలో ప్రభుత్వాలు కూడా కీలకంగా వ్యవహరిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి ఐటిరంగం కీలక చోదక శక్తిగా నిలిచిందన్నారు. ఆధార్, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆన్‌లైన్ చెల్లింపులతో డిజిటల్ సర్వీసులు వేగంగా పుంజుకున్నాయని ఆయన చెప్పారు. బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలతో పాటు చివరకు ఎంఎస్ఎంఈలు కూడా డిజిటల్ పేమెంట్స్ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాయని చంద్రశేఖరన్ చెప్పారు.

సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఐదు లక్షల మందికి రీస్కిల్లింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అయితే ద్వితీయ శ్రేణి పట్ట ణాల్లో ఇ-కామర్స్‌కు అనువైన మౌలిక సదు పాయాలు లేవన్నారు. స్మార్ట్‌సిటీలు, ప్రొక్యూర్‌మెంట్ సంస్క రణల ఐటి సర్వీసులు ప్రాథమిక దశలోనే ఉన్నాయని చంద్రశేఖరన్ చెప్పారు.

దేశంలో 110 బహుళజాతి సంస్థలు అందించే వివిధ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కొత్త టెక్నాలజీ అందు బాటులోకి వస్తుందని, అలాగే స్టార్టప్స్, విద్యాసంస్థల్లో వీటితో భాగస్వామ్య కార్యక్రమాలు చేపట్టనున్నాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఐవోటీ, ఆర్‌పిఏ తదితర టెక్నాలజీలపై టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ పెరుగుతాయని చెప్పారు. దేశంలో 700లకుపైగా స్టార్టప్స్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఉన్నాయని, ఇవి 25శాతం వృద్ధిరేటుతో విస్తరించాయని ఆయన చెప్పారు. 90 శాతానికిపైగా దేశీయ ఐటి ఉత్పత్తులు ఎగుమతులు చేస్తున్నాయని, దేశంలోని 50 శాతం సంస్థలు ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను తమ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో వినియోగిస్తున్నారని చంద్రశేఖరన్ చెప్పారు. ఈ-కామర్స్ రంగంలో ఈ-ట్రావెల్ 54 శాతంతో అగ్రస్థానంలో నిలిచిందని, మొబైల్ వ్యాలెట్ లావాదేవీలు గత ఏడాది రూ.79వేల కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం మరో 15 బిలియన్ డాలర్ల ఆదాయం పెరగనుందని, నియామకాలు ఈ ఏడాది మరింతగా పెరుగుతాయని ఆయన చెప్పారు.

దేవతలగుట్ట భూములపై స్టేటస్ కో సవరణ

ఆ భూములను పిటిషనర్లు స్వాధీనం చేసుకోవచ్చు: హైకోర్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దేవతల గుట్ట భూముల వ్యవహారంలో గతంలో జారీ చేసిన స్టేటస్ కో మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సవరిం చింది. సర్వే నంబర్లు 83, 84 ల్లోని భూములను పిటిషనర్లు స్వాధీనం చేసు కోవచ్చునని హై కోర్టు స్పష్టం చేసింది. అయితే హెచ్ ఎండీఏ,జీహెచ్ ఎంసీ ల నుంచి అవసరమైన అనుమతులు తీసు క ున్న తర్వాతనే ఆ భూముల్లో నిర్మాణాలు చేపట్టాలని హైకోర్టు పిటిషనర్లను ఆదేశిం చింది...ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ , జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన ధర్మాసనం మంగళ వారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆ భూములపై దర్యాప్తు జరిపారు. సర్వే నంబర్లు 83, 84 ల్లోని భూములు పిటిషనర్లకు చెందిన పట్టాభూములని తేల్చారు. రెవెన్యూ రికార్డులతో సహా కౌంటర్ దాఖలు చేశారు.కలెక్టర్ సమర్పించిన కౌంటర్ లోని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం గతంలో జారీ చేసిన స్టేటస్ కో మధ్యంతర ఉత్తర్వులను సవరించింది.

రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 86లో దేవతలగుట్ట పై ఉన్న వీరభద్రస్వామి దేవాలయంతో పాటు మరి కొన్ని దేవాలయాల కూల్చివేతను నిలిపివేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. అక్కడ దేవతల గుట్టపై వెలసిన వీరభద్రస్వామి దేవాలయంతో పాటు, మరి కొన్ని దేవాలయాలను ప్రైడ్ ఇండియా డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ మేనేజర్ సహకారంతో కొందరు కూల్చివేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొంటూ దేవతల గుట్ట పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు నామ.రాంరెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే.



మురళీ కృష్ణుడి అవతారంలో నృసింహుడు

మురళీకృష్ణుడిగా యాదాద్రి నృసింహుడు

యాదగిరికొండ, ప్రభన్యూస్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనృసింహుడు భగవద్గీత ఉపదేశించిన...వేణుమాధవుడైన మురళీ కృష్ణుడి అలంకారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గావ రోజుకు చేరుకున్నాయి. అలంకార ప్రియుడైన నృసింహుడుని మురళీ కృష్ణుడిగా అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. వేణువు అద్భుతం శూన్యంగా ఉంటుంది. భక్తులు తమ ఖర్మలన్ని గానీ, జ్ఞానాన్ని గానీ భక్తితత్పరతలు గానీ భగవానుడికి సమర్పిస్తే అహంకారతత్వం తొలగిపోతుంది. తదుపరి భగవంతుడి అనుగ్రహం పరిపూర్ణంగా లభించుటకు అవకాశం కలుగుతుంది. ఈ తత్వాన్ని తెలియజేసేందుకే భగవానుడు మురళీ కృష్ణుడిగా భక్తులకు అలంకార సేవలో దర్శనం కలిగించారు. రాత్రి శ్రీ స్వామి వారు హంస వాహన సేవపై భక్తులకు దర్శనమిచ్చారు. నీటిని, పాలను వేరు చేసే మహత్యాన్ని ఆవిష్కరించేందుకే ఈ హంస వాహనసేవ ప్రత్యేకతని ఆలయ ఆచార్యులు ప్రవచించారు. వేదమంత్రాలు...మంగళవాయిద్యాలు...సన్నాయి వేళాలు మారుమోగుతుండగా శ్రీ స్వామి వారు మురళీ కృష్ణుడిగా దర్శనం ఇచ్చారు. యాజ్ఞకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు, అర్చక బృందం ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ పెద్దలుగా ఆలయ ఈవో ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారి, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ రెడీ

(మొదటిపేజీ తరువాయి)



చట్టంలో సవరణ తేనున్నారు. ఇందుకు అను వుగా తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ఫర్ (పీఓటీ) యాక్టు1977 లోని సెక్షన్ 4(1)(బి)(1) ప్రకారం నిబంధనల ను సవరించ నున్నా రు. ఇందు కోసం ఈ ఆర్డినెన్స్‌ను సిద్ధం చేస్తు న్నారు. రికార్డుల శుద్ధీకరణ, నవీకరణలో భాగంగా వెలుగులోకి వచ్చిన పేదలకు చెందిన అసైన్డ్ భూముల అక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం కేసీఆర్ గతంలోనే నిర్ణయించారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ కలెక్టర్లకు ఆదేశాలను జారీ చేసింది. ఆక్రమణదారుల్లో బీసీఎల్ కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ బిసి, మైనార్టీ కులాలవారీగా లెక్కలు తీస్తూ వారి సామాజిక హోదాను తేల్చారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 22,63,139ఎకరాల అసైన్డ్ భూమి 15.83లక్షలమంది వద్ద ఉంది. 1,85,101 ఎకరాలతో అసిఫాబాద్ మొదటి స్థానంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంలో 1,66,557 ఎకరాలు, నల్గొండలో 1,38,686ఎకరాలు, కామారెడ్డిలో 1,33,157 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని గుర్తించారు. అయితే బీసీ సామాజిక వర్గంలో 6లక్షల 33 వేల451 మందికి 8లక్షల 14వేల 8వేల ఎకరాలు పంపిణీ అయి నట్లుగా తేల్చారు. ఎస్సీలకు 5,75,497ఎకరాలు, ఎస్టీలు 6,72,959 ఎకరాలు, ఓసీలు 1,46,102 ఎకరాలు, మైనార్టీలకు 54565 ఎకరాలను పంపిణీ చేసినట్లుగా రికార్డులు ధృవీకరిస్తున్నాయి.

దేశంలోనే అత్యధికంగా భూమిలేని నిరు పేదలకు ప్రభుత్వ భూములు పంచిన జాబితాలో ఉన్న తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉండి చరిత్ర సృష్టించాయి. రెండు రాష్ట్రాల్లో 50లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేశారు. ఇది దేశ మొత్తంలో పంపిణీ అయిన భూముల్లో దాదాపు 28శాతంగా ఉందని లెక్కలు ధృవీకరిస్తున్నాయి. సీలింగ్ మిగులు భూములు, భూదాన్ భూములు, వివిధ పథకాల కింద కొనుగోలు చేసి పంచిన భూములను కలుపుకుంటే ఈ లెక్క 60 లక్షల ఎకరాల పైమాటే. అయితే పేదలకు పంపిణీ చేసిన వ్యవసాయ, ఇంటిస్థలాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 1977లో అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం(పీఓటి 77) అమలులోకి తెచ్చింది.

చట్టంలో ఏముంది...

ఈ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం 1977కు ముందుకానీ, తర్వాత కానీ ప్రభుత్వం ఇచ్చిన భూములను బదలాయింపు చేయకూడదు. అసైన్డ్ భూమిని అమ్మినా, దానం చేసినా, కుదువబెట్టినా, కౌలుకిచ్చినా, ఇతర భూములకు బదులుగా మార్చుకున్నా బదలాయింపు కిందకే రానుందని పేర్కొంది. తరతరాలు వారసత్వంతప్ప విక్రయించేందుకు వీలు లేదు. బదలాయిస్తే చెల్లకపోగా శిక్షార్హం కూడానని చట్టం చెబుతోంది.

-చట్టానికివిరుద్ధంగా బదలాయింపు జరిగితే తహశీల్దార్ కానీ, కలెక్టర్ నియమించిన అధికారి కానీ విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేయాలి.

-చట్టాన్ని ఉల్లంఘించి భూమిని కొనుగోలు చేసిన వ్యక్తికుంచి స్వాధీనంచేసుకోవాలి.

-మొదటిఅసైనీ పొందిన వ్యక్తి ఇంకా నిరుపేద అయితే అతనికే అప్పగించాలి. రెండోసారి అయితే అప్పగించాల్సిన అవసరం లేదు.

-నోటిఫై ప్రాంతాల్లో అయితే అసైనీకి ఇవ్వాల్సిన పనిలేదు.

-అసైన్డ్ భూమి నిరుపేద కొనుగోలు చేస్తే ఆ కొనుగోలు చేసిన వ్యక్తికే అసైన్డ్ చేయాలి. అసైన్డ్ భూమితో కలుపుకుని అతనికి ఐదెకరాల మెట్ట, రెండున్నర ఎకరాల తరికి మించరాదు.

పర్యావరణహిత మైనింగ్

జాతీయ వర్క్‌షాప్‌లో సింగరేణి ప్రజంటేషన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మైనింగ్ రంగంలో దేశంలో ప్రత్యేకత నిలుపుకుంటున్న సింగరేణి కాలరీస్ పర్యావరణ హిత మైనింగ్ నిర్వహిస్తోందని సింగరేణి సంస్థ డైరెక్టర్ బి.భాస్కర్‌రావు తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన సింగరేణి తరఫున పాల్గొన్నారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో పర్యావరణ మార్పులను అధ్యయనం చేసేందుకు సింగరేణి సంస్థ ప్రత్యేకంగా పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుచేసిందన్నారు. జాతీయ వర్క్‌షాప్‌లో ఎంఓఈఎఫ్ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్, కార్యదర్శి మిశ్రా, మెహతా, ఝా తదితరులు పాల్గొన్నారు.

వర్మ అరెస్టు తప్పదా?

- బిగుస్తున్న జీఎస్టీ ట్రైలర్ ఉచ్చు
- సంగీత దర్శకుడు కీరవాణికి నోటీసులిచ్చే అవకాశం!
- టీవీ 9, బీజేపీ నాయకురాలిపై కేసు వేస్తానంటూ వర్మ ట్వీట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీఎస్టీ వెబ్ చిత్ర నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్క రినీ విచారించేందుకు సీసీఎస్ పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక కార్యకర్త దేవి ఇచ్చిన ఫిర్యా దుపై సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో దర్శకుడు వర్మను శనివారం సుమా రు నాలుగు గంటల పాటు సీసీ ఎస్ పోలీసులు విచారించారు. శుక్రవారం మరోసారి విచారణకు హాజరు కావాలని దర్శకుడు వర్మకు విచారణాధికారి సీసీఎస్ అదనపు డీసీపీ రఘువీర్ సూచించారు. విచారణ సందర్భంలో నాలుగు గంటల సమయంలో 30 ప్రశ్నల వర్మకు సంధిం చిన విచారణాధికారులకు వర్మ చుక్కలు చూపించాడని సమాచారం. తాను ఏవైతే చెప్పాలనుకున్నాడో అవే చెప్పాడు తప్పించి.. విచారణ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు వర్మ సమాధానాలు దాటవేశాడని తెలుస్తోంది. దీంతో వర్మ తమను తప్పుదోవ పట్టించాడని పోలీసులు భావిస్తున్నారు. జీఎస్టీని విదేశాల్లో చిత్రీ కరించినట్లు చెప్పిన వర్మ.. డౌన్‌లోడ్, అప్‌లోడ్ విషయంలో అడ్డంగా దొరికి పోయి నట్లు చెబుతున్నారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన వర్మ ట్విట్టర్ ద్వారా చేసిన వ్యాఖ్యలను కూడా పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వర్మ ఇచ్చిన సమా ధానాలపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసుకోవడానికే రెండోసారి విచారణకు పిలిచినట్లు విచారణాధికారి స్పష్టం చేశారు. కాగా, వర్మ నుంచి స్వాధీ నం చేసుకున్న ఫోన్, ల్యాప్‌టాప్‌ను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మరోవైపు ఈ కేసును పోలీసులు సీరియస్‌గానే తీసుకున్నారు. ఈ చిత్రం ఎక్కడ నిర్మించారు? ఎవరెవరు అందుకు సహకారం అందించారు? ఈ చిత్రం నిర్మాణంలో ఎవరి పాత్ర కీలకం ఇత్యాది అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. మొత్తంగా జీఎస్టీ వెబ్ సిరీస్‌లో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ విచారించే దిశగా పోలీసులు చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ లఘు చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణిని విచారించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనకు త్వరలో నోటీసులు జారీ చేయ నున్నట్లు సమాచారం. ఆ తర్వాత వర్మ అసిస్టెంట్లను పోలీసులు విచారిం చను న్నా రని తెలుస్తోంది. ఇదిలా ఉండగా వర్మ తమ విచారణలో జీఎస్టీ సినిమాతో తనకు ఎలాంటి సంబంధం లేదని.. కేవలం కాన్సెప్ట్ మాత్రమే తనదని వర్మ చెప్పి నట్లు పోలీసులు తెలిపారు. కాన్సెప్ట్ మాత్రమే తాను అమ్మానని వర్మ వెల్లడించాడని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి చాలా టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేక రించాల్సి ఉందని.. అన్ని వైపుల నుంచి ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అదే విధంగా సత్యమేవ జయతేను సత్య మియా జయతే అంటూ వర్మ ట్వీట్ చేసిన అంశాన్ని కూడా ఈ కేసులోనే చేర్చనున్నామని పోలీసులు వెల్లడి చేశారు. దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మకు సంబంధించిన కేసు సాధా రణ కేసు కాదని ఆయనను విచారించిన విచారణాధికారులు స్పష్టం చేశారు. కేసును ఆషామాషీగా విచారించలేమని, టెక్నికల్‌గా చాలా ఆధారాలను సేకరించాల్సి ఉం దని.. ఒకవేళ వర్మ దోషిగా తేలితే రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్షపడే అవకాశం ఉందని సైతం విచారణాధికారి స్పష్టం చేశారు.

కీరవాణికి త్వరలో నోటీసులు !

బాహుబలి, అన్నమయ్య వంటి ప్రతిష్టాత్మక చిత్రాలకు సంగీతం అందించిన కీర వాణి వర్మ జీఎస్టీకి కూడా మ్యూజిక్ అందించడంతో జీఎస్టీ వ్యవహారంలో కీరవాణి మెడకు ఉచ్చు బిగుసుకున్నట్లవుతోందని తెలుస్తోంది. ఆయనకు నోటీసులు జారీ చేసేందుకు సీసీఎస్ పోలీసులు నడుం బిగించారని సమాచారం. పోలీసులు కీరవాణిని సైతం ప్రశ్నించే అవకాశం మెండుగా ఉందని తెలుస్తోంది.

కౌంటర్ ఎటాక్ షురూ చేసిన వర్మ

జీఎస్టీతో వివాదంలో ఇరుక్కున్న ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ కౌంటర్ ఎటాక్ మొదలుపెట్టారు. తనను టార్గెట్ చేసిన వారిని చట్టపరంగా ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన ట్విట్టర్ ద్వారా మంగళవారం ఉదయం నుంచి వరుసగా పలు ట్వీట్ చేస్తూ వస్తున్నారు. టీవీ9 పై కేసు పెట్టబోతున్నట్లు మొదట ఓ ట్వీట్ చేసిన వర్మ.. బీజేపీ నాయ కురాలు తుమ్మలపల్లి పద్మపై కూడా కేసు పెట్టబోతున్నట్లు మరో ట్వీట్‌లో వెల్లడించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు
పీహెచ్‌డీ తప్పనిసరి

- యూజీసీ ఆదేశం
- 1061 ఖాళీల భర్తీకి సర్కారు సన్నాహకాలు
- తాజా నిర్ణయంతో అభ్యర్థులు డీలా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సవరించిన విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) నిబంధనల ప్రకారమే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆదేశించింది. దీంతో ప్రభుత్వం చేపట్టాలనుకున్న అధ్యాపకుల భర్తీ ప్రక్రియకు బ్రేక్ పడింది. రాష్ట్రంలో ఉస్మానియాతో పాటు కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, బీఆర్ అంబేద్కర్, పాలమూరు, జేఎన్‌టియూ, పొట్టి శ్రీరాములు తదితర వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1061లకుపైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫె సర్ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందుకు ఆర్థికశాఖ కూడా అనుమతులను ఇచ్చింది. ఈ ఖాళీలను గతంలో ఉన్న నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో యూజీసీ తాజాగా ప్రభు త్వానికి లేఖ రాస్తూ సవరించిన నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని ఆదేశించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఖచ్చితంగా తాము కోరుకునే సబ్జెక్టుల్లో పిహెచ్‌డీ పూర్తి చేయాలన్నది తాజా నిబంధన. గతంలో యూజీసీ నిర్వహించే నెట్ లేదా ఆయా ప్రభుత్వాల ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయాలు జరిపే రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష(స్లెట్) ఉత్తీర్ణత సాధిస్తే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయితే యూజీసీ అధ్యాపకుల ఎంపికకు తాజా నిబంధనలు తీసుకురావడంతో వాటిని దేశంలోని అన్ని ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు అమలు చేయాలని ఆదేశించింది. ఖాళీల భర్తీకి సంబంధించి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య యూజీసీ కార్యదర్శికి లేఖ రాస్తూ తాజా నిబంధనలను తెలియజేయాలని కోరింది. 2011వ సంవత్సరంలో యూజీసీ నిబంధనలను సవరించామని ఈ నిబంధనల ప్రకారమే అధ్యాపకుల భర్తీ జరగాలని ఆదేశించినట్టు సమాచారం. దీంతో ఇప్పటికే విశ్వవిద్యాలయాలు ఇచ్చిన నోటిఫికేషన్లను రద్దుచేసి తాజాగా మరో నోటిఫికేషన్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి సెలవుల్లో ఖాళీలను భర్తీ చేసి విద్యా సంవత్సరం ఆరంభం లోపు ఎంపికైన వారిని నియామక పత్రా లు ఇవ్వా లని ప్రభుత్వం భావిం చింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఇది సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

తీరుమారని టీఎస్‌పీఎస్సీ

- అసంబద్ధ నిర్ణయాలతో గందరగోళం
- టీఆర్‌టీ హాల్‌టికెట్లు వెబ్‌సైట్లో ఉంచిన కమిషన్
- డౌన్‌లోడ్ చేసుకున్న వేలమంది విద్యార్థులు
- ఈ హాల్ టికెట్లు చెల్లవంటూ ప్రకటన
- ఇప్పటికే వివిధ పోటీ పరీక్షల ఫలితాల విడుదలలో గందరగోళం
- తాజా హాల్‌టికెట్ల అంశంపై అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (టీఎస్‌పీఎస్సీ)కు అలవాటుగా మారింది. ఇప్పటికే వివిధ పోటీ పరీక్షల ఫలితాల విషయంలో గందరగోళ పరిస్థితులు సృష్టించిన కమీషన్ తాజాగా టిఆర్‌టి హాల్ టికెట్ల జారీలో అంతకన్నా మిన్నగా అభ్యర్థులను ఇబ్బందులుపెట్టే చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించిన ఎంపిక పరీక్ష హాల్ టికెట్లను కమీషన్ వెబ్‌సైట్ ద్వారా సోమవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. దీంతో ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం రాత్రి నుంచే హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలు ఎక్కడున్నాయో కూడా వెతుక్కుని అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చేసుకున్నారు. తీరా మంగళవారం సాయంత్రం సర్వీస్ కమీషన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవద్దని తాజా హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పెట్టాకే వాటిని తీసుకోవాలని సలహా ఇచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం సోమవారం రాత్రినుంచి మంగళవారం సాయంత్రం వరకు వేలాది మంది విద్యార్థులు హాల్‌టికెట్లను పొందినట్లు సమాచారం.

ఇప్పటికే ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ నిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ తరు ణంలో కమీషన్ వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. పోటీ పరీక్షల విషయంలో సర్వీస్ కమీషన్ ఒక అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కు అన్న చందాన పనిచేస్తోందని అభ్యర్థులు తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. టిఆర్‌టి పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు దగ్గరలో పరీక్షా కేంద్రాలు కేటాయించాలని అభ్యర్థించడంవల్లే సోమవారం రాత్రి వెబ్‌సైట్‌లో పెట్టిన హాల్ టికెట్లను రద్దు చేశామని తాజాగా పరీక్షా కేంద్రాలను సవరించి మళ్ళీ వీటిని అందుబాటులో ఉంచుతామని కమీషన్ అధికారులు చెబుతున్నారు. హాల్ టికెట్ల ముద్రణలో తప్పులు, అక్షర దోషాలు ఉండడంవల్లే కమీషన్ ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లను పరిగణలోకి తీసుకోవద్దని కోరినట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.



హాల్ టికెట్ల ముద్రణలో లోపాలు జరిగాయని అభ్యర్థి పేరు, తండ్రి పేరు విషయంలో అనేక తప్పులు దొర్లినట్లు అభ్యర్థులు గుర్తించారు. ఈ విషయాన్ని కొందరు అభ్యర్థులు కమీషన్ దృష్టికి తీసుకు వెళ్ళడంతోనే కమీషన్ కొత్తగా హాల్‌టికెట్లను ముద్రించి తిరిగి వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్న నిర్ణయానికి వచ్చిందని ఈ ప్రక్రియ ముగిశాకే హాల్‌టికెట్లను అందుబాటులోకి ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అభ్యర్థులు చెబుతున్నారు. సాధారణంగా పరీక్షా కేంద్రాల కేటాయింపు విషయంలో నిర్ణయం తీసుకోవలసింది సర్వీస్ కమీషన్ అధికారులేనని అయితే అభ్యర్థులు తమ సమీపంలో పరీక్షా కేంద్రాలు కేటాయించాలంటే అలా చేయడం కమీషన్‌కు సాధ్యం కాదని విషయాన్ని గుర్తుంచుకోవాలని అభ్యర్థులు అంటు న్నారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షా కేంద్రాలు, అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఏ అభ్యర్థి ఏ పరీక్షా కేంద్రానికి కేటాయించారన్నది కంప్యూటరే నిర్ణయిస్తుందని ఈ విషయాన్ని పక్కనబెట్టి అభ్యర్థులు పరీక్షా కేంద్రాలు సమీపంలో కేటాయించాలని కోరడంవల్లే హాల్ టికెట్ల జారీని నిలిపివేసినట్లు అధికారులు చెప్పడం సత్యదూరమని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

ఉపా ధ్యాయ ఎంపిక పరీక్ష విషయంలో ఇప్పటికే అభ్యర్థులకు అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో తాజాగా కమీషన్‌లో జరుగుతున్న పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. త్వరలో టిఆర్‌టి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో హాల్‌టికెట్ల జారీ వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశమైంది.

రంగంలోకి స్వచ్ఛ రోబోలు

- మ్యాన్ హోల్స్ శుభ్రపరచడానికి వినియోగం
- కేరళలో ట్రయల్ రన్ సక్సెస్
- వచ్చే వారం నుండి పూర్తి స్థాయిలో వాడకం
- వైఫై, బ్లూటూత్‌తో ఆపరేటింగ్ నచ్చిన భాషలో ఆదేశించే విధంగా రూపకల్పన
- 9 మంది యువ ఇంజినీర్ల.. 8నెలల కష్టం
- జెన్ రోబోటిక్స్ సంస్థ ఆధ్వర్యంలో తయారీ

తిరువనంతపురం : శాస్త్ర సాంకేతిక రంగాన్ని ఉపయోగిస్తూ అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేసే దిశగా కేరళ అధికారులు కదులుతున్నారు. దేశంలో ఎక్కడైనా మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది రంగంలోకి దిగేవారు. కానీ కేరళ అధికారులు మాత్రం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నారు. మ్యాన్ హోల్స్‌ను శుభ్రం చేయడానికి టెక్నాలజీని వినియోగించుకుంటున్నారు. దీనికిగాను రోబోలను తయారు చేశారు. మానవ రహిత రోబోలతో మ్యాన్‌హోల్స్‌ను క్లీన్ చేయడానికి ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా కేరళ వాటర్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.షైనమోల్ మాట్లాడుతూ... జెన్ రోబోటిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో మ్యాన్ హోల్స్‌ను శుభ్రపర్చే ట్రయల్ రన్ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతమైంది. దీన్ని వచ్చే వారం దీన్ని ప్రయోగాత్మకంగా రంగంలోకి దించుతాం. కేరళ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు రాకతో నూతనోత్సాహంతో ఉంది. రోబోను వైఫై, బ్లూటూత్‌తో నియంత్రిస్తు ఉంటా రు. నాలుగు అవ యవాలను అమర్చడం జరిగింది. బకెట్ సిస్టంను కూడా రోబోకు అనుసంధానిం చారు. మ్యాన్ హోల్స్ నుండి వ్యర్థాలను వెలికి తీసే ప్రక్రియను చూసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టుకు కేరళ వాటర్ అథారిటీ సహాయ సహకారాలు అందిస్తున్నది. టెక్నాలజీని ఉపయోగించి శానిటరీ రంగంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవచ్చో అనే అంశంపై కొత్త కొత్త ఆలోచనలను షేర్ చేసుకుంటున్నారు. పైపుల లీకేజీలను అరికట్టడం, శానిటేషన్ పనులు వంటి వాటిల్లో కూడా టెక్నాలజీని ఉపయోగించడానికి కేరళ ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది.



తొమ్మిది మంది యువ ఇంజనీర్ల బృందం ఈ రోబోను తయారు చేసింది. తిరువనంతపురంలో దీన్ని ట్రయల్‌రన్ చేయగా విజయవంతమైందని జెన్ రోబోటిక్స్ సంస్థ చీఫ్ ప్రొడక్ట్ ఆర్కిటెక్ట్ సీఈఓ విమల్ గోవింద్ తెలిపారు. మెదడుకు పదునుపెట్టి మ్యాన్‌హోల్స్‌ను శుభ్రపర్చ డంలో టెక్నాలజీని ఉపయోగించు కోవాలని భావిం చారు. రోబోలను తయారు చేయాలను నిశ్చయించు కున్నారు. చివరికి అనుకున్నది సాధించారు. రోబోల పనితనం పరీక్షించడానికి మెడికల్ కళాశాల సమీపంలోని మ్యాన్‌హోల్‌ను ఎంచుకున్నారు. మ్యాన్‌హోల్‌లో 30 కిలోల చెత్తను వేశారు. దాన్ని రోబో సాయంతో బయటికి తీయడానికి నిశ్చయించుకున్నారు. చెత్తలో న్యాప్కిన్స్, దస్తువులు, సర్జికల్ బ్లేడ్‌లు ఉన్నాయి. గంటలోపే మ్యాన్ హోల్‌ను రోబో ఎలాంటి ఇబ్బంది పడకుండా శుభ్రం చేసింది. దీంతో ఎలాంటి మ్యాన్ హోల్‌ను అయినా రోబో శుభ్రం చేయగలదనే నమ్మకం కలిగింది. రోబోను తయారు చేయడానికి 7 నుంచి 8 నెలల సమయం పట్టింది. కేరళ స్టార్టప్ మిషన్ (కేఎస్‌యూఎం), కేరళ వాటర్ అథారిటీ కింద పని చేస్తున్న కేరళ వాటర్ ఇన్నోవేషన్ జోన్ మధ్య అవగాహన ఒప్పం దం కూడా చేసుకున్నారు. మార్చి 2న అట్టికల్ పుంగాల పండుగలో భాగంగా దీన్ని విధానాన్ని వివరించడం జరుగుతుంది.

మ్యాన్‌హోల్ ఎలా శుభ్ర పరుస్తాం.. రోబో కార్య కలాపా లను గురించి ముందస్తు పరీక్ష నిర్వహించ నున్నారు. రోబో గురించి పలు విషయాలు తెలుసు కునేందుకు పక్క నున్న తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి ప్రతినిధులు వచ్చారు.

అదే విధంగా కెనడ, యూకే నుంచి ప్రతినిధులు పాల్గొ న్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా రోబో పనితీరును ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఢిల్లీలో సాలిడ్, లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎల్ఆర్ఎం)లో భాగంగా నిర్వహించనున్న నేషనల్ వర్క్ షాప్‌నకు హాజరు కావాలని కేరళ వాటర్ బోర్డుకు ఆహ్వానం అందింది. మ్యాన్‌హోల్స్‌లో ఎలక్ట్రానిక్ సామాగ్రిని తీసుకెళ్లలేని పరిస్థితి. అదేవిధంగా విషవాయువుల కారణంగా కూడా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పో తున్నారు. అందులో భాగంగానే శ్రమ తగ్గించడానికి రోబోల తయారీ జరిగింది. రోబోలో గ్యాస్‌తో పాటు పీడనంతో కూడి గాలి నింపబడుతుంది.



ఇంటర్ వరకూ కస్తూర్బా..!

- ఫలించిన మంత్రి కడియం కృషి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను (కేజీబీవీ) 12వ తరగతి వరకు పొడిగించేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ప్రకాష్ జవడేకర్‌తో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖా మంత్రి కడియం శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు సి.మల్లారెడ్డి సమావేశమయ్యారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (క్యాబ్) దేశవ్యాప్తంగా బాలికల విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కడియం జవడేకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఏపీ పునఃవిభజన చట్టంలో పొందుపరిచిన విధంగా తెలంగాణకు ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, మహిళా విశ్వవిద్యాలయాలను కేటాయించాని కోరారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం ఎనిమిదో తరగతి వరకూ ఉన్న కేజీబీవీలను 12వ తరగతి వరకు పెంచేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. జనవరిలో జరిగిన క్యాబ్ సమావేశంలో బాలికల విద్యాభివృద్ధి, కేజీబీవీలపై కేంద్ర మంత్రి నుంచి ఎటువంటి స్పష్టత రాలేదని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రకాష్ జవడేకర్‌తో సమావేశమై కేజీబీవీల ఏర్పాటు ఆవశ్యకతను వివరించామని కడియం అన్నారు. క్యాబ్ కమిటీ సిఫార్సుల మేరకు కేజీబీవీలను 12 వ తరగతుల వరకు పొడిగించి, ఈ ఏడాది నుంచే అమలయ్యేలా చూస్తామని జవడేకర్ స్పష్టం చేశారని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు కేంద్రం నిధులిస్తుందని, కానీ 9, 10 తరగతులకు కూడా కేజీబీవీలుగానే గుర్తిస్తూ తెలంగాణా ప్రభుత్వమే ఖర్చులు భరిస్తోందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఈ నెల చివరిన జరిగే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కేజీబీవీలకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటామని జవడేకర్ హామీ ఇచ్చారని అన్నారు. కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్రతో బాల్య వివాహాలను అరికట్టడానికి, బాలికల డ్రాపవుట్లను తగ్గించడానికి కేజీబీవీల పాత్ర కీలకంగా మారుతుందని కడియం ఆశాభావం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని, స్కూల్ యూనిఫామ్‌లను 12వ తరగతి వరకు పొడగిస్తే బాగుంటుందని కేంద్ర మంత్రికి సూచించామని చెప్పారు. ఈ మూడు అంశాలను 12వ తరగతి వరకు పొడగించడం వల్ల పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగడమే కాకుండా, బాలికల విద్యాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని కడియం ఆయనకు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఒక్కగానొక్క పద్మావతి మహిళా యూనివర్సిటీ విభజనలో ఏపీకే వెళ్లిపోవడం వల్ల తెలంగాణకు ప్రత్యేకంగా ఒక మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని జవడేకర్‌ను కోరినట్లు ఉప ముఖ్యమంత్రి పాత్రికేయులకు తెలిపారు. ఈ మహిళ విశ్వ విద్యాలయ ఏర్పాటుకు ఆర్థిక సాయం, సెంట్రల్ మహిళ విశ్వ విద్యాలయంగా అభివృద్ధి చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలనీ కోరినట్టు వెల్లడించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 21 ఫిబ్రవరి 2018

అమ్మ భాషే అమృతం

మాతృభాషే మాధ్యమం కావాలి!

తెలుగుకు ప్రాచీన హోదా ఇస్తూ కేంద్రం ప్రకటించి పదేళ్ళు కావస్తోంది.కన్నడంతో పాటుతెలుగు భాషకు కూడా ప్రాచీన హోదా ఇస్తున్నట్టు 2008 నవంబర్‌లో ఆనాటి కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి అంబికా సోని ప్రకటించారు. ఈ పదేళ్ళలో తెలుగు భాష అభివృద్ధి చెందలేదన్న వ్యధ చాలా మంది తెలుగువారిలో ఉంది.ఇందుకు కారణాలేమిటో అందరికీ తెలిసినవే. తెలుగు ప్రస్తావన రెండువేల ఏళ్ళ నాటి ఐతరేయ బ్రాహ్మణంలో ఉందని తెలుగు సంవత్సరాది నాడు ఏటా పండితులు పేర్కొంటూ ఉంటారు. తర్వాత ఆ విషయం మళ్ళీ ప్రస్తావనకు రాదు.అలాగే మాతృభాషా పరిరక్షణ దినోత్సవ రోజున కూడా తెలుగును వ్యవహార భాషగా అమలు జేయాలన్న తీర్మానాలు,ప్రతినలు చేయడం అలవాటైంది. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు దగ్గరుండి అన్నీచూసుకుంటూ ఎంతో ఘనంగా నిర్వహించారు. 1975లో ఆనాటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి ప్రేరణ, ప్రోద్బలం ఆనాటి విద్యా శాఖ మంత్రి మండలి వెంకట కృష్ణారావు. తెలుగు భాషపై మహాసభలు,తెలుగు భాషోత్సవాలు జరిగినప్పుడు మాత్రమే తెలుగు ప్రాభవం గురించి అందరికీ తెలుస్తోంది.అలా కాకుండా, పరిపాలనా భాషగా తెలుగును అమలు జేయాలన్న ఉద్దేశ్యంతోనే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధికార భాషా సంఘం అన్ని జిల్లాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాల యాసలనూ, మాండలీకాలనూ దృష్టిలో పెట్టుకుని జిల్లా, గ్రామస్థాయిల్లో తెలుగు భాష అమలు కోసం సూచనలు చేసింది. వ్యవహారిక పదాలను సిఫార్సు చేసింది. ఆ తర్వాత ఆదర్శ ప్రజా ప్రతినిధి వావిలాల గోపాల కృష్ణయ్య, అంతకుముందు వందేమాతరం రామచంద్రరావు.సుప్రసిద్ధ జర్నలిస్టు ఎబికే ప్రసాద్ వంటి ప్రముఖులు అధికార భాషా సంఘానికి నేతృత్వం వహించి ఎన్నో సిఫార్సులు చేశారు. అయితే,ఎప్పటికప్పుడు ఆ సిఫార్సులన్నీ ఫైళ్ళలో బూజు పడుతున్నాయే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. పదికోట్లమందికి పైగా తెలుగు ప్రజలు వేర్వేరు రాష్ట్రాల్లో ఉంటున్నా, తమ ఇళ్ళల్లో తెలుగే మాట్లాడుకుంటున్నారు. విద్యా,ఉద్యోగ కేంద్రాల్లో మాత్రం మళ్ళీ ఆంగ్లంలో మాట్లాడటం అందరికీ అలవాటైంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయన్న అభిప్రాయం తెలుగు వారిలో నాటుకుని పోయింది. మన విద్యా విధానం అంతా బ్రిటిష్ వారి కాలం నాటి మెకాలే విద్యావిధానానికి నకలుగానే ఉండటం వల్ల ఆంగ్ల భాషకు ప్రాధాన్యం తప్పని సరి అవుతోంది. దానికి తగ్గట్టు వృత్తి విద్యా కోర్సుల్లో పోటీ పరీక్షలకు హాజరు కావాలంటే ఆంగ్లం తప్పనిసరి కావడం వల్ల ఆ కోణం నుంచి కూడా విద్యాలయాల్లో బోధనాభాషగా తెలుగు అమలుకు నోచుకోవడం లేదు. అంతేకాక, ప్రైవేటు కాన్వెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకుని రావడం వల్ల ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బడులు,మాధ్యమిక,ఉన్నత పాఠశాలలు వెలవెల పోతున్నాయి. చదువు మధ్యలో మానేసే డ్రాప్ అవుట్స్ కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు జేస్తున్నా, ఆ పథకం నిధులు మిగిలిన ప్రభుత్వ పథకాల నిధుల మాదిరిగా పక్కదారి పడుతున్నాయి. తెలుగు భాష పాలనా భాషగా అమలు పాలకుల చేతుల్లో ఉన్న మాటనిజమే కానీ, వాడుక భాషగా అమలు కాకపోవడానికి పూర్తి బాధ్యత తల్లితండ్రులదే.రెక్కాడితే గానిడొక్కాడని అట్టడుగు కుటుంబాలకు చెందిన పిల్లలు బడులకు వచ్చేట్టు చేయడం కోసం ఎన్నో ఆకర్షణీయ పథకాలను ప్రభుత్వాలు అమలు జేస్తున్నా, తమ పిల్లలను అట్టడుగు వర్గాల వారు బడులకు పంపడం లేదు. మధ్యతరగతి కుటుంబాల తల్లితండ్రులకు పోటీ పరీక్షల్లో తమ పిల్లలు ర్యాంకులు సాధించాలని ఉవ్విళ్ళూరుతుండటం వల్ల తెలుగు మాధ్యమంలో విద్యాబోధన వెనకబడిపోతోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళే గ్రామీణ ప్రజలను ఆంగ్లంలో బోర్డులు ఇప్పటికీ వెక్కిరిస్తున్నాయి. తెలుగుమహాసభల ప్రభావం ఇటీవల కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులో పేర్లున్న బోర్డులు కనిపిస్తున్నాయి.ఇది చాలదు.కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ ఓ సభలో ప్రసంగిస్తూ కోర్టుల్లో వాదోపవాదాలు తెలుగులో జరగాలనీ, అలా జరిగితేనే న్యాయం జరగడమే కాదు,న్యాయం జరిగినట్టు కక్షిదారులకు అనిపిస్తుందని వ్యాఖ్యానించారు. కోర్టుల్లో తెలుగులో వాదోపవాదాలు జరగాలని ప్రజలు కోరుతున్నారు. అధికార భాషా సంఘం ప్రముఖులు కూడా సిఫార్సు చేస్తున్నారు.కోర్టులోనే కాదు. ఉన్నత విద్యా సంస్థల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రోత్సహించాలన్న డిమాండ్ సహేతుకమైనదే. అయితే, విదేశాల్లో ఉద్యోగాలు,విదేశాల్లో చదువు మీద మోజు పెరుగుతండటం వల్ల తెలుగులో విద్యాభ్యాసం చేస్తే ఉన్నతావకాశాలు రావేమోనన్న బెదురు చాలా మందిలో ఉంది. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తెలుగు రాష్ట్రాల్లో పర్యటనకు వచ్చినప్పుడల్లా తెలుగు కన్న తల్లి, ఆంగ్లం పెంపుడు తల్లి అని వ్యాఖ్యానిస్తూ ఉంటారు. అలాగే, గురువు ముఖతా నేర్చుకున్నదే విద్య అనీ, గూగుల్ కన్నా గురువు గొప్పవాడని తరచూ వ్యాఖ్యానిస్తూ ఉంటారు.తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా తెలుగును పాలనా భాషగా అమలు జేసేందుకు ఆసక్తి చూపుతున్నా, అన్ని స్థాయిల్లో అది అమలు జరగకపోవడానికి తదుపరి కార్యాచరణ లేకపోవడమే. ఇందుకు సంబంధించిన శాఖలూ,సంఘాలూ తెలుగు మాధ్యమాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలి. భాషాభిమానం విషయంలో తమిళులనూ,బెంగాలీలనూ ఆదర్శంగా తీసుకోవాలని వావిలాల గోపాలకృష్ణయ్య తరచూఅనేవారు. తెలుగులోనే ఆలోచించడం, మాట్లాడటం, ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేయడం వంటి తదుపరి కార్యాచరణ ద్వారానే తెలుగు జనభాషగా వృద్ధి చెందుతుంది. మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ఇందుకోసం ప్రతిన బూనడం ప్రతితెలుగు వాని కర్తవ్యం.

మంచి మాట

కవి సమూహమందు కాళిదాసుడు లెస్స
మహలులందు తాజమహలు లెస్స
నగరులందు భాగ్యనగరమే కడు లెస్స
దేశ భాషలందు తెలుగు లెస్స
- కరుణశ్రీ

ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం. భాషల బహుళత్వం, భాషాపరమైన సాంస్కృతిక భిన్నత్వానికి గుర్తుగా ఈ ఉత్సవం. ఐక్య రాజ్య సమితి యునెస్కో ఫిబ్రవరి 21ని మాతృభాషాదినోత్సవంగా తీర్మానించేందుకు మాతృ భాష సాధికారత కోసం బంగ్లాదేశ్ ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు చేసిన ప్రాణార్పణ ప్రధాన ప్రేరణ.

1947 నాటి భారతదేశ విభజన సందర్భంలో బెంగాల్ పశ్చిమభాగం తూర్పు పాకిస్థాన్‌లోకి వెళ్లిపోయింది. తూర్పు దేశీయుల ఉర్దూ సంస్కృతికి పశ్చిమ దేశీయుల బాంగ్లా సంస్కృతికి ఆర్థిక పరమైన బిన్నత్వమే కాకుండా.. భాషాపరమైన వైరుధ్యమూ కద్దు. ఉర్దూను మాత్రమే పాక్ అధికార భాషగా గుర్తించడంతో బంగాలీలు ఆందోళన చేయడం.. ప్రభుత్వ దమన కాండలో విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలసిపోవడం.. తదనంతర పరిణామాల పర్యవసానాల ఫలితంగా బంగ్లాదేశ్ ఆవిర్భావం సంభవమయ్యాయి. మాతృభాష ఔన్నత్యాన్ని ప్రపంచస్థాయిలో గుర్తింపు తేవాలన్న ఐరాస లక్ష్యమే ప్రతి ఏటా ఫిబ్రవరి 21 న ప్రపంచ మాతృభాషా దినోత్సవంగా జరిగేందుకు కారణమయింది.


మాతృభాష మొదటి భాష, ప్రాంతీయ భాష:

పిండ దశ నుండే శిశువుకు పరిచయమవుతుంది కాబట్టి మాతృభాషే మొదటి భాష. బిడ్డ ఎదిగే దశలో ఏ ప్రాంతపు భాషా మాధ్యమం ద్వారా పరిసర విజ్ఞానం అందుబాటులో ఉంటుందో అదే ప్రాంతీయ భాషా అవుతుంది కదా! తల్లి ఒడి భాషకు.. గురువు బడి భాషకు మధ్య తేడా ఉండకూడదన్నది భాషాశాస్త్రవేత్తల సూచన. మాతృభాష మీద చులకన భావం మేలు చేయదు. భూమ్మీదకు వచ్చే మూడు నెలల ముందు నుంచే శిశువు అమ్మ కడుపు నుంచే బైటి శబ్దాలను ఆలకిస్తుంటాడు. మహాభారతంలో అభిమన్యుడు తండ్రి అర్జునుడు వినిపించే పద్మవ్యూహం మెళకువలను తల్లిగర్భంలో నుండే ఆకళించుకొన్న వైనం మనకు తెలిసిందే! ఎన్నోరకాల శబ్దాలలో గారాలు పోగల సామర్థ్యం కలిగి ఉండీ తల్లిభాషలోనే మారాం చేసేందుకు కారణం మాతృభాషా ధ్వనులతో పిల్లలకు కలిగే ఉపశమనమనమే అని యేల్ విశ్వవిద్యాలయ భాషావిభాగం తేల్చి చెప్పిన సత్యం. అమ్మతోని జీవబంధమే అమ్మభాషతోనూ బిడ్డకు ఉంటుందని బాలమనస్తత్వవేత్తలు నిర్ధారిస్తున్నారు. ఆ సహజ జీవ లక్షణాన్ని సైతం నిర్లక్ష్యం చేస్తూ తొక్కు పలుకుల దశ నుంచే బిడ్డ నోటిలో పరిసరాలతో సంబంధం లేని పరాయి భాషా శబ్దజాలాన్ని బలవంతంగా కుక్కే కక్కుర్తి బిడ్డ సృజనాత్మక సామర్థ్యం మీద దుష్ప్రభావం చూపిస్తుంది. పరాయి భాషలో జరిగిన విద్యాబోధన కారణంగా తనకు జరిగిన మేథోనష్టాన్ని నిరసిస్తూ బాల్యం నాటి గురువు ముల్లా సాలేకు ఓ సందర్భంలో సుదీర్ఘమైన లేఖ ఒకటి రాసాడు మొగలాయీ చక్రవర్తి ఔరంగజేబు. పరిసరాలతో సంబంధంలేని విదేశీ భాష మీద పట్టు సాధించేటందుకు విలువైన బాల్య అభ్యసన కాలమంతా వృథా అయిందన్నది చక్రవర్తి ఫిర్యాదు. దేశీయభాషలో కనక విద్యాబోధన జరిగి ఉండుంటే పరిసర విజ్ఞానం మంచినీళ్ల ప్రాయంగా పట్టుబడి ఉండేదని ఔరంగజేబు బాధ. తల్లిభాష ద్వారా సాధించే అవగాహనా సామర్థ్యంతో తదనంతర దశల్లో ఎన్నిపరాయి భాషలనైనా సునాయాసంగా నేర్చుకోవచ్చన్న ఔరంగజేబు అభిప్రాయాన్నే అధునాతన భాషాశాస్త్రమూ మాతృభాషలోనేప్రాథమిక విద్యాబోధన సాగాలన్నది ప్రపంచవ్యాప్తంగా క్రమంగా ఉపందుకుంటున్న భావన. అయినా తల్లి భాష నిర్లక్ష్యానికి గురవుతున్న పరిస్థితి నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో కళ్లక్కడుతున్న దుర్భర దృశ్యం.. అమ్మలాగే అమ్మభాషా ప్రతి పసిబిడ్డ జీవితంలోనూ ఓంప్రథం నుంచీ ఓ ప్రధాన భాగం. ఇంటి భాషకు ఇంటా బైటా చుట్టుపక్కలు, చుట్టాలు పక్కాలే జీతం బత్తెం లేని గురువులే! రాయడం రాకపోయినా పలుకు సహజంగా పట్టుబడుతుంది. పలుకు బడులకు, వాక్యనిర్మాణాలకు ఏ వ్యాకరణ సూత్రాలు, పద బంధ కోశాల అవసరం ఉండదు అమ్మభాషకు. అమ్మభాషని నమ్ముకుంటే చాలు. ఆ మెట్టు పైనుంచే ఎన్ని భాషాసౌధాలనైనా సునాయాసంగా ఎక్కేయవచ్చు ఆసక్తి ఉంటే!

అమ్మను ప్రేమించు! పొరుగమ్మనూ గౌరవించు!

అమ్మను ప్రేమించమంటే.. పొరుగమ్మను దూషించమనికాదు అర్థం. రచ్చలో గెలువాలంటే ముందు ఇంటి నుంచి నడక మొదలవలన్నది మాతృభాషాభిమానుల వాదం.

తెలుగు బాష ప్రాముఖ్యత



మన మాతృభాష తెలుగు. ప్రాకృత రూపం తిరిలింగ. సంస్కృతంలోని త్రికళింగ మూల రూపం కావచ్చుమొ దిగ్వాచి రాసిన సోమయాజిగారి అభిప్రాయం. శ్రీకాళహస్తి, శ్రీశైలం, మహేంద్రగిరి అనే త్రి నగముల మధ్య వినిపించే శబ్దం కాబట్టి తెనుగు అయిందనే వాదనా కద్దు. ఎన్ని వందల వాదనలు ఉన్నా 'తెలుంగు' అంటే తెల్లగా, స్పష్టంగా ఉండే భాష- అన్న వాదనకు మాత్రం రెండో మాదన లేదు. క్రీ.శ. 1వ శతాబ్దం నాటి శాతవాహన చక్రవర్తి హాలుడి 'గాథా సప్తశతి'లో తెలుగు పదాలు కనపడుతున్నాయి.. క్రీ.శ. 200 లోని అమరావతి శిలాశాసనంలోని 'నాగబు' పదంలోని 'బు' ప్రత్యయాన్ని మొట్టమొదటి తెలుగు అక్షరంగా భాషా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భాషారూపం సంస్కృతానికి సన్నిహితంగా ఉంటుందనిపించినా.. భావ సారూప్యతలో మాత్రం ద్రవిడ భాషాకుటుంబానికి చెందినట్లు అనిపించే గొప్ప సమన్వయ తత్వం తెలుగుభాషది.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న శ్రీకృష్ణ దేవరాయల ప్రభువు ప్రశంస ఎన్ని శతాబ్దాల బట్టో వింటు వస్తున్నదే. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో లక్షకు మించిన పదాలతో కూడిన తెలుగు వ్యుత్పత్తి పదకోశం ఎనిమిది సంపుటాలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయంవారిచే ప్రచురించబడింది.

ఇంగ్లీషు తరువాత ఇంతటి పదకోశ సంపద ఉన్నా నేటి మన తెలుగు తరాల నోట తెలుగు మాటే వినబడటం లేదు! జాను అనే పదాన్ని 'స్పష్టము' అనే అర్థంలో కవి తిక్కన ప్రయోగించాడు. డా.సి. నారాయణ రెడ్డి నిర్వచన ప్రకారం 'ఏది ఒకానొక దుర్బోధక విషయముని కూడా సామాన్య జనులకు సైతం సుబోధకంగా, సుప్రసన్నంగా అందించునో అది జాను తెనుగు' అని వివరించారు. అట్లాంటి జానుపద పుష్పాలతో అన్నమాచార్యులు వంటి వాగ్గేయ కారులు ముప్పై రెండు వేల మాలికలనల్లి తిరువేంకటేశుని గళసీమను అలంకరించాడు. 'జానే దేవ్' అంటూ మనం ఓ పక్కకు నెట్టేసుకుంటున్న తెలుగుది దేశవ్యాప్తంగా హిందీ తరువాత ఎక్కువగా వినబడే భాష ఒకప్పుడు. తెలుగు వాడుగా పుట్టి తెలుగులో సాహిత్య సృజన చేయనందుకు తమిళులకు ఆరాధ్యుడైన సుబ్రహ్మణ్య భారతి తీవ్రంగా కలత చెందితే .. తెలుగు ఆయాచిత వరంగా అమ్మభాషారూపంలో అబ్బుతున్నా.. 'అబ్బా!' అంటూ నోటి నిండుగా పలికేటందుకే మొరటుగా భావిస్తున్నాం! పెరటి చెట్టు కదా! మందుకు పనికి రావడం లేదు మనకు! అందుకే భాష మృతస్థాయికి చేరుకుంటూందని మాతృభాషాభిమానులు గగ్గోలు పెడుతున్నారు.

యునెస్కో ప్రమాణాల ప్రకారం ఏ భాష వాడకంలో వరుసగా రెండు తరాలపాటు క్రమంగా 20 శాతం చొప్పున పడిపోతూ వస్తుందో ఆ భాష ఉనికికి రాబోయే రెండు దశాబ్దాలలో ప్రమాదం ముంచుకొస్తుంది. యునెస్కో విడుదల చేస్తూ వస్తున్న కనుమరుగయే భాషలలో అధిక శాతం మార్పుకు ఒక పట్టాన అంగీకరించని కొండజాతుల భాషలే ఎక్కువ. కాలానుగుణంగా ఎప్పటికప్పుడు మార్పు చెందే లక్షణం పుష్కలంగా కనబరిచే తెలుగు భాషకు కనుమరుగయే ప్రమాదం కేవలం మితిమీరిన అభిమానంతో మాతృ భాషా భిమానులు చేస్తున్న వాదనే అని ఇంకొందరి వాదంగా కూడా ఉన్నది. కాలానుగుణంగా ఏ భాషలో నైనా రవ్వంత మార్పులు రావడం సహజం. భాష బతికుందనడానికి అదే ఓ సజీవ సాక్ష్యం. ఇవాళ్టిది డిజిటల్ యుగం. అంతా అంతర్జాలం. రేపు ఏ మాయా జాలమో ఇప్పుడే ఊహించనైనా లేం. కాలానికి అనుగుణంగా కాలు కదపక పోతే కళ్లు మూసి తెరిచే లోగా ఓ యుగం వెనకబడే వేగం. మూలాలు చెదరకుండా .. గుర్తింపుకు ముప్పు రాకుండా.. మన మాతృభాషే అంతర్జాతీయంగా ఎదిగితే.. అంతకు మించిన సంతోషం మరేముంటుంది? శాస్త్రీయం, సాంకేతికం ఒక పార్శ్వంగా ఉంటే.. సహజత్వం, సజీవత మరో పార్శ్వంగా ఉన్నంతకాలం మనపదహారణాల తెలుగు నాణం చలామణీలో తప్పక ఉంటుంది. డాలరు రువాబుకు జవాబు తెలుగువాడు తన మాతృభాష మీద పెంచుకోవాల్సిన ప్రేమలోనే ఉందని ప్రతీ తెలుగు బిడ్డ తెలుసు కోవాలి. తెలుగు సజీవతకు సజ్జనులు తగు మాత్రం సంక్షేమ చర్యలు తీసుకుంటే చాలు.. మాతృభాషగానే కాదు అంతర్జాతీయ స్థాయిలోనూ తెలుగు వెలుగులు విరజిమ్మడం ఖాయం.

తెలుగు పరిరక్షణకు ఏం చేయాలి?

అధికార భాషా సంఘాలు, ప్రపంచ మహా సభలు, మాతృభాషలో విద్యాబోధనలు, పాలన.. న్యాయ.. పౌర.. రక్షణ రంగాలలో వాడడాలు, దేశ.. విదేశ విశ్వవిద్యాలయాల్లో పీఠాలు, అకాడమీల ద్వారా సాహిత్య ప్రోత్సాహకాలు.. వంటి మరెన్నో సంస్కరణలు ఎల్లకాలం కొత్త కొత్తవి అలా పుట్టుకొస్తూ ముందుకు సాగుతూనే ఉండాలి. రెండో మాట లేదు. కానీ అన్నింటికన్నా ముందు తెలుగువాడు తెలుగు పలుకే మన ఉనికికి మూలమన్నసత్యం మనసుకు పట్టించుకోవాలి. అప్పుడు ప్రతి ఏటా మనమింతగా సందర్భాలు పెట్టుకొని మరీ మాతృభాష ఔన్నత్యాన్ని గూర్చి ఘోషించుకోవలసిన అగత్యం ఉండదు.

తెలుగు నేర్చుకోవాలనుకునే వారు పరాయి దేశాల్లో కూడా క్రమంగా పెరుగుతున్న సందర్భం ఇది. పొరుగు రాష్ట్రాల తెలుగువారు తమ తల్లిభాష నిలుపుదల కోసం పోరు సలుపుతున్న సమయం కూడా ఇదే! భాషా శాఖ, నిఘంటు నిర్మాణ శాఖల ద్వారా మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడి తెలుగు పదజాలాన్ని రికార్డులకు ఎక్కే పని కొనసాగించాలి. వాడుకలో నుంచి తొలగిపోయిన మూల పదాలను జల్లెడ పట్టి పోగులు పోసే ప్రయత్నం మైసూర్ సిఐఐఎల్ సంస్థ తరహాలో ముమ్మరంగా కొనసాగించాలి. యుజిసి వంటి సంస్థల ద్వారా మారుతున్న కాలానికి తగ్గట్లు శాస్త్ర సాంకేతిక పారిభాషిక పదాలను తయారుచేయాలి. తెలుగు మాధ్యమంలో శాస్త్ర విద్యను బోధించేందుకు సరితూగే సహజ పదాలు పాతవి మరుగున పడివుంటే వెలుగులోకి తెచ్చే పరిశోధన ఒకవైపు.. లేని పక్షంలో కొత్తవి సృష్టించుకునే ఆవిష్కరణ మరో వైపు నిరంతరాయంగా కొనసాగించాలి. ఆంధ్రాంగ్లాల మధ్య ఇచ్చి పుచ్చుకొనే మాటలనో క్రమ పద్ధతిలో పేర్చడం మొదలు పెట్టాలి. వృత్తి పదకోశాలు, మాండలిక పదకోశాల నిర్మాణం భాషను పరిపుష్టం చేస్తుంది. ఆ దిశగా కృషిని మరింత ముక్కరం చేయవలసి ఉంది. అంతర్జాతీయ స్థాయి మహా సభలు మంచివే. వాటి తీర్మానాలూ అమలు నోచుకోవాలి. అప్పుడే పెట్టిన ఖర్చు వృథా కానట్లు. తెలుగువారంతా ఒకే భాషాసముదాయం. పరాయి ప్రాంతాలలో ఉన్నందువల్ల వారి సమస్యలు విభిన్నంగా ఉండవచ్చు. వాటినీ సమాదరించి పరిష్కరించే ప్రయత్నం సహృదయంతో చేపట్టినప్పుడే తెలుగు విశాలతకు ఓ సార్థకత చేకూరేది.

ఒక్క తెలుగేనంటే కుదరదు:

ప్రపంచీకరణ. మెరుగైన జీవితాల కోసం ఎక్కడెక్కడికో ఎగిరి వెళ్లక తప్పని స్థితి. మంచి జీతాల కోసం చదివే పెద్ద చదువుల్లో ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం ఒక్క తెలుగు అంటేనే కుదరదు. జీవనోపాధి కోసమే ఇంగ్లీషు చదువులు. ఆంగ్లం మాత్రమే అందుకు సంసిద్ధంగా ఉంది. తిండి పెట్టే దాని మీదే ఎవరికైనా మక్కువ ఎక్కువ. అమ్మయినా ఆదరిస్తేనే ప్రేమ. విద్యా వ్యాపారమయం అయిపోయిందిప్పుడు. పైసాకైనా చెల్లకుండా చేసి 'అమ్మభాష.. అందుకైనా ప్రేమించు' అంటూ భావోద్వేగాలను ప్రదర్శించినా కాలాన్ని కాసులతో తూచే కాలంలో చెల్లే రోజులు కావు. ప్రజలవైపు నుంచి సరే.. ప్రభుత్వాల వైపు నుంచీ చిత్తశుద్ధితో కార్యాచరణ మొదలవ్వాలి. ఏభై ఏళ్ళకిందట ఎంతో దయనీయంగా ఉన్న తమిళం నేడు ఉజ్వలంగా ప్రకాశిస్తోంది. మలయాళం, కన్నడ భాషలు వృద్ధి కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతున్నాయి. మాతృభాషాభివృద్ధి మీద పాలకులే ముందు చిత్తశుద్ధి ప్రదర్శించాలి. అప్పుడే పురోగతి. పాలకులకులకే పట్టని భాషమీద ప్రజలు ఏ భరోసాతో ఆధారపడతారు? 'తల్లి నుడి కంటే పరమామృతంబు కలదె' అన్నాడు మహాకవి రాయప్రోలు. ఆ మాటాను సార్థకం చేయాలంటే అటు ప్రజలు.. ఇటు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కొనసాగించాల్సిన కార్యాచరణ చాలానే ఉంది మరి!

-కర్లపాలెం హనుమంతరావు, 8142283676

పరిరక్షణే ఆవశ్యం

మనిషికి ఉండే కొన్ని అనుబంధాలలో భాష కూడా ప్రబలమైనది. అలాంటి భాష ప్రయోజనం కేవలం సంభాషించడానికే పరిమితమవకుండా సంస్కృతీ సంప్రదాయాలు సైతం భాషతో సంబంధం ఏర్పరచుకొని మిళితమై ఉంటాయి. ప్రస్తుతం ప్రపంచం అంతటా అనేక భాషలు అంతరించే సమస్యను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా భిన్న భాషలు, వైవిధ్యతలకు పట్టం కట్టేలా యునెస్కో నిర్ణయం తీసుకున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. భాషలోని భావాలు, పూర్వ ఆచార వ్యవహారాలు, ప్రత్యేక అంశాలు అనేకం వాటి అంతర్ధానంతో సమాధవుతున్నాయి. ఈ మధ్య కేంద్ర హోంశాఖ వర్గాలు విడుదల చేసిన నివేదిక సైతం మనదేశంలో కూడా నలభైకి పైగా మాండలికాలు (10 వేల మంది లోపు మాత్రమే భాషిస్తున్నారు) అతి త్వరలో అంతరించే అవకాశం ఉందని వచ్చిన ప్రకటన వైవిధ్యమైన భాషలు, భిన్న మాండలికాలు, అల్ప సంఖ్యాకుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన వారికే ప్రత్యేకమైన భాషలు ఎంత తీవ్ర ముప్పు ముంగిట నిలిచాయో అద్దం పడుతున్నది. అజంత భాషగా పేరున్నప్పటికీ దేశంలో అత్యధికంగా మాట్లాడే రెండో భాషగా గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ తెలుగు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నదనటంలో సందేహం లేదు. ముఖ్యంగా ఈ మధ్యనే తెలంగాణ ప్రభుత్వం తెలుగు మహాసభల పేరిట భాషా పండుగను అట్టహాసంగా నిర్వహించడం అభినందనీయమే. తెలుగు వెలుగులు నిత్యం విరజిమ్మాలంటే ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు మరింత చేరువ చేయాల్సింది పోయి దూరమవటం, తల్లిదండ్రుల ఒత్తిడి, ఆంగ్ల భాషపై సమాజంలో పెరిగినమోజు, అవకాశాల లేమి, భాషపై చిన్న చూపు లాంటి పలు కారణాలతో మన మాతృ భాష మృతభాషగా మారే స్థాయికి నెట్టబడింది. తగు చర్యలు తీసుకోకపోవటమే కాక భవిష్యత్ పరిణామాల అంచనా వైఫల్యానికి నిదర్శనంగా ప్రస్తుత పరిస్థితులు దాపురించాయనటంలో ఎలా సందేహం లేదు. ఆంగ్లాన్ని భాషించేలా తర్ఫీదునిస్తూనే తెలుగు భాషను మాధ్యమంగా కొనసాగించే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి.

-వినోద్‌కుమార్ సుద్దాల

లిపిని సంస్కరిస్తేనే మంచి రోజులు

ఆంగ్ల భాష ప్రపంచంలో అతిపెద్దభాషగా ఎదిగి ఏలటానికి దాని అక్షరాలు నాలుగు బడుల్లో ఉండటం ఒక కారణమని ఆచార్య ప్రబోధానంద యోగి అంటుంటే నిజమేనా అని ఆగి ఆలోచించవలసి వచ్చింది. ప్రపంచం లో ఎన్నో భాషలు ఉంటే లిపి నాలుగు రకాలుగా ఏ భాషకన్నా ఉందా అని ఆయన ప్రశ్నించాడు. నిజమే కదా? నాలుగు రకాల లిపులు ఇంకే భాషకన్నా ఉన్నాయో లేదో తెలిసినవాళ్ళు చెప్పాలి. చాతుర్వర్ణం మయా సృష్ట్యామ్ అనే శ్లోకం ఆధారం చేసుకొని అదే మాదిరిలో నాలుగు బడుల అక్షరాలు చేసుకున్నారేమోనని ఆయన సందేహమూ వ్యక్తం చేశారు. భాష ఎదగాలంటే లిపి కూడా ముద్రణకు, రాయటానికి అనుకూలంగా బాగుండాలన్నమాట. 56 అక్షరాలున్న మన అతిపెద్ద తెలుగు లిపికి నాలుగు బడుల అక్షరాలు సమకూర్చలేము కానీ ఉన్న ఒకే ఒక్క లిపిని ముద్రణకు రాతకూ ఎలా అనుకూలంగా చెయ్యాలో ఆలోచిద్దాం.

ఇణి, జ్ఞ, న్య

ఇది ఇటీవలే ఎదురైనసమస్య. జ్ఞానము అనిరాయకుండా జ్నానము అనిరాస్తే ఫేస్ బుక్ అంగీకరిస్తోంది. జ్ఞా అనే తెలుగు అక్షరం ఎక్కడ కనబడ్డా మొత్తం పోస్టునే తొలగిస్తోంది. జ్ఞా లోని ఇణి గుర్తు సురక్షితమైనదే కాబట్టి అనుమతించాలని అభ్యర్థన పంపాను. ఇణి గుర్తు తెలుగు అక్షరమాలలో ఒక అక్షరం. దాని ప్రత్యేకత దానిది. ఈ అక్షరాన్ని వదిలేద్దామా కాపాడుకుందామా? అని మిత్రులను అడిగితే అక్షరాన్ని వదులుకోకూడదు అని కొందరు, ఇది తాత్కాలిక సమస్యే త్వరలో తొలగిపోతుంది అని కొందరు అన్నారు. యూనీకోడ్ లో ఉన్న అక్షరమే అయినప్పటికీ ఈ అక్షరం ఉన్న వ్యాసాలను అది ఎందుకో తిరస్కరించి ఫేస్ బుక్ మిత్రులను ఇబ్బంది పెట్టింది.

ప్రపంచ తెలుగు మహాసభలు ఇన్నిసార్లు జరిగినా ఎవరూ సరిగా పట్టించుకోని సమస్య లిపి సమస్య. మన జాతి వెనుకబడి పోవటానికి, తెలుగులో చదువులు బండబారిపోవటానికి, ఇంగ్లీషుతో సమానమైన వేగం అందుకోలేకపోవటానికి మన లిపే ప్రధాన కారణమని పండితులు, మేధావులు ఎప్పటినుండో చెబుతూనే ఉన్నారు. అయినాలిపి సంస్కరణ జోలికి వెళ్ళకుండానే మహాసభల్ని ముగించేస్తున్నారు. భాషను బాగుచేసే లిపి సంస్కరణ కార్యక్రమాన్ని ఇప్పటికైనా చేపట్టడం మంచిది.

బ్రహ్మ ఏర్పరచిన లిపి 'బ్రహ్మలిపి' అనుకుంటున్నారేమో గాని మనవాళ్ళు లిపి సంస్కరణకు భయపడుతున్నారనిపిస్తోంది. సవర భాషకు గిడుగు కొత్తలిపిని తయారు చేశాడు అంటారు. కానీ కొత్త లిపి ఎందుకు? తెలుగు లిపినే వాడుకోవచ్చుకదా? కొత్త లిపి జనామోదం పొందటం కష్టమే. భాష వాక్కు రూపంలో ధ్వనిస్తే, ఆ ధ్వనికి సంకేతమే లిపి, ఈ లిపి మనిషి తన సౌలభ్యంకోసం తయారు చేసుకున్నాడు. మోషేకు పది ఆజ్ఞలు దేవుడు రాతి పలకల మీద హెబ్రూ లిపిలో చెక్కి ఇచ్చాడట. ఎందుకంటే మోషే భాష హెబ్రూ గనుక. మనమంతా కలిసి ఈ శబ్దాన్ని ఈ అక్షరంతో రాయాలి. ఇలారాయాలి అనినిర్ధారించుకుంటే అదే మన లిపిగా నిలబడుతుంది. ప్రపంచంలో వేలాది భాషలకు లిపి లేదు. ఆ భాషలు రానురాను నాశనమై పోతున్నాయి. కేవలం 26 అక్షరాలతో వత్తులు, గుణింతాలను కూడా కల్పించుకొని సాఫీగా యంత్రాలపై సాగిపోతున్న ఇంగ్లీష్ తరహాలో తెలుగు లిపిని కూడా సంస్కరించుకోవాలి.

భూపతినారాయణమూర్తి 'భోధన, పాలన జనజీవన రంగాలలో తెలుగు' (1998) అనే పుస్తకంలో ఇలా అంటారు: మన లిపిలో ఉపయోగం లేని అక్షరాలు మూడోవంతు వరకు ఉన్నాయి. వాటిని రద్దుచెయ్యాలి. ఉ, ఖ, ఘ, ఝ, థ, ఐ వగైరా అక్షరాలను తీసి వేయాల్సి ఉంది. చైనా 3 సార్లు తన లిపిని సంస్కరించింది. శాస్త్ర సాంకేతికపరికరాలకు అనుకూలంగా లిపిని తయారు చేసుకున్నారు. అలాగే తెలుగు లిపిని కూడా సంస్కరించాలి. అప్పుడే అధికార భాషగా తెలుగు రాణించగలదు. లిపిని సంస్కరించటం వల్ల అత్యధిక సంఖ్యలో ఉన్న నిరక్షరాస్యుల్ని కూడా అక్షరాస్యులుగా చేయటం తేలిక అవుతుంది.' ఇప్పటికే మనం కొన్ని అక్షరాలను వదిలించుకున్నాం. 'అక్షర దీక్ష' వాచకాల్లో కేవలం 30 అక్షరాలే ఉపయోగించారు.

బూదరాజు రాధాకృష్ణ 'భాషాశాస్త్ర వ్యాసాలు' (1990) అనే పుస్తకంలో ఇలా అన్నారు. తెలుగును అధికార భాషగా వినియోగించినప్పుడు అదే సహజంగా అభివృద్ధవుతుంది.'

విజయ లిపి - భారతి లిపి

భారతదేశంలోని అనేక భాషల లిపులను కలపటానికి ఉమ్మడి లిపులను తయారు చేయటానికి ప్రయత్నాలు చేశారు. సత్య సాయి కోరిక మేరకు కన్నడ-తెలుగు లిపులను కలిపి విజయ లిపి రూపొందించే ప్రయత్నం జరిగింది. శ్రీకృష్ణ దేవరాయల స్మృతి చిహ్నంగా.. విజయనగర సామ్రాజ్యాన్ని జ్ఞప్తికి తెచ్చేలా 'విజయ లిపి' అనిపేరు పెట్టారు. మద్రాసు ఐ.ఐ.టి. ప్రొఫెసర్ వడ్డాది శ్రీనివాస చక్రవర్తి భారతి లిపి రూపొందించారు.

'కొన్ని తెలుగు ముద్రాక్షరాలు అచ్చుకూర్పరులకు విసుగు పుట్టించేవి. తెలుగు లిపిలో ఉన్న క్లిష్టత వల్ల తెలుగులో అచ్చు కూర్చటానికి (కంపోజింగ్‌కు) చాలా ప్రయాస పడేవారు. ఉదాహరణకు ఆనాడు అచ్చులో ఉపయోగిస్తున్న అర్ధచంద్రాకారంలో వేరొక వర్ణానికి కిందరాస్తూ ఉండిన రావడి కూర్పు చాలా శ్రమ కలిగించేది. దీన్ని సి.పి. బ్రౌన్ తెలుగు శాసనాలలో ఉన్న గుర్తును నమూనాగా గ్రహించి లాంటి రెండు రూపాలు కల్పించారు. ఈ సంస్కరణల వల్ల కూర్పరులకు కొంత శ్రమ తగ్గింది. అచ్చు కూర్పు కొంత మేరకు వేగవంతమయ్యింది. ఈ కొత్త రూపాలకు 'బ్రౌన్ రావళ్ళు' అనే పేర్లు కలిగాయి. ఇలాగే ప, వ, న, స, ల విషయంలో లిపిలో ఉన్న సామ్యాన్ని బట్టి పొరబాటు పడటానికి అవకాశం ఉన్న దాన్ని గ్రహించి కన్నడంలో ఉన్నట్లు ఈ అక్షరాలలో స్పష్టంగా మార్పు కనబడే విధంగా టైపులు పోత పోయించి సి.పి.బ్రౌన్ వాటిని వాడుకలోకి తెచ్చారు. కాని ఇవి తెలుగులో నిలిచినట్లు కనబడదు. బ్రౌన్ కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా, తెలుగు, ముద్రణ పెక్కు లోపాలతో సాగుతూ వచ్చింది.

ముద్రాక్షరాల సంఖ్యను 405 కన్నా తగ్గించటం ఎవ్వరికీ సాధ్యం కాలేదు. బందరులోని కల్యాణీ టైపు ఫౌండ్రీ అధిపతి కె.వి. కొండయ్యగారు అక్షరాల సొంపుచెడకుండా ముద్రణయంత్రానికి ఒదిగేవిధంగా టైపు తయారీలో సాంకేతిక మార్పులుచేసి, 350కి తెలుగు లిపి రూపాలను కుదించారు. దీన్ని 'కళ్యాణీ టైపు' అన్నారు. అక్షరాలు అధికంగా ఉండటం అనే అంశాలు తెలుగు లిపిలోని క్లిష్టతకు ముఖ్యమైన కారణాలు. ఇలాంటి క్లిష్టతవల్లే తెలుగులో పుస్తక ముద్రణ వేగంగా జరగటం లేదు. లోపాలను తొలగించి తెలుగులిపి సంస్కరణ తప్పనిసరిగా చేయాల్సి ఉంది.

లిపిని మార్చుకోవడం ఎందుకు?

ఇంగ్లీషు స్థాయిలో మన భాషకు కూడా అభివృద్ధి చేసిన యాంత్రిక సదుపాయాలు కల్పించడం కోసమే. వాస్తవానికి లిపి సంస్కరణ యంత్రాలకనుగుణంగా జరగాలి. కంప్యూటర్‌లలో వాడకానికి ప్రస్తుతం తెలుగు సాఫ్ట్‌వేర్‌లో ఏయే సమస్యలు తలెత్తుతున్నాయో వాటిని నిశితంగా, పరిశీలించి నిరంతరం వాటిని బాగుచేసే నిపుణుల్ని నియమించాలి. పరిశోధకుల్ని ప్రోత్సహించాలి. అరకొరగానైనా చేపట్టినపనిని పూర్తి చేసుకోలేక చతికిల పడుతూ ఆంధ్రులు ఆరంభ శూరులు అన్న నానుడిని సార్థకం చేశారు.

పూర్వం మన భాష నశించిపోతుందే అని కొంతమంది నాయకులైనా బాధపడేవారు. ఇప్పుడు తెలుగు ఎందుకూ పనికిమాలిన భాషనీ, ఇంగ్లీషు, హిందీ వస్తే మనం ఎక్కడైనా చలామణీ కావొచ్చనీ, పదవులు దక్కాలన్నా, పరపతి పెరగాలన్నా కేవలం తెలుగు వస్తే చాలదనీ, హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా నేర్వాలనీ, చచ్చిపోయే ముసలి భాషను ఎవరూ బ్రతికించలేరనీ మనతెలుగు మేధావులే వాదిస్తున్నారు. మన నాయకులు అందుకు వంత పాడుతున్నారు.

తెలుగు అధికార భాష కావాలంటే ఇంగ్లీషు స్థాయికి దానిని అభివృద్ధి చెయ్యాలి. తెలుగు నేర్చుకునే వాళ్ళ సంఖ్య పెరగాలి. ఎందుకు? ఎలా? అని మన పాలకులు, ప్రజలు ప్రశ్నించుకోవాలి. మన ప్రభుత్వం నడుపుతున్న తెలుగు మీడియం స్కూళ్ళన్నీ ఇంగ్లీషు లిపిలోకి మారిస్తే చాలు. ఒక్క చర్యతో అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి.

-నూర్ బాషా రహంతుల్లా, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, అమరావతి - 9948878833

పాలన తెలుగులోనే!

తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులోనే జరగాలి. ప్రజలకు భాషా స్వాతంత్ర్యం కల్పించాల్సిన బాధ్యత పాలకులదే. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుకు అధికార భాష హోదాను కల్పించారు. అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేసి పాలక మండలిని కూడా నియమించారు. తెలుగుకు ప్రాచీన హోదా కోసం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి సైకిల్ యాత్ర నిర్వహించాను. ఇంత వరకూ తెలుగును పరిపాలనా భాషగా అమలు చేయకపోవడం విచారకరం. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, ఇంత వరకూ తెలుగు ప్రజలకు మాతృ భాషా స్వాతంత్ర్యం రాలేదు. తెలుగును పరిపాలనా భాషగా చేయలేకపోవడం వల్ల సంక్షేమ పథకాల ఫలాలను 80 శాతం ప్రజలు అందుకోలేకపోతున్నారు. అమరావతి రాజధానిగా మాతృభాషలో పరిపాలన సాగించాలని అనేక సార్లు కోరాం. అలా చేస్తే ఆయన అమలు జేస్తున్న పథకాల ఫలాలు అసలైన లబ్ధిదారులకు చేరుతాయి. ఆంగ్ల భాషను కేంద్ర ప్రభుత్వ సంబంధాల కోసం, విదేశీ విదేశీ ప్రముఖులకు ఉత్తర ప్రత్యుత్తరాల కోసం వినియోగిస్తూనే, సామాన్య ప్రజలకు సంబంధించిన అన్ని వ్యవహారాలను తెలుగులోనే సాగించాలని కోరుతున్నాను. ఇతర రాష్ట్రాలను చూసైనా మన తెలుగు రాష్ట్రాలు తగిన చర్యలు తీసుకోవడం తక్షణావసరం.

-పొన్నాల గౌరీ శంకర్, 8074694409

నేడు దీక్ష

మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లాలోని సాహిత్య, సాంస్కృతిక కళా రంగాలకు చెందిన ఐక్యవేదికను ఏర్పాటు చేస్తున్నాం.ఈ వేదిక ఆధ్వర్యంలో కవులు,రచయితలు,కళాకారులు, భాషా పండితులు,ఉపాధ్యాయులు, భాషాభిమానులతోమాతృభాష పరిరక్షణ దీక్ష జిల్లా కేంద్రం ఏలూరులో ఏర్పాటు చేస్తున్నాం.

- నాగాస్త్ర, ఏలూరు

ఇంట్రా పనులపై దృష్టి సారించండి

మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మిషన్ భగీరథ ప్రధాన పనులు పూర్తి అయినందున ఇక నుంచి ఇంట్రా పనుల మీద దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇంట్రా పనులను త్వరగా పూర్తి చేయడానికి ప్రధాన పనులు చేసిన వర్క్ ఏజెన్సీల సహకారం తీసుకుంటామన్నారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మిషన్ భగీరథపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంట్రా పనుల కోసం ప్రత్యేకంగా ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ ఈఈలు ఉన్నందున పనుల్లో మరింగత వేగంపెంచాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఇంట్రా విలేజ్ పనులు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను త్వరలనే పరిష్కరిస్తామన్నారు. స్థానిక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఓహెచ్‌ఎస్ఆర్ డిజైన్‌లను మార్చుకునేందుకు ప్రభుత్వం ఇదివరకే అనుమతి ఇచ్చిందన్నారు. ఇక డబుల్‌బెడ్ రూం కాలనీలు వచ్చే ప్రాంతాలలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవసరమైన ప్రణాళికలను ముందే తయారు చేసుకోవాలన్నారు. ఇంట్రా పనులు ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి కావడానికి ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లతో పాటు కూలీలను సమీకరించుకోవడంలో చీఫ్ ఇంజనీర్లు మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఈ సారి రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి నల్లాతో నీరు సరఫరా అయినప్పుడే సిఎం కేసీఆర్ స్వప్నం సాకారం అవుతుందన్నారు. అందుకు అనుగుణంగా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు కృపాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు శంకరన్ ఆదర్శం

పౌరహక్కుల నేత జి.హరగోపాల్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మాజీ ఐఏఎస్ శంకరన్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని పౌరహక్కుల నేత జి.హరగోపాల్ పేర్కొ న్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం శంకరన్ క్యాలండర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత పదవులు నిర్వహించడం గొప్ప కాదని ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవడమే గొప్పన్నారు. దీనికి కరెక్టుగా శంకరన్ సరిపోతారన్నారు. ఆయన గొప్ప మేధావని, ఆయన తీసుకొచ్చిన పలు సంస్కరణలు పేదలకు ఎంతో మేలు చేశాయన్నారు. ఒక మనిషిని ఎందుకు గుర్తు చేసుకోవాలి, ఎందుకు విగ్రహం ఏర్పాటు చేయాలి, ఆయన పేరుమీద క్యాలండర్ ఎందుకు తీసుకురావాలి అన్న విషయాన్ని పరిశీలిస్తే ఆయన చేసిన మంచిపనులు గుర్తుకువస్తాయన్నారు. సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రాంచంద్రామూర్తి మాట్లాడుతూ ఒక అధికారి నిస్వార్థంగా పనిచేసినప్పుడే వారికి గుర్తింపు వస్తుందన్నారు. శంకరన్ సాదా జీవితాన్ని గడిపారని ఐఏఎస్ అన్న అహంభావాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదన్నారు. సామాజిక రాజకీయ విశ్లేష కులు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సర్వీసులో ఉన్నప్పుడు ఒకలా అనంతరం మరోలా చాలామంది అధికారులు ప్రవర్తిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో శంకరన్ విగ్రహం పెట్టడం ఆయన పేదల కోసం చేసిన గుర్తింపు వల్లే అది సాధ్యమయిందన్నారు. ఆయన మీద ఉన్న భక్తి, అభిమానం మరోసారి గుర్తు చేసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ ఒక సంవత్సరంలో 120 జీఓలను విడుదల చేసిన గొప్ప ధైర్యవంతుడు శంకరన్ అని ఆయన కొనియాడారు. అంకితభావంతో, ధృడనిశ్చ యంతో ఆయన పనిచేశా రని అలాంటి వ్యక్తి మనందరితో పాటు యువ ఐఏఎస్‌లకు దిక్సూచిగా భావించవచ్చున్నారు. ఈ సందర్భంగా క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ, శశిభూషణ్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై ఏంచేద్దాం.?

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా పేర్కొంటూ రెండు బిల్లులను రాష్ట్రపతి వద్దకు పంపకుండా కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ (డీవోపీటీ) హోంశాఖకు సూచించడంపై ఏం చేద్దామని రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్ రెడ్డితో న్యాయశాఖాధికారులు చర్చలు జరిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్ల పెంపుతో వాటి సంఖ్య 50 శాతానికి మించుతున్నదని డిసెంబర్ 11న డీవోపీటీ అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు హోంశాఖకు ఆఫీస్ మెమోరాండం పంపింది. ఈ విషయమై సీఎం కేసీఆర్‌తో కూడా చర్చించినట్లు సమాచారం. తమిళనాడులో రిజర్వేషన్లు 60 శాతానికి పైగా ఉన్న విషయం తెలిసిందే. తమిళనాడు మాదిరిగానే ఇక్కడ కూడా రిజర్వేషన్లను 60 శాతానికి పెంచాలని సీఎం నిర్ణయించి ఎస్టీ రిజర్వేషన్లను 6.2 శాతం నుంచి 10 శాతానికి, ముస్లిం రిజర్వేషన్లను 4 శాతం నుంచి 12 శాతానికి పెంచుతూ శాసనసభలో తీర్మానం చేయించారు. తీర్మానాన్ని కేంద్ర హోంశాఖకు పంపిన విషయం తెలిసిందే. రాష్ట్ర శాసనసభ తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపకుండా నిలిపివేయడంపై తదుపరి చర్యలపై ప్రభుత్వం న్యాయనిపుణులతో చర్చలు జరుపుతోంది.

పోలీసుల యూనిఫాం అలవెన్స్ పెంపు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర పోలీసుల యూనిఫాం అలవెన్సును రూ.7,500కి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ శివశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రూ.3, 500 ఉండేది. పదవ వేతన సవరణ కమిషన్ సిఫార్సుల మేరకు అలవెన్స్‌ను రూ.7, 500 కి పెంచింది.

బాలికను కాటేసిన కామాంధుడు

మహాదేవపూర్, ప్రభన్యూస్ : సభ్య సమాజం తలదించుకునే విధంగా అభం శుభం తెలియని మైనర్ బాలికను కాటేశాడు. మాయమాటలు చెప్పి లోబర్చుకుని అత్యాచారం చేయడంతో పాటు విషయం ఎవరికైన చెప్పితే నిన్ను చంపేస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. బాలిక గర్భం దాల్చిన తర్వాత విషయం కాస్తా వెలుగులోకి వచ్చింది. కాళేశ్వరం గ్రామానికి చెందిన రణప్రతాప్ అనే 24 ఏళ్ల యువకుడు ఓ మైనర్ బాలికను మాయమాటలు చెప్పి లోబర్చుకొని అత్యాచారం చేసి చంపేస్తానంటూ బెదిరింపులకు గురిచేయగా ఎమి చేయాలో తెలియని ఆ బాలిక విషయాన్ని తనలోనే దాచుకొని నిత్యం శోకాన్ని అనుభవించేది. గర్భం దాల్చినక తల్లిదండ్రులు నిలదీయడంతో విషయాన్ని బయటపెట్టింది. కామాందుడ్ని కఠినంగా శిక్షించాలంటూ బాలిక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. కామాంధుడ్ని కఠినంగా శిక్షించాలంటూ మహిళా సంఘాలు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు నాన్ బెయిలబుల్

కాజీపేట, ప్రభన్యూస్ : తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్రం సాధించుకోవాలని పలు రైల్‌రోకో నిర్వహించిన సందర్భంలో ఉద్యమకారులపై రైల్వేయాక్ట్ క్రింద కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంలో పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు ఉద్యమకారులపై కేసులు నమోదు చేశారు. ఆ కేసులల్లో కోర్టుకు హాజరుకాని ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌తో పాటు ఉద్యమకారులకు మంగళవారం రైల్వే కోర్టు నాన్‌బేయిలెబుల్ వారెంటు జారీ చేశారు.

సాదాబైనామాలకు చివరి చాన్స్

- తిరస్కరించిన దరఖాస్తులకూ మోక్షం
- 2లక్షల 45వేల ఎకారాల కమబద్ధీకరణ
- 11 లక్షల దరఖాస్తులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సాదా బైనామాల(తెల్ల కాగితలపై జరిపిన భూక్రయ విక్రయాలు)పై ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. మార్చి 12 నాటికి 2,45,668 ఎకరాల క్రమబద్ధీకరణను పూర్తి చేసి నిరుపేదలక ఉచిత రిజిస్ట్రేషన్ చేయించాలని నిర్ణయించింది. 20165 జూన్ 3న సీఎం కేసీఆర్ సాదాబైనామాల ఉచిత క్రమ బద్ధీకరణ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో దాదాపు 11,19,112 దర ఖాస్తులు రాగా వీటిలో 2,68,610 ఎకరాలకు సంబం ధించిన 6లక్షల 18వేల 368 దరఖాస్తులను క్రమ బద్ధీకరించారు. ఇందులో 4,19,430 దరఖాస్తులను వివిధ కారణాలతో ప్రభుత్వం తిరస్కరించింది. కాగా వీటికి కూడా అనుమతినివ్వాలని తాజాగా సీసీఎల్ఏ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకు ప్రభుత్వ అనుమతి కోరుతూ సీసీఎల్ఏ కార్యాలయం ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ దఫా క్రమబద్ధీకరణకు పట్టణాల్లోని భూములూ అవకాశం పొందనున్నాయి. ఇందులో కుడా, హెచ్ఎండీఏ, మున్సిపల్, నగర పంచాయతీల భూములకూ స్థానం దక్కనుంది.

తెలంగాణ ప్రభుత్వం సాహసోపేతంగా తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలనిస్తోంది. సాదా బైనామాలకు మార్చి 12తో మోక్షం కల్గనుంది. తెల్ల కాగితాలపై చేసుకున్న భూ కొనుగోలు ఒప్పందాలకు మార్చి 12నాటికి చట్టబద్ధత పూర్తి చేయనున్నారు. ఇందుకు ధృవీకరణ పత్రాల అందజేతకు సర్కార్ మార్గదర్శకాలు జారీ చేసింది. 13బీ ధృవీకరణ పత్రాన్ని సేఫ్టీ బార్‌కోడ్ క్విక్ రెస్పాన్స్ కోడ్ ఆధారంగా జారీ చేయాలని నిర్ణయించింది. దీంతో 11,19,112 దరఖాస్తులను పరిశీలిస్తోంది.

ఇటీవలే ఈ అంశంపై సీఎం కేసీఆర్ మాట్లాడుతూ...'' తెలంగాణలో భూముల క్రయవిక్రయాలు సాదాబైనామాల మీద జరుగుతున్నాయి...డబ్బులు లేకనో...అవగాహన లేకనో పేద ప్రజలు పట్టా చేయించుకోవడం లేదన్నారు. పేదలకు భారం కాకుండా వీటిని రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో గత 20-30 ఏళ్లుగా కాగితాల మీదనే ఉన్న భూముల క్రయవిక్రయాల వ్యవహారం రిజిస్ట్రేషన్‌తో చట్టబద్ధం కానుంది. 2014 జూన్ 2నాటికి సాదాబైనామాల మీద ఉన్న ఐదు ఎకరాల లోపు భూమిని ఉచితంగా రిజిస్టర్ చేసి, పేరు మార్పిడి చేయాలని ఆయన ఆదేశించారు. పట్టణ ప్రాంతాలకు చెందిన దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ అర్బన్‌లో 27.057, వరంగల్ రూరల్‌లో 26630, జనగామలో 10,350, సంగారెడ్డిలో 703 కలుపుకుని 64740దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది.

దరఖాస్తుల వివరాలు...

జిల్లా	దరఖాస్తులు
మహబూబ్‌నగర్	27622
రంగారెడ్డి	5065
హైదరాబాద్	12
మెదక్	59662
నిజామాబాద్	88211
ఆదిలాబాద్	45223
కరీంనగర్	242079
వరంగల్	297699
ఖమ్మం	197845
నల్గొండ	132926

చూచిరాతను ప్రోత్సహించొద్దు

- టీచర్లను, తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రాసిక్యూట్ చేయండి
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పబ్లిక్ పరీక్షల్లో సామూహిక చూచిరాతను ప్రోత్సహించే ఎవ్వరినీ వదలొద్దని హైకోర్టు స్పష్టం చేసింది. మాస్ కాపీయింగ్ లో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా భాగస్వాములు అవుతున్నారని హైకోర్టు అభిప్రాయపడింది. చూచిరాతను ప్రోత్సహించిన ఇన్విజిలేటర్లు విద్యార్థులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. సామూహిక చూచిరాత వ్యవహారంలో మండల, జిల్లా విద్యాధికారులను బాధ్యులుగా చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద వారి సెల్ నంబర్లను ప్రదర్శించాలనిహైకోర్టు ఆదేశించింది. ఆ నంబర్లక ు ఫిర్యాదులు రాగానేసదరు ఎంఈవో/డీఈవోలు బాధ్యులైన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. వచ్చే మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో చూచిరాతను అరికట్టేందుకు తీసుకున్న చర్యలను వివరిస్తూ వచ్చే జూన్ రెండవ వారంలో కార్యాచరణ నివేదికను సమర్పించాలని హైకోర్టు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విద్యాశాఖ కార్యదర్శులను ఆదేశించింది. మాస్ కాపీయింగ్ ను అరికట్టేందుకు పరీక్షకేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని ఏపీ, తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులు తెలిపారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో పబ్లిక్ పరీక్షల్లో జరుగుతున్న సామూహిక చూచిరాతను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గుంటూరుకు చెందిన డాక్టర్ గుంటపల్లి శ్రీనివాస్ ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వాలు ఏపీ విద్యాచట్టం,1982 మరియు ఏపీ పబ్లిక్ పరీక్షల చట్టం, 1977 లోని నిబంధనలు అమలు చేయనందువల్లనే ఈ కాపీయింగ్ జాఢ్యం రెండు రాష్ట్రాల్లోనూ విస్తరించిందని పిటిషనర్ తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో టీచర్లు,ఇన్విజి లేటర్లు గైడ్లు, జవాబులు రాసిన జిరాక్స్ ప్రతులను పంచి మాస్ కాపీయింగును ప్రోత్సహిస్తున్నారన్నారని పిటిషనర్ పేర్కొన్న విషయం తెలిసిందే.



చెట్టు పన్నును తొలగించాలి

తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులు చెల్లిస్తున్న పన్ను, ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియోపై గత జీవోల్లో ఇచ్చిన అనేక అడ్డగోలు నిబంధనలు తొలగించాలని తెలంగాణ గౌడ కల్లుగీతసంఘాల సమన్వయ కమిటీ నేతలు ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావును కలిశారు. 2017 డిసెంబర్ 29న మంత్రి స్వయంగా హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వానికి చెల్లించే పన్ను రూ. 15 కోట్లు రద్దు చేయాలని కోరారు. అప్పుడు పేర్కొన్నట్లుగా జీవో జారీ చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. అధికారులు గీత కార్మికులను పన్ను పేరుతో ఇబ్బంది పెట్టొద్దని ఆదేశించారు. జీవో నెంబర్ 164లో ఎక్స్‌గ్రేషియో ఇచ్చేందుకు ఉన్న నిబంధనలను తొలగిస్తామని, ఆసరా పెన్షన్ తీసుకుంటున్న లబ్దిదారులకు కూడా ఎక్స్‌గ్రేషియో వర్తింపజేస్తామని మంత్రి పద్మారావు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తాత్కాలిక వికలాంగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియో పెంపును కూడా పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

అధికారులు రూల్స్ పాటించకుంటే చర్యలు


ఎస్సీ కమిషన్ చైర్మన్ రాంశంకర్ కథారియా

హైదరాబాద్,ఆంధ్రప్రభ: షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణలో అధి కారులు నిబంధనల మేరకు పని చేయకపోతే చర్యలకు సిఫార్సు చేస్తామని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాంశంకర్ కథారియా హెచ్చరించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చి కథారియా బృందం మంగళవారం తాజ్ డెక్కన్ హోటల్‌లో పలు దళిత సంఘాలతో సమావేశమైంది.ఈ సందర్భంగా రాష్ట్రంలో దళితుల సమస్యలను గూర్చి నాయకులు చెప్పిన విషయాలను సావధానంగా విన్నారు. ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కథారియా మాట్లాడుతూ, దేశంలో అన్ని కులాల కంటె ఎక్కువ సంఖ్యలో దళితులు ఉన్నారని, ప్రభుత్వాలను నిలదీసి సమస్యలను సాధించేందు కు అవసరమైన పోరాటం చేసే శక్తియుక్తులు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వాలను శాసించే స్థితిలో ఉన్న ఎస్సీలు ఆత్మన్యూనత నుంచి బయటపడాలని కోరారు.అణచివేతకు గురైన ఈ వర్గాలు సంపన్న శ్రేణికి ఎదిగేందుకు కృషి చెయ్యాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రభుత్వంతో పాటు కుల సంఘాలు, అందరు సమిష్టి కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు. న్యాయం కోసమే కమిషన్ ఉందన్న విషయాన్ని మరవరాదని, ఏవైనా సమస్యలుంటే తనకు లెటర్ రాయాలని సూచించారు. అధికారులు పని చెయ్యకపోతే ఢిల్లీకి పిలిపించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ కమిషన్ వైస్ చైర్మన్ ఎల్ మురుగన్ మాట్లాడుతూ, తమకు అందిన ఫిర్యాదులపై బుధవారం జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుపై రాజీ పడే ప్రసక్తిలేదన్నారు. కమిషన్ సభ్యుడు కె రాములు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 30 జిల్లాలు తిరిగి దళితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నానని చెప్పారు. అంతకు ముందు పలు సంఘాల బాధ్యులు సమస్యలను కమిషన్ దృష్టికి తెచ్చారు. మాల మహానాడు అధ్యక్షులు జి చెన్నయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను ఇతర కార్యక్రమాలకు దారి మళ్లిస్తోందని చెప్పారు. ఎంఆర్‌పీఎస్ మేధావుల కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ముత్తయ్య మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ ఎం.ఎస్. స్వరాజ్ విద్వాన్, యోగేందర్ పాశ్వాన్, కమిషన్ కార్యదర్శి స్మితా చౌదరి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ రైల్వేస్టేషన్‌లో

నక్షత్ర తాబేళ్లు స్వాధీనం



అమరావతి, ఆంధ్రప్రభ: అక్రమంగా రవాణా చేస్తున్న నక్షత్ర తాబేళ్లను విజయవాడ రైల్వే స్టేషన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధి కారుల విచారణలో ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కదరి నుంచి ఒడిశాలోని భువ నేశ్వర్ మీదుగా వీటిని బంగ్లాదేశ్‌కు తరలించేందుకు తీసుకెళుతున్నట్లు గుర్తించారు. ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి 406 నక్షత్ర తాబేళ్లను అధికారులు స్వాధీనం చేసుకోవడంతో పాటు పొరుగు దేశాలకు వీటిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఆర్ఐ హైదరాబాద్ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఎం.కే.సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

సర్కారు స్కూళ్ల

విద్యార్థులకు హెల్త్‌కిట్లు!

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సర్కార్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయా లని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతోపాటు హైస్కూల్ విద్యార్థినీలకు శానిటరీ నాప్కిన్లతో పాటు ఇతర వస్తువులు ఉన్న హెల్త్ కిట్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం వల్ల 30 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ప్రభుత్వ స్కూళ్లలో ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు లబ్ధిపొందనున్నారు. ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమాచారంతో కూడిన ప్రొఫైల్‌ను ఎప్పటికప్పుడు సిద్ధం చేయనున్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన

గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలికల్లో వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కిశోర బాలికలకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో భాగంగా 8,9,10 తరగతులకు చెందిన బాలికలకు శానిటరీ నాపికన్లతో సహా హెల్త్‌కిట్లను అందచే యాలని ప్రభుత్వం నిర్ణయించింది. హెల్త్‌కిట్లకు అయ్యే ఖర్చు, కిట్లలో శానిటరీ నాప్కిన్లతో పాటు ఏయే వస్తు వులు చేర్చాలన్న దానిపై అధికారులు కసరత్తు ప్రారం భించారు.

సమష్టికృషి వల్లే ఇ-పాస్ అవార్డు

టీఎస్‌పీసీబీ మెంబర్ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) టీఎస్-ఐపాస్ ద్వారా 2017 సంవత్సరానికి గాను అవా ర్డు రావడం సంతోషకరమని, ఇది అందరూ ఉద్యోగుల కృషి ఫలితమేనని టీఎస్‌పీసీబీ మెంబర్ సెక్రటరీ పి.సత్య నారాయణ రెడ్డి పేర్కొన్నారు. టీఎస్‌పీసీబీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జనవరి 26వ తేదీన జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన మంగళ వారం సనత్‌నగర్‌లోని కార్యాలయంలో బహుమతు లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యో గులను ఉద్దేశించి మాట్లాడుతూ సంస్థకు చెందిన అధి కారులు, సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేసి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడిలకు గురికాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో పనిచేస్తే మంచి ఫలి తాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విశ్వనాథం, జేసీఈఈ బి.మురళీధర్ రెడ్డి, జేసీఈఎస్ వీరన్న, చీఫ్ అకౌంట్స్ అధికారి వినయ్‌కుమార్ నాయుడు, ఈఈలు, టీఎస్‌పీసీబీ యూనియన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పరిశోధన విభాగం కొనసాగింపు

హై దరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో నిత్యావసర సరుకుల పరిశోధన, పర్యవేక్షణ విభాగాన్ని మరో రెండేళ్లపాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచే ఈ విభాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్1నుంచి 2020 మార్చి 31 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఉన్న పోస్టులను కూడా మార్పులు చేశారు. గతంలో జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ఉండగా ప్రస్తుతం దీనిని జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లను నియమించారు. రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులో డైరెక్టరేట్ కాకుండా కమిషనరేట్‌నుంచి నియామకం చేశారు.

ఎస్సీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గాను రెండు నెలల పాటు ఉచిత శిక్షణను అందించనున్నట్టు గిరిజనా భివృద్ధి సంస్థ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనికోసం దరఖాస్తులు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా http://studycircle.cgg.gov. in లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాంకుతో పాటు ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. భద్రాచలం, ఉట్నూర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ శిక్షణా కేంద్రాలు ఉన్నాయన్నారు. గ్రామీ ణ ప్రాంతానికి చెందిన అభ్యర్థులు రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందిన అభ్యర్థులు రూ.2 లక్షల లోపు ఆదాయ పరిమితి ఉన్నవారు దీనికి అర్హుల న్నారు. మిగతా వివరాలకు 040-27540104 నెంబ ర్‌లో సంప్రదించాలన్నారు.

రైల్వే ఉద్యోగాలకు వయో పరిమితి పెంపు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ (రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు) గుడ్‌న్యూస్ తెలిపింది. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని రెండేళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గరిష్ట వయోపరిమితి మొదట రైల్వే బోర్డు జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లుగా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థుల వయస్సును కూడా సడలించింది. ప్రస్తుత వయస్సును పెంచడంతో పాటు దరఖాస్తు గడువును కూడా త్వరలోనే పెంచనున్నట్టు ఆర్ఆర్‌బీ తెలిపింది. తెలుగు సహా ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష నిర్వహించేందుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన సవరణ ప్రకటనను వెబ్‌సైట్‌ను త్వరలో జారీ చేయనున్నట్టు ఆర్ఆర్‌బీ తెలిపింది. రైల్వేశాఖ ఇటీవల 90 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే దీనికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

మహిళా కబడ్డీ జట్టుకు ద.మ.రైల్వే మేనేజర్ వినోద్ అభినందన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అఖిల భారత ఏ గ్రేడ్ కబడ్డీ టోర్నమెంట్‌లో విజయం సాధించిన దక్షిణ మధ్య రైల్వే మహిళా కబడ్డీ టీంను ఆ సంస్థ జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అభినందించారు. ముంబాయిలో ఈ నెల 13 నుంచి 17వ వరకు కబడ్డీ పోటీలు జరిగిన విషయం తెలిసిందే. క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ పోలీసు టీం, సెమిఫైనల్లో ఎస్ఎంవికే (తమిళనాడు) టీం, ఫైనల్లో పాలమ్ (ఢిల్లీ)టీంపై విజయం సాధించి దక్షిణ మధ్య రైల్వే మహిళా కబడ్డీ టీం ఈ టోర్నమెంట్‌ను సొంతం చేసుకుంది.

గీతం అధ్యాపకుడికి అణుశక్తి విభాగం పరిశోధనా ప్రాజెక్టు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : గీతం యూనివర్సిటిలోని అధ్యాపకుడు పీవీ నాగేంద్రకుమార్‌కు అణుశక్తి విభాగంలో పరిశోధాన ప్రాజెక్టులో అవకాశం లభించిండం అభినందనీయమని గీతం వీసీ శివప్రసాద్ అన్నారు. నానో కణాల ఆధారిత ఘన అధిశోషకాలు, న్యూట్రాన్ క్రియాశీలత విశ్లేషణ ఉపయోగించి లాంతనైడ్స్, ఆక్టినైడ్స్ విషయాలపై ఆధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును మూడేళ్లలోపు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పరిశోధనలో సాయపడేందుకు గాను ప్రాజెక్టులో ఫెలో అవసరం ఉందన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.వివరాల కోసం 09885357559 కు సంప్రదించాలని కోరారు.

జీఎస్టీకి కీరవాణి సంగీతం..షాకయ్యా

రచయిత జైకుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్నో భక్తి చిత్రాలకు సంగీతం అందించిన కీరవాణి జీఎస్టీ లాంటి నగ్న చిత్రానికి సంగీతం అందించడంతో తాను షాక్ అయ్యానని జైకుమార్ అన్నారు. సంగీత దర్శకుడు కీరవాణిపై రచయిత జైకుమార్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్శకుడు వర్మ నిర్మించిన గాడ్ సెక్స్ అండ్ ట్రూత్(జీఎస్టీ) చిత్రా నికి కీరవాణి ఓంకారాన్ని స్వరపరిచారని జైకుమార్ ఆరోపిస్తూ ఈ మేరకు సీసీ ఎస్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబ్‌నుంచే మ్యూజిక్ కంపోజ్ చేసి అప్‌లోడ్ చేశా రని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బూతు సన్నివేశలకు ఓంకారం విని పించడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తా మన్నారు.

గడియారం రామకృష్ణ శర్మ శతజయంతోత్సవాలు మార్చి 6న

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: కవిగా, శాసన పరిశోధకునిగా, గ్రంథ పరిష్కర్తగా, పత్రికా సంపాదకునిగా అనేక పాత్రలు పోషించిన డాక్టర్ గడియారం రామకృష్ణ శర్మ శతజయంత్యుత్సవాలు తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. శర్మ జన్మించిన మార్చి 6వ తేదీన పరిషత్తులో శతజయంత్యుత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. పరి షత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పరిషత్ ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్.కె.వి. రమణాచారి, ప్రధాన కార్యదర్శి డాక్టర్.చెన్నయ్య మంగళవారం పరిషత్‌లో సమావేశమై సారస్వత పరిషత్ 75 సంవత్సరాల మహోత్సవాలు, గడియారం రామకృష్ణశర్మ శత జయంత్యుత్సవాల గురించి చర్చిం చారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, సిద్ధిపేట, నిజామా బాద్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో సాహి తోత్సవాలు నిర్వహించాలని మే20వ తేదీ నుంచి 26 వరకు వారం రోజుల పాటు సమాపనోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు.



ఆర్‌బీఐ ముందస్తు హెచ్చరికలు
పీఎన్‌బీ బేఖాతర్



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో స్కాం వెలుగు చూడకముందే రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఇంటర్‌బ్యాంక్ నెట్‌వర్కు స్విఫ్ట్ దుర్వినియోగం చేసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఆర్‌బీఐ ఆగస్టు 2016లో ఒక సర్క్యూలర్ జారీ చేసింది. అనధికారికంగా నిధులు బదలీ చేసే అవకాశం ఉందని ఆ లేఖలో పేర్కొంది. అయితే దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం మాత్రం పీఎన్‌బీ స్కాం రిజర్వుబ్యాంకు వైఫల్యమే అనే ఆరోపిస్తోంది.

సెలెబ్రిటి నగల వ్యాపారి నీరవ్ మోడీతో పాటు ఇతరులు కలిసి పీఎన్‌బీకి చెందిన ముంబై బ్రాంచీని రూ.11,400 కోట్ల వరకు ముంచారు. దీనికి బ్యాంకులో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు సహాయ సహకారాలు అందించారు. వీరిద్దరు కలిసి నకిలీగ్యారంటీ లేదా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ ఇచ్చారు. మోడీ వీటిని తీసుకొని విదేశీబ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. ఈ మోసం కొన్ని సంవత్సరాల పాటు అలా నిర్విరామంగా కొనసాగింది. అధికారులు స్విఫ్ట్‌నెట్‌వర్క్ పాస్‌వర్డ్‌ను వినియోగించి ఎల్‌వోయులు జారీ చేశారు. ఈ లావాదేవీలను బ్యాంకు ఖాతాపుస్తకాల్లో రిజిష్టర్ చేయలేదు. అయితే పీఎన్‌బీ చెప్పేదేమిటంటే కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ స్విఫ్ట్‌తో అనుసంధానం చేయలేదని.. దీని వల్ల మోసం కనుగొనలేకపోయాయని 17 నెలల తర్వాత పీఎన్‌బీ దీని గురించి తీరిగ్గా చెబుతోంది. ఆర్‌బీఐ చేసిన హెచ్చరిక ఏమిటంటే స్విఫ్ట్ నెట్‌వర్కును దుర్వినియోగం చేసి ఇతర బ్యాంకుల నిధులను మాయం చేసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఇదే సర్క్యులర్‌తో ఆర్‌బీఐ బ్యాంకులను సైబర్ సెక్యూరిటి ఫ్రైమ్‌వర్కును ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. కరెస్పాండెంట్ బ్యాంకులకు చెల్లింపులను మరింత బలోపేతం చేయడానికి తమ అధికారాలు ఇవ్వాలని, ఒక వేళ లావాదేవీల్లో ఎలాంటి తేడాలు వచ్చినా. తక్షణమే గుర్తించవచ్చునని సెంట్రల్ బ్యాంకు నోటీసులో వివరించింది. స్విఫ్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సాఫ్ట్‌వేర్‌లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వాటిని ఎప్పటి కప్పుడు గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది.

ఇక స్విఫ్ట్ విషయానికి వస్తే (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్స్) ఇది ఒక మేసెజింగ్ సిస్టమ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్యాంకులు సమాచారాన్ని .. సూచనలను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్ ... సెక్యూర్డ్ చానల్స్ ద్వారా పంపుతుంది. ఇక్కడ పీఎన్‌బీ నకిలీ గ్యారంటీ విషయానికి వస్తే విదేశీ బ్యాంకులకు స్విఫ్ట్ సిస్టం ద్వారా పంపిచడం జరిగింది. రాయిటర్స్ వార్తా సంస్థ సమాచారం ప్రకారం ప్రభుత్వం ఆర్‌బీఐకి రాసిన లేఖలో పీఎన్‌బీ బ్యాంకులో జరిగిన మోసాన్ని గుర్తించడంలో విఫలయ్యారని, సెంట్రల్ బ్యాంకు మోసాలను గుర్తించడంతో పాటు నిఘాపెట్టడంతో ఘోరంగా విఫలమయ్యిందని లేఖలో పేర్కొంది. విదేశీ బ్యాంకింగ్ వ్యవహారాలుచూస్తే రాజీవ్‌కుమార్ న్యూఢిల్లీలో రాయిటర్స్‌తో మాట్లాడుతూ.. ఆర్థికమంత్రిత్వశాఖ ఆర్‌బీఐకి లేఖ రాస్తూ పీఎన్‌బీ లాంటి మోసాలు మళ్లీ మళ్లీ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని లేఖ రాసినట్లు తెలిపారు. అయితే దీనిపై ఆర్‌బీఐ స్పందించడానికి నిరాకరించింది.

డొల్ల కంపెనీలతో కొఠారి
రూ.3,695 కోట్ల టోకరా!

- గోధుమ ఎగుమతులపేరుతో రుణం
- నేనెక్కడికి పారిపోలేదు
- బకాయిలు చెల్లిస్తా...కొఠారి
- దర్యాప్తు ముమ్మరం

న్యూఢిల్లీ: కాన్పూర్‌కు చెందిన రొటొమాక్ పెన్స్ యాజమాని విక్రమ్ కొఠారి అక్రమాలు తవ్వే కొద్ది దర్యాప్తు ఏజెన్సీలకు కొత్త కొత్త ఆశ్చర్యం కలిగించే అంశాలు కళ్లముందు ప్రత్యక్షమవుతున్నాయి. కొఠారి బోగస్ కంపెనీలను సృష్టించి ఏడు బ్యాంకుల నుంచి రూ.3,695 కోట్ల రుణాలు తీసుకున్నాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐలు రెండు కొఠారి వ్యాపార కార్యకలాపాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నాయి.

ఇక్కడ ఈడీ, సీబీఐకి విస్తుపోయే అంశాలు ఏమిటంటే గోధుమ సేకరణతో పాటు ఇతర సరకులను ఎగుమతి చేయడానికి అని చెప్పి ఆయన బ్యాంకుల నుంచి పక్కాగా రూ.2,919 కోట్లు (ఇది అసలు.. వడ్డీని దీనిలో కలుపలేదు). ఈ మొత్తాన్ని బ్యాంకులు విక్రమ్ కొఠారికి రుణాలుగా ఇచ్చాయి.

బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.754.77 కోట్లు రుణాలు ఇస్తే, బ్యాంకు ఆఫ్ బరోడా రూ.456.03 కోట్లు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు రూ.771.07 కోట్లు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.458.95 కోట్లు, అలహాబాద్ బ్యాంకు రూ.330.68 కోట్లు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర రూ.49.82 కోట్లు, ఒరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ రూ.97.47 కోట్లు రుణాలు ఇచ్చాయి.

విక్రమ్ కొఠారి బ్యాంకుల మోసంపై కేసు విచారణ జరుపుతోంది అదే సమయంలో ఆయన భార్య సాధనా కొఠారి, కుమారుడు రాహుల్ కొఠారితో పాటు కొఠారికి సహకరించిన పలువురు బ్యాంకుల అధికారులపై కూడా కేసు నమోదు చేశాయి. అయితే బ్యాంకు అధికారులు మాత్రం కొఠారికి చెందిన బోగస్ కంపెనీల గురించి పెదవి విప్పడం లేదు.

కొఠారి అరెస్టు లేదు : ఇదిలా ఉండగా సీబీఐ ఉత్తరప్రదేశ్‌లోని కొఠారికి చెందిన ఇళ్లు, కార్యాలయాలపై సోదాలు నిర్వహించింది. అయితే ఇప్పటి వరకు కొఠారిని మాత్రం అరెస్టు చేయలేదు. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ మాదిరిగా కొఠారి దేశం నుంచి పారిపోయాడన్న పుకార్లు కూడా వచ్చాయి. తాను దేశం విడిచిపెట్టే ప్రసక్తి లేదని, మాతృదేశాన్ని తాను ప్రేమిస్తున్నానని, ఇది పెద్ద విషయం కాదని, కేవలం లోన్‌డిఫాల్ట్ కేసు అని.. స్కాం కాదని.. ఆయన తేలికగా కొట్టిపారేశాడు. నేను ఎక్కడికి పారిపోవడం లేదు. నేను భారతీయ పౌరుడిని, తాను తన సొంత ఊరులోనే ఉంటాను అని కొఠారి చెప్పుకొచ్చారు. బ్యాంకులు తన కంపెనీని ఎన్‌పీఏ కింద ప్రకటించింది. తాను డిఫాల్టర్‌ను కానీ.. ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ (ఎన్‌సీఎల్‌టి) వద్ద ఉందని అన్నాడు. బ్యాంకులతో తాను ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నానని, వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. బ్యాంకుల నుంచి రుణాలుతీసుకున్నాను.. త్వరలోనే వాటిని చెల్లిస్తానని స్పష్టం చేశారు.

వివిధ తరహాల్లో బ్యాంకులకు టోకరా: సీబీఐ విచారణలో వెల్లడవుతున్న అంశాల గురించి విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం... కొఠారి వివిధ పద్దతు ల్లో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారని తేలింది. ఇవన్నీ చూస్తే పక్కాగా ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫెమా) నిబంధనలు ఉల్లంఘించినట్లు స్పష్టమవుతుందని ఆ వర్గాలు తెలియజేశాయి. ఎగుమతుల ఆర్డర్ చూపించి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఆ డబ్బును తన కంపెనీకి వినియోగించుకున్నాడు. బోలెడన్ని బోగస్ కంపెనీలు సృష్టించాడు. నకిలి డాక్యుమెంట్లతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నాడు. అలహాబాద్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకులు నిబంధనలను తుంగలో తొక్కి రొటొమాక్ కంపెనీకి ఉదాహరంగా రుణాలు మంజూరు చేశాయని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉండగా ముంబై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి కొఠారి రూ.485 కోట్లు రుణం తీసుకున్నాడు. కోలకతా ప్రధాన కార్యాల యంగా పనిచేస్తున్న అలహాబాద్ బ్యాంకు నుంచి రూ.352 కోట్లు రుణం తీసుకున్నాడు. ఏడాది తర్వాత చూస్తే కొఠారి బ్యాంకులకు అసలు కానీ వడ్డీకానీ చెల్లించిన పాపాన పోలేదు. ఇదిలా ఉండగా గతేడాది బ్యాంకు ఆఫ్ బరోడా (బీఓబీ) రొటొమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఉద్దేశపూర్వక ఎగవేత దారుగా ప్రకటించింది. అటు తర్వాత ఆయన కంపెనీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించి జాబితా నుంచిఉద్దేశపూర్వక ఎగవేతదారుని పేరు తీయించుకుంది. చీఫ్ జస్టిస్ డీబీ భోంస్లే, జస్టిస్ యశ్వంత్ వర్మ బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌లో బ్యాంకు ఆఫ్ బరోడా తప్పుగా విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా ప్రకటించిందని పేర్కొంది. దీనికి కోర్టు చెబుతున్న కారణం కంపెనీకి బ్యాంకుకు సుమారు రూ.300 కోట్ల వరకు ఆస్తులు తనఖా పెట్టింది కాబట్టి ఆయన పేరును విల్‌ఫుల్ డిఫాల్ట్ నుంచి తీసేయాలని ఆదేశించింది.

పీఎస్‌యు బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండి బకాయిలకు (ఎన్‌పీఏ)లకు శస్త్ర చేయడానికి రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నడుంబిగించింది. ఫిబ్రవరి 27, 2017న దీనికి సంబంధించి బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసిన తర్వాత అధికారికంగా ఏర్పాటు చేసిన కమిటి రొటొమా క్‌ను ఉద్దేశపూర్వక ఎగవేతదారుడిగా ప్రకటించింది.

ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే పీఎన్‌బీలో వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ రూ.11,400 కోట్ల స్కాం బయటపడ్డ తర్వాత తాజాగా విక్రమ్ కొఠారి స్కామ్ బట్టబయలైంది. కాగా నీరవ్‌మోడీ ముందుగానే తన పరిస్థితులను పసిగట్టి కుటుంబంతో సహా అమెరికాకు చెక్కేస్తే.. కొఠారి మాత్రం దేశం విడిచిపెట్టకుండా ఇక్కడే ఉన్నాడు.. తాను విదేశాలకు పారిపోయే ప్రసక్తి లేదని బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం అణాపైసాలతో సహాచెల్లిస్తానని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడు.


భార్య సాదనతో కొఠారి (పాత చిత్రం)

రొటొమాక్ 14 బ్యాంకు ఖాతాలు జప్తు

రొటొమాక్ గ్రూపు ప్రమోటర్స్‌కు చెందిన 14 బ్యాంకు ఖాతాలను సీబీఐ, ఈడీ జప్తు చేసుకున్నాయని అధికారులు మంగళవారం నాడు ప్రకటించాయి. గతరాత్రి ఉత్తరప్రదేశ్‌లోని వివిధ బ్యాంకుల్లోని 11 ఖాతాలను జప్తు చేసుకుంది. రొటొమాక్ నుంచి ప్రభుత్వానికి సుమారు రూ.85కోట్లు పన్ను రాబట్టుకోవాల్సి ఉంది. దీంతో ఈ ఖాతాలు జప్తు చేసినట్లు తెలుస్తోంది. 11 ఖాతాలు రొటొమాక్ గ్రూపు పేరుతో ఉంటే.. మిగిలిన మూడు ఖాతాలు మాత్రం కొఠారి కుటుంబం పేరుతో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఏడు బ్యాంకుల కన్సార్షియం రొటొమాక్ కంపెనీకి సుమారు రూ.3695 కోట్లు బకాయి పడ్డారు.

పాత మోడల్స్‌కు మహీంద్రా స్వస్తి

- 2020 నాటికి గ్జైలో, వెరిటో, వైబ్,
- నువోస్పోర్ట్ మోడల్స్ నిలిపివేత



న్యూఢిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు అంత జోరుగాలేని మోడల్స్ ఉత్పత్తిని నిలిపివేయాలని నిర్ణయించింది. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ప్రత్యామ్నయువర్గాలకు అవకాశం ఉన్నా వాటి జోలికిపోవడం లేదు. వచ్చే 18-24 నెలలో ఉత్పత్తి చేసిన కార్లను విక్రయించిన తర్వాత వాటి ఉత్పత్తిని పూర్తిగా నిలిపి వేయాలని నిర్ణయించింది. అయితే ఉత్పత్తి నిలిపివేస్తున్న కార్ల మోడల్స్ వివరాలు ఇవ్వలేదు. విశ్వసనీయవర్గాల సమాచారం గ్జైలో ఎంపీవో, వెరిటో సెడాన్, వెరిటో వైబ్ నోచ్‌బ్యాక్ నువోస్పోర్ట్ కాంపాక్ట్ ఎస్‌యూవీలని చెబుతున్నారు.

రాబోయే భారత్ స్టేజ్ 6 ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని మహీంద్రా ఇప్పటినుంచే సన్నద్ధం అవుతోంది. ఏప్రిల్ 1, 2020 నుంచి బీఎస్‌ఈ-6 ప్రమాణాలను అమలు చేయాల్సి ఉంటుంది. అలాగే జులై 1,2019 నుంచి కొత్త క్రాష్ సెఫ్ట్ నిబంధనలు అమల్లోకి వస్తాయి. కాబట్టి కేవలం మహీంద్రా ఒక్కటే కాకుండా మిగిలిన కంపెనీలు కూడా తమ పాతమోడల్స్ కార్లకు కూడా కొత్త భద్రతా ప్రమాణాలను అమల్లోకి తేవాల్సి ఉంటుంది. 2020 నాటికి అన్ని ప్రొడక్టులకు బీఎస్‌ఈ-6 ప్రమాణాలను అందుబాటులోకి తెస్తామని, రాబోయే రోజుల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తామని మహీంద్రా ఎండీ పవన్‌గోయెంకా చెప్పారు.



ఒత్తిడిని అధిగమిస్తేనే సృజనాత్మక ఆలోచనలు

- మానసిక ఒత్తిడితో 17 వేల మంది గుండె పోటుతో మృతి
- 40 ఏళ్ల వారే ఎక్కువ
- ప్రపంచ ఐటి సదస్సులో సంగితారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పని ఒత్తిడి పెరిగితే మానసిక ఆందోళనకు గురికాకుండా ఉపశమనం కలిగేలా ప్రశాంతతో ఆలోచించాలని అపోలో హాస్పిటల్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంగీతారెడ్డి చెప్పారు. ఇటీవల కాలంలో విధి నిర్వహణలో సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆమె చెప్పారు. ప్రపంచ ఆర్థిక సంస్థ అధ్యయనం మేరకు ఏటా 17వేల మంది గుండెపోటుతో చనిపోతున్నారని ఆమె తెలిపారు. భారత్‌లో ఎక్కువ మంది 40 ఏళ్ళలోపు వారే గుండెపోటుకు గురవుతున్నారని ఆమె తెలిపారు. ప్రపంచ ఐటిసదస్సులో ద క్రియేటివ్ షిఫ్టు అన్న అంశంపై మంగళవారం జరిగిన చర్చాగోష్టిలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ, పనిచేసే కార్యాలయంలో మెరుగైన సదుపాయాలతో పాటు ప్రశాంతత ఉండాలని అన్నారు. మానసిక ఒత్తిడితో శారీరక రుగ్మతలు తలెత్తుతాయని, దీన్ని అధిగమించేందుకు శరీరంలోని జీవనచక్ర పనితీరును మెరుగుపర్చుకోవాలని ఆమె చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో ప్రతి అంశం ప్రతిరోజూ మార్పు చెందుతోందని, అందుకు తగినట్లుగా పనితీరు కూడా పెంచుకోవలసి ఉందన్నారు. ప్రతివ్యక్తి తనకొక లక్ష్యం, దృష్టిని నిర్ధారించుకోవాలని, పనిచేసే కంపెనీ యాజమాన్యం మాదిరిగానే నిర్దిష్టప్రణాళికలతో వీటిని నిర్ణయించుకోవాలని సంగీతారెడ్డి సూచించారు. అయితే వీటిని ఆచరణలో పెట్టేందుకు వాస్తవికతతో కూడిన ప్రణాళిక నిర్దేశించుకొని వాటిని అమలు చేసుకోవాలన్నారు.

ప్రతి ఆలోచన సృజనాత్మకతతో ఉంటుందని, మేధోశక్తిని పెంచుకునేందుకు ఒత్తిడిని తొలగించుకోవాలని ఆమె సూచించారు. ఒత్తిడిని తట్టుకునే విధంగా మెదడు శక్తిని పటిష్టపరచుకునేందుకు శ్వాస ప్రక్రియ దోహద పడుతుందన్నారు. కళ్ళు మూసుకుని ఏకాగ్రతతో ఉచ్వాస, నిశ్వాస ప్రక్రియను సదస్సు ప్రతినిధులతో ఆమె చేయించారు.

రూపాయి వెల వెల!



- 58 పైసల పతనం


ముంబై : డాలర్ మారకంతో రూపాయి మూడు నెలల కనిష్ఠానికి దిగివచ్చింది. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులతో పాటు ఎగుమతిదారుల నుంచి పెద్దెత్తున డిమాండ్ రావడంతో రూపాయి వెలవెలపోయింది. డాలర్ మారకంతో రూపాయి 58 పైసలు క్షీణించి 67.49 మార్కుకు దిగివచ్చింది. ఈ ఏడాది రూపాయి ఈ స్థాయిలో క్షీణించడం ఇదే మొదటిసారి. స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకుల కారణంగా విదేశీ ఇన్వెస్టర్లతో పాటు గ్లోబల్ ట్రేడర్లు తమ పోర్టుపోలియోను (తమ వద్ద ఉన్న షేర్ల)ను విక్రయించుకొని పెట్టుబడులు తీసుకువెళ్లిపోయారు. కరెన్సీ ట్రేడర్ల అంచనా ప్రకారం ఫెడ్ రిజర్వు ఈ ఏడాది వడ్డీరేట్లు పెంచుతుందన్న అంచనాతో విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నాయని అందుకే రూపాయి బక్కచిక్కిపోతోందని చెబుతున్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 64.86 మార్కుకు వచ్చిన వెంటనే రిజర్వుబ్యాంకు రంగప్రవేశం చేసి పెద్దమొత్తంలో డాలర్లు కొనుగోలు చేసి రూపాయి మరింత పడకుండా అడ్డుకోగలిగింది. దీంతో పాటు విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలో దేశీయస్టాక్ మార్కెట్ల నుంచి బిలియన్ డాలర్లు రూ.6,850 కోట్లు పెట్టుబడులు తరలించుకుపోవడం కూడా రూపాయి బలహీనపడ్డానికి ప్రధాన కారణం. ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు వద్ద ఫిబ్రవరి చివరి నాటికి విదేశీ మారకద్రవ్యం నిల్వలు 419.76 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడయే కారణం. నవంబర్ 22 తర్వాత రూపాయి 64.92 వద్ద ముగిసింది. అటు తర్వాత మంగళవారం నాడు భారీగా 58 పైసలు నష్టపోయింది.



ఎంఎస్‌ఎంఈలకు ఎస్ బ్యాంకు చేయూత

హైదరాబాద్ : సూక్ష్మ, చిన్న మధ్య తరహా వ్యాపార సంస్థలు (ఎంఎస్‌ఎంఈ)లకు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు, ప్రమోటర్ల కోసం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ చాండర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీఏపీసీసీఐ) భాగస్వామ్యంతో వారి వ్యాపారాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి ప్రైవేట్ బ్యాంకు నాలెడ్జ్ సరీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. డిజిటల్ ఫైనాన్స్ మరియు ఎంఎస్‌ఎంఈలపై దాని ప్రభావం అనే అంశంపై నిర్వహించిన ఈకార్యక్ర మంలో తెలంగాణ ఐటి పరిశ్రమ, కామర్స్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌తో పాటు సుమారు 200కు పైగా ఎంఎస్‌ఎంఈలకు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్ బ్యాంకు సీనియర్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్ కమర్షియల్ బిజినెస్ బ్యాంకింగ్ గౌరవ్ గోయెల్ మోడరేటర్‌గా వ్యవరించారు.

దుమ్మురేపిన అంబుజా సిమెంట్



- క్యూ3లో రూ.478 కోట్లు

న్యూఢిల్లీ : అంబుజా సిమెంట్స్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 77.12 శాతం వృద్ధితో రూ.478.32 కోట్లు ఆర్జించింది. అమ్మకాలు జోరందుకోవడంతో పాటు క్లింకర్ ఉత్పత్తి బాగా పెరిగింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.270.08 కోట్లని కంపెనీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఇక ఆదాయం విషయానికి వస్తే 10.96 శాతం పెరిగి రూ.6264.81 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.5645.84 కోట్లని తెలిపింది. అమ్మకాలు పుంజుకోవడంతో మంచి ఫలితాలను సాధించామని కంపెనీ ఎండీ, సీఈవో అజయ్‌కపూర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం తమ వ్యూహం ప్రీమియం ప్రొడక్టులపై దృష్టిపెట్టడంతో పాటు మార్కెటింగ్ వ్యయాన్ని తగ్గించుకోవడంతో మంచి ఫలితాలను సాధిస్తామని ఆయన అన్నారు. అంబుజా బోర్డు తుది డివిడెండ్‌ను రూ.2 ముఖ విలువ కలిగిన షేరుపై 100 శాతం ప్రకటించింది. మధ్యంతర డివిడెండ్ షేరుకు రూ.1.60తో కలుపుకొని మొత్తం డివిడెండ్ రూ.3.60 చెల్లిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది. బీఎస్‌ఈ దీని షేరు 2.08 శాతం పెరిగి రూ.263.10 వద్ద ముగిసింది.

పీఎస్‌యు బ్యాంకు సిబ్బందిపై దాడులు ఆపండి

ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోయేషన్

హైదరాబాద్ : ఇటీవల బ్యాంకుల్లో జరుగుతున్న కుంభకోణాలపై కేవలం బ్యాంకు సిబ్బందిని దోషిగా నిలబెట్టడం సరికాదని ఆల్ ఇండియా బ్యాంకు ఆఫీసర్ల అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన స్కాంలో ఉన్నతాధికారులకు తెలియకుండా జరిగే అవకాశం లేదని ఆల్ ఇండియా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజన్ తెలిపారు. పీఎస్‌యుబ్యాంకుల్లో జరుగుతున్న స్కాంలను దృష్టిలో ఉంచుకొని భారత వాణిజ్యసమాఖ్యలు, మండలులు ప్రైవేట్‌పరం చేయాలనడాన్ని తీవ్ర అభ్యంతరం తెలియజేసింది.

మూడో రోజు అదే సీన్

- ఈ సారి ప్రైవేట్ బ్యాంకుల వంతు
- చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి
- భారీగా క్షీణించిన రూపాయి



ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లో చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. దీంతో సెన్సెక్స్ 71 పాయింట్ల నష్టపోయింది. స్టాక్ మార్కెట్లు వరుసగా గత మూడు ట్రేడింగ్ సెషన్‌ల నుంచి నష్టపోతున్నాయి. ఐటి రంగానికి చెందిన షేర్లు దూసుకుపోతే.. ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకు షేర్లు మాత్రం సూచిని కిందికి లాగాయి. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి బక్కచిక్కింది. విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడంతో రూపాయి నష్టపోయింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు స్కాం ఇప్పటికి మార్కెట్లను వెంటాడుతోంది. దీంతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన యాక్సిస్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, ఎస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు షేర్లు 1.44 శాతం వరకు నష్టపోయాయి. అయితే టెక్నాలజీ, లోహ రంగానికి చెందిన షేర్లు సూచి మరింత పడిపోకుండా అడ్డుకున్నాయి.

సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన నాస్కామ్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో ఐటి రంగానికి ఈ ఏడాది అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ప్రకటించింది. దీంతో ఐటి కంపెనీలకు మంచి వ్యాపారావకాశాలు లభిస్తాయని వెల్లడించింది. మొత్తానికి మంగళవారం నాడు సంతోషించదగ్గ పరిణామం మాత్రం పీఎస్‌యు బ్యాంకు షేర్లు తిరిగి పుంజుకున్నాయి. మదుపరులు షార్ట్ కవరింగ్‌కు పాల్పడ్డంతో ఇవి గట్టెక్కాయి. మొత్తానికి మంగళవారం నాడు మార్కెట్ సరళిని గమనిస్తే..ఇటీవల కాలంలో మార్కెట్లు క్రమంగా నష్టాల్లో కూరుకుపోవడంతో మదుపరులు షార్ట్ కవరింగ్‌కు పాల్పడ్డారు. అటు తర్వాత బాండ్ ఈల్డింగ్ పెరగడంతో ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. డాలర్ బలపడ్డంతో ఐటి రంగానికి చెందిన షేర్లు జోరందుకున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. డాలర్ మారకంతో రూపాయి 68 పైసలు క్షీణించి మూడునెలల కనిష్ఠానికి 64.88 మార్కుకు దిగివచ్చింది. బీఎస్‌ఈలో ఉదయం ట్రేడింగ్ మొదలుకాగానే 186 పాయింట్ల వరకు లాభపడి 33,960.95 మార్కుకు చేరింది. అటు తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో 33,657.89 పాయింట్ల మార్కుకు దిగివచ్చింది. మార్కెట్ ముగిసే నాటికి సూచి 71.07 పాయింట్లు నష్టపోయి 33,703.59 వద్ద ముగిసింది. వరుసగా గత రెండు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 522.81 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ విషయానికి వస్తే 18 పాయింట్లు నష్టపోయి 10,360.40 వద్ద స్థిరపడింది. ఇదిలా ఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు సోమవారం నాడు రూ.895.79 కోట్లు షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.586.52 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. బీఎస్‌ఈలో అత్యధికంగా నష్టపోయింది ఎంఅండ్‌ఎం 2.48 శాతం వరకు నష్టపోగా.. యాక్సిస్ బ్యాంకు 1.44 శాతం క్షీణించి రూ.531.70 వద్ద ముగిసింది. నష్టపోయిన మిగిలిన షేర్లు ఇలా ఉన్నాయి. కొటక్ బ్యాంకు, ఎస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, సన్‌ఫార్మా, ఎల్‌అండ్‌టి, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, మారుతి సుజుకి, ఐటీసీ, హిందుస్తాన్‌యూనీలీవర్ 1.09 శాతం వరకు నష్టపోయాయి. అత్యధికంగా లాభపడింది కోల్ ఇండియా 1.90 శాతం, కాగా ఎస్‌బీఐ 1.81 శాతం వరకు ఉన్నాయి. వాటిలో పాటు ఒఎన్‌జీసీ, హీరోమోటోకార్ప్, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతి ఎయిర్‌టెల్, టాటాస్టీల్, ఏషియన్ పెయింట్స్, విప్రో, పవర్‌గ్రిడ్, టాటామోటార్స్, బజాజ్‌ఆటో, డాక్టర్ రెడ్డీస్, అదానీపోర్ట్స్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఎస్ బ్యాంకు, ఐటీసీ షేర్లు 1.70 శాతం వరకు లాభపడ్డాయి. పీఎన్‌బీ షేరు నష్టాల్లోనే ట్రేడ్ అవుతోంది. 52 వారాలకనిష్టానికి రూ.111 మార్కుకు దిగివచ్చింది. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే అక్కడా మార్కెట్లు నష్టాలతో ట్రేడ్ అయ్యాయి.

ఐదు రోజుల్లో రూ.11వేల మార్కెట్‌క్యాప్ ఉఫ్!



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు గత ఐదు ట్రేడింగ్ సెషన్‌లలో రూ.10,939 కోట్ల మార్కెట్ క్యాపిటలయిజేషన్‌ను కోల్పోయింది. నీరావ్‌మోడీ చేతిలో పీఎన్‌బీ బ్యాంకు మోసపోయింది కూడా రూ.11,384 కోట్లు. కాగా మంగళవారం నాడు స్టాక్‌మార్కెట్లు నష్టాల నుంచి క్రమంగా కోలుకున్నాయి. గత వారం నుంచి చూస్తే దీని షేరు 28 శాతం వరకు నష్టపోయింది. పీఎన్‌బీఐ మార్కెట్‌క్యాప్ మంగళవారంనాడు రూ.10,938.72 కోట్లు తగ్గి రూ.28,270.22 కోట్లకు దిగివచ్చింది. కాగా ఫిబ్రవరి 12వ తేదీన బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ.39,209 కోట్లుగా నమోదైంది. బీఎస్‌ఈ విడుదల చేసిన వాటాల గణాంకాల ప్రకారం చూస్తే ప్రభుత్వానికి పీఎన్‌బీలో 57.04 శాతం వాటాలున్నాయి. ఇటీవల కాలంలో షేర్లు భారీ నష్టపోవడంతో ప్రభుత్వం కూడారూ.6,274.4 కోట్లు నష్టపోయింది. లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు రూ.13.93 శాతం ఉంది. రూ.1,532 కోట్ల వరకు నష్టపోయింది. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లకు రకూ.12.56 శాతం వాటా ఉంది. వీరు కూడా రూ.1381.6 కోట్లవరకు నష్టపోగా.. చోటామోటా ఇన్వెస్టర్లు సుమారు రూ.387 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకున్నారు.

FORM-C
NOTIFICATION

(Under Section 11 of the Act where 10A Exemption is given)
(See rule 6/12)

Government of Telangana
Revenue (LA) Department

Collector, Khammam file No.G1/667/2018 Date: 19-02-2018
RDO/LAO KMM File No.C1/236/2018. Date: 17 -02-2018

Whereas it appears to the Government of Telangana/Collector that a total of Acs.38.35 ¼ Gts. of land is required in Suvarnapuram Village of Mudigonda Mandal, KHAMMAM District for public purpose, namely for the purpose of four lining of Kodad-Khammam NH 365A.

Therefore it is notified that for the above said project in Suvarnapuram Village of Mudigonda Mandal, KHAMMAM District land measuring, more or less Acs. 38.35 ¼ Gts. of standard measurement, whose detail description is as following, is proposed for acquisition:

SCHEDULE

Village: Suvarnapuram | Mandal: Mudigonda | District: KHAMMAM

Sl. No	Survey No. as per SSDR	Survey No as Per Pahani	Type of Title	Type of Land	Area under Acquisition (Ac. Gts)	Name and Address of Person interested	Boundaries	Structures /Trees /Etc., any
1	310	307/ 6/1	Patta	Dry	0.17	Mallarapu Ramulu S/o Gopaiah	N:310/2p S:221/2 E:310/1 W:310/2	Nil
2	310	307/ఆ2 308/4	Patta	Dry	0.21 ¼	Gosu Laxmaiah S/o Ramaiah	N: 311/2 S :310/2p E :310/1 W : 310/3	Neem - 20
3	311	311	Patta	Dry	0.33	Pucha kayala Asha kumari W/o Venkata swamy	N: 309/2 S : 310/2 E : 311/3 W : 311/1	Neem - 25
4	309	309/3/2	Patta	Dry	0.36 ½	Mandarapu Upender Rao S/o Naraiah	N: 308/2 S :309/2p E : 309/1 W : 309/3	Neem - 15
5	309	311	Patta	Dry	0.23 ¼	Pucha kayala Asha kumari W/o Venkata swamy	N: 309/2p S : 311/2 E : 309/1 W : 309/3	Nil
6	308	308/2	Patta	Dry	0.08 ¼	Mandarapu Upender Rao S/o Naraiah	N: 308/2p S : 309/2 E : 308/1 W : 308/3	Nil
7	308	308/2/1	Patta	Dry	0.15	Kurra Shivarama kumar S/o Venkata Koteswar Rao	N: 308/2p S :308/2p E :308/2p W :308/3	Neem - 10
8	308	307/4	Patta	Dry	0.15 ¼	Kaan chaani Radha mma W/o Achaalu	N: 308/2p S :308/2p E : 308/1 W :308/2p	Nil
9	308	307/7/1	Patta	Dry	0.05	Chintala Jaga deesh S/o Biksham	N: 307/2 S:308/2p E :308/2p W : 308/3	Nil
10	308	307/1/1	Patta	Dry	0.12 ½	Yalamaddi Nageswar Rao S/o Venkate swarlu	N: 307/2 S :308/2p E : 308/1 W :308/2p	Nil
11	307	307/7/1	Patta	Dry	0.03 ½	Chinthala Jaga deesh S/o Biksham	N:307/2p S :308/2 E :307/2p W : 307/3	Nil
12	307	307/1/1	Patta	Dry	0.10 ½	Yelamaddi Nageswa ra Rao S/o Venkates warlu	N: 307/2p S : 308/2 E : 307/1 W:307/2p	Nil
13	307		Patta	Dry	0.00 ¼	Yalamaddi Nageswar Rao S/o Bhush aiah	N:307/2p S : ...... E : 307/1 W:307/2p	Nil
14	307		Patta	Dry	0.03 ½	Yalamaddi Nageswar Rao S/o Bhush aiah	N: .... S:307/2p E:307/2p W :307/3	Nil
15	307	307/7/3	Patta	Dry	0.11 ¼	Chintala Sangamma W/o Babu	N:307/2p S :307/2p E :307/2p W : 307/3, 307/2p	Nil
16	307	307/7/2	Patta	Dry	0.34 ½	Chintala Upendra W/o Venkata ramulu	N:315/2 S :307/2p E :307/2p W : 307/3, 307/2p	Nil
17	307		Patta	Dry	0.21	Yelamaddi Nageswa ra Rao S/o Bushaiah	N:315/2 S : .... E : 307/1, 307/2p W:307/2p	Nil
18	307	307/1/1	Patta	Dry	0.13	Yelamaddi Nageswa ra Rao S/o Venkate swarlu	N:316/2 S : .... E : 307/1, 307/2p W:307/2p	Nil
19	307	307/1/2	Patta	Dry	0.05	Manda rapu Ram Dinesh S/o Upender Rao	N:316/2 S : ... E : 307/1 W:307/2p	Nil
20	315	309/1	Patta	Dry	0.01 ½	Adusu malli Srinivasa Rao S/o Venkata rathnam	N:316/2 S : 307/2 E : ... W : 315/1	Nil
21	316	316/ఆ	Patta	Dry	1.08 ½	Adusu malli Srinivasa Rao S/o Venkata rathnam	N:317/2 S : 307/2, 315/2 E : 316/3 W : 316/1	Neem - 10
22	317	316/ఆ	Patta	Dry	0.12 ½	Adusu malli Srinivasa Rao S/o Venkata rathnam	N:317/2p S : 316/2 E : 317/1 W : 317/3	Nil
23	317	317/e	Patta	Dry	0.34	Vaddem Ravi Kumar S/o Pitchaiah	N: 317/2p S : 317/2p E : 317/1 W : 317/3	Nil
24	317	317/e	Patta	Dry	1.30	Vaddem Ravi Kumar S/o Pitchaiah	N:317/2p S :317/2p E : 317/1 W : 317/3	Nil
25	317	317/ఆ	Patta	Dry	1.09 ½	Vaddem Venkate swarlu S/o Pitchaiah	N: 317/2p S : 328/2 E : 317/1 W : 317/3	Nil
26	327	327/ ఆ1/1/2	Patta	Wet	0.23 ¼	Raavula penta Rathamma W/o Venkaiah	N:327/2p S : 328/2 E : 327/1 W : 327/3	Neem -4 Pros ofis (juliflora)-1 toddy
27	327	327/ ఆ2/2	Patta	Wet	0.22 ½	Raavula penta Venkamma W/o Veeraiah	N:327/2p S :327/2p E : 327/1 W :327/3	Nil
28	327	327/ ఆ1/1/2	Patta	Wet	0.04 ½	Raavula penta Rathamma W/o Venkaiah	N:327/2p S :327/2p E:327/2p W :327/3	Well - 1
29	327	327/ఆ 1/1/2/2	Patta	Wet	0.11	Bhukya Suneetha W/o Nagesh	N:327/2p S:327/2p E : 327/1 W:327/2p	Nil
30	327	327/ఆ 1/1/2	Patta	Wet	0.19 ½	Ravula penta Rathamma W/o Venkaiah	N:327/2p S:327/2p E:327/2p W:327/2p	Nil
31	327	327/ఆ 5/1/2	Patta	Wet	0.18	Burra Venkanna S/o Malsoor	N:327/2p S:327/2p E : 327/2p W : 327/3	Nil
32	327	326/ఆ2	Patta	Dry	0.33 ½	Mallela Madhava Rao S/o Butchaiah	N:326/2 S :327/2p E :327/1 W :327/3	Nil
33	326	326/ఆ2	Patta	Dry	0.39 ½	Mallela Madhava Rao S/o Butchaiah	N:326/2p S:327/2 E:326/1 W : donka	Neem - 4
34	326	326/ఆ1	Patta	Dry	0.37 ½	Mandada pu Vinod Babu S/o Venkata ranayana	N:325/2 p S:326/2p E : 326/1 W : donka	Well - 1 Neem - 4
35	326	326/ఆ2	Patta	Dry	0.18 ½	Malikanti Venkate swarlu S/o Hanu manthu	N:325/2 S : 326/2p E : 326/1 W : donka	Nil
36	325	326/ఆ2	Patta	Dry	0.10 ¾	Malikanti Venkate swarlu S/o Hanu manthu	N:325/2p S : 326/2 E : 325/1 W : donka	Neem - 4 pipes
37	325	325ఆ 1/2	Patta	Dry	2.03	Vattikonda Srikanth S/o V.M. Chowdary	N:325/2p S:325/2p E: 325/1 W :donka	Toddy - 4 indian date - 6 Neem - 4
38	325	325ఆ 1/1/ఆ	Patta	Dry	0.17 ¼	Palvancha RamaRao S/o Kotaiah	N: 368/2 S:325/2p E :325/1 W : donka	Nil
39	368	325? 1/1/ఆ	Patta	Dry	0.08 ½	Palvancha RamaRao S/o Kotaiah	N:368/2p S : 325/2 E : 368/3 W : 368/1	Nil
40	368	368/ఇ4	Patta	Dry	1.08	Yetukuri Papa Rao S/o Lingaiah	N:368/2p S :368/2p E :368/3 W :368/1	Neem - 4
41	368	368/ఇ3	Patta	Dry	0.28	Yetukuri Venkate swarlu S/o Lingaiah	N:368/2p S:368/2p E: 368/3 W :368/1	Nil
42	368	368/ ఆ/2	Patta	Dry	0.31 ½	Abburi Krishnaiah S/o Venkaiah	N:368/2p S:368/2p E :368/3 W :368/1	Man go- 4 pipes Teak -5 Neem -2
43	368	368/ ఆ/1	Patta	Dry	0.31 ½	Abburi Srinivasa Rao S/o Venkaiah	N:368/2p S:368/2p E : 368/3 W : 368/1	Man go-4 pipes Teak -5 Neem -2
44	387	368/ ఇ1/1	Patta	Dry	0.20 ½	Kamartha pu Satya narayana S/o Veera swamy	N: 387/2 S:368/2p E : 368/3 W : 368/1	Pipes-Toddy - 7 Neem - 2
45	387	387/6/2	Patta	Dry	0.26	Kamartha pu Ramesh S/o Veera swamy	N:387/2p S : 368/2 E : 387/3 W : 387/1	Pipes Toddy - 7 Neem - 2
46	387	387/2/2	Patta	Dry	0.39	Kurapati RamaRao S/o Narayana	N:387/2p S:387/2p E:387/3 W:387/1	Neem - 2 Ginne - 1 Pipes Toddy - 2 Man go- 14
47	387	387/3/1	Patta	Dry	0.39 ½	Putta bathini Anasurya W/o Pandu ranga Rao	N:387/2p S:387/2p E :387/3, 387/2p W:387/1	Neem - 6 Toddy - 4 Teak - 23 Pipes
48	387	387/2/2	Patta	Dry	0.27 ½	Kurapati Rama Rao S/o Narayana	N:386/2 S:387/2p E:387/2p W:387/1	teak - 10 neem - 2 pipes Man go-10 Tama rind 01
49	387	387/4/3	Patta	Dry	0.09 ½	Mallela Satyavathi W/o Ganapathi Rao	N:388/2, 386/2 S : .... E : 387/3 W : 387 /2p	Neem - 3
50	388	388/3	Patta	Dry	0.01 ½	Angirekula Satyana rayana S/o Laxmaiah	N: ... S:387/2 E: 388/1 W : 386/2	Nil
51	386	386/3	Patta	Dry	0.33 ½	Bathula Janaki Ramaiah S/o Seetara maiah	N:384/2 S : 387/2 E:386/2p W : 386/1	Teak - 10 Man go-45 Neem - 3
52	386	386/2	Patta	Dry	1.00	Bathula Sarojini W/o Jaanaki Ramaiah	N:384/2 S : 387/2 E :386/3, 388/2 W :386/2	Dirisi na-10 Pipes
53	384	384	Patta	Dry	3.07	Bathula Janaki Ramaiah S/o Seetara maiah	N: 377/2 S : 386/2 E :384/4, 384/3, 383/2 W : 384/1	Neem - 20 Man go -20 Teak - 35 Diri sina-3
54	383	384	Patta	Dry	0.04	Bathula Janaki Ramaiah S/o Seetara maiah	N: .... S : 384/4 E : 383/1 W :384/2	Nil
55	379	384	Patta	Dry	0.07	Bathula Janaki Ramaiah S/o Seetara maiah	N:378/2/2 S : 384/2 E : 378/ 2/3, 379/1 W :	Nil
56	378	378/3	Patta	Dry	0.31 ½	Kandula Venkate swarlu S/o Atchaiah	N:378/3/2 S : 377/2 E:378 /2/3 W : 378/ 2/1	Nil
57	378	378/2	Patta	Dry	2.38	Kandula Surya narayana S/o Atchaiah	N:378/ 1/2p S:378 /3/2 E:378/ 1/1 W : 378/ 1/3	Nil
58	378	378/4	Patta	Dry	0.39	Kandula Bala chander S/o Atchaiah	N: VB of Gudimalla S : 378/ 1/2p E : 378 /1/1 W : 378 /1/3	Nil
				Total:	Acs. 38.35 ¼ gts			

This notification is made under the provisions of Section-11(1) of The Right to Fair Compensation and Transparency in Land acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (Central Act No.30/2013), as amended by the Right to Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement (Telangana Amendment) Act, 2016 (Act No.21 of 2017) to all whom it may concern.

A plan of the land may be inspected in the office of the District Collector & Land Acquisition Officer & Revenue Divisional Officer, Khammam on any working day during the working hours. The Government of Telangana / Collector-cum-Appropriate Government are pleased to authorize Officer Land Acquisition Officer & Revenue Divisional Officer, Khammam and his staff to enter upon and survey land, take levels of any land, dig or bore into the sub-soil & do all other acts required for the proper execution of their work as provided and specified in section-12 of the said Act.

Under section 11(4) of the Act, no person shall make any transaction or cause any transaction of land i.e. sale/purchase, etc., or create any encumbrances on such land from the date of publication of such notification without prior approval of the Collector.

Objections to the acquisition if any, and claims from all the persons interested/affected for settlement by negotiation of the compensation, may be filed by the person interested in the land within 60 (sixty days) from the date of publication of this notification as provided under section 15 of the Act before District Collector./Authorized officer

Sd/-
Land Acquisition Officer & Revenue Divisional Officer Khammam

Sd/-
Joint Collector Khammam

Sd/-
District Collector Khammam

పీసీబీ పునరుద్ధరణ ఎన్నడు?



పదవీ కాలం ముగిసినా పట్టించుకోని ప్రభుత్వం
సంవత్సర కాలంగా సమావేశం జరపని బోర్డు
కీలక నిర్ణయాల కోసం సభ్యుల ఎదురుచూపు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: తెలంగాణ పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) బోర్డు పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా ప్రభుత్వం లో కదలిక రావడం లేదు. దేశంలోనే పారిశ్రామిక రంగంలో నెంబర్‌వన్‌గా నిలిచిన తెలంగాణ రాష్ట్రంలో పీసీబీని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల స్థాపన, అనుమతులు, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక చర్యల్లో పీసీబీదే కీలకపాత్ర. ఇంతటి కీలక సంస్థ పాలకమండలి గడువు ముగిసినా దాని పునరుద్ధరణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమ ర్శలు వినిపిస్తు న్నాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో అనేక ప్రోత్సాహాలను ప్రభుత్వం కల్పిస్తోంది. దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే సింగిల్‌విండో విధానంలో టీఎస్ ఐపాస్ ద్వారా ఎటువంటి జాప్యం లేకుండా అన్ని అనుమతులను ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత దాదాపు 40వేలకు పైచిలుకు పరిశ్రమలతో కోట్లాది మందికి ఉపాధి లభిస్తోంది. ఐటీ ఎగుమతుల్లో దేశం లోనే తెలంగాణ రాష్ట్రం ప్రథమస్థానంలో నిలిచింది. ఫార్మాసిటీ, నిమ్జ్, అంకుర పరిశ్రమలతో రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ తరుణంలో పీసీబీ కీలకపాత్ర పోషించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కానీ ప్రభుత్వం ఈ బోర్డు విషయంలో సరిగ్గా స్పందించడం లేదన్న అపవాదును మూటగట్టు కుంటుంది.

మూడునెలలకోసారి బోర్డు సమావేశం జరగాలి

ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన బోర్డు సమా వేశం పాలకమండలిని పునరుద్ధరించకపోవడంతో అది సాధ్యపడడం లేదని ఓ ఉన్నతాధికారి పేర్కొంటున్నారు. పరిశ్రమలపై వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు దీంతో మొక్కుబడిగా చర్యలు తీసుకుంటున్నారని పలు వురు ఆరోపిస్తున్నారు.

గత నెల జనవరిలో బోర్డు కాలం ముగిసింది

06.07.2017 సంవత్సరంలో ఈ బోర్డు పదవీకాలం ముగిసింది. కమిటీని పునరుద్ధరించాలని దీనికి సంబం ధించి ప్రభుత్వానికి 04.09.2017 పీసీబీ ఒక లేఖను రాసింది. ఈ కమిటీని పునరుద్ధరిస్తూ 22.11.2017న జీఓను ప్రభుత్వం వెలువరించింది. ఆ జీఓ ప్రకారం పీసీబీ 14 మంది బోర్డు సభ్యులకు సమాచారం అం దించింది. దీంతో బోర్డు సభ్యుల నుంచి సమాచారం సేకరించి మీటింగ్ తేదీని నిర్ణయించేలోపే 06.01.2018తో ప్రస్తుతం ఉన్న కమిటీ పదవీ కాలం క ూడా ముగిసింది. తెలంగాణ ఏర్పడిన తరువాత 4 సార్లు బోర్డు మీటింగ్ జరిగింది. 5వ సారి బోర్డు మీటింగ్ జరపడానికి కొన్ని అనివార్య కారణాల వలన దానిని వాయిదా వేసినట్టు తెలిసింది.

బోర్డు తీసుకునే విధానాల్లో ఈ విధంగా ఉన్నాయి

శరవేగంగా పెరుగుతున్న పారిశ్రామీకరణతో ప ట్టణ ప్రాంతాల్లో కాకుండా మారుమూల గ్రామీణ ప్రాం తాల్లో కూడా పరిశ్రమలు వెలుస్తున్నాయి. ఆయా పరిశ్ర మల్లోంచి వచ్చే జల, వాయు, ధ్వని కాలష్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రస్తుతం మొక్కుబడిగా వ్యవహరించాల్సి వస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

1.రాష్ట్రంలో నీరు పారే కాలువలు, బావుల కాలుష్య నివారణ నియంత్రణ లేదా తగ్గించేందుకు ఒక సమగ్ర కార్యక్రమాన్ని రూపొందించి దాన్ని సమగ్రంగా అమలు చేయాలి.

2.ముఖ్యంగా నీటి కాలుష్య నివారణ నియంత్రణతో పాటు తగ్గించేందుకు రాష్ట్రప్రభుత్వానికి సలహాలు ఇవ్వాల్సి ఉంటుంది.

3.కాలుష్య నివారణ కోసం అవసరమైన సమాచారాన్ని సేకరించడం దాన్నిపంపిణీ చేయడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేయడం.

4.నీటి కాలుష్యం తగ్గింపు కోసం నిరంతర పరిశోధనలు చేయడం ప్రత్యేకంగా పరిశోధన కార్యక్రమాలు నిర్వహిస్తూ మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేయాలి.

5.మురుగునీరు వాణిజ్య వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులను అవలంబించి కాలుష్యాన్ని తగ్గించే కార్యాచరణను రూపొందించాలి.


14మందితో కూడిన బోర్డు ఏర్పాటు

చైర్మన్, మెంబర్ కన్వీనర్‌తో పాటు 14 మందితో కూడిన బోర్డును తెలంగాణ ప్రభుత్వం 7.7.2014లో ఏర్పాటు చేసింది. దీనికి చీఫ్ సెక్రటరీని చైర్మన్‌గా నియ మించింది. ఈయనతో పాటు కార్పొరేషన్ నుంచి ఇద్దరు సభ్యులుగా, ఒకరు మెంబర్ సెక్రటరీ, ఒకరు మెంబర్ కన్వీనర్‌గా, లోకల్ బాడీ నుంచి ఐదుగురు, నాన్ అఫీషియల్ నుంచి ముగ్గురిని బోర్డు మెంబర్లుగా ప్రభుత్వం నియమించింది. ఈ బోర్డు పదవీకాలం 3 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్ణయించింది. 2015, 2016 సంవత్సరంలో ఏటా నాలుగుసార్లు బోర్డు సమావేశాలను నిర్వహించింది. చివరగా 2017 జనవరిలో సమావేశం నిర్వహించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ సమావేశం గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కుక్కల దాడి... నాలుగేళ్ల బాలుడి మృతి

కర్నూలు ప్రభ న్యూస్ బ్యూరో: కుక్కలు విశ్వాసానికి నిదర్శనమంటారు, కానీ అవే కుక్కలు విశ్వాసఘాతకానికి పాల్పడ్డాయి. ఈ సంఘటన మంగళవారం కర్నూలు జిల్లా, కృష్ణగిరి మండలం, చిట్యాల గ్రామంలో చోటుచేసుకుంది. కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన తలారి ఉసేన్‌పీరా, చాంద్‌బీలకు ఇద్దరు సంతానం. మొదట కూతురు కాగా, రెండవ సంతానంగా కుమారుడు ఇబ్రహీం(4) జన్మించాడు. మంగళవారం నాడు ఉసేన్‌పీరా తన పొలంలో ఉన్న వేరుశనగ పంటను నూర్పిడి చేయడానికి యంత్రాన్ని పొలం వద్దకు తీసుకువెళ్లాడు. ఇదే క్రమంలో కుమారుడు ఇబ్రహీంను కూడా తల్లిదండ్రులు పొలం వద్దకు తీసుకువెళ్లి మంచం కింద ఊయలలో పడుకోబెట్టి పనులలో నిమగ్నమయ్యారు. అంతలోనే మంచం వద్దకు చేరుకున్న కుక్కలు బాలుడిపై దాడిచేసి కళ్లు, గొంతును అక్కడికక్కడే కొరికేసి చంపివేశాయి. యంత్రం శబ్దానికి తల్లిదండ్రులకు ఏమి వినపడకపోవడంతో సాయంత్రం పని ముగిసిన తర్వాత పిల్లాడి వద్దకు వెళ్లి చూడగా పిల్లాడు రక్తపుమడుగులో పడివున్నాడు. పక్కనే కుక్కలు కూడా ఉండటంతో ఆ కుక్కలే దాడిచేశా యని తల్లిదండ్రులు భావించారు. అప్పటికే బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అచ్చంపేటలో యువకుడి కిడ్నాప్



అచ్చంపేట, ప్రభన్యూస్: అచ్చంపేట పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులోని గణేష్‌నగర్‌లో నివాసం వుంటున్న ఉప్పుల రాజేష్ అనే యువకుడిని మంగళవారం గుర్తు తెలియని ముఠా కిడ్నాప్ చేసి వాహనంలో ఎత్తుకెళ్ళారు. రాజేష్‌ను తీసుకెళ్ళుతున్న సమయంలో అడ్డు వచ్చిన వారందరిని ముఠా సభ్యులు తరిమి వేయడంతో పాటు వారిపై దాడి చేశారు. కిడ్నాప్ చేయడానికి కారణాలు గత సంవత్సరం పాత నోట్ల మార్పిడి సమయంలో కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద 50 లక్షలు తెచ్చి మళ్ళీ అతనికి తిరిగి ఇవ్వక పోవడంతో అతని అనుచరులు కిడ్నాప్ చేశారన్నది పట్టణంలో చర్చనీయం అంశంగా మారింది. పాత ఉప్పుల శంకరయ్యకు ముగ్గురు కుమారులు నరేష్, రాజేష్, సందీప్‌లు ఉన్నారు. నరేష్ కర్ణాటక ప్రాంతంలో ఒక పెట్రోల్ పంపు లీజు తీసుకొని నడిపి స్తున్న సమయంలో పాత నోట్ల రద్దు కావడంతో సంబంధిత బంకు యజమాని నరేష్ సోద రులకు కొంత డబ్బు ఇచ్చి మార్చమని చెపినట్లు తెలుస్తుంది, దానికి నరేష్ సోదరులు అంగీకరించారు. పాత నోట్లు మార్చిన తర్వాత బంకు యజమానికి డబ్బులు ఇవ్వకుండా నరేష్, సందీప్ తమ మకాం హైదరాబాద్‌కు మార్చి అక్కడ మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. మరొ సోదరుడ అచ్చంపేటలో తల్లిదండ్రులతో వుంటున్నాడు. పలుమార్లు చెప్పినా డబ్బులు ఇవ్వక పోవడంతో చివరకు కర్ణాటక ముఠా సభ్యులు తన సోదరుడు రాజేష్‌ను కిడ్నాప్ చేశారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు కమోదు చేశారు.

ప్రేమించలేదని.. పొడిచేశాడు

నడిరోడ్డుపై కత్తితో పొడిచి చంపేశాడు ● కర్ణాటకలో ఘటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తన ప్రేమను అంగీకరించలేదని బీఎస్సీ విద్యార్థిని సాటి విద్యార్థినిని నడిరోడ్డుపై అతి దారుణంగా హత్య చేసిన ఘటన కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలోని సుళ్య నగరంలో చోటు చేసుకుంది. అక్షితా అనే విద్యార్థిని సాటి విద్యార్థి కార్తీక్ మంగళ వారం నడిరోడ్డులో అతి కిరాతకంగా పొడిచి చంపేశాడు. దక్షిణ కన్నడ జిల్లా సుళ్య నగరంలోని నెహ్రూ మోమోరియల్ కాలేజ్‌లో అక్షితా, కార్తీక్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యాభ్యాసం చేస్తున్నారు. అక్షితాను కార్తీక్ ప్రేమిస్తున్నాడు. అయితే అక్షితా మాత్రం కార్తీక్‌నున ప్రేమించడం లేదని సమాచారం. మంగళవారం అక్షితా కార్తీక్ ఇద్దరూ కాలేజీకి వెళ్లారు. ఆ సందర్భంలో తనను ప్రేమించాలని కార్తీక్ అక్షితా మీద ఒత్తిడి చేశాడు. తాను ఇంటిలో పెద్దలు చూసిన పెళ్లి చేసుకుంటానని, పెద్దలను ఎదిరించి తాను ఏ పని చెయ్యలేనని అక్షితా తేల్చి చెప్పింది. మంగళవారం కాలేజీ పూర్తి అయిన తర్వాత అక్షితా ఇంటికి బయలుదేరింది. సుళ్య నగరంలోని చెన్నకేశ్వర రథవీధిలోని అక్షితా నడుచుకుని వెళుతున్న సమయంలో కార్తీక్ ఆమెను అడ్డగించాడు. ఆ సందర్భంలో అక్షితా, కార్తీక్ మధ్య మాటా మాటా పెరిగింది. అక్షితా తనను ప్రేమించలేదని కార్తీక్ సహనం కోల్పోయాడు. నడిరోడ్డులో అక్షితా మీద దాడి చేశాడు. తరువాత వెంట తీసుకెళ్లిన కత్తితో అక్షితాను కసితీరా ఆరుసార్లు పొడిచాడు. అక్షితా మీద దాడి చేసిన కార్తీక్ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. కార్తీక్‌కు దేహశుద్ధి చేసి పారిపోవడానికి ప్రయత్నించిన కార్తీక్‌ను వెంబడించిన స్థానికులు అతడ్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అక్షితాను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించిందని వైద్యులు తెలిపారు. కార్తీక్‌ను అరెస్టు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

FORM-C
NOTIFICATION
(Under Section 11 of the Act where 10A Exemption is given)
(See rule 6/12)
Government of Telangana
Revenue (LA) Department

Collector, Khammam file No.G1/669/2018 Dt :17-02-2018
RDO/LAO KMM File No C1/237/2018 Dt : 16-02-2018

Whereas it appears to the Government of Telangana/Collector, Khammam District that a total Extent of Acs.28-24 Gts of land is required in Gudimalla village of Khammam Rural Mandal, Khammam District for public purpose, namely four laning project of NH 365A from Kodad to Khammam Section.

Therefore it is notified that for the above said project in Gudimalla Village of Khammam Rural Mandal Khammam District the land measuring, more or less Acs. 28-24 Gts of standard measurement, whose detail description is as following, is proposed for acquisition:

SCHEDULE

Village: Gudimalla | Mandal: Khammam Rural | District: KHAMMAM

Sl. No	Survey No.	Type of Title	Type of Land	Area under Acquisition (Ac. Gts)	Name and address of person interested	Boundaries	Structures /Trees /Etc., if any
1	264/2	Assignment Patta	Wet	00-00 ½	Naganti Bhadraiah S/o Guravaiah		
2	265/2	Patta	Wet	00-01	Naganti Bhadraiah S/o Guravaiah		
3	265/2	Patta	Dry	00-00 ½	Voruganti Sangaiah, Voruganti Venkatramudu S/o Laxmaiah		
4	265/2	Patta	Dry	00-31 ½	Balusuri Rambabu S/o Ramanadham		
5	265/2	Patta	Dry	00-18 ½	Pallapati Nagamani W/o Venkata Narayana		
6	265/2	Patta	Dry	00-16	Voruganti Venkateswarlu S/o Achaiah		
7	265/2	Patta	-	00-30	Bairu Thirupathaiah, Bairu Ravi S/o Rabbaraiah		
8	265/2	Patta	Wet	00-07	Bairu Upendramma W/o Yalamandhamma		
9	265/2	Patta	Wet	00-13	Balusuri Appaiah S/o Venkatnarsu		
10	265/2	Patta	Wet	00-17 ½	Bairu Rama Rao S/o Narsaiah		
11	265/2	Patta	Wet	00-16 ½	Bairu Venkateswarlu, Bairu Laxmipathi S/o Gopaiah		
12	266/2	Patta	Wet	00-15	Bairu Venkateswarlu, Bairu Laxmipathi S/o Gopaiah		
13	266/2	Patta	Wet	00-00 ½	Voruganti Sangaiah S/o Laxmaiah		
14	267/2	Patta	Wet	00-03 ¼	Bairu Venkateswarlu, Bairu Laxmipathi S/o Gopaiah		
15	267/2	Patta	Wet	00-08 ½	Pagilla Prameela S/o Achaiah		
16	267/2	Patta	Wet	00-02	Voruganti Sangaiah S/o Laxmaiah		
17	268/2	Patta	Dry	00-11	Pagilla Prameela S/o Achaiah		
18	268/2	Patta	Dry	00-03 ¼	Voruganti Venkateswarlu, Voruganti Papa Rao and Voruganti Srinu S/o Achaiah		
19	268/2	Patta	Dry	00-13 ¼	Voruganti Paparao, Voruganti Srinu S/o Achaiah		
20	269/2	Patta	Dry	00-00 ½	Voruganti Paparao, Voruganti Srinu S/o Achaiah		
21	264/3	Assignment Patta	Dry	00-12 ¾	Voruganti Paparao, Voruganti Srinu S/o Achaiah		
22	264/3	Assignment Patta	Dry	00-16 ½	Kadamanchi Ramaswamy S/o Sangappa		Teak Trees
23	264/3	Assignment Patta	Dry	01-09 ½	Bairu Kanthamma W/o Nageswar Rao		Teak Trees
24	264/3	Assignment Patta	Dry	00-09 ½	Pilluri Biksham S/o Kotaiah		RCC Shed and Teak Trees
25	264/3	Government Land	Dry	00-04 ½	Road		
26	264/3	Assignment Patta	Dry	00-25 ½	Bairu Upender Rao, Bairu Rambabu S/o Krishnaiah		
27	264/3	Assignment Patta	Dry	00-24	Pilluri Kanthamma W/o Venkateswarlu		
28	264/3	Assignment Patta	Dry	00-10 ½	Bairu Rambabu S/o Krishnaiah		
29	264/3	Assignment Patta	Dry	00-20 ½	Daggubati Bharathamma W/o Venkaiah		
30	297/2	Patta	Wet	00-12	Bairu Rama Rao S/o Laxmaiah and Bairu Chandra Sekhar S/o Srinivasa Rao		Open Well
31	297/2	Government Land	-	00-18 ½	NSP Canal		
32	297/2	Patta	Wet	01-07	Battu Guravaiah S/o Mallaiah		
33	298/2	Patta	Dry	01-25	Battu Guravaiah S/o Mallaiah		
34	298/2	Patta	Dry	00-31	Kannekanti Laxmi Kantha Mohan S/o Mohan Rao		
35	264/4	Assignment Patta	Dry	02-27	Daggubati Sitaravamma W/o Ramulu		
36	264/4	Assignment Patta	Dry	00-04	Pasupuleti Rammurthy, Pasupuleti Veeraiah S/o Venkaiah		
37	295/2	Patta	Dry	00-01 ½	Pasupuleti Rammurthy, Pasupuleti Veeraiah S/o Venkaiah		
38	295/2	Patta	Dry	00-10 ½	Duggi Upender Rao, Duggi Gopi and Duggi Naga Anji S/o Muttaiah		
39	295/2	Patta	Dry	00-01 ½	Duggi Upender Rao, Duggi Gopi and Duggi Naga Anji S/o Muttaiah		
40	295/2	Patta	Dry	0-31 ½	Pasupuleti Nageswar Rao S/o Appaiah		
41	295/2	Patta	Dry	00-18	Duggi Upender Rao, Duggi Gopi and Duggi Naga Anji S/o Muttaiah		
42	295	Patta	Dry	02-00	Garikapati Pawan Kumar S/o Venkateswar Rao		Mango Trees
43	312	Patta	Dry	01-20	Plots		
44	312	Patta	Dry	00-30	Kasiboina Upender Rao S/o Laxmaiah		
45	313	Patta	Dry	00-01	Kanaparthi Venkateswarlu S/o Subba Rao		
46	315	Patta	Dry	00-15	Plots		
47	315	Patta	Dry	00-15	Bairu Harinadh Babu S/o Chinna Kotaiah		
48	316	Patta	Dry	00-23	Battula Ratna Kumari W/o Adinarayana		Shopping Complex
49	316	Patta	Dry	01-00	Manne Meena Kumari W/o Venkat Ramana		Weigh Bridge
50	316	Patta	Dry	01-00	Bairu Harinadh Babu S/o Chinna Kotaiah		
51	316	Patta	Dry	00-10	Sadineni Latha W/o Janardhan Rao		
52	316	Patta	Dry	00-10	Ravella Ravi Kumar S/o Venkat Rama Rao		
53	320	Patta	Dry	00-10	Samineni Laxmi W/o Harinadh Babu		
54	322	Patta	Dry	00-20	Samineni Laxmi W/o Harinadh Babu		
55	322	Patta	Dry	01-20	Plots		
	Total Extent			28-24			

This notification is made under the provisions of Section-11(1) of The Right to Fair Compensation and Transparency in Land acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (Central Act No.30/2013), as amended by the Right to Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement (Telangana Amendment) Act, 2016 (Act No.21 of 2017) to all whom it may concern.

A plan of the land may be inspected in the office of the District Collector & Land Acquisition Officer & Revenue Divisional Officer, Khammam on any working day during the working hours. The Government of Telangana / Collector-cum-Appropriate Government are pleased to authorize Officer Land Acquisition Officer & Revenue Divisional Officer, Khammam and his staff to enter upon and survey land, take levels of any land, dig or bore into the sub-soil & do all other acts required for the proper execution of their work as provided and specified in section-12 of the said Act.

Under section 11(4) of the Act, no person shall make any transaction or cause any transaction of land i.e. sale/purchase, etc., or create any encumbrances on such land from the date of publication of such notification without prior approval of the Collector.

Objections to the acquisition if any, and claims from all the persons interested/affected for settlement by negotiation of the compensation, may be filed by the person interested in the land within 60 (sixty days) from the date of publication of this notification as provided under section 15 of the Act before District Collector/Authorized officer.

Sd/- Land Acquisition Officer & Revenue Divisional Officer Khammam | Sd/- Joint Collector Khammam | Sd/- District Collector Khammam

మీడియా సమావేశాల్లో నిందితులకు నో ఎంట్రీ

● పోలీసులు తీసిన ఫొటోలనే వాడుకోవాలి ● ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం కొత్త నిర్ణయం


ఫైల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివిధ కేసులలో పట్టుబడ్డ నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టరాదని పోలీసు యంత్రాంగం నిర్ణయించిందా?. ఒక వేళ నిందితులను పట్టుకుంటే మీడియా సమావేశం నిర్వహించాలి కానీ వారిని కెమెరాలకు చూపించరాదని పోలీసు శాఖ భావిస్తుందా?. అంటే అవుననే అంటున్నాయి పోలీసు వర్గాలు.

హైదరాబాద్ ఉత్తర మండలం పరిధిలోని తిరుమలగిరి పోలీసుస్టేషన్‌లో మూడు రోజుల క్రితం ఒక మహిళను మీడియా ముందు ప్రవేశపెట్టిన సమయంలో జరిగిన చేదు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మకంగా వ్యవహరించాలని పోలీసు శాఖ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇక నుంచి వివిధ కేసులలో పట్టుబడ్డ నిందితుల వివరాలను మీడియాకు తెలియజేయాలని, ఈ సందర్భంగా అవసరమనుకుంటే ఫొటోలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఉత్తర మండలంలో మహిళను మీడియా ముందు ప్రవేశపెట్టిన సందర్భంగా మహిళ తన వాదనను వినిపించేందుకు ప్రయత్నించింది. దీంతో ఆగ్రహించిన ఎసిపి చెంప చెళ్ళుమనిపించాడు.

ఈ దృశ్యం ప్రసార మాధ్యమాలలో రావడంతో సదరు అధికారిని తప్పించాల్సి వచ్చింది. అంతక ౦ ముందుమధ్య మండలం పరిధిలో ఒక యువకుడిని మీడియా ముందుకు తీసుకు వచ్చిన సందర్భంగా తన తప్పేమీ లేదని, పోలీసులు కావాలని తనను కేసులో ఇరికించి భవిష్యత్‌ను పాడు చేస్తున్నారని వాపోయాడు. పోలీసులు చెప్పిన వివరాల కంటే యువకుడు చెప్పిన వివరాలనే ప్రసార మాధ్యమాలు ఎక్కువగా ప్రసారం చేయడం జరిగింది. ఇలాంటి సంఘటనల వల్ల ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ఇబ్బందికరంగా తయారవుతున్నాయన్న ఉద్దేశ్యంతో ఉన్న అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

రాష్ట్ర పోలీసు శాఖ కొంత కాలంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం తీవ్ర ప్రయత్నాలను చేస్తోంది. ఇందులో భాగంగా పోలీసు స్టేషన్‌లలో సహాకుల ఏర్పాటు, హెల్ప్‌కౌంటర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించడంతో పాటు వారికి కావాల్సిన సహాయాన్ని అందించేందుకు వెంటనే ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కకడక్కడా కొన్ని సంఘటనలు పోలీసుల తీరును ప్రశ్నించే విధంగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. మీడియా సమావేశంలో పోలీసుల ముందే నిందితులుగా నమోదు చేసిన కొంత మంది తమ తప్పు లేకున్నా బలవంతంగా నేరాన్ని రుద్దుతున్నారని చెప్పడం సరైంది కాదన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. తప్పు చేసిన వారెవరూ తొందరగా నేరాన్ని ఒప్పుకోరని పోలీసులు అంటున్నారు. నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం దెబ్బతింటున్నందున కేవలం విషయాన్ని తెలియజేసి ఫొటోలను అందిస్తే సరిపోతుందని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

28న టీటీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం

● తెలంగాణలో పార్టీ పటిష్ఠతపై చర్చ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ తెదేపా నాయకులతో ఈ నెల28వ తేదీన పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. నగరంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు.... పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు..... ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరుగుతున్న తీరు.... పార్టీ నేతలపై అక్రమంగా పెడుతున్న కేసులు...భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు.... తదిత అంశాలపై కూలంకషంగా చర్చించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పార్టీ నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ అధ్యక్షతన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సెంట్రల్ కమిటీ సభ్యులు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకవచ్చే విధంగా చంద్రబాబుతో జరిగే సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నామా నాగేశ్వర్‌రావు, కొత్తకోట దయాకర్‌రెడ్డి, సామ భూపాల్‌రెడ్డి, బుచ్చిలింగం, ఈగమల్లేష్, బండ్రు శోభారాణి, అట్లూరి రమాదేవి, నన్నూరి నర్సిరెడ్డి, కొమ్మినేని సాయి వికాస్ పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

ఎంఆర్పీఎస్ నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కు తెలుగుదేశం పార్టీ సహకరించాలని మందకృష్ణమాదిక ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వచ్చి రమణను కోరారు. ఈ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

టీడీపీ ఎంపీల మద్దతు కోరవా పవన్?

● వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉందని రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం ఆయన విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అవిశ్వాస తీర్మానం అంశంపై తన సహకారంతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీని అడగకుండా కేరళ, తమిళనాడు, ఢిల్లీలో కేజ్రీవాల్ సహాయం కోరుతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రశ్నించాల్సిన చోట ప్రశ్నించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రత్యేక హోదా అంశం గురించి ఆది నుండి చిత్తశుద్ధితో పోరాడుతున్నది ఒక్క వైసీపీ ఒక్కటేనన్నారు. ఈ పరిస్థితుల్లో ఎంపీల రాజీనామా అంశం, అవిశ్వాస తీర్మానం పెట్టడం వంటి అంశాలను తామే తెరపైకి తీసుకొచ్చామన్నారు. కానీ, ఈ అంశాలపై పవన్ వైఖరి అనుమానాలకు దారితీస్తోందన్నారు.

నేటి నుంచి ఏపీలో 'టెట్'

అమరావతి, ఆంధ్రప్రభ: అనేక వివాదాల మధ్య ఎట్టకేలకు టెట్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తోన్న ఈ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రకటించారు. కాగా అనేక టెట్ విషయంలో అనేక అపోహలు తలెత్తినప్పటికీ అడ్డంకులను అధిగమించి ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు మొగ్గు చూపామని, అభ్యర్థులు ఎలాంటి అపోహలు చెందవద్దని కోరారు. మొత్తం 183 ఆన్‌లైన్ కేంద్రాలలో టెట్ ను నిర్వహిస్తుండగా, ప్రాథమిక కీ ని మార్చి 4 వ తేదీన, ఫైనల్ కీ ని మార్చి నెల 12 వ తేదీన విడుదల చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బెంగళూరు, చెన్నైలలో కూడా ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా కంప్యూటర్లు మొరాయించకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు వసతులు కూడా కల్పించడం జరిగింది. పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు ఆందోళన చెందవద్దని, పరీక్షలు ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని, కోర్టు వివాదాలు కూడా లేవని టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. మొత్తం 4.61 లక్షల మంది అభ్యర్థులు హాజరవుతుండగా, 2016 బ్యాచ్‌కి చెందిన డి.ఇడి అభ్యర్థులను కూడా పరీక్షలకు అనుమతిస్తున్నారు. మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రైవేట్ ఏజన్సీకి అప్పగించారు.

భూ కుంభకోణంపై దర్యాప్తు చేయండి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మంచిర్యాల జిల్లా, నెన్నెల్ మండలం లో రూ.ఐదు వేల కోట్ల విలువచేసే రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూ కుంభకోణం పై దర్యాప్తు చేసి, రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు మంచిర్యాల జిల్లా కలెక్టర్ ను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు చేసింది.. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి.రాంమ్మోహన్ రావు దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆ ప్రభుత్వ భూమిని స్థానిక తెరాస నాయకులతో పాటు మరికొందరు ఆక్రమించారని తెలిపారు. ఆ భూమి విలువ మార్కెట్లో రూ.5000 కోట్ల పైనే ఉంటుందన్నారు. ఆక్రమణదారులు అంతటితో ఆగకుండా ఆ భూమిని వివిధ బ్యాంకుల్లో తనఖా పెట్టి వ్యవసాయ రుణాలు కూడా పొందినట్లు నివేదించారు..తెలంగాణ గ్రామీణ బ్యాంకు నెన్నెల్ శాఖ ,ఆదిలాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బెల్లంపల్లి శాఖ తో పాటు మరికొన్ని బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందినట్లు తెలిపారు. ఈ కుంభకోణం పై దర్యాప్తు జరపాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కేవలం రెండు గ్రామాల్లో మాత్రమే విచారణ చేపట్టారన్నారు.ఈ భూకుంభకోణం 11 గ్రామాల్లో పరిధిలో జరిగిందన్నారు. భూ దురాక్రమణకు పాల్పడిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ భారీ భూకుంభకోణంపై దర్యాప్తు జరిపేలా తెలంగాణ సర్కారును ఆదేశించాలని అభ్యర్థించారు. నకిలీ పత్రాలు సమర్పించి ఆక్రమణదారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు తెలిపారు. అయితే ఆక్రమణదారులు సమర్పించిన నకిలీ పత్రాలను విడుదల చేయకూడదని బ్యాంకులను ఆదేశించాలని అభ్యర్థించారు.

శిశుగృహాల్లో పిల్లల మరణాలు, విక్రయాలపై కౌంటర్ దాఖలు చేయండి

● తెలంగాణ సర్కారును ఆదేశించిన హైకోర్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో 0-6 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లల మరణాలు, విక్రయాల వ్యవహారంలో రెండు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులందరికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్,జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల శిశు గృహాల్లో ఉన్న 0-6 ఏళ్ల మధ్య వయస్సుగల పిల్లల మరణాలు, విక్రయాలపై సమగ్ర దర్యాప్తు జరిపేలా, బాధ్యులైన ఉద్యోగులు,అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు దాఖలు చేసిన విషయం తెలిసిందే...ఈసందరభ ంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ..ఆ మూడు జిల్లాల్లోని శిశుగ హాలకు చెందిన పిల్లలకు సరియైన వైద్యం,చికిత్స లేని కారణంగా32 మంది మృత్యువాతపడ్డారని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ..ఈ వ్యవహారంలో రెండు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులైన తెలంగాణ వైద్య,ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి,మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్,నల్గొండ జిల్లా కలెక్టర్,ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లకు నోటీసులు జారీ చేసింది.తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

చంద్రబాబు వ్యవసాయాన్ని నాశనం చేశారు

● హెరిటేజ్ కోసం డెయిరీలు మూత వేశారు

● రైతు సదస్సులో నిప్పులు చెరిగిన వైఎస్ జగన్



ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దళారీల నాయకుడని, నాలుగేళ్లలో వ్యవసాయాన్ని దళారీలకు అప్పగించి, రైతులకు అన్యాయం చేశారని ప్రతిపక్షనేత జగన్ విమర్శించారు. నాలుగేళ్ల టీడీపీ పాలనలో రైతుల ముఖంలో చిరునవ్వు మాయమైందన్నారు. హెరిటేజ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా కోఆపరేటివ్ డెయిరీలను మూత వేశారని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే నవరత్నాలతో వ్యవసాయాన్ని పండుగగా మారుస్తానని, పెండింగ్‌లో ఉన్న ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేయిస్తానని జగన్ హామీఇచ్చారు.

ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ప్రకాశం జిల్లాలోని పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామంలో రైతుల ఆత్మీయ సదస్సులో పాల్గొన్న జగన్ తాను అధికారంలోకి వస్తే రైతాంగానికి అండగా ఉంటానని తెలిపారు. చంద్రబాబు రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని ఆరోపించారు. నాలుగేళ్లుగా రైతు ఏ పంట పండించినా గిట్టుబాటు లేని పరిస్థితి ఏర్పండిందన్నారు. గత ఎన్నికలలో రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేస్తానన్న చంద్రబాబు ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు.

రైతన్నల ముఖంలో చిరునవ్వు చూడటానికి నవరత్నాల పథకాలను ప్రకటించానన్నారు. తాము అధికారంలోకి వస్తే వ్యవసాయానికి పగటి పూట 9 గంటల విద్యుత్, వడ్డీ లేకుండా రుణాలు, వ్యవసాయ ప్రారంభానికి ముందే మే నెలలో పెట్టుబడి క్రింద రూ.12,500లు ప్రతి తాము బోర్లు ఉచితంగా వేయిస్తామని చెప్పారు. పంట వేయటానికి ముందే గిట్టుబాటు ధర ప్రకటించి ఆ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చేస్తామన్నారు. రూ.3,500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేసి రైతులకు అండగా ఉంటామన్నారు. ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజిలు, గిడ్డంగులు నిర్మిస్తామని, నియోజకవర్గ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజా ప్రతినిధులు చట్ట నియమాలను గౌరవించాలి

తాము ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా టీవీల ముందు మాట్లాడిన ప్రజాప్రతినిధులపై హైకోర్టు ఆగ్రహం

● కోడి పందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పండి

● 144వ సెక్షన్ విధించాల్సింది

హైదరాబాద్ , ఆంధ్రప్రభ : ప్రజా ప్రతినిధులందరూ న్యాయశాస్త్ర నియమాలను (రూల్ ఆఫ్ లా) గౌరవించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. కోడి పందేల్లో చురుకుగా పాల్గొన్న ప్రజాప్రతినిధుల పేర్లను వచ్చే విచారణ తేదీ నాడు తమకు సమర్పించాలని హైకోర్టు ఏపీ సర్కారును ఆదేశించింది. కోడి పందేలను నిరోధించేందుకు సెక్షన్ 144 విధించాల్సిందని హైకోర్టు అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న కోడి పందేలను నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని తాము జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా కోడిపందేలు నిర్వహిస్తామంటూ టీవీల ముందు ప్రకటనలు చేస్తున్న ప్రజాప్రతినిధులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ప్రజాప్రతి నిధుల పేర్లు వివరాలను తెలియజేస్తే వారి సంగతి తేలుస్తామని హైకోర్టు హెచ్చరించింది. ప్రభుత్వ సంస్థల పట్ల మాకు గౌరవముందని, అలాగే కోర్టు ఉత్తర్వులను అధికారులు గౌరవించాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఏపీ ప్రభుత్వం సమర్పించిన నివేదికలో ప్రజాప్రతినిధుల పేర్లు లేకపోవడం పట్ల హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది.. ప్రజాప్రతినిధుల పేర్లను విస్మరించలేమని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోడి పందేలను నిరోధించడంలో విఫలమైన తహసీల్దార్లు, ఎస్.హెచ్.వో లకు చార్జ్ మెమోలు జారీ చేసినట్లు ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.. ..పశ్చిమ గోదావరి జిల్లా , భీమవరం మండలంలోని వెంప, శ్రీరాంపూర్ గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందేలు, జూదం, గుండాట వంటి క్రీడలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పేర్కొంటూ కె.రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత వాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ..కోడి పందేలను అడ్డుకోవడంలో విఫలమైన తహసీల్దార్లు, ఎస్.హెచ్.వో లకు చార్జ్ మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. కోడి పందేల నిర్వాహకులపై కేసులు నమోదు చేశామన్నారు. అయితే పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయలేదన్నారు.. ఈ వ్యవహారంలో నివేదికలు సమర్పించడంలో అలసత్వం చూపిన ఏపీ సీఎస్, డీజీపీలపై గత విచారణ సందర్భంగా హైకోర్టు అసహనం, అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.. ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్వహించిన కోడి పందేలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయని ప్రశ్నించింది. ఆ రెండు జిల్లాల్లో 806 చోట్ల జరిగిన కోడి పందేలను ఎవరు నిర్వహించారు నిందితులు ఎవరో చెప్పండి. గత ఏడాది కోడి పందేలను నిలువరించడంలో విఫలమైన తహసీల్దార్లు, ఎస్ఐ (ఎస్‌హెచ్‌వో)లపై తీసుకున్న చర్యలను వివరించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.



ఎయిర్ పోర్టుకు ఎక్స్‌ప్రెస్ మెట్రో రైల్

- కనెక్టివిటి అంశాలపై మంత్రి కేటీఆర్ ఆరా
- మలిదశ విస్తరణ పనులపై చర్చ
- మెట్రోరైల్ కార్యకలాపాలపై సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మెట్రోరైల్ మలిదశ పనుల్లో హైదరాబాద్ ఎయిర్ పోర్టు (రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం)కు కనెక్టివిటి అంశంపై రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సూచించారు. ఆ దిశగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేస్తూ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.మంగళవారం బేగంపేటలోని మెట్రోరైల్ భవన్‌లో మెట్రో కార్యకలాపాలపై మంత్రి కేటీఆర్ సమీక్షించారు. త్వరలో మెట్రోరైల్ మలిదశ పనులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో, అందుకు తగ్గ కసరత్తు ప్రారంభించాలన్నారు. కారిడార్ల ఎంపిక, స్టేషన్ల గుర్తింపు, నిధుల సేకరణ వంటి అంశాలపై ఒక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.ప్రస్తుతం నాగోల్ నుంచి మియాపూర్ వరకు నడుస్తున్న మెట్రోరైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచేందుకు ప్రయత్నించాలని అధికారులను ఆదేశించారు. ఇతర మెట్రోలతో పోల్చితే హైదరాబాద్ మెట్రోలోనే ప్రయాణికుల సంఖ్య బాగుందన్నారు. మెట్రో టికెటింగ్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మెట్రోకు అనుసంధానంగా రవాణా సౌకర్యాలను కల్పించేందుకు ఆర్టీసీతో పాటు ఇతర అంశాలను పరిశీలించాలన్నారు. ఇందుకోసం సెట్విన్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా వంద ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. మెట్రో కారిడార్లలో పార్కింగ్, ఫుట్‌పాత్, రోడ్ల వంటి మౌళిక వసతుల కల్పన మరింత వేగంగా జరగాలన్నారు. పార్కింగ్ సదుపాయాన్ని మరింత పెంచడం కోసం 12 మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలను టెండర్లు పిలువనున్నట్లు మెట్రో అధికారులు మంత్రికి వివరించారు. నాంపల్లి మెట్రో స్టేషన్ వద్ద ఈఎంఎల్‌పి సదుపాయానికి వారం పది రోజుల్లో టెండర్లు పూర్తి కానున్నాయన్నారు. ఈసదుపాయాలకల్పనకోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఉప్పల్ స్టేడియం నుంచి మెట్రో స్టేషన్ వరకు స్కైవాక్ నిర్మాణానికి స్టేడియం అథారిటీలు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. మెట్రో స్టేషన్లతో పాటు, ఆయా కారిడార్లలో మూత్రశాలల అవసరం ఉందని, వాటి నిర్మాణం కోసం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా షీటాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మొదటి దశ పనుల్లో మిగిలిన కారిడార్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అమీర్‌పేట్ నుంచి హైటెక్ సిటీ వరకు పనుల పురోగతిని మంత్రికి అధికారులు వివరించారు. ఈ సమావేశంలో పురపాలక ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రాంతీయ సదస్సులు

- రైతు సమన్వయ సమితుల సభ్యులంతా హాజరయ్యేలా చూడండి
- ప్రయాణ సౌకర్యం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయండి
- జిల్లా అధికారులకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి ఆదేశాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్‌నుంచి ప్రభుత్వం అమల్లోకిరానున్న సరికొత్త వ్యవస్థ రైతు సమన్వయ సమితులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా సంసిద్ధం కావాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో, 26న కరీంనగర్‌లో జరుగు నున్న ప్రాంతీయ సదస్సులకు మండల, జిల్లా సమన్వయ సమితుల సభ్యులంతా విధిగా హాజరయ్యేలా చూడాలని చెప్పారు. వారందరికీ ప్రయాణ సౌకర్యం, భోజన సదుపాయా లు ప్రభుత్వ ఖర్చుతోనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశంపై మంగళవారం సచివాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, సీఎం ఇటీవల సుదీర్ఘ సమావేశం ఏర్పాటుచేసి ప్రాంతీయ సదస్సుల నిర్వహణకు మార్గదర్శకాలు ఇచ్చినట్లు అధికారులకు తెలిపారు. ఈ సదస్సుల్లో కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో పాల్గొంటున్నారని, ఆయన కొంతసమయం రైతులతో స్వయంగా ముచ్చటించనున్నారని తెలిపారు. మండల, జిల్లా స్థాయి రైతు సమన్వయ సమితి సభ్యులను ఉద్దేశించి ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందని, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్లతో సమన్వయపరచుకొని వస్తున్న రైతుల వివరాలు, సంఖ్య పక్కాగా అంచనా వేసుకోవాలని, దీనికి మండల వ్యవసాయ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

ఇన్‌చార్జిల నియామకంపై కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నియోజకవర్గ ఇన్‌ఛార్జిల నియామకంపై టీఆర్ఎస్ కసరత్తు చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే నియమించిన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిల వల్ల కొత్త తలనొప్పులు వస్తున్నాయని, పలువురు ఎమ్మెల్యేలు సిఎంకు ఫిర్యాదుచేయడంతో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీకి సంబంధించిన పకడ్బందీ వ్యవస్థను నిర్మించాలని అధినేత తలపోస్తున్నారు. ఇప్పటికే చేపట్టిన సర్వేల ద్వారా బలవంతులెవరో.. ప్రజాభిమానం ఉన్నవారెవరో.. ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న వారెవరో తేలిపోవడంతో ఇన్‌ఛార్జిల నియామకంలో వీటిని సిఎం దృష్టిలో పెట్టుకుంటారని పార్టీలో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు కాకుండా వచ్చే ఎన్నికల్లో మళ్ళీ టిక్కెట్ ఇవ్వాలనుకున్న ఎమ్మెల్యేలను తొలివిడతగా ఇన్‌ఛార్జిలుగా ప్రకటించాలని, టికెట్ నిరాకరించాలనుకున్న వాళ్ళ స్థానంలో మరో కొత్తనేతను ఇన్‌ఛార్జిగా నియమించడం లేదా.. కొంతకాలం వ్యూహాత్మకంగా జాప్యం చేయడం చేయాలని అధినేత భావిస్తున్నట్లు సమాచారం. జిల్లాకమిటీలను రద్దుచేసి ఆ స్థానంలో కమిటీల నియామకం చేయకపోవడంతో వచ్చే ఎన్నికల్లో పార్టీని లీడ్ చేసేందుకు కొంత ఇబ్బంది తలెత్తుతుందన్న అభిప్రాయం పార్టీవర్గాల్లో ఉంది. దీనిని అధిగమించేలా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను కెసిఆర్ నియమించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

106 స్థానాలు మావే

సార్వత్రిక ఎన్నికలపై మంత్రి పోచారం ధీమా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తాజా సర్వే ప్రకారం తెలంగాణలో 106 అసెంబ్లీ స్థానాలను గెలుస్తామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరో 20 సంవత్సరాలు రాష్ట్రంలో తెరాస ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నగర శివారులోని గాజులరామారంలో నివాస గృహాలకు మంచినీటి పైపులైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన 40 యేళ్ళ రాజకీయ జీవితంలో ఇంతటి సమర్ధవంతమైన పరిపాలనను చూడలేదన్నారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు శాశ్వతంగా తొలగిపోయేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాలు మెచ్చే విధంగా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలువుతున్నాయని చెప్పారు.

టి- సేవ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ:టి-సేవ సెంటర్స్ ద్వారా సామాన్యులకు 150లకు పైగా ఐటీ ఆధారిత ఆన్‌లైన్ సేవలను చేరువ చేయడం, ప్రజలకు బహుళ ప్రయోజనాలను అందించడం కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టి-సేవ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం అర్హత, ఆసక్తిగల అభ్యర్ధుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నగదు రహిత సేవలు, బిల్ చెల్లింపులు, బ్యాంకింగ్, మనీట్రాన్స్‌ఫర్, పాన్‌కార్డు, బస్, ట్రైన్, ఫ్లైట్ టికెట్ల కొనుగోళ్ళు, మెక్రో ఏటిఎం...ఇలా 150కుపైగా ఆన్‌లైన్ సేవలను ఒకే ప్లాట్‌ఫాం ద్వారా అందించడమే లక్ష్యంగా వీటిని నెలకొల్పుతున్నారు. కంప్యూటర్ రంగంలో 23 సంవత్సరాల అపార అనుభవాన్ని గడించిన పేస్ గ్రూప్ టీ-సేవ కేంద్రాల స్థాపనకు శ్రీకారం చుట్టింది. పూర్తి వివరాలకు దరఖాస్తుల ఫారాలకు ఫోన్ 8801007277, 9100994489లో వచ్చే నెల 5వ తేదీ వరకు సంప్రదించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.టిఎస్‌ఈసేవసెంటర్.కామ్‌ను ఆశ్రయించాల్సి ఉంటుందని టీసేవ సెంటర్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల్లో 119 స్థానంలోపోటీ

బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ప్రభన్యూస్ బ్యూరో : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 119 స్థానాల్లో పోటీ చేస్తుందని ఏ పార్టీతో పొత్తు ఉండదని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కిషన్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మంగళవారం మహబూబ్‌నగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రోజురోజుకు పుంజుకుంటుందని, 2019లో అధికారంలోకి రావాలనే సంకల్పంతో ముందుకెళ్తుందని తెలిపారు.

పే అండ్ అకౌంట్స్‌కు నూతన భవనం

- తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.5 కోట్లతో నిర్మాణం
- ఆర్థిక శాక మంత్రి ఈటల రాజేందర్



తిమ్మాపూర్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత 5 కోట్ల నిధులతో ఆధునీకరణతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల జాయింట్ డైరెక్టర్ వర్క్స్ అండ్ అకౌంట్స్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్స్, సహాయ క పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్స్ భవన సముదాయ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ప్రాణహిత ప్రాజెక్టలలో నీటిని ఒడిసి ప ట్టుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నీటిపారుదల శాఖ ప్రాజెక్టలకు డబ్బులు సమకూర్చే శాఖ పే అండ్ అకౌంట్స్ శాఖ అని జిల్లా కార్యాలయమే కాకుండా 15 జిల్లాలకు సంబంధించిన శాఖ అని రీజనల్ కార్యాలయాన్ని కరీంనగర్ జిల్లాలో 4 కోట్ల 90 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. ఇట్టి కార్యాలయాన్ని ప్రారంభించుకొని 15 జిల్లాల ప్రజానీకానికి అంకితం చేశామని చెప్పారు. కరీంనగర్ జిల్లా ఉత్తర తెలంగాణకు గుండెకాయలాంటి జిల్లాయని ఇప్పటికే ఎస్సారెస్పీ నీళ్ళతో ఎల్ఎండి ప్రాజెక్ట్ కళకళలాడుతున్నటువంటి ఈ జిల్లాకు మిడ్‌మానేర్ ప్రాజెక్టుని ఈ సంవత్సరంలో నీటిని నింపుకొని ప్రజలకు అంకితం చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు మరింత శరవేగంగా చేసి 2018-19 సంవత్స రంలో ఉత్తర తెలంగాణ జిల్లాలలో కరువు లేని జిల్లాలు గా ప్రకటించే దానిలో భాగంగా జరుగుతున్న టువంటి కార్యక్రమాలకి తమ పే అండ్ అకౌంట్స్ శాఖ అనుబంధమై డబ్బులు చెల్లింపులో ఏలాంటి ఆవకతవకలకు పాల్పడకుండా నిజాయితీకి తమ శాఖ ముందుంటుందని తెలిపారు.అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సర్పంచ్ మాతంగి స్వరూప, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ డా. ఎం. వేంకటేశ్‌బాబు, పే అండ్ అకౌంట్ ఆఫీసర్ నాగరాజు, 14 జిల్లాల పే అండ్ అకౌంట్స్ అధికారులు, ఎపిఏవోలు, టిఎన్‌జివో ఎల్ఎండి శాఖ అధ్యక్షులు మామిడి రమేష్, పిఏవో శాఖ అధికారులు రవీందర్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగుల ఏకానందం, మాతంగి లక్ష్మణ్, ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు.

100 ఎకరాల్లో మాంసం ఎగుమతి కేంద్రం

- భారీ పెట్టుబడితో ముందుకొచ్చిన లూలూ ఇంటర్నేషనల్ సంస్థ
- 800 మందికి ప్రత్యక్షంగా, 5వేల మందికి పరోక్షంగా ఉపాధి
- దుబాయ్‌లో జరిగిన గల్ఫ్ ఫుడ్ ట్రేడ్ షో-2018లో మంత్రి తలసానికి హామీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విదేశాలకు మాంసం ఎగుమతి చేసేందుకు రాష్ట్రం లో దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో మాంసం ఎగుమతి కేంద్రాన్ని నెలకొల్పేందుకు లూలూ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. దుబాయ్‌లో ఈనెల 18 నుంచి 22 వరకు జరుగు తున్న గల్ఫ్ ఫుడ్ ట్రేడ్ షో-2018లో పశు సంవర్ధ కశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ పాల్గొన్నా రు. మంగళవారం లూలూ సంస్థ సీఈవో సలీం, కోడైరెక్టర్ విజయ్‌కుమార్‌తో జరిపిన చర్చల ఫలితంగా మాంసం ఎగుమతి కేంద్రాన్ని నెలకొల్పేందుకు హామీ ఇచ్చారు. ఈకేంద్రం ద్వారా దాదాపు 800 మందికి ప్రత్యక్షంగా, 5వేల మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ ఫుడ్ ట్రేడ్ షోకు తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి ఆధ్వర్యంలో డెయిరీ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డిలతో కూడిన అధికారుల బృందం దుబాయ్‌కి వెళ్ళింది. భారతదేశం నుంచి మాంసం, చికెన్, కోడిగుడ్లు, పాల ఉత్పత్తులకు సంబంధించిన దాదాపు 100 స్టాళ్ళను ఈ షోలో ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపెడా, ఆల్‌కబీర్, చెంగిచర్లలోని మహ్మద్ సలీం అండ్ కంపెనీ తదితర సంస్థలు రాష్ట్రం నుంచి ఈ ప్రదర్శనలో తమ స్టాళ్ళను ఏర్పాటుచేసి ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ, ప్రభుత్వ పరంగా అతి సరళమైన విధానాల ద్వారా సింగిల్ విండో అనుమతులు ఇస్తుందని అన్నారు. 24 గం టల విద్యుత్ సరఫరా, నీటి లభ్యత, మానవ వనరుల లభ్యత వంటి ఎన్నో ముఖ్యమైన అంశాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సానుకూల అంశాలని తెలిపారు.

గ్రేటర్‌లో రోడ్లకు జర్మనీ టెక్నాలజీ

- ప్రయోగాత్మకంగా లుంబినీ పార్కు రోడ్డు నుంచి నెక్లస్ రోడ్డు వరకు కొనసాగుతున్న పనులు
- పది సంవత్సరాల పాటు రోడ్డు నాణ్యత
- కిలోమీటర్ లేన్‌కు రూ. 55 లక్షల నుంచి రూ.65 లక్షల ఖర్చు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ మహానగరంలో నగర రోడ్ల పరిస్థితిని మెరుగుపరిచేందుకు జర్మనీ టెక్నాలిజీని వినియోగించాలని మున్సిపల్ శాఖ నిర్ణయిం చింది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా సచివాలయం ఎదురుగా ఉన్న లుంబినీ పార్కు నుంచి నెక్లస్ రోడ్డు వరకు ఈ పనులను చేపట్టిన విషయం తెలిసిందే. 3.80 లేన్ కిలోమీటర్ మేర సుమారు రెండున్నర కోట్ల రూపాయలతో జర్మనీ సంస్థ ఉచితంగా నిర్మిస్తోంది. విశ్వ సముద్ర ఇంజనీరింగ్ కంపనీ ఆధ్వర్యంలో ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతు న్నాయి.కొన్ని సంవత్సరాల పాటు రోడ్డు మన్నికకోసం సిమెంట్‌లో పలు రసాయన పదార్థాలను కలిపి రూపొందిం చిన మిశ్రమంద్వారా చేపడుతున్నారు. స్టెబిలైజేషన్ రోడ్ బై రీసైక్లింగ్ విత్ ఎడిషన్ సిమెంట్ అండ్ అదర్ కెమికల్స్ పేరుతో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఒక కిలోమీటర్ లేన్‌కు సుమారు 55 లక్షల నుంచి 65 లక్షల రూపాయల మేరకు ఖర్చు అవుతోంది.నగరంలో ప్రతిసంవత్సం కురుస్తున్న భారీ వర్షాలు వరదలకు రహదారులు పూర్తిగా చిన్నాభినం అవుతున్నాయి. కొత్తగా వేసిన రోడ్లు సైకం కొట్టుకపోతున్నాయి. దీంతో ప్రతియోటా నగర రహదారులపై జీహెచ్‌ఎంసీ వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా....ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరడం లేదు. ఈ పరిస్థితిని చూసి కొన్ని సందర్భాల్లో సిఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కూడా మున్సిపల్ అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం, అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో నగర రోడ్ల పరిస్థితిని మెరుగుపరచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణంలో ఆధునిక సాంకేతికను వినియోగించుకుని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగానే జర్మనీ టెక్నాలిజీని వినియోగించి లుంబీనీ పార్కు వద్ద ప్రయోగాత్మకంగా రోడ్డు నిర్మాణ పనులను చేపట్టింది. వైట్‌టాపింగ్ రోడ్ల మాదిరిగానే ఈ రోడ్డు మన్నిక కూడా కనీసం పది సంవత్సరాల పాటు నాణ్యతతో ఉంటుందని తెలుస్తోంది. ప్రభుత్వం ఆశించిన విధంగా జర్మనీ సహకారంతో నిర్మించిన రోడ్డు ఎక్కువ కాలం మన్నికతో ఉంటే ....గ్రేటర్‌లోని పలు రహదారుల నిర్మాణాలను జర్మనీ టెక్నాలిజీతో చేపట్టాలని మున్సిపల్ శాఖ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

హైకమాండ్ ఆదేశాలతోనే బస్సు యాత్ర

- సీనియర్ల సలహాలు తీసుకున్నాం
- ప్రధాని అంటే కేసీఆర్‌కు భయమెందుకు
- ఈనెల 26నుంచి జిల్లాల పర్యటన
- టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి చేవెళ్ల నుంచి చేపట్టే బస్సుయాత్ర నిర్ణయం ఏకపక్షం కాదని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హై కమాండ్ ఆదేశాల మేరకే బస్సుయాత్ర నిర్ణయం తీసుకున్నామని, పార్టీలోని అందరి సలహాలు, సూచనల మేరకే బస్సుయాత్ర చేపడుతున్నట్లు ఉత్తమ్ తెలిపారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బస్సుయాత్ర సమయంలో వివిధ రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని, చేరే వారు కూడా పెద్ద నాయకులే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. యాత్ర చేపట్టే క్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రైతులు,మహిళలు, విద్యార్థులు, యువతతోనూ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు ఉత్తమ్ వివరించారు. జూన్ 1న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు, ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హాజరవుతారని చెప్పారు.

ఇదిలా ఉంటే వచ్చే ఎన్నికల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటికి దూరంగా ఉండాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. ఇదే అంశంపై రాహుల్‌గాంధీ కూడా మాట్లాడే అవకాశం ఉందన్నా రు.

డీసీసీ అధ్యక్షులు పోటీ చేయొద్దు

ఏఐసీసీ కార్యవర్గంలో యువతకు అవకాశం కల్పించాలని పార్టీ ఆలోచన చేస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. మజ్లిస్ పార్టీ బరిలో ఉండే అన్ని నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపాలని పార్టీ హై కమాండ్ నిర్ణయం తీసుకున్నదన్నారు.

టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇదే అఖరి బడ్జెట్..

రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇదే అఖరి బడ్జెట్ అని, వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇంటిదారి పట్టడం ఖాయమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోనే ఎన్నికలు ఉంటాయని భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ఫిబ్రవరి లోపు దుర్మార్గం పాలన అంతం అవు తుందని ఆయన విమర్శిం చారు. సచివాలయానికి రానిముఖ్యమంత్రి దేశంలోనే ఒక కేసీఆర్ మాత్ర మేనని ఆయన ఆరోపిం చారు. తెలంగా ణ వ్యతిరే కు లనే కేసీఆర్ అంద లం ఎక్కించా రని ఆయ న దుయ్యబట్టారు. రాష్ట్రం లో కేసీఆర్ కుటుంబం తప్పా ఏ ఒక్కరూ కూడా సంతోషంగా లేరని ఆయన విమర్శించారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన వారందరూ నిరాశగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఏర్పడి నాలుగేళ్లు పూర్తయినా విభజన హామీలను సాధించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడితో కొట్లాడే దమ్ము కేసీఆర్‌కు లేదన్నారు. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జెట్లి కేసీఆర్ కిట్స్ బాగున్నాయని అన్నారో..? కేసీఆర్ కిడ్స్ బాగున్నాయన్నారో అర్థం కావడం లేదన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఏయిమ్స్ తో పాటు ఏ ఒక్కటి కూడా సాధించలేదన్నారు. టీఆర్ఎస్‌కు రాజ్యసభలో ఒక్క ఎంపీ లేకున్నా బిల్లు ఎలా పాసయ్యిందో ప్రజలకు తెలుసన్నారు. మరో వైపు పినపాక అసెంబ్లీ నియోజక వర్గ అభ్యర్థిగా రేగా కాంతారావును ఉత్తమ్ ప్రకటించారు. మంద కృష్ణమాదిగ భేటి అయ్యారు. మంగళవారం గాంధీభవన్‌కు వచ్చిన కృష్ణ మాదిగ వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్ ఇచ్చే తెలంగాణ బంద్‌కు మద్దతు, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయించాలని ఉత్తమ్‌ను కోరారు.

వర్గీకరణపై రాహుల్‌తో లేఖ ఇప్పిస్తాం

టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ భేటి అయ్యారు. గాంధీభవన్‌కు వచ్చిన కృష్ణ మాదిగ వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్ ఇచ్చే తెలంగాణ బంద్‌కు మద్దతు, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయించాలని ఉత్తమ్‌ను కోరారు. తెలం గాణ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతిస్తున్నదని ఉత్తమ్ హామీ ఇచ్చారు. వర్గీకరణకు అనుకూలంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడికి రాహుల్‌గాంధీ తో లేఖ రాయించే విధంగా కృషి చేస్తామన్నారు. అంతుకు ముందుగా కాంగ్రెస్ పార్టీ తీరుపై మంద కృష్ణమాదిగ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

రిజర్వేషన్ల పెంపుపై కేసీఆర్‌కు చిత్తుశుద్ధి లేదు

విపక్ష నేత షబ్బీర్‌అలీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల పెంపుపై సీఎం చంద్రశేఖర్‌రావుకు చిత్తశుద్ధి లేదని మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ విమర్శిం చారు. మంగళవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముస్లిం, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన బిల్లు ఎక్కడుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పేరుతో మోసం చేయాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. రిజర్వేషన్ల బిల్లులను కేంద్రం తిప్పి పంపిందని వస్తున్న వార్తలపై సీఎం స్పందించా లన్నారు. లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీలు ఏం చేస్తున్నారని షబ్బీర్‌అలీ ప్రశ్నించారు. తెలంగాణలో పథకాలు భాగున్నాయని కితాబిచ్చిన కేంద్ర ఆర్థిక సలహాదారు.. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేలా ప్రధాన మంత్రిని ఒప్పించాలన్నారు.

రాముడు ధర్మానికి ప్రతి రూపం

స్వామి పరిపూర్ణానంద ప్రవచనం



బాన్సువాడ టౌన్, ప్రభన్యూస్ : ధర్మానికి శ్రీ రామ చంద్ర ప్రభువు ప్రతిరూపమని స్వామీ పరిపూర్ణా నంద అన్నారు. కామారెడ్డి జిల్లా, బాన్సువాడ పట్ట ణంలోని శ్రీ అయ్యప్ప స్వామీ ఆలయ నిర్మాణం జరిగి12 సంవత్సరాలు పూర్తయన సందర్భంగా అయ్యప్ప స్వామీ సేవా సమితి ఆధ్వర్యంలో సహస్ర కలశా కుంభాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ పీఠాధి పతి శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. ధర్మానికి రూపం లేదని, ఒకవేళ వుంటే ఈ ధర్మం రాముని వలే వుంటుందని ఆయన అన్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి సమయం ఆసన్నమూందని, దీనికి అందరు కంకణబద్ధులై దీక్ష చేపట్టాలని ఆయన అన్నారు. ప్రవచనానికి ముందు పట్టణంలో భారీ శోభాయాత్రం నిర్మించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి గలి గూడ మీదుగా, తాడ్కోల్ రోడ్డు నుంచి అయ్యప్ప ఆలయానికి శోభాయాత్ర చేరుకుంది. గలి గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహానికి స్వామీజీ పాలాభిషేకం చేశారు.



మోసగాళ్ల అంతు చూస్తాం

కుంభకోణంపై కేంద్రమంత్రి జైట్లీ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పిఎన్‌బి కుంభకోణంపై ఎట్టకేలకు మౌనం వీడారు. ప్రభుత్వం మోసగాళ్ళను తుదికంటా వేటాడుతుందని తెలిపారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ పేర్లను ప్రస్తావించకుండా ఆర్థిక మంత్రి కుంభకోణాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. రాజ్యానికి చట్టబద్ధంగా సంప్రాప్తించిన సంపూర్ణ హోదాలో, ఒక రాజ్యంగా ఈ వ్యక్తులను(మోసగాళ్ళను) వేటాడి, వారి అంతు చూసి, దేశం మోసపోలేదని నమ్మించే బాధ్యత మాపై ఉంది అని మంగళవారమిక్కడ జరిగిన ఏడీఎఫ్ఐఏపీ వార్షిక సదస్సులో జైట్లీ అన్నారు. ఆడిటర్లు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంతర్గత, బాహ్య ఆడిటర్లు ఉభయులు ఏమారి ఉండవచ్చు లేదా గుర్తించడంలో విఫలమై ఉండవచ్చు అని జైట్లీ అన్నారు. ఆర్థిక క్రమశిక్షణను నియంత్రించే చార్టెర్ట్ అకౌంటెంట్లు ఆత్మశోధన చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆర్థిక మోసాలు అదేపనిగా చోటు చేసుకొని విధంగా నెలకొల్పాల్సిన అదనపు యంత్రాంగాలపై ఆత్మశోధన చేసుకోవాల్సిన ఒక ముఖ్యమైన సవాల్ సూపర్‌వైజరీ ఏజెన్సీల ముంగిట ఉందని జైట్లీ చెప్పారు. ఇలాంటి మళ్ళీ మళ్ళీ పునరావృతం కావు అంటూ ప్రజలకు చెప్పేలా వాటిని మొగ్గలోనే తుంచేయాలని ఆయన అన్నారు. మోసాలకు దేశంతో పాటుగా పన్ను చెల్లింపుదారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని జైట్లీ తెలిపారు. అది ఒక ప్రత్యక్ష మూల్యం. అది అభివృద్ధిపై పరోక్ష ప్రభావం చూపుతుంది. ఒక వ్యవస్థగా బ్యాంకుల రుణాలిచ్చే సామర్థ్యంపైన, ఆర్థికాభివృద్ధిపైన ప్రభావం చూపుతుంది అని తెలిపారు.

పీఎంవో నిద్రపోయిందా.?



పాట్నా: ఎంపీనైన తనకే ప్రధాని నరేంద్ర మోడీతో వేదిక పంచుకునే భాగ్యం దక్కలేదని, అలాంటిది దావోస్‌లో ప్రధాని బృందంలో లేని నీరవ్ మోడీకి ఆయనతో ఫొటో తీయించుకునే అవకాశం వచ్చిందంటూ బీజేపీ ఎంపీ శతృఘ్న సిన్హా మోడీ సర్కారుపై మంగళవారం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. డియర్ సర్, ప్రధానమంత్రి కార్యాలయం అనుమతించిన జాబితాలో నేను లేని కారణంగా అనేక అధికారిక కార్యక్రమాల్లో, అంతెందుకు పాట్నా సిట్టింగ్ ఎంపీనైన నన్ను పాట్నా యూనివర్సిటీ శతాబ్ది వేడుకలప్పుడు ప్రధానితో వేదికను పంచుకునేందుకు నన్ను అనుమతించలేదు అని ఆయన ట్వీట్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ప్రధాని హాజరైన కార్యక్రమాన్ని ఆయన ప్రస్తావించారు. మన మంత్రిత్వ శాఖ ప్రకారం నీరవ్ మోడీని దావోస్‌కు ఆహ్వానించలేదు. కానీ ఆయన మీతో పాటుగా వేదికపై ఉన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉండే పిఎంఓ ఈసారి నిద్రపోయిందా? లేక ఎప్పటిలాగానే నీరవ్ మోడీ జాతక చక్రంలోకి దూకిందా? అయినాకానీ అది మీతో, మీ గౌరవనీయ బృందంతో ఆయన్ను అనుమతించింది. దయచేసి ఈ విషయమై జాతికి జ్ఞానాన్ని కలిగించరూ అని ప్రధాన మంత్రిని ఉద్దేశించి శతృఘ్న సిన్హా ట్వీట్ చేశారు.

పీఎన్‌బీపై సుప్రీం కోర్టులో పిటిషన్లు


23న వాదోపవాదాలు మొదలు

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం వాదోపవాదాలు వినడానికి సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. విదేశాల్లో ఉన్న నీరవ్ మోడీ, ఇతర నిందితులను రెండు నెలల్లోగా స్వదేశానికి తీసుకువచ్చే ప్రక్రియ ప్రారంభించాలని కేంద్రాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఎదుట సోమవారం రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిలో ఒకటి చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎం.ఎమ్.ఖన్‌విల్కర్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు మంగళవారం వచ్చింది. ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. పిఎన్‌బి కుంభకోణంపై సిట్ ఏర్పాటును అభ్యర్థిస్తూ పిటిషనర్ వినీత్ ధండా అడ్వకేట్ జె.పి.ధండా ద్వారా ప్రజాప్రయోజనవ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. పంజాబ్ నేషనల్ అత్యున్నత మేనేజ్‌మెంట్ పాత్ర పైన సైతం పిల్ దర్యాప్తు కోరింది. ప్రభుత్వ ఖజానాకు, సాధారణ పౌరులకు తీవ్రమైన ప్రతిఘాతానికి కారణమైన బ్యాంకింగ్ కుంభకోణంపై సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన రిటైర్డ్ జడ్జీలతో సిట్‌ను ఏర్పాటు చేయాలని అడ్వకేట్ ఎం.ఎల్.శర్మ దాఖలు చేసిన పిటిషన్ అభ్యర్థించింది. రాజకీయ నేతలు లేదా రాజకీయ అధినేతల నియంత్రణలోని ఒక ఏజెన్సీతో దర్యాప్తు చేయించవద్దని అది కోరింది. ఈ కేసులో భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ) ఆర్థిక నియమ, నిబంధనలు, నియంత్రణ వ్యవస్థలను అనుసరించకుండా రుణాలు మంజూరు చేశారని ఆరోపించింది.

నగదు భద్రత, దాని రికవరీ దిశగా రూ.10 కోట్లు అంతకు మించిన మొత్తంలో రుణాలు మంజూరుకు మార్గదర్శకాల రూపకల్పనకు ఆర్థిక మంత్రిత్వ శాఖను ఆదేశించాలని ధండా దాఖలు చేసిన పిటిషన్ కోరింది. దేశంలో మొండి బకాయి కేసుల వివరాలను వెలికితీసేందుకు ఒక నిపుణుల కమిటీ నియామకానికి ఆదేశించాలని కూడా అభ్యర్థించింది. దాదాపు రూ.11,400 కోట్ల పిఎన్‌బి కుంభకోణంపై నీరవ్ మోడీ, ఆయన బంధువు మెహుల్ చోక్సీ, తదితరులపై సిబిఐ జనవరి 31, ఆ తర్వాత కొద్ది రోజులకు రెండు ఎఫ్ఐఆర్‌లను దాఖలు చేసింది.

ఆంధ్రా బ్యాంక్‌కు టోకరా

- నకిలీ పత్రాలతో రూ. 1.50 కోట్లకు ఎగనామం
- ఇద్దరు నిందితుల అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నకిలీ పత్రాలతో బ్యాంకుకు రూ.1.50 కోట్ల ఎగనామం పెట్టిన కేసులో నిందితులైన దూలం నాగేంద్ర, ఎం.లక్ష్మారెడ్డిలను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. లోన్ మెస్సర్స్ డీవీఆర్ ప్రాజెక్టు సివిల్ కాంట్రాక్టు నిమిత్తం ఆంధ్రాబ్యాంకు, మారేడ్‌పల్లి బ్రాంచ్ నుంచి రూ.1.50 కోట్లు ఎస్‌వోడీ లోన్ పొందారు. ఇందుకుగానూ రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం, రామదాస్‌పల్లి గ్రామంలో ఉన్న 5.28 గుంటల ప్రాపర్టీకి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు పొందుపర్చారు. 2015లో ఆ లోన్ పొందిన అనంతరం తిరిగి రీపేమెంట్ చేయకపోవడంతో బ్యాంకు అధికారులు ఈ వ్యవహారంపై ఆరా తీయగా అసలు విషయం అవగతమైంది. దీంతో ఈ విషయంపై వారు హైదరాబాద్ సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నందుకున్న పోలీసులు ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నా కుటుంబానికి సంబంధంలేదు



- పీఎన్‌బీ కేసుపై నీరవ్ మోడీ వ్యాఖ్య
- హైదరాబాద్‌లో ముమ్మర సోదాలు
- ఆస్తుల విలువ మదింపు చేస్తున్న ఈడీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంజాబ్ నేషనల్ బ్యాంకుకు పెద్ద మొత్తంలో టోపీ పెట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీవర్ మోడీ ఆ బ్యాంకుకు లేఖ రాశారు. బ్యాంకు తన బ్రాండ్ విలువను నాశనం చేసిందని, దీనివల్ల బ్యాంకుకు అప్పులను కట్టే అవకాశాన్ని తగ్గించారని ఆరోపించారు. తాను చెల్లించాల్సిన డబ్బు బ్యాంకు చెబుతున్న దాని కంటే తక్కువగా ఉందని వెల్లడించారు. తన కుటుంబసభ్యులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు నమోదు చేశాయని, వారికి దీంతో సంబంధం లేదన్నారు. నీరవ్ ఈ లేఖను 15వ తేదీ అర్ధరాత్రి తర్వాత రాశారని తెలుస్తోంది.

అయిదు పేర్లతో పది యూనిట్లు

రావిర్యాల జెమ్స్ పార్కులో 2007 నుంచి గీతాంజలి జెమ్స్ అండ్ జ్యూవెల్లర్స్, బిలియన్ జ్యూవెల్లర్స్, బెలిజ్ జ్యూవెలర్స్, నక్షత్ర జ్యూవెల్లర్స్ పేరుతో నీరవ్ మొత్తం పది యూనిట్లు ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి వజ్రాలను సానబెట్టి వాటితో ఆభరణాలు చేయించి నగరంలో ఏర్పాటు చేసిన షోరూంల ద్వారా అమ్మించేవాడు.

హైదరాబాద్ షోరూంలో సోదాలు

హైదరాబాద్ ఈడీ అధికారులు జెమ్స్ పార్కులోని నీరవ్ మోడీ సంస్థలపై దాడులు చేసి అక్కడున్న సరుకు, వాటి లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సీబీఐ అధికారులు దర్యాప్తులో భాగంగా బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తులను అంచనా వేస్తున్న అధికారులు

హైదరాబాద్‌లో నీరవ్ మోడీ సంస్థల్లోని సరుకును స్వాధీనం చేసుకున్న ఈడీ అధికారులు వాటిని అంచనా వేస్తున్నారు. నిపుణులతో అంచనా వేయిస్తున్నారు. దిగుమతి చేసుకున్న ఈ సరుకుకు సంబంధించి ఇన్‌వాయిస్‌లోని విలువ, వాస్తవంగా దాని విలువ ఎంత ఉంటుందన్నదానిని బట్టి బేరీజు వేస్తారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఎంత అన్నది న్యాయస్థానానికి సమర్పిస్తారు.

అసలు ఉద్దేశం ఇదేనా.?

ఒక్కో వజ్రాన్ని ఒక్కో యూనిట్‌గా లెక్క కట్టి లెక్కిస్తున్నారు. ఇదిలా ఉండగా, రికార్డుల్లో చూపిస్తున్న దానికి, వాస్తవంగా ఉన్న సరుకు విలువకు పొంతన కుదరడం లేదని వార్తలు వస్తున్నాయి. పది యూనిట్లలో రూ.3100 కోట్ల విలువైన సరుకు ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా, వాస్తవంగా రూ.500 కోట్లకు మించడం లేదని తెలుస్తోంది. జెమ్స్ పార్కులోని తమ పేరిట ఉన్న స్థలాన్ని తాకట్టు పెట్టి జీవిత బీమా సంస్థ ద్వారా రుణం తీసుకున్న నీరవ్ మోడీ దిగుమతి దిగుమతి చేసుకున్న సరుకును వందల రెట్లలో పెంచి చూపించినట్లుగా తెలుసుకున్నారు.

అదే కాగితాలను మళ్లీ గ్యారెంటీగా చూపించి మళ్లీ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నాడని గుర్తించారు. నీరవ్ అసలు ఉద్దేశం వ్యాపారం చేయడం కంటే వ్యాపారం జరుగుతున్నట్లు చూపించి తప్పుడు పత్రాలతో రుణం తీసుకోవడమే కావొచ్చునని భావిస్తున్నారు.

పోలీస్ కస్టడీకి పిఎన్‌బి అధికారులు

పిఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి అరెస్టయిన ముగ్గురు బ్యాంకు అధికారులను సిబిఐ ప్రత్యేక కోర్టు వచ్చే మూడవ తేదీ దాకా పోలీస్ కస్టడీకి పంపించింది. నగరంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాడీ హౌస్ శాఖలో ఫారెక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పట్లో చీఫ్ మేనేజర్‌గా వ్యవహరించిన బిచ్చు తివారి, అదే డిపార్ట్‌మెంట్‌లో స్కేల్-2 మేనేజర్ యశ్వంత్ జోషి, ఎగుమతులు సెక్షన్ చూసుకుంటున్న స్కేల్-1 అధికారి ప్రఫుల్ సావంత్‌లను సిబిఐ సోమవారం సాయంత్రం అరెస్టు చేసింది. ప్రత్యేక జడ్జీ ఎస్.ఆర్.తంబోలి ముగ్గురిని మార్చి మూడవ తేదీ వరకు పోలీస్ కస్టడీకి పంపించారు

పీఎన్‌బీ ఉద్యోగుల ఆందోళన

రంగారెడ్డి జిల్లా రావిరాలలోని రాజీవ్ జెమ్స్ పార్క్ ముందు మంగళవారం ఆందోళనకు దిగారు పీఎన్‌బీ ఉద్యోగులు. పంజాబ్ నేషనల్ బ్యాంకు స్కామ్‌లో ఈడీ, సీబీఐ అధికారులు రాజీవ్ జెమ్స్ పార్కును సీజ్ చేయడంతో తాము రోడ్డున పడ్డామంటున్నారు. 700 మందికి పైగా కార్మికులు అందులో పనిచేస్తున్నారు. చాలా మంది వరకు దివ్యాంగులే ఉద్యోగులుగా ఉన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

నీరవ్ నిరపరాధి

- అభియోగాలకు ఆధారాల్లేవు
- పీఎన్‌బీ కేసుకు 2జీ గతే పడుతుంది
- నీరవ్ న్యాయవాది విజయ్ అగర్వాల్ ధీమా

కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న నీరవ్ మోడీ దేశం నుంచి ఎందుకు పారి పోతారంటూ ఆయన తరఫు న్యాయవాది విజయ్ అగర్వాల్ ఎదురు ప్రశ్నించారు. నీరవ్ మోడీ పారిపోయారని అందరూ అంటున్నారు. రికవరీ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు రూ.5,000 కోట్ల నుంచి రూ.6,000 కోట్లు విలువైన ఆస్తులు వదిలేసిన ఏ వ్యక్తి అయినా ఎందుకు పారిపోతారు అని మీడియాను ఆయన మంగళవారం ఎదురు ప్రశ్నించారు. అయితే తన క్లయింట్ ఆనుపానులు, ఆయన భారత్‌కు అసలు తిరిగి వస్తారా.. ఒకవేళ తిరిగి వచ్చేపక్షంలో ఎప్పుడు వస్తారు లాంటి ప్రశ్నలకు విజయ్ అగర్వాల్ బదులు ఇవ్వలేదు. కేసు ఫైలును నేను చదివాను. దీనికి కూడా 2జీ, బోఫోర్స్ లాంటి కేసులకు పట్టిన గతే పడుతుంది. ఏజెన్సీలు మీడియాలో అంతా హంగామా చేస్తున్నాయి. అవి ఈ అభియోగాలను కోర్టులో నిరూపించలేవు. నీరవ్ అపరాధిగా నిరూపితం కారని కచ్చితంగా చెబుతున్నాను అని న్యాయవాది తెలిపారు. ఎవరైనా బ్యాంక్ నగదు రికవరీ గురించి ఆందోళన చెందుతున్న పక్షంలో మొదటగా ఈడీ తాను జప్తు చేసిన నగదును బ్యాంకులో డిపాజిట్ చేయాలి అని అగర్వాల్ అన్నారు. ఈడీ రంగంలోకి వచ్చింది కాబట్టి బ్యాంకు నగదు పొందేది లేదు అని ఆయన ఆరోపించారు. తన క్లయింట్‌పై చేస్తున్న అభియోగాలను నిరూపించుకోవడానికి ఎలాంటి ఆధారం లేదు అని విజయ్ అగర్వాల్ తెలిపారు. కాగా నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ కంపెనీలకు చెందిన విపుల్ అంబానీ, నలుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను సిబిఐ అరెస్టు చేసింది.

చోక్సీ కంపెనీలపై ఐటీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేకుండానే గతంలో భారీగా లావాదేవీలు చేపట్టడానికి వినియోగించిన డొల్ల కంపెనీలపై ఐటీ శాఖ దృష్టి పెట్టింది. పత్రాలు, పటిష్టమైన ఆధారాల సేకరణకు దాడులు జరుగుతున్నాయి. 110 మందికి పైగా ఐటీ అధికారులు 20 చోట్ల దాడులు చేపట్టారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఐటీ శాఖ ఇటీవల చోక్సీ, గీతాంజలి గ్రూప్ ఇతర ఆస్తులు, బ్యాంక్ ఖాతాలను జప్తు చేసింది.

పీఎన్‌బీ ఈడీని విచారించిన సిబిఐ

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మరో తొమ్మిది సీనియర్ అధికారులను సిబిఐ మంగళవారం ప్రశ్నించింది. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలకు లబ్ధి చేకూర్చేలా రూ.11,400 కోట్ల విలువైన మోసపూరిత పూచీకత్తుల జారీపై వారిని ప్రశ్నించినట్టు అధికారులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చీఫ్ కర్నల్ సింగ్ తన ఫ్రాన్స్ పర్యటనను సైతం రద్దు చేసుకొని దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈడీ ఆరవ రోజైన మంగళవారం సోదాలు కొనసాగించింది. మోడీ, చోక్సీలకు చెందిన 13 చోట్ల జరిపిన సోదాల్లో రూ.10 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేశామని ఈడీ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు మోడీ కంపెనీలకు చెందిన ఎనిమిది మంది, గీతాంజలి గ్రూప్‌కు చెందిన 10 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను సిబిఐ ప్రశ్నించిందని అధికార వర్గాలు తెలిపాయి.

అధికారులపై చర్యకు బ్యాంకుల నిరాసక్తత

న్యూఢిల్లీ: అవినీతికి పాల్పడిన తొమ్మిది మంది అధికారులపై విచారణకు అనుమతించాలంటూ కేంద్ర విజిలెన్స్ కమిషన్(సివిసి) పదే పదే వినతులు చేసినప్పటికీ పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూకో బ్యాంక్, ఎస్‌బిఐ పట్టించుకోవడంలేనది తేలింది. సివిసి డేటా దీనిని వెల్లడించింది. నిబంధనల ప్రకారం సివిసి అభ్యర్థించిన నాలుగు మాసాల్లోగా అధికారులపై విచారణకు అనుమతిపై నిర్ణయం తీసుకోవాలి. ఐఎఎస్ అధికారులు, బ్యాంక్ సీనియర్ అధికారులను కలుపుకొని 39 అధికారులపై మొత్తం 23 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఎస్‌బిఐకి రెండు, యూకో బ్యాంక్, పిఎన్‌బిలకు చెరి ఒకటి ఉన్నాయి. ఈ బ్యాంకులకు చెందిన తొమ్మిది మంది అధికారులను అవినీతి ఆరోపణలపై సిబిఐ బుక్ చేసింది. తొమ్మిది మందిలో ఐదుగురు ఎస్‌బిఐ, ముగ్గురు యూకో బ్యాంక్, మరొకరు చీఫ్ మేనేజర్ స్థాయిలో పిఎన్‌బికి చెందిన అధికారి ఉన్నారు.

విపుల్ అంబానీ అరెస్టు

- మరో నలుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నిర్బంధం
- పీఎన్‌బీ కేసులో పురోగతి



న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణం కేసులో నీరవ్ మోడీకి చెందిన ఫైర్ స్టార్ డైమండ్ కంపెనీ ప్రెసిడెంట్(ఫైనాన్స్) విపుల్ అంబానీని సిబిఐ మంగళవారం అరెస్టు చేసింది. కేసులో ఒక ఉన్నత స్థాయి వ్యక్తిని అరెస్టు చేయడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. అంబానీ సోదరులు ముకేష్, అనిల్ అంబానీలకు విపుల్ అంబానీ బంధువు. ఆదివారం నుంచి చేస్తున్న విచారణలో సహకరించని కారణంగా విపుల్‌ను సిబిఐ అరెస్టు చేసిందని అధికారులు తెలిపారు. ధీరూబాయ్ అంబానీ స్థాపించిన రిలయన్స్ కంపెనీ పేరిట వేర్వేరు కంపెనీలను అంబానీ సోదరులు ప్రమోట్ చేస్తున్నారు. అయితే వారు నడుపుతున్న కంపెనీలకు లేదా స్వయంగా వారికి పిఎన్‌బి కుంభకోణంతో సంబంధం ఉందని కేసు దర్యాప్తు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు అనలేదు.కాగా కుంభకోణంలో దాఖలైన రెండు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి మరో నలుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను సైతం ఏజెన్సీ అరెస్టు చేసింది. రూ.6,498 కోట్ల విలువైన 150 ఎల్ఓయూలపై దాఖలైన మొదటి ఎఫ్ఐఆర్‌కు సంబంధించి అంబానీతో పాటుగా ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కవితా మన్‌కికర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ పాటిల్‌లను అరెస్టు చేశారు. ఎఫ్ఐఆర్‌లో చోటు చేసుకున్న డైమండ్ ఆర్ యుఎస్, స్టెల్లార్ డైమండ్, సోలార్ ఎక్స్‌పోర్ట్‌స్ కంపెనీలకు మన్‌కికర్ అధీకృత చేవ్రాలుదారుగా సైతం వ్యవహరిస్తున్నారు. ఈ నెల 15న నమోదైన రెండవ ఎఫ్ఐఆర్‌కు సంబంధించి నక్షత్ర గ్రూప్, గీతాంజలి గ్రూప్ సిఎఫ్ఓ కపిల్ ఖండేల్‌వాల్, గీతాంజలి గ్రూప్ మేనేజర్ నితిన్ సాహీలను సిబిఐ అరెస్టు చేసింది.

సింఘ్వీ భార్యకు నోటీసులు

న్యూఢిల్లీ: పిఎన్‌బీ కుంభకోణంలో నిందితులు నీరవ్ మోడీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీ పన్ను ఎగవేత కేసులో దర్యాప్తునకు సంబంధించి కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ భార్య అనితా సింఘ్వీకి ఆదాయ పన్ను శాఖ మంగళవారం నోటీసులు జారీ చేసింది. కొద్ది సంవత్సరాల క్రితం నీరవ్ మోడీకి చెందిన ఒక షోరూమ్ నుంచి రూ.ఆరు కోట్ల విలువైన ఆభరణాల కొనుగోలులో నగదు రూపేణా, చెక్కు రూపేణా ఎంత చెల్లించిందీ వివరించాలని నోటీసులో కోరింది. అనితా సింఘ్వీ చెక్కు రూపేణా దాదాపు రూ.1.5 కోట్లు, నగదు రూపేణా రూ.4.8 కోట్లు చెల్లించారని ఐటీ శాఖ భావిస్తోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

వేధింపుల్లో భాగంగా నోటీసులు: అభిషేక్ సింఘ్వీ

తమ కుటుంబంపై వచ్చిన అభియోగాలను అభిషేక్ సింఘ్వీ తోసిపుచ్చారు. విపక్షానికి చెందిన తనను వేధించడానికే ఈ చర్య తీసుకున్నారని ఆరోపించారు. తనపై వచ్చిన అభియోగాలన్నీ అవాస్తవాలనేని, చట్టానికి లోబడి ఐటీ నోటీసుపై స్పందిస్తానని సింఘ్వీ ట్వీట్ చేశారు. నా భార్య నగదు ద్వారా నగలు కొనుగోలు చేశారంటూ వస్తున్న అభియోగాలకు ఎవరో చేసిన కంప్యూటర్ ఎంట్రీ తప్ప మరో ఆధారం లేదు. మొత్తం రూ.1.56 కోట్లను చెక్కు ద్వారా చెల్లించడం జరిగింది. భారతదేశంలో అత్యధిక పన్ను చెల్లింపుదారు(సాక్షాత్తూ సింఘ్వీ) వద్ద రసీదులతో పద్దు చేయబడినది అని కాంగ్రెస్ నేత తెలిపారు. మొదట స్నేహంగా ఉండే మీడియాకు లీక్ చేస్తారు.. ఆ తర్వాత ఒక్కరికి మాత్రం నోటీసు ఇస్తారు అని విమర్శించారు.

కొఠారి కుటుంబంపై ఈడీ దిగ్బంధం

న్యూఢిల్లీ: రొటోమాక్ పెన్స్ ప్రమోటర్ విక్రమ్ కొఠారి, ఆయన కుటుంబ సభ్యులు దేశం వీడి పోకుండా అన్ని భూమార్గాలు, సాగర మార్గాలు, విమానాశ్రయాలను నోటిఫై చేసినట్టు ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం తెలిపింది. కేసులో ఆధారాల సేకరణకు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నోవా, కాన్పూర్ సహా అనేక చోట్ల ఈడీ సోదాలు జరిపింది. తీసుకున్న రుణ మొత్తం నిర్దేశిత ప్రయోజనానికి వినియోగించలేదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికార వర్గాలు తెలిపాయి. కొఠారి, ఆయన భార్య సాధన, కుమారుడు రాహుల్ దేశం వీడిపోకుండా ఒక లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌ఓసి)ను ఇమ్మిగ్రేషన్ అధికారులకు జారీ మరియు నోటిఫై చేసినట్టు వెల్లడించాయి.

చోక్సీ..బ్రాండ్ బాజా!



- అంతర్జాతీయ గుర్తింపు కోసం తపన
- విలాస జీవితంలో మాల్యాతో పోటీ
- బ్రాండ్ ఇమేజీ కోసం భారీగా ఖర్చు
- మేనమామ అడుగు జాడల్లో నీరవ్ తప్పటడుగులు

న్యూఢిల్లీ: ''నాకు తెలిసిన మేధావుల్లో, తెలివైన వ్యక్తుల్లో మెహుల్ చోక్సీ ఒకరు. ఆయనే నాకు మార్గదర్శకుడు'' గీతాంజలి గ్రూప్ సంస్థల చైర్మన్, తన మేమ అయిన చోక్సీ గురించి ఒకానొక సందర్భంలో నీరవ్ మోడీ చేసిన వ్యాఖ్యలివి. చోక్సీని ఆనాడు పొగడ్తలతో ముంచెత్తడానికి నీరవ్‌కు ప్రత్యేక కారణాలు ఉండివుండవచ్చని వ్యాపార సామ్రాజ్యం భావించింది. మెహుల్‌ని మేధావుల జాబితాలో చేర్చింది. కానీ, ఇప్పుడు భారీ కుంభకోణానికి తెరదీసి, సరిహద్దులు దాటివెళ్లిన నేపథ్యంలో, మామా- అల్లుళ్ల పొగడ్తల సారాంశంలోని రెండవ కోణం బహిర్గతమైంది. అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజీ సంపాదించాలన్నదే మెహుల్ లక్ష్యం. ఈ గుణమే మామను ఆదర్శంగా తీసుకునేందుకు మోడీని ప్రేరేపించి ఉండవచ్చు. చిన్ననాటి నుంచే మెహుల్ వ్యాపార సామ్రాట్ కావాలని, ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాలని కలలు కనేవాడు. అందుకు అనుగుణంగానే పట్టుదలతో ఒక్కోమెట్టు చేరుకున్నాడు. అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజీని సంపాదించాడు.

తిరోగమనం అప్పుడే మొదలైంది..

2012-13 మధ్య కేవలం వ్యాపార ప్రమోషన్స్‌కి 228 కోట్ల రూపాయలు ఖర్చు చేశారంటే బ్రాండ్ ఇమేజీ కోసం ఎంత ప్రాధాన్యం ఇచ్చారో అర్ధమవుతుంది. చోక్సీ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ లాభదాయక సంవత్సరం. దాదాపు 592 కోట్లు లాభాలను ఆర్జించాడు.

ఆ యేడాది మొత్తం ఆదాయం 16,419 కోట్లకు చేరింది. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. సంస్థ లాభాల్లో నుంచి నష్టాల బాట పట్టింది. మరుసటి యేడాది అప్పుల సమీకరణ మారింది. 5,235 కోట్ల నుంచి 8,465 కోట్లకు రుణభారం పెరిగింది. బ్రాండ్ ఇమేజీ కోసం వెచ్చించేవ్యయాలు కూడా తగ్గాయి. 2012-13తో పోల్చుకుంటే కేవలం మూడో వంతు మాత్రమే ప్రకటనల కోసం ఖర్చుచేశారు. గీతాంజలిసంస్థ ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు దాని మార్కెట్ విలువ 6000 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో ముంబై బ్రోకరేజీ సంస్థ ప్రైమ్ సెక్యూరిటీస్‌తో కలిసి షేర్ల లావాదేవీల్లో అక్రమాలకు పాల్పడ్డారని అభియోగాలు వచ్చాయి. దీనిపై మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ (సెబి) విచారణ చేపట్టింది. కుట్ర నిర్ధారణ కావడంతో దాదాపు ఆరు మాసాలు ట్రేడింగ్ నుంచి సస్పెండ్ చేసింది. ఈ సంఘటన తర్వాత కూడా గీతాంజలిలో చోటుచేసుకున్న పలు అక్రమాలు సెబీ దృష్టికి వచ్చాయి. అటు సప్లయర్లకు, ఇటు రుణదాతలకు సకాలంలో చెల్లింపులు జరపడం లేదని తేలింది. వ్యక్తిగత రుణ సంక్షోభం కారణంగానే చోక్సీ సంస్థల ఆర్థిక స్థితి ఎగుడుదిగుడులు కనిపించాయి. మూలధన నిల్వలు డొల్లగా మారాయి. అయినప్పటికీ చోక్సీ అధైర్యపడలేదు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ వచ్చాడు.

ఈ క్రమంలో బహిరంగ మార్కెట్ నుంచి మరిన్ని నిధులు సేకరించే ప్రయత్నం చేశాడు. నక్షత్ర కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయడం ద్వారా, 650 కోట్లు సమీకరించాలని గతేడాది పథకం రచించాడు.

తారస్థాయికి బ్రాండ్ ఇమేజీ

భారీ ఈవెంట్లు, తారల తళుకుబెళుకులతో ప్రత్యేక షోలు, ఫ్యాషన్ షోలు ఇమేజీ పెంచుకునే వ్యూహంలో భాగమే. అమెరికా వజ్రాల వ్యాపారదిగ్గజం బెర్నార్డ్ ఆర్నాల్ట్‌తో చోక్సీని పోల్చడం తో, తాను హారీవింట్సన్ స్థాయి ఇమేజీ భ్రమల్లోకి వెళ్లాడు నీరవ్‌మోడీ. అంతర్జాతీయ ప్రముఖులు, వ్యాపార సంస్థల అధినేతలు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, బిల్‌గేట్స్, ప్రిన్స్ చార్లెస్‌లతో కలిసి ఖరీదైన విందు, వినోద కార్యక్రమాల్లో చోక్సీ పాలుపంచుకునేవాడు. విలాసవంత జీవితంలో విజయ్ మాల్యాతో చోక్సీ పోటీపడేవాడట. గీతాంజలి జెమ్స్‌తోపాటు మాయాగిల్, నక్షత్రాస్, అస్మి వంటి అనేక మాల్స్‌ను స్థాపించాడు. తన వ్యాపార సామ్రాజ్యానికి గీతాంజలి పేరు పెట్టడం వెనుక కుటుంబ నేపథ్యం ఉంది. తన తల్లి (గీత), సోదరి (అంజలి) పేర్లను కలగలిపి జుయెల్లరీ వ్యాపారానికి గీతాంజలి అని పేరు పెట్టాడు. ప్రియాంక చోప్రా, షారుక్‌ఖాన్, కత్రినా కైఫ్, కరీనా కపూర్ వంటి బాలీవుడ్ స్టార్లను బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకున్నారు.

చోక్సీ అలియాస్ పప్పూ ..

బాల్యంలో చోక్సీకి పప్పూ అనే ముద్దుపేరు ఉండేది. ఆయన తల్లిదండ్రులకు ఆరుగురు సంతానం. మిగతా వాళ్లకంటే పప్పూది భిన్నశైలి. తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని బలంగా కోరుకునేవాడు అని చోక్సీ బాల్య మిత్రుడు అరుణ్ మర్చంట్ తెలిపాడు. చోక్సీ వాళ్ల ఉమ్మడి కుటుంబం ముక్కలు కావడంతో అతని జీవితం మలుపు తిరిగింది. 1970లో వజ్రాల వ్యాపారం మంచి జోరుమీదుంది. చోక్సీ తండ్రి చిన్నుభాయ్, అతని నలుగురు సోదరులు కలిసి గ్లోబల్ డైమండ్ ఇండస్ట్రీని స్థాపించారు. 1974 నాటికి ఇండియా మార్కెట్‌లో వాళ్లే నంబర్ వన్. వయోభారానికి తోడు, చిన్నుభాయ్‌కి చూపు మందగించడంతో ఇతరులపై ఆధారపడాల్సి వచ్చింది. అదే సమయంలో డిగ్రీ చదువుతున్న కుమారులు చేతన్, మెహుల్‌ను వ్యాపార రంగంలోకి దించాడు. ఇక్కడి నుంచి మెహుల్ దశ తిరిగింది అని అరుణ్ మర్చంట్ వెల్లడించాడు. కొద్దికాలం తర్వాత తన బాబాయిలు మెహుల్‌చోక్సీని వ్యాపారం నుంచి వేరుచేశారు. ఇక్కడే అతనికి పంతంపెరిగింది. మార్కెట్‌ను అధ్యయనం చేయడంలో మంచి నేర్పరి అయిన మెహుల్, జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య పరిణామాలను వేళ్లమీద చెప్పగలిగేవాడు. బ్రాండ్ ఇమేజీ ఎలా సంపాదించాలన్న విషయం తెలిసిన అతను, లక్ష్యాన్ని చేరాడు. ఒక వెలుగు వెలిగాడు. అయితే, ఆర్థిక ఒడిదొడుగులు, అవకతవకలను వజ్రాల తళుక్కులను మసకబారుస్తాయని బహుశా అతను ఊహించి ఉండడేమో.



రైతుల ఆదాయానికి 4 సూత్రాలు

- అన్నదాత ఆదాయం రెట్టింపే లక్ష్యంగా కేంద్రం చర్యలు
- నష్టాల ఊబి నుంచి గట్టెక్కించేలా ప్రణాళికలు
- 22వేల గ్రామీణ మార్కెట్ల ఆధునీకరణ
- పంట ఉత్పత్తి ప్రదేశాలకు 5-15 కి.మీ దూరంలోనే మార్కెట్లు
- రైతు సదస్సులో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. 2022 సంవత్సరం నాటికి అన్నదాత ఆదాయాన్ని రెండిం తలు చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రణాళికలు రచిస్తున్న మోడీ సర్కారు.. అందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు నూతన విధానాలు అనుసరించాల్సిన అవసరముందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. పాత విధానాలతో ఇది సాధ్యం కాదని స్పష్టం చేశారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసే రోడ్‌మ్యాప్ రూపకల్పనపై రెండు రోజులుగా జరుగుతున్న సదస్సులో ప్రధానమంత్రి ప్రసంగించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన సుమారు 300 మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు ప్రధానమంత్రి నాలుగు సూత్రాల ఫార్ములాను ప్రతిపాదించారు. ఇందులో భాగంగా రైతుల ఉత్పాదక ఖర్చులను తగ్గించాలని, కనీస మద్దతు ధరను పెంచాలని అన్నారు. పంట సాగులో వృథాను తగ్గించాలని, రైతులకు అదనపు ఆదాయ మార్గాలు చూపాల్సి ఉందన్నారు. ఈ కీలక అంశాలు 25 సంవత్సరాలుగా ఆగిపో యి ఉన్నాయని, వచ్చే 24 నెలలో వీటన్నింటిని సాధించేందుకు తాము ప్రయత్ని స్తామని చెప్పారు. తమ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల తో రైతుల ఉత్పాదక ఖర్చులు తగ్గుతాయని చెప్పారు.

తక్కువ వ్యయంతో ఎక్కువ లాభం

తక్కువ వ్యయంతో వ్యవసాయ ఉత్పత్తులు, ఉత్పాదాకత పెంపు, రైతుల ఉత్పత్తులు వ్యవసా య మార్కెట్లకు తరలించే క్రమం లో జరిగే వేస్టేజ్ తగ్గింపు వంటి అంశాలపై పటిష్టమన విధానాలను అవలంభించనున్నట్లు ప్రధాని పేర్కొన్నా రు. యూరియాకు నీమ్ కోటింగ్ ద్వారా ఎరువుల సామర్థ్యం మరింతగా పెంచగ లమన్న ప్రధాని... ఉత్పాదకత పెంపుకు ఊతమివ్వడం ద్వారా ఖర్చు తగ్గింవచ్చ న్నారు. భూసార హెల్త్ కార్డుల పంపిణీ ద్వారా రైతులకు ఆయా భూముల్లో ఉండే లవణాలపై అవగాహన కల్పించి ..ఏ భూమిలో ఏ పంట వేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పాదకతను పొందవచ్చో తెలియజే స్తామన్నారు.



99పథకాలకు రూ.80వేల కోట్లు

దశాబ్దాల కాలం పాటు పెండింగ్ లో ఉన్న 99 సాగుపథకాలను నిర్దిష్ట కాలంలో పూర్తి చేసేందు కు రూ. 80 వేల కేటాయించి నట్లు ప్రధాని వెల్లడించారు. వీటిలో సగం పథకాల ను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. మిగిలిన వాటి ని వచ్చే ఏడాది లో పూర్తి చేస్తా మని భరోసా ఇచ్చారు. టమో టో, ఉల్లి, ఆలు గడ్డ పంట కు మార్కెట్ సదుపాయా లను కల్పించేందు కు 2018-19 బడ్జెట్ లో ఆపరేషన్ గ్రీన్స్ ప్రకటిం చా మ న్నారు. 22వేల గ్రామీణ మార్కెట్లను అభి వృద్ధి చేసి.. పం డిన పంటకు 5-15 కి.మీ దూరంలోనే వీటి ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

11వేల కోట్ల పంట బీమాలకు క్లెయిమ్‌లు

సోలార్ విద్యుత్ ప్లాంట్ ల ద్వారా రైతులకు విద్యుత్ కష్టాలు తీరి పోయి అంచనా లను సులు వుగా అధిగ మిం చగ లుగుతార న్నారు. చెరుకు నుంచి సేకరిం చిన 10 శాతం ఇథనాల్ ను పెట్రోల్ లో కలిపేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింద న్నా రు పంట బీ మా కింద రూ. 11 వేల కోట్ల నుక్లెయిమ్ చేసిన ట్లు పునరుద్ఘా టించారు..

కాంగ్రెస్‌వి చౌకబారు రాజకీయాలు

సూరత్కాల్ (కర్నాటక): దావోస్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పక్కన పిఎన్‌బి కుంభకోణం నిందితుడు నీరబ్ మోడీ కూర్చుని ఉన్న ఫొటోని ఆధారం చేసుకుని ప్రధాని మోడీతో నీరబ్‌కి సంబంధం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం చౌకబారుగా ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా విమర్శించారు. మంగళవారం ఇక్కడ విలేకరుతో మాట్లాడు తూ, అంతర్జాతీయ సమావేశాల్లో, బహిరంగ సభల్లో పాల్గొనే అతిథుల పక్క న కూర్చునే వారంతా అతిథులతో సంబంధం ఉన్నవారనడం చౌకబారు విమర్శ అని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ విషయమై చేసిన వ్యాఖ్యను తిప్పికొడుతూ ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడై ఉండి రాహుల్ ఈ మాదిరిగా చౌకబారుగా మాట్లాడటం తగదని అన్నారు. అమిత్ షా ఇప్పుడు నేను మాట్లాడుతుండగా, మీకు కూడా తెలియని వారు ఎవరో వస్తారు, వారికీ, నాకూ సంబంధం ఉందని అనడం ఎంతవరకు న్యాయమని షా ప్రశ్నించారు.



రెండేళ్లలో 300 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

రాయపూర్: చత్తీస్ గడ్‌లో రెండే ళ్ళలో పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో 300 మందిపైగా నక్సలైట్లు మరణించినట్టు రాష్ట్ర హోం మంత్రి రామ్ సేవక్ పైక్రా తెలిపారు. ఆయన మంగళవారం రాష్ట్ర శాసన సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, ఎన్‌కౌంటర్లు ఎక్కువగా సుకుమా జిల్లాలోనే జరిగాయని అన్నారు. ఈ నెల18వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌గురించి ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకుసమాధానమిస్తూ ఆత్మరక్షణ కోసమే పోలీసులు ఎదురుకాల్పులు జరిపారని అన్నారు. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు ప్రసంగిస్తూ నక్సల్స్ ప్రాబల్య ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమా లన్నీ కాగితాలకే పరిమితమని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు భూపేష్ బగేల్, సత్యనారాయణ శర్మ ప్రభృతులు నక్సలైట్లను ఎదురుకాల్పుల పేరిట పోలీసులు కాల్చి చంపుతున్నారని ఆరోపించారు. 2016 నుంచి ఇంతవరకూ 440 ఎన్‌కౌంటర్లు జరిగాయనీ, 2160మంది మావోయిస్టు నక్సలైట్లను అరెస్టు చేశామని మంత్రి చెప్పారు.

అగ్ని-2 ప్రయోగం సక్సెస్

బాలాసోర్ (ఒడిశా): భారత సైన్యానికి మరో శక్తిమంతమైన క్షిపణి అందుబాటులోకి వచ్చింది. అణ్వస్త్రాలను మోసుకెళ్లగలిగ సామర్థ్యం గలమధ్య శ్రేణి క్షిపణి అగ్ని-2 ప్రయోగం విజయవంతమైంది. మధ్యంతర శ్రేణి క్షిపణి అగ్ని-2 పరీక్ష విజయవంత మైందని అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించా రు. ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రయోగించిన అగ్ని-2 క్షిపణి పరీక్ష విజయవంతమైందని రక్షణశాఖ అధికారులు వెల్లడించారు. ఉపరితల నుంచి ఉపరితల క్షిపణి పరీక్షను ఉదయం 8.38 ప్రాంతంలో ఇంటిగ్రేటె డ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) కాంప్లెక్స్ 4 వద్ద మొబైల్ లాంఛర్ నుంచి నిర్వహించా మన్నారు. ఆర్మీలో వ్యూహాత్మక దళాల పరీక్షల్లో భాగంగా ఈ ప్రయోగం నిర్వహించామని అధికారులు తెలిపారు. దీని బరువు 17టన్నులు ఉంటుందని, పొడుగు 20మీటర్ల ఉంటుందన్నారు. ఇది 1000 కిలోల బరువైన వార్ హెడ్‌ను మోసుకెళ్లగలదన్నారు. ఈ క్షిపణి 2,000కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను విజయవంతంగా ఛేదించగలదన్నారు. ఈ క్షిపణి భూఉపరితలం నుంచి ప్రయోగిస్తే భూమిపై ఉన్న నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదిస్తుందన్నారు. దీనిని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించింది.



ఆధిపత్యం కోసం చైనా కుయుక్తులు

- గుట్టుచప్పుడు కాకుండా ఎత్తులు
- హిందూ మహాసముద్రంలో చైనా యుద్ధనౌకలు

మాలే : మాల్దీవులు రాజకీయ సంక్షోభాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు చైనా తహతహలాడుతోంది. అంతర్గత సమస్యపై విదేశాల జోక్యం అవసరం లేదంటూ సన్నాయినొక్కులు నొక్కిన చైనా.. గుట్టుచప్పుడు కాకుండా తన పని తాను చేసుకుపో తోంది. చైనా మాల్దీవులుపై గుత్తాధిపత్యం దిశగా అడుగులు వేస్తున్నట్లుతాజా పరిణామాల ద్వారా తెలుస్తోంది. మాల్దీవులు నుంచి భారత్ ను దూరంగా ఉంచేందుకు పైకి ప్రగల్బాలు పలికిన డ్రాగన్.. తూర్పు హిందూ సముద్రంలోకి 11 యుద్ధనౌకలను చైనా తరలించినట్లు సమాచారం. ఓ భారీ యుద్ధనౌక సహా, 30వేల టన్నుల యాంఫీబియస్ ట్రాన్స్ పోర్ట్ డాక్, మూడు ట్యాంకర్లు సముద్రంలో ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఈయుద్ధ నౌకలను ఎప్పుడు త రలించారనేదానిపై సమాచారం లేదు. చైనాకు చెందిన ఓ న్యూస్ పోర్టర్ ఈ విషయాన్ని వెల్లడించినప్పటికీ ఇటు చైనా నుంచి గానీ..అటు మాల్దీవులునుంచి గానీ ఎలాంటి అధికారిక సమాచారం రాకపోవడం గమనార్హం. చైనా నుంచిమాల్దీవులకు అత్యధికపర్యాటక ఆదాయం వస్తున్న నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా పర్యాటకులకు డ్రాగన్ హెచ్చరికలు కూడా జారీ చేసింది. ముందస్తుగా చేసుకున్న మాల్దీవులు పర్యాటక ట్రిప్ లను కూడా విరమించుకోవాలని సూచించింది.



మరో నెలపాటు ఎమర్జెన్సీ

మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ సిఫార్సుపై దేశంలో ఎమర్జెన్సీని మరో 30 రోజులు పొడిగిస్తూ పార్లమెంటు తీర్మానాన్ని మంగళవారంనాడు ఆమోదించింది. ఈతీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు పార్లమెంటులో 38 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు. అయితే, దేశ రాజ్యాంగం ప్రకారం ఇలాంటి తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు 43 మంది సభ్యులు సభలో ఉండాలి. దేశాధ్యక్షుణ్ణి సమర్థిస్తున్న 38 మంది సభ్యులూ ఈ తీర్మానాన్ని ఆమోదించారు. దీంతో దేశంలో ఎమర్జెన్సీ మార్చి 22వరకూ కొనసాగనుంది. పార్లమెంటు స్పీకర్ అబ్దుల్లా మసీహ్ పార్లమెంటు నియమనిబంధనలను ఉటంకిస్తూ, ఇలాంటి తీర్మానాన్ని ఆమోదించేందుకు రాజ్యాంగంలో తగినంత సంఖ్యాబలం ఉండాలన్న స్పష్టత లేదని అన్నారు. .కాగా, తగినంత బలం లేకుండా ఈ తీర్మానాన్ని దేశాధ్యక్షుడు యమీన్ మద్దతుదారులు ఆమోదించడం, దానిని అధికారికంగా స్వీకరించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. దేశాధ్యక్షుడి ఒత్తిడికి స్పీకర్ లొంగిపోవడం దురదృ ష్టకరమని వారు అన్నారు. మాల్దీవుల డెమోక్రసీ నెట్ వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ షాహిందా ఇస్మాయిల్ మాట్లాడుతూ పదవిలో కొనసాగడం కోసం యమీన్ ప్రజాస్వామ్య విలువలకు పాతర వేశారని విమర్శించారు.

పాక్ మాజీ క్రికెటర్ కుమారుడు ఆత్మహత్య

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ క్రికెటర్ ఆమిర్ హనీఫ్ కుమారుడు మహ్మద్ జర్యాప్ ఆత్మహత్య చేసుకున్నాడు. అండర్-19 క్రికెట్ టీమ్ లో తనకు చోటు దక్కలేదని జర్యాప్ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న జర్యాప్.. గతంలోని అండర్-19కు సెలక్టై జనవరి లో కరాచీ తరపున లాహోర్ లో జరిగిన టోర్నమెం ట్ లో ఆడాడు. అయితే గాయం కారణం గా సెలక్టర్లు అతన్ని ఇంటికి పంపారు. తాజాగా ప్రకటించిన టీమ్ లో తనకు చోటు దక్కకపోవడంతో జర్యాప్ తీవ్ర మనస్తాపం చెందినట్లు అతడి తండ్రి హనీఫ్ ఆవేదన చెందారు. కోచ్ లో వ్యవహార శైలితోనే తన కుమారుడు బలయ్యాడని ఆరోపించారు. క్రికెట్ లో ఇలాంటి వాతావరణం మారకుంటే మరికొంత మంది బలవన్మరణాలను పాల్పడవచ్చని ఆవేదనను వెల్లగక్కాడు.

బలూచ్ మిలిటెంట్లతో చైనా చర్చలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ లోని బలూచిస్తాన్ మిలిటెంట్లతో చైనా చర్చలు జరిపేందుకు సిద్ధమైంది. పాకిస్తాన్ తో కలిసి చైనా -పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ నిర్మిస్తున్న నేపథ్యంలో మిలిటెంట్ల నుంచి అవాంతరాలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు ప్రారంభించారు. దాదాపు 39 వేల కోట్లతో మూడు వేల కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఆర్థిక కారిడార్ లో రైల్వే లైన్లు, రోడ్ల నిర్మాణంతో పాటు పైప్ లైన్లు, ఆప్టికల్ కేబుల్ ఫైబర్ నెట్ వర్క్ వేయాలని చైనా భావిస్తోంది. చైనాలోని గ్జియాంగ్ నుంచి పాకిస్తాన్ లోని గ్వాదర్ పోర్టువరకు నిర్మిస్తున్న సీపెక్ కు మిలిటెంట్ల దాడుల వల్ల నష్టం కలగకూడదని చైనా చర్చలకు వెళ్తోంది.

సరిహద్దుల్లో చైనా వాయుసేన



బీజింగ్: భారత్ సరిహద్దుల్లో వాయుసేన భద్రతను చైనా మరింత మెరుగుపరుస్తోంది. భారత్ నుంచి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భద్రతను బలోపేతం చేస్తున్నట్లు చైనా అధికారులు పేర్కొన్నారు. జే-10, జే-11 యుద్ధ విమానానికి సంబంధించిన కొన్ని ఫోటోలను చైనా మిలిటరీ విడుదల చేసింది. ఇటీవల జే-20 యుద్ధ విమానాన్ని ఆర్మీకి అందజేసిన చైనా సరిహద్దు భద్రతపై ఫోకస్ పెట్టింది. వెస్టర్న్ థియేటర్ కమాండ్ బలాన్ని మరింతగా మెరుగు పరచి సరిహద్దు దేశాల వద్ద భద్రతను పెంచేందుకు చైనా కొన్నాళ్లుగా చర్యలు చేపట్టింది. వివిధ దేశాలతో చైనా 3వేల 488 కి.మీ అసలైన నియంత్రణ రేఖ సరిహద్దు కలిగి ఉంది. ఈ నేపథ్యంలో సరిహద్దు రేఖ వెంబడి భద్రతను పెంచుతున్నారు. డొక్లామ్ వివాదం సమిసిపోయిన తర్వాత భారత్- చైనా ఒప్పందాలను పునః ప్రారంభించాలని భావిస్తున్న తరుణంలో డ్రాగన్ తన భద్రతను సమీక్షించుకుంటోంది.

ఢిల్లీ సీఎస్‌పై ఆప్ ఎమ్మెల్యేల దాడి

- సెక్రటేరియట్లో మంత్రిని ఘెరావ్ చేసిన ఉద్యోగులు
- అర్బన్ నక్సలిజంగా వర్ణించిన బీజేపీ
- రాజ్యాంగ సంక్షోభమన్న కాంగ్రెస్
- ఆరోపణలు నిరాధారమన్న సీఎం కేజ్రీవాల్
- లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఐఏఎస్ అధికారుల సంఘం భేటీ

న్యూఢిల్లీ: సీఎం కేజ్రీవాల్ ఇంట్లో ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడిచేశారని ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం ఇంట్లో జరుగుతున్న సమావేశంలో ఆప్ ఎమ్మెల్యేలు తన పట్ల అనుచితంగా ప్రవర్తించి దాడి చేశారని సీఎస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ ఉద్యోగిపై దాడి, బెదిరింపులు, అక్రమ నిర్బంధం, ఉద్యోగ నిర్వహణలో విధులను అడ్డుకోవటం తదితర ఆరోపణలపై కేసు నమోదు చేశామని, ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)ను అనుసరించి పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశామని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ఇదిలా ఉండగా సీఎం కార్యాలయం ఈ వివాదంపై స్పందిస్తూ ఆప్ ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలును ఖండించారు. అవన్నీ నిరాధారమైన ఆరోపణలు అన్నారు. సీఎస్ ప్రకాశ్‌ను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రచురితం కాని ప్రకటనల విషయంపై మాట్లాడేందుకు పిలిచారని సీఎం కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఆప్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రేషన్ విషయంపై చర్చించేందుకే పిలిచామని తెలిపారు.

ఉద్యోగులు స్వేచ్ఛగా పని చేయాలి

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ఎటువంటి భయ భ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛాయుతంగా పనిచేయాలని, ఇందుకు అనువైన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించాలని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అనుష్ ప్రకాశ్‌పై ఆప్ ఎమ్మెల్యే దాడిని ఖండిస్తూ ఢిల్లీ అధికారుల బృందం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఢిల్లీ సీఎస్‌పై వ్యక్తిగత దాడికి పాల్పడటంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధికారుల బృందం రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడుత్తూ ఢిల్లీ చీఫ్ సెక్రటరీపై ఆప్ ఎమ్మెల్యేల దాడి తనకు బాధ కలిగించిందని, ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి భయంలేకుండా హుందాగా పనిచేసేలా ప్రభుత్వం వ్యవహరించాలని ట్వీట్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి హోంశాఖకు ఈ ఘటనపై నివేదిక అందిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రిని ఘెరావ్ చేసిన ఉద్యోగులు

సెక్రటేరియట్‌లో సుమారు వందమంది ఉద్యోగులు, సిబ్బంది ఢిల్లీ పర్యావరణ మంత్రి ఇమ్రాన్ హుస్సేన్‌ను ఘెరావ్ చేశారు. చీఫ్ సెక్రటరీపై దాడి జరిగిందని తెలియటంతో ఉద్యోగులంతా మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మంత్రి తన కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం పోలీసు ఎస్కార్టుతో మంత్రి తన కార్యాలయానికి చేరుకున్నారు.



ఉద్యోగులపై మంత్రి ఇమ్రాన్ ఫిర్యాదు

ఉద్యోగులు తనను ఉద్యోగులు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్న విషయంపై మంత్రి ఇమ్రాన్ మాట్లాడుతూ తనను అడ్డుకున్నవారంతా ఉద్యోగులో కాదో తనకు తెలియదన్నారు. కానీ వారిని గుర్తుపట్టగలను అన్నారు. కాగా ఈ ఘటనపై తనపై దాడి జరిగిందని ఆయన ఉద్యోగులపై ఐపి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే ఢిల్లీ ప్రభుత్వోద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ దీపక్ భరద్వాజ్ మాట్లాడుతూ మంత్రి ఇమ్రాన్ హుస్సేన్ వ్యాఖ్యలను ఖండించారు. మంత్రి రాగానే ఉద్యోగులు నినాదాల చేసి నిరసన వ్యక్తం చేశారని, ఎవరూ ఆయనపై దాడిచేయలేదన్నారు.

సీఎస్‌పై దాడిని ఖండించిన ప్రతిపక్షాలు

ఢిల్లీ చీఫ్ సెక్రటరీపై దాడిని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖండించాయి. సీఎస్‌పై దాడిని అర్బన్ నక్సలిజంగా బీజేపీ వర్ణించింది. ఈ ఘటనపై వెంటనే సీఎం కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. కాగా ఈ సంఘటనపై కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ పరిపాలన, రాజ్యాంగ సంక్షోభంగా వర్ణిస్తూ ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. కాగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు.


కమల్ పార్టీ ఆవిర్భావ సభకు కేజ్రీవాల్



చెన్నై: ప్రముఖ నటుడు కమల్‌హాసన్ మధురై వేదికగా నేడు కొత్త రాజకీయ పార్టీ ప్రకటించనున్నారు. కమల్ కొత్త పార్టీ ఆవిర్భావ సభకు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ కానున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కమల్‌హాసన్ సన్నిహితులు వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ నేతలు రానుండడంతో తమిళనాట రాజకీయ సందడి నెలకొంది. ఇప్పటికే పశ్చిమబెంగాల్ సీఎం మమత సహా పలువురు కమ్యూనిస్టు నేతలను పార్టీ ఆవిర్భావ సభకు ఆహ్వానించిన సంగతి విదితమే. అయితే, కమల్ రాజకీయాల్లోకి రావాలంటూ గతేడాది సెప్టెంబర్‌లోనే కేజ్రీవాల్ పిలుపునిచ్చిన సంగతి విదితమే. రానురాను దేశంలో అవినీతి, మతోన్మాదం మరింత పెచ్చరిల్లుతున్నాయని, వాటిని రూపుమాపేందుకు భావసారూప్యత ఉన్న నాయకులంతా ఒక్కటై ముందుకు పోవాలని అప్పట్లో కోరారు. ఇదిలా వుండగా, పార్టీ ఆవిర్భావం అనంతరం కమల్ చేపట్టబోయే ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేడుసాయంత్రం 6 గంటలకు పార్టీ పేరు ప్రకటించి, పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. అక్కడి నుండి నేరుగా రామేశ్వరం వెళ్లి మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం సమాధిని సందర్శించుకోనున్నారు. అనంతరం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కమల్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నట్లు సమాచారం.

రేపిస్టులను కొట్టిచంపిన స్థానికులు

అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘటన



ఇటానగర్(అరుణాచల్‌ప్రదేశ్): చిన్నారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఇద్దరిని స్థానికులు కొట్టి చంపిన షాకింగ్ ఘటన అరుణాచల్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. వాక్రో సర్కిల్‌లోని నామ్‌గో గ్రామంలో ఓ చిన్నారిని ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. ఐదు రోజుల అనంతరం సమీపంలోని టీ గార్డెన్‌లో నగ్నంగా చిన్నారి శవం లభ్యమైంది. పోస్టుమార్టంలో బాలిక పైశాచికంగా అత్యాచారానికి గురైనట్టు తేలింది. ఘటనపై ప్రజా సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అసోంకు చెందిన వలస కూలీలు సంజయ్ సబర్ (30), జగదీష్ లోహర్(25)గా గుర్తించి, వారిని అరెస్టు చేశారు. అయితే, ఈ ఘటనపై ఆగ్రహంతో ఉన్న నామ్‌గో గ్రామస్తులు నిందితులు తేజూ పోలీసు స్టేషన్‌లో ఉన్న విషయం తెలుసుకుని సుమారు 400 నుంచి 1000 మంది కర్రలతో ఒక్కసారిగా స్టేషన్‌పై దాడిచేశారు. వారిని పోలీసులు అడ్డుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఇద్దరు నిందితులను బయటకు లాక్కొచ్చి నగ్నంగా మార్చి, ఆపై రాళ్లు, కర్రలతో కొట్టి చంపేశారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి ప్రేమ ఖండూ ఖండించారు. ఘటనకు సంబంధించి ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ప్రభుత్వం మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. అయితే, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఒకరోజు ముందు ఈ ఘటన జరగడం విచారించదగ్గ విషయం.

పాక్ స్మగ్లర్ల పనిపట్టిన బీఎస్ఎఫ్ జవాన్లు

- 10 కేజీల మాదక ద్రవ్యాలతో ఎదురైన స్మగ్లర్లు

అమృత్‌సర్(పంజాబ్): పంజాబ్‌లోని భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లో ఓ మాదక ద్రవ్యాల స్మగ్లర్‌ను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) మట్టుబెట్టింది. ఆయుధాలు, మందుగుండు సామాగ్రితోపాటు 10 కేజీల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసు కుంది. ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లోని బర్రెకే స్థావరం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సరిహద్దు భద్రతా దళం, పంజాబ్ పోలీసు శాఖకు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ పాకిస్థాన్ నుంచి మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారులు, చొరబాటుదారులు అక్రమంగా ప్రవేశించడాన్ని నిరోధించేందుకు బీఎస్ఎఫ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కలిసి కృషి చేస్తున్నాయన్నారు. అయితే, మంగళవారం తెల్లవారుఝామున స్మగ్లర్లు మన దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించినప్పుడు గస్తీ స్థావరం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హెచ్చరించారని, వెంటనే అటువైపు నుంచి కాల్పులు మొదలయ్యాయని తెలిపారు.



క్రీడాప్రభ

ఐసీసీ ర్యాంకింగ్స్ - అగ్రస్థానాల్లో

కోహ్లీ, బుమ్రా

టెస్టులు, వన్డేల్లో 900 పాయింట్లు దాటిన కోహ్లీ



దుబాయ్: భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రపంచ క్రికెట్‌లో రికార్డును సృష్టించాడు. టెస్టుల్లో, వన్డే మ్యాచుల్లో కోహ్లీ ఉమ్మడిగా 900 పాయింట్ల మార్క్‌కు చేరుకున్న రెండో బ్యాట్స్‌మన్‌గా క్రికెట్ చరిత్రలో చోటు సంపాదించాడు. కాగా వన్డే బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా, ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్‌ఖాన్‌తో కలిసి అగ్ర భాగాన ఉన్నాడు. కోహ్లీ కంటే ముందు దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ ఎబి డివిల్లియర్స్ ఈ రెండు ఫార్మాట్లలో 900 పాయింట్లను సాధించాడు. మొత్తం క్రికెట్ చరిత్ర పరంగా చూస్తే కోహ్లీ వెస్టిండీస్ బ్యాట్స్‌మన్ బ్రియన్ లారాను దాటిపోయాడు. టెస్టుల్లో గత నెలలోనే లారాను అధిగమించాడు. వన్డేల్లో ఆల టైమర్స్ రికార్డుల్లో కోహ్లీ ఏడవ స్థానంలో ఉండగా, వివియన్ రిచర్డ్స్ 935 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉన్నాడు. వన్డేల్లో సచిన్ టెండూల్కర్ 1988లో జింబాబ్వేపైఆడుతూ సాధించిన 887 పాయింట్ల రికార్డును కోహ్లీ ఈ పర్యటనలో 12 పాయింట్ల తేడాతో అధిగమించాడు. అదేవిధంగా టెస్టుల్లో లారా 1993లో సాధించిన 911 పాయింట్లను కూడా కోహ్లీ అధిగమించాడు.

బౌలింగ్ విభాగంలో..

బౌలర్లలో వన్డే మ్యాచ్ విభాగంలో పేస్ బౌలర్ బుమ్రా, ఆఫ్ఘనిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్‌తో కలిసి అగ్ర స్థానాన్ని పంచుకుంటున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో చాహల్, యాదవ్‌లు కూడా తమ ర్యాంకులను మెరుగు పరుచుకున్నారు. లెగ్ స్పిన్నర్ చాహల్ 20 స్థానాలు ఎగబాకి 8వ స్థానంలో ఉండగా చైనామన్ యాదవ్ ఏకంగా 41 స్థానాలు ఎగబాకి 15కు చేరుకున్నాడు. బుమ్రా రెండు స్థానాలు మెరుగుపడి అగ్రస్థానానికి చేరాడు. టెస్టుల్లో ఇంగ్లండ్ బౌలర్ జేమ్స్ అండర్సన్ అగ్ర స్థానంలో ఉండగా, రబాడా రెండో స్థానంలో, రవీంద్ర జడేజా మూడో స్థానంలో ఉన్నాడు. అశ్విన్ ఐదో స్థానంలో ఉన్నాడు. టీ20ల్లో న్యూజిలాండ్ బౌలర్ మైఖేల్ సాంటెర్ అగ్ర స్థానంలో ఉండగా ఆఫ్ఘన్ బౌలర్ రషీద్ ఖాన్ రెండో స్థానంలో, న్యూజిలాండ్‌కు చెందిన ఐష్ సోదీ మూడో స్థానంలో, జస్ప్రీత్ బుమ్రా నాలుగో స్థానంలో ఉన్నాడు.

ఆల్ రౌండర్ విభాగంలో: బంగ్లాదేశ్‌కు చెందిన ఆల్ రౌండర్ షాకిబ్ అల్ హసన్ అన్ని ఫార్మాట్లలో అగ్ర భాగాన ఉన్నాడు. టెస్టుల్లో మన ఆటగాళ్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు వరుసగా 3,4 స్థానాల్లో ఉన్నారు.



కోహ్లీ పాయింట్లు

టెస్టుల్లో	వన్డేల్లో	టీ 20ల్లో
912	909	776

నేడు రెండు టీ20లు

కోహ్లీ, కౌర్ సేనలు సిద్ధం

సా. 4 గం. నుంచి సోనీ టెన్ 1,3 ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం

బదులు తీర్చుకుంటాం

హర్మన్ ప్రీత్ కౌర్





సెంచూరియాన్: మూడో టీ20లో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవాలన్న కసితో భారత మహిళా క్రికెట్ జట్టు నేటి టీ20 మ్యాచ్‌కు సిద్ధమైంది. ఒక్క మ్యాచ్‌ను గెలిస్తే భారత జట్టు ఒక పర్యటనలో దక్షిణాఫ్రికా గడ్డపై రెండు సిరీస్‌లు గెలిచిన ఘనతను మూటగట్టుకుంటుంది. భారత్ ఇప్పటికే వన్డే సిరీస్‌ను2-1 తేడాతో గెలుచు కుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి రెండు టీ20లు గెలిచి2-1 ఆధిక్యంతో ఉంది. కాగా దక్షిణా ఫ్రికాకు కూడా ఈ సిరీస్ గెలిస్తే ఆ జట్టుకు ఈ విజయం ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఆస్ట్రేలియాలో టీ20 సిరీస్ గెలిచిన తర్వాత దక్షిణాఫ్రికా అమ్మాయిలు సిరీస్ గెలిచిన దాఖలాలు లేవు. అయితే అది అంత సుళువుకాదని పరిశీలకులు అంటున్నారు. కౌర్ సారథ్యంలోని జట్టు మూడో మ్యాచ్ ఓటమినుంచి పుంజుకుంటుందని ఆశిస్తున్నారు. కౌర్, మంధాన మెరుపు ఇన్నింగ్స్‌లతో మళ్లీ మెరిస్తే, మిథాలి రాణించి, పూనం యాదవ్, పూజా, అంజు పాటిల్, శిఖా పాండేలు రెచ్చిపోతే భారత్ గెలుపు ఖాయం. భారత క్రీడాకారిణులు తమ వంతు పాత్రను పోషిస్తే సరిపోదు. మ్యాచ్ గెలవాలన్న తపనతో బరిలోకి దిగాలని కెప్టెన్ కౌర్ ఆశిస్తోంది. ఈ మ్యాచ్ గెలిస్తే చివరి టీ20లో తమపై ఒత్తిడి తగ్గించుకోవచ్చన్న బావనతో కౌర్ సేన ఉంది. మరోవైపు కెప్టెన్ నెయ్‌కెర్క్ నేతృత్వం లో దక్షిణాఫ్రికా జట్టు ఈ మ్యాచ్‌తోపాటు చివరి టీ20ను కూడా గెలిచి సిరీస్ దక్కించుకోవాలని ఆశిస్తోంది. మూడో టీ20లో సఫారీల బౌలర్లు భారత్‌ను కట్టడి చేశారు. ఇస్మాయిల్ పొట్టి ఫార్మాట్‌లో 30 పరుగులకు 5 వికెట్లు తీసి అత్యుత్తమ రికార్డును నమోదు చేసింది. అంతేకాక వారు లక్ష్యాన్ని మరో ఆరు బంతులు మిగిలిఉండగానే ఛేదించారు. చోలోయి ట్రైయాన్ 15 బంతుల్లో 34 పరుగులతో భారత బౌలర్లపై దాడిచేసింది. ట్రైయాన్ ఇదే ఊపును నేటి మ్యాచ్‌లోను కొనసాగించాలని కెప్టెన్ నెయికెర్క్ ఆశిస్తోంది.



ఈ ఏడాది నేను నెంబర్ వన్ అవుతా



ముంబై: తనకు ఈ ఏడాది అత్యంత ప్రాధాన్యతకూడిన సంవత్సరంగా మిగిలిపోతుందని భారత షట్లర్ పివి సింధు అంది. బ్రిడ్జ్ స్టోన్ ఇండియా సంస్థ ప్రచార కర్తగా వ్యవహరిస్తున్న సింధు మంగళవారం సంస్థ ఏర్పాటు చేసిన ఈవెంట్లో పాల్గొంది. అనంతరం మీడియాతో ముచ్చటిస్తూ '2018 సంవత్సరం నాకు అత్యంత ప్రధానం. ఈ ఏడాదిలో ఆల్ ఇంగ్లండ్ (ఛాంపియన్‌షిప్స్ ఇన్ బర్మింగ్ హాం)టోర్నీ, కామన్వెల్త్, ఆసియన్ గేమ్స్‌లున్నాయి. ఒకసారి ఒక టోర్నీలో పాల్గొనాలని నేను అనుకుంటున్నాను. ఈ ఏడాది చివరినాటికి నంబర్ 1 స్థానంలో ఉండాలని కోరుకుంటున్నా' అని సింధు తెలిపింది. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం గెలుచుకున్న సింధు దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్లో వెంట్రుక వాసిలో స్వర్ణాన్ని జపాన్ క్రీడాకారిణి అకెని యమగుచికి కోల్పోయింది. యమగుచి 21-15,12-21, 19-21 తేడాతో సింధును ఓడించింది. ఈ ఓటములపై సింధు వ్యాఖ్యానిస్తూ.. 'ఫైనల్స్‌లకు చేరడం నాకు సంతోషాన్ని చ్చింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్, దుబాయ్, ఇండియన్ ఓపెన్‌లో కొన్ని గెలవాల్సిన మ్యాచ్‌ల్లో ఓడిపోయిన ఘటనలు నాకు బాధ కల్గించాయి. నా తప్పులనుంచి సరిదిద్దుకొని మరింత నేర్చుకోవాల్సి ఉంది' అని అంది. ఆడాలంటే శారీరకంగా, మానసికంగా ఆరో గ్యంగా ఉండాల్సి ఉంటుంది. అనారోగ్యంతో ఆడటం అసంభవం. ఏడాదికి ఒక క్రీడాకారుడు లేదా క్రీడాకారిణి 15 టోర్నీలను తప్పనిసరిగా ఆడాలని నిబంధన ఉంది. షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించారని సింధు పేర్కొంది. ఆటలో గెలుపోటములు నిర్ణయించే పాయింట్ల పద్ధతిలో 11 పాయింట్లకు కాకుండా 21 పాయింట్ల పద్ధతే తనకు ఇష్టమని సింధు తెలిపింది.

ఒకేసారి 15మందితో చెస్ ఆట

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఐటీ సదస్సులో పాల్గొంటున్న పలు అంతర్జాతీయ, దేశీయ కంపెనీలు సీఈవోలు ఒకే వ్యక్తితో చదరంగం ఆడి సందర్శకులకు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. మంగళవారం సదస్సు భోజన విరామం అనంతరం 15 మంది సీఈవోలు ఆంగ్ల అక్షరం సి ఆకారంలో కూర్చొని పైగా సిస్టమ్స్ సీఈవో అలాన్ ట్రెఫ్లర్‌తో చదరంగం ఆడటం అందరిని ఆకట్టుకుంది. సదస్సులో పాల్గొంటున్న ఇతర సీఈవోలు, ఐటీ సంస్థల ప్రతినిధులు ఆటను తిలకించారు.



పాక్ అండర్-19 క్రికెటర్ ఆత్మహత్య



కరాచి: పాకిస్తాన్‌కు చెందిన అండర్-19 క్రికెట్ జట్టు ఆటగాడు మహ్మద్ జార్యబ్ ఆత్మహత్య చేసుకున్నాడు. తన కోచ్‌లతో వివాదాలు, జట్టుకు ఎంపిక కాక పోవడం వంటి సమస్యలతో మానసికంగా కుంగిపోయిన జార్యబ్ మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై జార్యబ్ తండ్రి ప్రముఖ క్రికెటర్ ఆమీర్ హనిఫ్ మీడియాకు తెలుపుతూ.. గత రాత్రి జార్యబ్ తమతో రాత్రి భోజనం చేశాడని.. ఆ సమయంలో జార్యబ్ కుంగిపోయి కన్పించాడన్నాడు. క్రికెట్లరు పనికిరానివారు. వారితో ఎటువంటి ప్రయోజనం లేదని జార్యబ్ ఆ సమయంలో అన్నాడని వెల్లడించాడు. జార్యబ్ ఈ మాటలు ఎందుకంటున్నాడో అన్న విషయాన్ని తాను పట్టించుకోలేదని బాధ పడ్డాడు. ఈ రోజు ఉదయం తన కొడుకు ఆత్మహత్యతో విషయం అర్థమైందన్నాడు. కొన్ని నెలలుగా కోచ్‌లు తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదని జార్యబ్ తనకు చెపుతుండెడివాడని హనిఫ్ గుర్తు చేసుకున్నాడు. రెండు నెలల క్రితం కరాచి జూనియర్ జట్టులో సభ్యుడిగా జార్యబ్ లాహోర్ వెళ్లగా కోచ్‌లు భుజానికి గాయంను సాకుగా చూపి వెనక్కి పంపారని హనిఫ్ వెల్లడించారు. ఆ గాయం అంత తీవ్రమైందని కాదని చెప్పినప్పటికి వారు ఒప్పుకోలేదని జార్యబ్ తనముందు వాపోయాడని హనిఫ్ తెలిపారు. యువ క్రికెటర్లు క్రికెట్‌లాగానే ఆస్వాధించాలని ఆత్మహత్యలు చేసుకోవద్దని హనిఫ్ పేర్కొన్నాడు. కాగా, ఈ ఘటనపై బాధిత కుటుంబం తమకు ఇప్పటివరకు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఆత్మహత్య కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

సిరీస్‌పై కన్నేసిన భారత్

టీ20 సిరీస్ గెలుపుకు మరో మ్యాచ్ దూరంలో కోహ్లీ సేన ఉండగా.. వన్డే సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా టీ20 సిరీస్‌ను దక్కించుకోవాలని సర్వ శక్తులను ఒడ్డుతోంది. సిరీస్‌పై తమ ఆశలు సజీవంగా ఉంచుకోవడానికి నేటి మ్యాచ్‌ను గెలిచితీరాలన్న పట్టుదలతో డుమిని సారథ్యంలోని జట్టు ఉరకలేస్తోంది. ఇరు జట్లకు వ్యూహాత్మకంగా మారిన ఈ మ్యాచ్ ఫలితం ఎలావుంటుందో వేచి చూడాల్సిందే

వ్యూహం మార్చాం : డుమిని

సెంచూరియాన్: కోహ్లీ సేన మరో సిరీస్ విజయా నికి సన్నద్ధమయింది. నేడు ఇక్కడి సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో జరుగనున్న టీ20 మ్యాచ్ కు ఉరకలేస్తోంది. మూడు టీ20 అంతర్జాతీయ వ్యాచ్‌ల సిరీస్‌లో తొలి వ్యాచ్‌ను గెలిచి 1-0 ఆధిక్యంలో ఉన్న భారత్ ఇంకో మ్యాచ్ గెలిస్తే సిరీస్ గెలిచినట్లే. సొంత గడ్డపై భారత్‌కు వన్డేల్లో తొలి సిరీస్ విజయాన్ని అందించిన దక్షిణాఫ్రికా టెస్టుల్లో కొంచెం కష్టంతో సిరీస్‌ను 2-1 తేడాతో దక్కించుకున్నప్పటికి.. ఇటు టీ20ల్లో పేలవమైన ఆరంభాన్ని చేసింది. సఫారీలు పన్నిన వ్యూహాన్ని భారత ఆటగాళ్లు అవలీలగా ఛేదించారు. భారత బ్యాట్స్‌మన్లు షార్ట్‌పిచ్ బంతులు ఎదుర్కోలేరన్నవిషయాన్ని పసిగట్టిన సఫారీలు తమ బౌలర్లకు వాటినే సంధించాలని కెప్టెన్ డుమిని సూచించాడు. అయితే డుమిని వ్యూహం విఫలమైంది. షార్ట్‌పిచ్ బంతులను భారత బ్యాట్స్‌మన్లు ఎదుర్కొన్న తీరు అబ్బుర పర్చింది. శిఖర్ ధావన్ దక్షిణాఫ్రికా బౌలర్లను తారెత్తించాడు. 39 బంతుల్లో 72 పరుగులు చేయగా, రోహిత్ శర్మ ఎక్కువసే పు బ్యాటింగ్ చేయనప్పటికి ఆడిన 9 బంతుల్లో 21 పరుగులు చేశాడు. కోహ్లీ 20 బంతుల్లో 26 పరుగులు, పాండే 27 బంతుల్లో 29 పరుగులు చేసి దక్షిణాఫ్రికా బౌలర్లకు చెక్ చెప్పారు. ఇక మిగిలిన రెండు టీ20ల్లో భారత్ బ్యాట్స్‌మన్లే కాక, బౌలర్లు రెచ్చిపోతారనటంలో ఎలాంటి సందేహం లేదు. మరోవై పు డుమిని సారథ్యంలోని సఫారీల జట్టు టీ20 సిరీస్‌ను ఎలాగైనా దక్కించుకోవాలని తాపత్రయపడుతోంది. వన్డే సిరీస్‌లో జరిగిన పరాభవానికి బదులు తీర్చుకోవాలని భావిస్తోంది.

సిరీస్ గెలిస్తే ఐసీసీ ర్యాంక్ మెరుగు

ఒకవేళ కోహ్లీ సేన టీ20 సిరీస్‌ను 3-0 ఆధిక్యంతో సొంతం చేసుకున్నట్లైతే టీ20 ఐసీసీ ర్యాంకింగ్‌ల్లో భారత్ మూడు నుంచి రెండో స్థానానికి ఎగబాకుతుంది. తొలి స్థానంలో పాకిస్తాన్ ఉంది. ముక్కోణప టీ20 మ్యాచ్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల మధ్య నేడు జరుగనున్న ఫైనల్లో ఆస్ట్రేలియా గెలిస్తే.. భారత్ ర్యాంకులో మార్పు ఉండదు. ప్రస్తుతం ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉండగా న్యూజిలాండ్ నాలుగో స్థానంలో ఉంది. వెస్టిండీస్ ఐదవ స్థానం, ఇంగ్లండ్ ఆరవ స్థానం, దక్షిణాఫ్రికా ఏడవ స్థానంలో ఉంది.

కోహ్లీ ఫిట్‌నెస్ ఓకే

జొహన్నెస్‌బర్గ్‌లో తొలి టీ20 మ్యాచ్ ఆడుతున్న సందర్భంగా భారత కెప్టెన్ కోహ్లీకి ఎడమ కాలి తొడ కండరానికి గాయమయింది. జట్టు మేనేజ్‌మెంట్ మాత్రం ఇది అంతగా పట్టించుకోవాల్సిన అంశం కాదని, నేటి మ్యాచ్‌లో బరిలోకి దిగుతాడని పేర్కొన్నారు. సిరీస్‌ను గెలిచి కేప్‌టౌన్‌లో జరుగనున్న చివరి టీ20లో ఆడకుండా రెస్ట్ తీసుకుంటాడని పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు వచ్చే మూడునెలలు భారత జట్టుకు బిజీ షెడ్యూలు ఎదురుచూస్తోంది. డర్బన్‌లో తొలి వన్డే ఆడుతున్న సమయంలో ఫీల్డింగ్‌చేస్తూ కోహ్లీ మోకాలు నొప్పితో బాధపడ్డాడు. అయితే అనంతర మ్యాచ్‌లో నొప్పిని లెక్కచేయకుండా ఆడి శతకాన్ని నమోదు చేశాడు. ఆట ఒత్తిడితో మరోసారి కూడా ఈ నొప్పులు తిరగబెట్టే అవకాశముండటంతో కోహ్లీ చివరి టీ20 కి దూరంగా ఉండేందుకే మొగ్గు చూపుతాననడంలో సందేహంలేదు. ఒకవేళ గాయం కారణంగా కోహ్లీ నేటి మ్యాచ్‌కు దూరమైతే కె ఎల్ రాహుల్ తుది 11 మందిలోకి రావొచ్చు. తొలి మ్యాచ్‌లో మనీష్‌పాండేకు స్థానం ఇవ్వడానికి రాహుల్ పక్కన ఉండాల్సి వచ్చింది. అయితే ఈ మార్పు జరుగకపోవచ్చు, గత మ్యాచ్‌లో ఉన్న జట్టే నేటి మ్యాచ్‌లో కొనసాగే అవకాశముంది. ఆటగాళ్లను పదేపదే మార్చడం వారి కెరియర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని ఇటీవల కోహ్లీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.


పిచ్ స్లో..

ఈ పర్యటనలో సూపర్‌స్పోర్ట్ పిచ్‌పై బంతి నెమ్మదిగానే కదిలింది. నేటి మ్యాచ్‌లో కూడా అదే రీతిగా ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో భారత్ స్పిన్నింగ్ ద్వయం చాహల్, యాదవ్‌లను మరోసారి ఉపయోగిస్తుందని చెప్పవచ్చు. ఈ పర్యటనలో ఆడటానికి అవకాశంరాని అక్సర్ పటేల్‌కు ఈసారి అవకాశం రావచ్చని పరిశీలకులు అంటున్నారు. సురేష్‌రైనా మళ్లీ మూడో వికెట్‌గా బరిలోకి దిగుతాడా అన్నది సందేహమే.. జొహన్నెస్‌బర్గ్‌లో అక్కడి పిచ్ కండిషన్‌ను బట్టి 200 పరుగులు చేయవచ్చని భావించిన కోహ్లీ రైనాను మూడో వికెట్‌గా పంపాడు. తాను నాలుగు వికెట్‌గా బరిలోకి దిగాడు. భారత్ ఆందోళన పడుతున్న అంశమేమిటంటే దిగువ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు కుదురుగా ఆడకపోవడం. పొట్టి ఫార్మాట్లో ధోనిపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు ధోని కూడా బ్యాటింగ్ ఆర్డర్లో దిగువ స్థానంలోనే బరిలోకి దిగి ఇన్నింగ్స్‌లో పరుగులవరద పారించి ముగించాలని కోరుకుంటున్నాడు.

సఫారీలకు డూ ఆర్ డై

ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టు ఎన్నడూ లేనంతగా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఒకవైపు గాయాలతో ప్రముఖ ఆటగాళ్లు జట్టుకు దూరకావడం, మరోవైపు వారి ఆటగాళ్ల వ్యూహాలు విఫలమవుతుంటంతో జట్టు ఒత్తిడిలో పడింది. రెండో టీ20 మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌పై ఆశలను సజీవంగా ఉంచుకోవాలని ఆశిస్తోంది. టీ20లకు డివిల్లియర్స్ దూరంకావడంతో ఆ లోటును భర్తీ చేయడానికి కెప్టెన్ డుమిని ఏంచేస్తాడో వేచి చూడాల్సిందే.

కామన్వెల్త్ క్రీడల్లో మహిళా అథ్లెట్లు చీరలు దరించొద్దు



న్యూఢిల్లీ: కామన్వెల్త్ ప్రారంభ ఉత్సవాల్లో భారత మహిళా అథ్లెట్లు సంప్రదాయ వస్త్రదారణ అయిన చీరలకు బదులు బ్లేజర్లు, ట్రౌజర్లు దరించి పాల్గొననున్నారు. ఈమేరకు భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఒఎ) తన కార్యాలయంలో అథ్లెట్లతో, బోర్డు సభ్యులతో జరిపిన సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంది. '2018 కామన్వెల్త్ క్రీడల్లో మహిళా అథ్లెట్లు బ్లేజర్లు, ట్రౌజర్లు దరిస్తారు' అని ఐఒఎ మంగళవారం ఒక ప్రకటనను మీడియాకు జారీ చేసింది. ఆస్ట్రేలియాలోని కర్రార స్టేడియంలో ఏప్రిల్ 4నుంచి 15వరకు ఈ క్రీడలు జరుగనున్నాయి. మొత్తం 18 క్రీడాంశాల్లో 278 ఈవెంట్లు నిర్వహించనున్నారు. మాలవ్ ష్రాఫ్ ఆధ్వర్యంలోని ఐఒఎ అథ్లెట్స్ కమిషన్ ఈ మార్పును స్వాగతించారు. 'ప్రారంభోత్సవాల్లో భారత మహిళా అథ్లెట్లు దరించే దుస్తుల మార్పు మంచిదే. ఇవి అథ్లెట్లకు సౌకర్యవంతంగా ఉంటాయి' అని మాలవ్ అన్నారు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

నేను-నా ప్రజలు



"ఉద్యోగం ఏదైనా దానికి పరిపూర్ణత చేకూరాలంటే..ప్రజాసేవే పరమావధి కావాలి. ప్రజలు ఖాకీ డ్రెస్సును కాకుండా.. దాని వెనుక దాగిన మనసును చూడగల్గితే పోలీసులు విధినిర్వహణలో సక్సెస్ సాధించినట్లే!"
-రాచకొండ సీపీ మహేశ్ ఎం.భగవత్

ఐపీఎస్...సివిల్ సర్వీస్!

మానవీయ కోణంలో ఆలోచించినప్పుడు...మనసుంటే మార్గం దొరుకుతుంది! తనకు సాధ్యమైనంత మేర ప్రజల మేలుకోసం..ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటారు కొందరు!... అలాంటి మనసు లేనప్పుడే సాకులు దొరుకుతాయి... చేయాలనే ఉంది కానీ..పని ఒత్తిడి...క్షణం తీరిక లేదు అంటూ....నొప్పించక, తానొవ్వక... అన్నట్లు తప్పించుకుంటారు మరి కొందరు!! మొదటి కోవకు చెందిన మనసున్న మనీషి.... 1995 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి, రాచకొండ సీపీ మహేష్ మురళీధర్ భగవత్! పోలీస్ కమిషనర్‌గా ఎంతో బిజీగా ఉంటూనే సివిల్స్,ఐఎఫ్ఎస్ అభ్యర్థులకు ఆసరాగా నిలుస్తున్నారు. క్షణం ఊపిరిసలపని ఉద్యోగ జీవితంలోనూ... వారి విజయానికి తనవంతు సహకారం అందిస్తున్నారు. 13 సంవత్సరాలుగా మానవ అక్రమ రవాణాను రూపుమాపేందుకు కృషి చేస్తున్నారు. ఎందుకంటే...అధికారిక హోదా అనుభవించడం కన్నా.. దానిని ఆసరాగా చేసుకొని, ప్రజలకు సేవచేయడమే తనకు తృప్తినిస్తుందంటున్నారు మహేష్ భగవత్!...ఐపీఎస్‌కు ఎంపికైన తర్వాత మణిపూర్‌లో ప్రొబెషన్ పీరియడ్ పూర్తిచేసుకుని.. సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో ఏలూరు ఏఎస్పీగా 1999లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన 4పోలీస్ మెడల్స్,ఐదు అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ఈ 22 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో..తన అనుభవాలు, అనుభూతులను ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...!

ఖాకీ డ్రెస్సు మాటున కారుణ్యం!

సివిల్ ....అభ్యర్థులకు సలహాలు!

మాది మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లా షత్రార్డి గ్రామం. మొదటి నుంచి నాకు సోషల్ సర్వీస్ అంటే చాలా ఇష్టం. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూనే మా దగ్గర గ్రామాల్లో మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేవాన్ని. ప్రస్తుతం ..నాకంటూ ఒక హోదా ఉంది. ప్రజలకు సేవచేయడం తేలిక. ప్రజలకు సేవచేయడమే ఉద్యోగ ధర్మంగా భావిస్తాను. సివిల్స్, ఐఎఫ్ఎస్ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సలహాలు ఇస్తుంటా. ముఖ్యంగా రాత పరీక్షలో అర్హత పొంది ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ..నాకు ఫోన్ చేసినా, వాట్సప్‌లో మెసేజ్ పెట్టినా, నేరుగా వచ్చినా .. వారి అనుమానాలు నివృత్తి చేస్తుంటాను. ఇంటర్వ్యూను ఎలా ఫేస్ చేయాలో వివరిస్తుంటాను. ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 1099 మంది ఎంపికైతే... అందులో నా సలహాలు,సూచనలు తీసుకున్నవారు 84 మంది ఉన్నారు. 100లోపు ర్యాంకు సాధించిన వారు ఆర్గురు...అందులో తెలుగువారు ముగ్గురైతే.. మహారాష్ట్ర కు చెందినవారు ముగ్గురు. వాళ్లంతా నా వల్లే విజయం సాధించారని చెప్పను. కాని వారు సాధించిన విజయంలో నాకూ భాగస్వామ్యం ఉండడం నాకు సంతృప్తినిస్తుంది.



సెక్స్ వర్కర్లకు ఆసరాగా..!

ఎవరూ కావాలని సెక్స్ వర్కర్లుగా మారరు. అందుకే వారిని సరైన కోణంలో అర్థం చేసుకుని,చేయూత అందిస్తే వారు కూడా సమాజంలో గౌరవంగా బతుకుతారనేది నా విశ్వాసం. 2005-2006లో నల్లగొండ జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు పవిత్రమైన యాదగిరి గుట్టలో వ్యభిచార సమస్య తీవ్రంగా ఉండేది. సెక్స్ వర్కర్లంతా సంచార జాతివారే. కడుపు కూటికోసం వారు ఆ వృత్తి ఎంచుకున్నారు తప్ప వేరేకాదు. అందుకే వారిలో పరివర్తన కోసం కౌన్సిలింగ్ నిర్వహించాను. కలెక్టర్‌తో మాట్లాడి, స్థానిక అధికారుల సహకారంతో 100 మంది సెక్స్ వర్కర్లకు స్వయం ఉపాధి కల్పించాను. వారి కుటుంబాలకు చెందిన యూత్‌కు గుడిలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఇప్పించాను. సెక్స్ వర్కర్ల పిల్లల కోసం బ్రిడ్జి స్కూల్ ఏర్పాటు చేయించాను. ఇద్దరు అమ్మాయిలకు సాఫ్ట్ స్కిల్స్ లో శిక్షణ ఇప్పించి..హోం గార్డు ఉద్యోగాలు ఇచ్చాను. ప్రస్తుతం వారంతా గతాన్ని పూర్తిగా విస్మరించి, సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు.

పోలీస్ ..మీకోసం

2001 నుంచి 2003వరకు అదిలాబాద్ జిల్లా ఎస్పీగా పనిచేయడం చాలా తృప్తినిచ్చింది. పోలీస్..మీకోసం..కార్యక్రమాన్ని 3 సంవత్సరాలు కొనసాగించాను. జిల్లాలో గోండులు, ఇతర గిరిజన జాతులు.. నక్సల్ ఆటపాటలకు త్వరగా ప్రభావితులయ్యేవారు. కారణం వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకపోవడం. వారికి ప్రభుత్వం అంటే అవగాహన ఉండేదికాదు. వారిలో చైతన్యం కోసం శ్రమించాను. జిల్లా వ్యాప్తంగా 130 మెడికల్ క్యాంపులు నిర్వహించాను. 700మంది గిరిజనయువకులను హైదరాబాద్ తీసుకొని వచ్చి, మూడు రోజుల పాటు అసెంబ్లీ, సచివాలయం చూపించి, ప్రభుత్వం అంటే ఏంటో అవగాహన కల్పించాను. ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరించాను. జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు చెప్పించి, వాటి పరిష్కారానికి కృషిచేశాను. ఇప్పటికీ బాగా గుర్తుంది... బజార్ హత్నూర్ మండలం డెడ్రా గ్రామం. ఆ ఊరి నుంచే9 మంది యువకులు నక్సల్స్‌లో చేరారు. ఓ సారి ఆ గ్రామాన్ని సందర్శించాను. తీవ్ర మంచినీటి సమస్య. గ్రామస్తులు మంచి నీళ్లకోసం కడవలు నెత్తిన పెట్టుకొని 10 కిలోమీటర్లు వెళ్లేవారు. బాధేసింది. మరుసటి రోజే కలెక్టర్‌ను కలిసి పరిస్థితి వివరించి, మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయించాను. ఆ తర్వాత వారితో కలిసి చర్చించి, నక్సల్స్‌లోకి వెళ్లిన యువకులు తిరిగి జనజీవన స్రవంతిలో కలిసేలా చేశాను. సిర్పూర్(యు) మండలం చోర్‌పల్లి గ్రామానికి కరెంటు సమస్య తీర్చాను. ఐటీడీఏ వాళ్లతో మాట్లాడి ఇళ్లు నిర్మించి ఇచ్చాను. పోలీసులు చేస్తున్న సేవలు చూసి జోడేఘాట్ దళం డిప్యూటి కమాండర్ జయరాం పోలీసులకు లొంగిపోయారు. నేను పనిచేసిన రోజుల్లో జిల్లాలో నక్సల్స్ సమస్యను 80శాతం తగ్గించాను. జిల్లాలో వీరన్న వర్గానికి చెందిన జనశక్తి రాష్ట్ర నాయకుడు ఒకరు నా హయాంలోనే లొంగిపోయాడు. అయితే అతను హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ చేస్తూ ..మధ్యలో చదువుమానేసి నక్సల్స్‌లో చేరాడు. అతను లొంగిపోయినప్పుడు తనకు తిరిగి చదవాలనుందని చెప్పాడు. అప్పుడు జేఎన్‌టీయూ వీసీతో మట్లాడి, అతని వల్ల ఎలాంటి సమస్య తలెత్తినా నేనే బాధ్యత వహిస్తానని చెప్పి, నా లెటర్ హెడ్ మీద రాసిచ్చా. ప్రస్తుతం అతను ఎంటెక్ పూర్తిచేసి, హైదరాబాద్‌లోనే ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఫ్యాకల్టీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఓ రోజు అదే కాలేజీకి వెళ్లినప్పుడు.. అతను నన్ను కలిసినప్పడు...అతని కృతజ్ఞతా పూర్వకమైన చూపులు ఎంతటి తృప్తినిచ్చాయో మాటల్లో చెప్పలేను.

బాల కార్మికులకు బాసటగా..

హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు ఒరిస్సానుంచి వలస కూలీలు వస్తుంటారు. చివరకి వారి పిల్లలు కూడా అందులోనే బాలకార్మికులుగా మగ్గుతుంటారు. కనీసం వారికి వేతనం కూడా ఉండదు. అది తెలిసి 2017లో ఇటుకబట్టీల మీద దాడులు నిర్వహించి బాలకార్మికులకు విముక్తి కల్పించాను. అంతటితో తృప్తిపడకుండా.. ఇటుక బట్టీ కార్మికుల కోసం ఒరిస్సా నుంచి టీచర్లను రప్పించి చీకటి మామిడి(బొమ్మల రామారం), పెద్ద కొండూరు (చౌటుప్పల్, కొంగరకలాన్ (ఆదిభట్ల), రావిర్యాల (ఆదిభట్ల) ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయించాను. ప్రభుత్వం పాఠశాలకు బిల్డింగ్ సౌకర్యంకల్పించింది. ఇటుక బట్టీ యజమానులే టీచర్లకు జీతాలు ఇచ్చే ఏర్పాటు చేశాను. అధికారులతో మాట్లాడి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాను. ప్రస్తుతం ఈ ప్రత్యేక పాఠశాలల్లో 700 మంది చదువుకుంటున్నారు.

మానవ అక్రమ రవాణాపై...

13 సంవత్సరాలుగా మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తూనేఉన్నా. వ్యక్తిగతంగా యాంటీ-ట్రాఫికింగ్ రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొన్నా. ఢిల్లీ, బెంగళూరు, పూణె, ముంబాయి, హైదరాబాద్‌లో ఆపరేషన్స్ నిర్వహించి వందలాది మంది బాధితులకు విముక్తి కల్పించగలిగాము. 2016లో హైదరాబాద్‌లో ఆన్‌లైన్ సెక్స్ రాకెట్‌ను ఛేదించి, ఉజ్బెకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ లాంటి దేశాల నుంచి హైదరాబాద్‌కు తరలించిన సెక్స్ వర్కర్లకు విముక్తి కల్గించాను. 70 వ్యభిచార గృహాలను మూయించాను.

రాచకొండను దత్తత తీసుకున్నా..

రాచకొండ పోలీస్ కమిషనర్‌గా రాచకొండ గ్రామాన్ని దత్తత తీసుకున్నాను. హైదరాబాద్ దగ్గర్లో ఉన్నా..ఆ గ్రామంలో సెల్‌ఫోన్లు పనిచేయవు. 2017 ఫిబ్రవరిలో ఆ గ్రామంలో మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినప్పుడు, అప్పటి డీజీ అనురాగ్ శర్మ ప్రారంభించారు. అప్పటికి కాని మాకు ఆ విషయం తెలియలేదు. వెంటనే బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి ..బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయించాను.

జనవరి 1న రాచకొండ, తిప్పాయిగూడలో పాఠశాల విద్యార్థులకు 2000ల నోట్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశాను. విద్యాసౌకర్యాలు మెరుగు పడకపోతే ...గ్రామాలు బాగుపడవు. అందుకే దత్తత గ్రామంలో విద్యాసౌకర్యాలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తున్నాను. అధికారిగా నాకు ఆ అవకాశం ఉంది. అందుకే నా పరిధిలో ప్రజలకు సేవచేయగల్గుతున్నా. అయితే అదంతా నా ఘనత కాదు. నాకు సహకరించిన వారికే ఆ ఘనత దక్కుతుంది...ఎందుకంటే నేను ప్రజల కోసం చేస్తున్న ప్రతి పనికి అనుసంధాన కర్తను మాత్రమే!

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

సర్దుకుపోయే...కళ!



ఐడియా

ఇప్పుడున్నవన్నీ చిన్న కుటుంబాలే. అంతేకాదు...చిన్న ఇళ్లు కూడా. మరీ ముఖ్యంగా నగరాల్లో ఇళ్లయితే పిట్టగూళ్లలా 'సర్దుకుపోవడమే జీవితం' అనేలా ఉంటున్నాయి. ఇక్కడ సర్దుకుపోవడమంటే...మనుషులు పరిస్థితులతోనే కాదు...వస్తువులను చక్కగా సర్దుకోవటంగా కూడా దీన్ని గుర్తించాలి. తక్కువ స్థలంలో ఎక్కువ వస్తువులను ఇంటి అందం చెడకుండా సర్దుకోవటం ....అనేది చిన్న ఇళ్లలో కాపురాలు చేసేవారికి మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి అదో కళ కూడా. ఇక్కడ కనబడుతున్న చిత్రాల్లో అలాంటి కళని మనం కళ్లారా చూడవచ్చు. మంచం వేసిన స్థలంలోనే మరెన్నో వస్తువులను పెట్టుకునే అవకాశాన్ని ఈ క్లోజెట్ బెడ్ ఇస్తోంది.





భారత దేశంలో మహిళలకు ఎంత స్వేచ్ఛ ఉంది... ఎంత స్వాతంత్ర్యం ఉంది...ఎన్ని హక్కులున్నాయి...వారెంత అభివృద్ధి సాధించారు... అనే ప్రశ్నలకు...సరైన సమాధానం ఇవ్వాలంటే ఒక విచిత్రమైన పరిస్థితి మన కళ్లముందు ఆవిష్కృతమవుతుంది. ఎందుకంటే ఈ ప్రశ్నలకు రెండు విభిన్నమైన సమాధానాలను ఇవ్వాల్సివస్తుంది. ఇక్కడ మహిళలు ఎన్ని అడుగులు ముందుకు వేస్తున్నారో...అన్ని అడుగులు వెనక్కు కూడా వేస్తున్నారు. అయితే ఎంత అణచివేతకు గురవుతున్నారో అంతే స్థాయిలో పోరాటానికి సిద్ధపడుతున్నారు. అలాగే వివక్ష ఎంత స్థాయిలో ఉందో...సమానత్వంకోసం జరుగుతున్న కృషి సైతం అంతే స్థాయిలో ఉంటున్నది. పూర్తిగా పురుషాధిపత్యం ఉన్న సమాజంలో స్త్రీలు తమ ఉనికి కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నారు. నిరంతరం పడిలేచే కెరటాలవుతూనే ఉన్నారు.



ఒక ప్రశ్న...రెండు సమాధానాలు!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2018 ప్రత్యేకం

దేశం అభివృద్ధి చెందుతోంది...టెక్నాలజీలో ముందుకెళుతోంది....అంతరిక్షంలోకి అభివృద్ధి చెందిన దేశాల ఉపగ్రహాలను మోసుకెళ్లగల స్థాయిలో ఉంది. మరి దేశమంటే మహిళలుకూడా కదా...ఎందుకు వారి జీవితాలు మాత్రం సెకండ్ జండర్‌గానే రెండవస్థానంలో మిగిలిపోతున్నాయి...అనే ప్రశ్నవేసుకుంటే...ఆర్థికాభివృద్ధి వేరు...ఆలోచనల్లో అభివృద్ధి వేరని చెప్పాల్సి వస్తుంది. అందుకే ఏటికి ఎదురీదుతున్నవారు, ప్రోత్సాహకరమైన వాతావరణంలో ఉన్నవారు ముందడుగులు వేస్తుంటే...ఆ శక్తిలేనివారు, సంకుచిత ఆలోచనలున్న పరిస్థితుల్లో బందీలైనవారు మాత్రం తమ జీవితాల్లో మార్పుకోసం ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు. స్త్రీల ప్రగతి అనేది నేటికీ వ్యక్తిగత అంశంగానే మిగిలి ఉంది తప్ప....అదొక సామాజిక ఆవశ్యకత అనే గుర్తింపు రాలేదనే చెప్పాలి.

విద్య పెరిగింది...బాల్యవివాహాలూ పెరిగాయి

గత పదేళ్లకాలంలో మహిళల విద్య బాగా పెరిగింది. గత సంవత్సరం వెల్లడైన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే- 4 లోని అంశాలు ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. దీంతో 55శాతంగా ఉన్న మహిళల అక్షరాస్యత రేటు 68శాతానికి పెరిగింది. అయితే పురుషుల అక్షరాస్యత 86 శాతం ఉంది. దీన్ని బట్టి చూస్తే స్త్రీల అక్షరాస్యత చాలా తక్కువే. చదువులో ఇలాంటి అభివృద్ధి సాధించాము కదా....అని ఆనందించే లోపునే...బాల్య వివాహాల్లో మనదేశం ప్రపంచంలోనే ముందువరుసలో ఉందనే సమాచారం కళ్లముందు మెదులుతుంది. అవును 47శాతం మంది అమ్మాయిలకు తమ 18వ పుట్టినరోజుకంటే ముందుగానే వివాహాలు జరుగుతున్నాయి. విద్యలో అభివృద్ధి ఉందా...అనే ప్రశ్నకు ఒక వైపు ఉంది...అనే సమాధానం చెబుతూనే...మరో పక్క అమ్మాయిల చదువుకునే హక్కుని బాల్యవివాహాలు కాలరాస్తున్నాయనే సమాధానంకూడా చెప్పాల్సివస్తుంది. ఎంతో మంది ఆడపిల్లలు...మేము చదువుకుంటాము మొర్రో... అని పెళ్లిళ్లను ప్రతిఘటిస్తున్న సందర్భాలు మన కళ్లముందు కనబడుతున్నాయి. చదువా, పెళ్లా అనే విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం ఆడపిల్లలకు పూర్తిగా రాలేదనే చెప్పాలి. ఈ కారణంగానే పెరుగుతున్న అక్షరాస్యత మహిళల తలరాతలను ప్రభావితం చేయలేకపోతున్నది.

హోదా పెరిగింది...హింసా పెరిగింది

ముంబయిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ నిర్వహించిన సర్వేలో దేశంలో మహిళల హోదా బాగా పెరిగిందనే ఫలితాలు వచ్చాయి. 2015-16 మధ్యకాలంలో నిర్వహించిన ఈ సర్వేలో 6,99,686 మంది మహిళల, 1,03,525 మంది మగవారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సర్వేలో భారత్‌లో మధ్య తరగతి పెరుగుతున్నదని దాంతో మహిళలు సర్వస్వతంత్రులు అవుతున్నారని, వారికి ఆర్థిక స్వేచ్ఛ సాధికారత లభించాయనే అభిప్రాయాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న మహిళల్లో సగంమందికి సెల్‌ఫోన్లు ఉన్నాయి. అంతేకాదు...బ్యాంకు ఖాతాలు ఉన్న మహిళల సంఖ్య 15శాతం నుండి 53శాతానికి పెరిగింది. ఇల్లు, భూమి ఉన్న మహిళల సంఖ్య 38శాతంగా ఉంది. 2005-06లో సర్వే నిర్వహించినప్పుడు ఈ సంఖ్య ఇంతగా లేదు. ఇవన్నీ మంచి విషయాలే. మహిళ జీవితం మెరుగవుతున్నదని....ఆమె నిజంగానే స్వయంసమృద్ధివైపు అడుగులు వేస్తున్నదని...ఆనందంతో గర్వించదగినవే. అయితే ఈ ప్రగతి వెలుగుకి మరో వైపు పెనుచీకటి కోణం కనబడుతోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అందిస్తున్న వివరాల ప్రకారం 2006-2015 మధ్యకాలంలో భర్త, ఇతర బంధువుల నుండి మహిళలు ఎదుర్కొంటున్న హింస 80శాతం పెరిగింది. 2005-2015 మధ్యకాలంలో 88,467మంది మహిళలు వరకట్న సంబంధిత హింస కారణంగా మరణించారు. ఈ సంఖ్య రోజుకి సగటున 22గా ఉందంటే దీని తీవ్రతని మనం అర్థం చేసుకోవచ్చు. ఒక్క 2015లోనే 7,643మంది వరకట్నవేధింపులతో హత్యకు గురయ్యారు. మరి దీన్ని ఎలా చూడాలి. ఎంతగా శ్రమపడి...మహిళలు తమని తాము ముందుకు నడిపించుకుంటున్నా...వెనక్కు నెట్టేస్తున్న అంశాలు సమాజంలో తగ్గటం లేదు. అందుకే మహిళ పరిస్థితి ఏలా ఉంది...అనే ప్రశ్నకు........రెండు వ్యతిరేక సమాధానాలు చెప్పాల్సిన పరిస్థితి....బాగుందనే కాదు...బాగాలేదు...అని కూడా. ఈ ద్విముఖత్వమే...ఆమెని ద్వితీయ స్థాయికి పరిమితం చేస్తోంది.

-వి.దుర్గ

శిల నుంచి మానవుని దాకా...

జీవాత్మ మానవ జన్మ ఎత్తేందుకు ముందు అనేకదశలు పొందుతుంది. వీటిలో మొదటి దశ శిలగా ఉన్న స్థితి. ఈ దశలో ఉన్నప్పుడు జీవాత్మ బ్రహ్మానందానికి పూర్తిగా విరుద్ధమైన మహా దుఃఖాన్ని అనుభవిస్తుంది. అది కూడా వాక్కులతో వివరించ రానిది. ఇందుకు మన ఇతిహాసాలలో శిలా రూపంగా ఉన్న అహల్యను ఉదాహరణగా పేర్కొనవచ్చు.



జీవాత్మ (జీవుని) జన్మల పరిణామ క్రమం గురించి ఎన్నో సిద్ధాంతాలున్నాయి. ఆ జన్మల పరిణామ క్రమం ఏ విధంగా ఉంటుందన్న దాని గురించి విజ్ఞులు వెలిబుచ్చిన ఒక అభిప్రాయం ఇది. జీవాత్మ, పరమాత్మతో కలిసి ఉన్నప్పుడు బ్రహ్మానందాన్ని అనుభవిస్తుంది. అది వాక్కులలో వర్ణించటానికి వీలుకానిది. మనస్సుతో తెలియరానిది. జీవాత్మ మానవ జన్మ ఎత్తేందుకు ముందు అనేక దశలు పొందుతుంది. వీటిలో మొదటి దశ శిలగా ఉన్న స్థితి. ఈ దశలో ఉన్నప్పుడు జీవాత్మ బ్రహ్మానందానికి పూర్తిగా విరుద్ధమైన మహా దుఃఖాన్ని అనుభవిస్తుంది. అది కూడా వాక్కులతో వివరించరానిది. ఇం దుకు మన ఇతిహాసాలలో శిలా రూపం గా ఉన్న అహల్యను ఉదాహరణగా పేర్కొనవచ్చు.

లోహ దశ


ఈవిధంగా అనేక శిలల్లో ప్రవేశిస్తూ ప్రాణరహితమైన మహాదుః ఖాన్ని అనుభవిస్తూ లోహ స్థితిలో అది ప్రవేశిస్తుంది. లోహ స్థితిలో ప్రాణం నిద్రాణంగా ఉంటుంది. కొంతకాలం ఉన్న అనంతరం దాని నుంచి బయల్పడేందుకు ప్రయత్నిస్తుంది. ఆ సమయంలో లోహ రూపంలో ఉన్న దానిపై, దానికి సరిపడని విషపదార్థాలను పోసిన ప్పుడు నానావిధ లోహాలలో అది సంచ రిస్తూ దానిలో నిద్రాణ స్థితిలో ఉన్న ప్రాణం బాధననుభవించి ఆ లోహాన్ని విడిచి మరో లోహం లోనికి ప్రయా ణిస్తుంది. బంగారం, రాగి కలిసి నగగా తయారవడం ఈ విధంగా లోహాల సంయోగానికి ఉదాహరణగా చెప్ప వచ్చు.

వృక్ష దశ

జీవాత్మ ఈ రెండవ దశ నుంచి మూడవ దశ అయిన వృక్షాలు వంటి వాటిలో ప్రవేశిస్తుంది. గతంలో నిద్రాణ పదార్థంగా ఉన్న ప్రాణం ఈ దశలో చైతన్య వంతమై నిటారుగానో, వాలుగానో ఉండాలనే సంకల్పాన్ని కలిగి ఉంటుంది. వృక్షాలలో ప్రాణం ఉన్నదని మన దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త జగదీశ్‌చంద్ర బోస్ చేసిన పరిశోధనలు ఈ సందర్భంగా ఉదహరించవచ్చు. జీవాత్మ అనేక రకాల వృక్ష జాతులలో అనేక అనుభవాలు పొందుతుంది.

క్రిమి కీటకాల దశ

వృక్ష జాతుల స్థితి అంటే సగం జీవన సహితంగాను, సగం జీవ రహితం గాను ఉన్న స్థితి నుంచి ప్రాణం పూర్తిగా ఉన్న నాలుగో దశ అయిన క్రిమి కీటకాల స్థితికి చేరుకుంటుంది. వృక్ష జాతిలో ఉండగా చలనం కలగాలని ఉండే దాని సంకల్పం ఈ దశలో నెరవేరుతుంది. అనేక సంస్కా రాలతో చీమ, దోమ, తేలు వంటి కుట్టే స్వభావం, సీతాకోక చిలుక వలె ప్రకృతి సంపద పెరిగేందుకు దోహదం చేసే జన్మ వస్తుంది.



మత్స్య దశ

క్రిమి కీటకాదుల దశ నుంచి జీవాత్మ ఐదవదశ అయిన మత్స్యరూపాన్ని పొందుతుంది. అలాగే రకరకాల జల జీవ రాశులుగా అనుభవాలను పొందుతుంది.

పక్షి దశ

మత్స్య రూపం నుంచి జీవాత్మ ఆరవ దశ అయిన పక్షుల రూపాన్ని పొందుతుంది. ఈ దశలో రకరకాల పక్షులుగా పుట్టి అనుభవాలు పొందుతూంటుంది.

చతుష్పాద జంతు దశ

ఆ తరువాత దశ అయిన ఏడవ దశలో జీవాత్మ నాలుగు కాళ్ల జంతువులుగా జన్మిస్తుంది. ఇవి కుక్క, పిల్లి వంటివి. అలాగే ఏనుగులు, పులులు వంటి క్రూర మృగాలూ ఈ తరహాకు చెందినవే. కుక్క, పిల్లి వంటివి మానవునితో సహజీవనం చేస్తూ, మానవ జన్మ కోసం సంకల్పాన్ని కలిగి ఉంటాయి.

వీటిలోనే గోవు వంటి మానవుల చేత కొలవబడే జంతువులుగా, వారికి సహకరించే జంతువులుగా కూడా జీవాత్మ జన్మను పొందుతుంది. ఆ జన్మలో మాన వులకి సహాయకారిగా పాలు వంటి ఆహారాన్ని ఇవ్వడం, ఎద్దు రూపంలో వ్యవసాయ పనుల్లో సాయ పడడం వంటివి చేయడం వల్ల కొంత పుణ్యం పొందుతుంది. ఏ జంతువులైనా తమ స్థాయిలో ఇటువంటి సాయం చేసి పుణ్యం పొందే అవకాశం ఉంది.

మానవ జన్మ

అటువంటి పుణ్యం వల్ల తరువాత జన్మలో ఎనిమి దవ దశ అయిన మానవ జన్మ పొందుతుంది. ఈ పరిణామ క్రమంలో వాసనలు, సంస్కారాలు ఆలోచనలు మొదలైన వాటితో మానవ జన్మ పొంది పుణ్య పాపకర్మలు చేస్తూ అనేక యోనులందు పుడుతూ ఉంటుంది.


ఈ జీవులు స్థూల, సూక్ష్మ, కారణ అనే మూడు దేహాలను కలిగి దేహాభిమానంతో అనేక జన్మలు పొందడం, మరణిం చడం చేస్తూ ఒక చక్రంలో తిరుగుతూ ఉంటారు. ఈ చక్రాన్నే 'భవము' అంటారు. భవ నాశనమే జీవన్ముక్తి పొందటమని తెలుసుకోవాలి.

- శ్రీ హయగ్రీవ జ్యోతిష పరిశోధనా కేంద్రం
9949514583

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

చాటు ఎందుకు?



(గత సంచిక తరువాయి భాగం)

28-5-47

ఉలిక్కిపడి చూతును గదా ఆరున్నరయింది. ఆడంగులుండదగిన వేళ అంతటితో సరిగదా? అందరూ చల్లగా జారుకుంటున్నారు. ఎట్లాగో లేచి, నమస్కరించాను. అనుగ్రహపూరితమైన ఆగ్రహాన్ని సూచించేరూక్షేక్షణాలతో పళ్లు బిగబట్టి, నావంక చూస్తూనే ఉన్నారు భగవాన్. ఆ గంభీరమూర్తిని కన్నెత్తి చూడలేక సిగ్గుతో వంచిన తల ఎత్తకుండా ఇంటికి వచ్చాను. భళ్లున తెల్లవారింది. శిక్షా లక్షణమైన ఆ మందలింపునకు జీడిపప్పే కారణం కాదనీ, జ్ఞానోపార్జనకై గదా వచ్చింది. ఆ వచ్చిన పని మరచి సంచరించిన విషయాలు ఇంకా ఎన్నో ఉన్నవనీ గ్రహించి, మనస్సులో క్షమాపణ వేడుకున్నాను.

ఉదయాత్పూర్వమే లేచి, త్వరగా కాలకృత్యాలు ముగించుకొని, ఆశ్రమానికి వెళ్లి, హాల్లో అడుగుపెట్టగానే, మందహాసంతో, మా కేసు విచారణకు తెచ్చారు భగవాన్. సుబ్బలక్ష్మమ్మకు నేచెప్పలేదనీ, భర్తగారి షష్టిపూర్తికి తెచ్చిన పప్పు మిగిలితే, ఉడుతలకివ్వమని అలివేలత్తే ఇచ్చిందనీ తేలింది. ''అట్లాగా, ఇప్పుడు కథంతా వేరువిధంగా మారింది. అయితే మాత్రం చాటెందుకు? ఊ, పోనీలే, ఏదో అయింది'' అంటూ ప్రసంగం మార్చి, మాటలతో మాయగప్పు చూచారు భగవాన్. నాకు మాత్రం ఇంతవరకూ మరపు రాలేదు.

''ఆశయా బధ్యతే లోకో కర్మణా, బహుచింతయా।
ఆయుక్షీణం సజానాతి తస్మాత్ జాగ్రత జాగ్రత॥

అన్న పెద్దల వాక్యం విస్మరించి, కాలవేగం గమనించక, కాలయాపన చేస్తున్నదే బిడ్డ అన్న పరితాపంతో పలికిన ఆ పలుకులూ, చూచిన ఆ చూపులూ, నా హృదయ ఫలకంలో ముద్రవేయబడినవి. అన్నా,ఆ సంఘటన ఏమని వ్రాయగలను, జ్ఞానదాత గదా భగవానుడు.

కృతి సమర్పణ

5-6-47

మొన్న రాత్రి పట్నంలో, మీ ఇంటి నుండి బయలుదేరి నిన్న ఉదయం ఏడు గంటలకు ఆశ్రమం చేరుకున్నాను. భగవత్సన్నిధి విడిచి, నాల్గురోజులే అయినప్పటికి, నాల్గుయుగాలయినట్లుండుట వల్ల, స్టేషన్ నుండి ఏకాయకి ఆశ్రమానికే వెళ్లాను. భగవాన్ ఫలహారం చేస్తున్నారు. నమస్కరించి, నిలుచుంటే ''వచ్చారా? ఇప్పుడేనా?'' అన్నారు. ''ఔ''నని లేఖల పుస్తకాలు పది కాపీలే వచ్చినవనీ, మిగతావి ప్రెస్సువారు ఆశ్రమానికే పంపుతామన్నారనీ, ఇచ్చిన పదీ తెచ్చాననీ చెప్పాను. ''సరే''నని నిర్లక్ష్యంగా ఊరుకున్నారు భగవాన్.

స్నానాపానాదులు ముగించుకొని పుస్తకాల కట్ట పట్టుకొని, ఆఫీసులోకి వెళ్లేసరికి సర్వాధికారి నిరంజనానంద స్వాములు లేరు. పోనీ, భగవానునకు చూపించే తెద్దామని హాలుకు వెళ్లాను. రూల్సు ప్రకారం నడవాలని ఆఫీసులోకి వెళ్లానేగాని, ముందు భగవానునకే చూపాలన్న మురిపెం లోపల ఉన్నది. ఎట్లాగైతేనేమి, ముందు హాలుకే వెళ్లవలసి వచ్చింది. భగవాన్ చూచీ చూడనట్లు పేపరు చదువుతున్నారు. చేతికివ్వటానికి జంకి కుర్చీపీట మీద పెట్టాను. కృతిసమర్పణ సందర్భంలో వారి వారి శక్త్యానుసారం ఫలపుష్పాది కానుకలిచ్చి, కృతి భర్త నర్చించటం సహజం. అయితే ''కొండంత దేవునకు కొండంత పత్రియా?'' అన్నట్లు ఏ ఒక్కటో లాంఛనంగా యిద్దామన్నా ''వచ్చిన పని చూచుకోక, ఇదంతా ఎందు''కని ఈ మధ్యనే భగవాన్ మందలించడం వల్ల, ఏమీ ఇవ్వక చేతులు జోడించాను.

(తరువాయి భాగం వచ్చేసంచికలో) - సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

వేషరాశి: పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు మెల్లమెల్లగా పరిష్కరింపబడతాయి. శత్రుభీతి తగ్గుతుంది.

వృషభరాశి: అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథునరాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటకరాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహరాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూరాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకరరాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభరాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

పురాణాల్లోనూ పాండురంగడు

పరమాత్మ పలు అవతారాలుగా ఈ భూమి మీద అవతరించాడు. వాటిలో బహుళ ప్రచారం పొందినవి రామకృష్ణావతారాలు. మానవ రూపంలో పరమాత్మ అవతరించినందున ఆ అవతారాలు బహుళ ప్రచారం పొందాయి. అంతేకాదు మానవ ధర్మాలను ఆ అవతారాలలో పరమాత్మ చూపాడు. పరమాత్మ అవతారాలెన్నో ఉన్నట్టే అవతారాల్లో రకాలు కూడా ఉన్నాయి. ఇక భూమిపై మహాత్ముల రూపంలో అవతరించి కూడా ఆయన ధర్మ సంస్థాపన చేశాడు. ఏ అవతార ప్రయోజనం దానిదే. కృష్ణుడు ప్రజల మధ్య పల్లెల్లో తిరిగాడు. ఆధునిక కాలంలోనూ పరమాత్మ ప్రజల మధ్యకు వచ్చిన సందర్భాలున్నాయి. తిరుమలలో వేంచేసి ఉన్న శ్రీనివాసుడు కూడా ఒకప్పుడు మహాభక్తులతో సంభా షించే వాడని చెబుతారు. అలాంటి విష్ణువు మరో రూపమే మహారాష్ట్రలోని పండరిపురంలో కొలువైన పాండురంగడు.

పండరి పురంలో వెలసి ఉన్న పాండురంగని గురించి చాలా మందికి తెలుసు. అయితే రుక్మిణీ సమేత పాండురంగని గురించి వేద వ్యాసుల వారు పద్మపురాణం, రుద్ర పురాణాల్లో రచించారనే విషయం కొంతమందికే తెలుసు. స్కాంద పురాణంలో కూడా పాండురంగని ప్రస్తావన ఉన్నట్టు చెబుతారు. ఇక విఠలుడనేది మరాఠీ, సంస్కృత పదాల కలయికగా పేర్కొంటారు. విఠ్ అంటే మరాఠీలో ఇటుక. స్థల్ అంటే సంస్కృతంలో నిలబడటం. ఇటుకపై నిలబడినవాడు కనుక ఆయనకు ఆ పేరు వచ్చిందని అంటారు. పాండురంగడు ఒక ఇటుకపై నిలబడి దర్శనమిస్తాడు కనుక ఆయనకు ఆ పేరు వచ్చిందని చెబుతారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవాల్లో ఎంతో మంది పాండురంగ భక్తులు ఉన్నారు. అయితే పాండురంగ ఆరాధన మహారాష్ట్రలో ఎక్కువ. పాండురంగని గురించి, పాండురంగ యాత్రా వైభవం గురించి తెలుసుకుంటే జీవితం ధన్యమవుతుంది.

పాండురంగ ఆవిర్భావం గురించి అనేక కథలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఒకసందర్భంలో రుక్మిణిపై కినుక వహించి కటి హస్తుడై భక్తులను ఉద్ధరించాలని పండరిపురంలో విఠలునిగా, పాండురంగనిగా వెలిసాడనేది ఒక కథ. తల్లి తండ్రుల సేవలో తరించి వారిపై భక్తి పరాకాష్ఠకు చేరిన పుండరీకునికి దర్శనమిచ్చేందుకు శ్రీవిష్ణువే పాండురంగనిగా, స్వయంభువుగా వెలిసాడని మరొక కథ. పుండరీకుడే పాండురంగని మూర్తిని పండరిపురం తెచ్చాడని కొందరి అభిప్రాయం. ఆది శంకరులు రచించిన 'శ్రీపాండురంగాష్టకం'లో శైవ, వైష్ణవ మతాలకు భేదం లేదని ఆ విషయం తెలియజేయాలనే పాండురంగడు అక్కడ వెలిసినట్లు చెబుతారు. దానికి తగ్గట్టే పండరిపురంలోని పాండురంగ దేవాలయం పలు శైవాలయాలున్న ప్రదేశంలో ఉంటుందని చెబుతారు. స్వామిని అభిషేక సమ యంలో దర్శించుకునేవారికి పాండురంగని తల పైభాగం లింగాకారంలో కని పిస్తుంది. ఒకసారి పాండురంగనికి కిరీటం, వడ్డాణం చేయించేందుకు ఆ గ్రామం లోని సంత్ శ్రీనరహరి సోనార్ అనే విశ్వబ్రాహ్మణుని పిలిపించారు. అతడు శివ భక్తుడు అయినందున విష్ణు స్వరూపుడైన పాండురంగని కొలతలు తీసుకోవడానికి నిరాకరించాడు. దానితో అతని కళ్ళకు గంతలు కట్టి ఒక దైవ విగ్రహానికి కిరీటం చేయాలని అయితే ఆ మూర్తిని కిరీటం చేసే వరకూ చూడరాదన్న నియమం ఉందని తెలిపారు. అతడు ఆ దేవతామూర్తి కిరీటానికి కొలతలు తీసుకునేందుకు విఠలుని విగ్రహం, తల భాగం తాకగా శివలింగాన్ని తాకిన అనుభూతి కలిగింది. కళ్ళ గంతలు విప్పి చూడగా విఠలుడు శివునిగా దర్శనమిచ్చి, శివ , విష్ణు రూపాలకు భేదం లేదని చెప్పి సంత్ నరహరి సోనార్‌ని ఆశీర్వదించాడు. విశేషమేమంటే ఇతర దేవతల మాదిరి కాక పాండురంగడు స్వయంగా కదలివచ్చి తమ భక్తుల మధ్య మసిలాడన్న కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆయన వారితో కలిసి , మాట్లాడి, భోజనం చేయటం వంటివి చేయటం మాయమై మరో పక్క దేవాలయంలో దేవతామూర్తిగా దర్శనమిచ్చాడన్న కథలు ఉన్నాయి.




పండరిపురాన్ని, పండరి నాథుని వివిధ భాషల వారు వేర్వేరు పేర్లతో పిలుస్తారు. పండరి, పండరి పురం, పౌండరీక క్షేత్ర, పుండలీక క్షేత్ర, పండ రంగే, పాండురంగ పూర్ అని పిలుస్తారు. ఆయననే విఠల్, విఠల్ నాథ్, విఠో, విఠోబా, విఠూ, విఠలూ మావులి, పండరి రాయ, పండరినాథ అని పిలుస్తారు. రుక్మిణీ మాతను మాతా రుక్మిణిగా కొలుస్తారు. ఆమెనే రఖుమాయ్ అని రాఖామాయ్ అని కూడా వ్యవహరిస్తారు.

మహాభక్తుడైన తుకారాం మహారాజ్ పండరి యాత్ర మహిమలను ఇలా చెబుతారు. 'ఐదుసార్లు కాశీ యాత్ర, మూడుసార్లు ద్వారక యాత్ర, ఒక్కసారి పండరి యాత్ర చేయటంతో సమానం. కాశీలో మరణం, ద్వారకలో దహనం వల్ల ముక్తి వస్తే ఒక్కసారి పండరి యాత్ర వల్ల బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుందని జాతి, కుల, మత భేదం లేకుండా విఠలుడు అందరికీ తన దర్శన మాత్రం చేతనే ముక్తి లభింపజేస్తాడు. 'సంత్ ఏక్ నాథ్, భక్త తుకారాం, సంత్ నామదేవ్, సంత్ జానాబాయి భక్తి తన్మయత్వంతో పాండురంగని దర్శించి, తరించారు. వారి భక్తిని వర్ణించడానికి ఎన్నో సంఘటనలు ఉన్నాయి. ఈ సంత్‌లు తాము తాకిన ప్రతి వస్తువులోనూ, నడిచిన భూమిలోనూ, చేసే ప్రతి పనిలోనూ విఠలుడినే చూస్తారని చెప్పడంలో సందేహం లేదు.

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

భగవద్గీత



అంత్యకాల భావనే మరుజన్మలో సాకారం

అధ్యాయం 8
శ్లోకం 6

యం యం వాపి స్మరన్ భావం
త్యజత్యంతే కలేవరమ్।
తం తమేవైతి కౌంతేయ
సదా తద్భావభావితః॥

తాత్పర్యం

ఓ కౌంతేయా! దేహాన్ని త్యజించినప్పుడు మనుజుడు ఏ భావాన్ని స్మరించునో అదే భావాన్ని అతడు నిశ్చయంగా పొందుతాడు.


భాష్యం

మన మరణానంతర భవిష్యత్తుకు మృత్యు సమయం ఎంత కీలకమైనదో ఈ శ్లోకంలో తెలియజేయటమైనది. మనం మరణసమయంలో కృష్ణుణ్ని గనక స్మరిస్తే దివ్యచైతన్యం వస్తుంది లేకపోతే మరొక జన్మ తీసుకోవాల్సి వస్తుంది. గొప్పవాడైన భరత మహారాజు సైతం, జింకను స్మరించుట చేత తరువాతి జన్మలో జింకగా జన్మించాల్సి వచ్చింది. మన జీవితకాలంలో వేటిని స్మరిస్తూ ఉం టామో వాటి ప్రభావం మృత్యు సమయంలో ఉంటుంది కాబట్టి మనము సాత్విక జీవనాన్ని గడుపుతూ కృష్ణుణ్ని స్మరించటాన్ని **'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే '** అనే మంత్ర జపం ద్వారా అభ్యాసం చేసినట్లయితే కృష్ణుని దివ్యత్వాన్ని పొందే అవకాశం తప్పక ఉంటుంది. మన బంగారు భవిష్యత్తుకు దీనిని మించిన పద్ధతి లేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



స్ఫూర్తి



వైకల్యం అన్నది శరీరానికే కాని మెదడుకి కాదని, మానసిక ధైర్యం, ప్రోత్సాహంఉంటే ఏపనినైనా చేయగల సామర్థ్యం సంపాదించవచ్చునని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతుంది నిషాగుప్తా. తనకి సరికొత్త జీవితాన్ని ఇచ్చింది ఈ క్రీడాజీవితమేనని, తను ఆడుతున్నప్పుడు తనకో లోపముందన్న విషయం మర్చిపోయి ఎంతో సంతోషంగా ఉంటున్నానని ఎంతో ఆనందంతో చెబుతుంది. ఆమె జీవిత విశేషాలు మీకోసం...

'వీల్‌చైర్'నుంచి విజయపథంలో

ఆమె వయస్సు ముప్పయి సంవత్సరాలు. ఆమె జాతీయ స్విమ్మర్. అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి. ఆమె రాష్ట్రస్థాయిలో మూడు గోల్డ్ మెడల్స్‌ను, మూడు జాతీయ స్థాయిలో కాంస్యపతకాలను స్విమ్మింగ్ విభాగంలో సాధించింది. 2015లో రెండవ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఆమె కాంస్య పతకం సాధించింది. 2017లో ఇంటర్నేషనల్ బాలి టోర్నమెంట్‌లో మూడవస్థానంలో చోటు సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె మహారాష్ట్ర ఉమెన్స్ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టీమ్‌లో ఉంది. ఈ టీమ్ 2017 జాతీయస్థాయి పోటీల్లో నాల్గవ స్థానం సంపాదించింది.

ఎంతో సంతోషంగా ఉన్న ఆమె కుటుంబంలో అనుకోని ప్రమాదం జరిగింది. వేసవి సెలవులు ఆమె జీవితాన్నే మార్చేశాయి. తన అన్నదమ్ములతో ఆడుకుంటున్న సమయంలో మామిడికాయలు కోయడానికి వాళ్లతో పాటు ఆమె కూడా గోడ ఎక్కింది. కాని పట్టుతప్పి కింద పడిపోయింది. దీనితో ఆమె శరీరంలోని వెన్నెముకకు బలమైన గాయాలవడంతో వీల్‌చైర్‌లోనే జీవితం గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రమాదం మే1, 2004లో జరిగింది. అప్పుడామె



ఇంటర్మీడియెట్ పూర్తిచేసింది. ట్రీట్‌మెంట్‌కోసం మే6,2004లో ఆమెను రీహాబిలిటేషన్ సెంటర్‌కి పంపించారు. ఐదు నెలలు అక్కడ గడిపాక ఇంటికి వచ్చింది. కాని చాలా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. నాలుగు సంవత్సరాలు టివి చూడటం, నిద్రపోవటం మాత్రమే చేసేది. ఆ జీవితంతో ఆమెకు విసుగు వచ్చింది. మళ్లీ రీహాబిలిటేషన్ సెంటర్‌కి వెళ్లాలని నిర్ణయించుకుంది. అది కూడా వెన్నెముక దెబ్బతిని ఆశ్రమం పొందుతున్న సెంటర్‌కి పంపించమని తల్లిదండ్రులను కోరింది. అలాంటి కేంద్రమే నైనా ఫౌండేషన్. దీనిని ఒక ఎన్‌జీవో సంస్థ నిర్వహిస్తోంది. ఆ ఎన్‌జీవో సంస్థ నిర్వాహకుడు కేతనా మెహతాను కలిపించారు నిషాకి సంబంధించిన డాక్టర్. ఆ సంస్థ వాళ్లు నిర్వహిస్తోన్న ఒక ఈవెంట్‌కి ఆమెను తీసుకుని వెళ్లారు. అక్కడ స్టేజీమీద ఒక మహిళ వీల్‌చైర్‌లో కూర్చునే డాన్స్ చేస్తోంది. వాళ్లని చూసి ఆమె మనసుకు ఊరట కలిగింది. తనలాగా చాలామంది ఈ ప్రపంచంలో ఉన్నారని. వాళ్లు అంత సంతోషంగా ఉన్నప్పుడు నేనెందుకు దిగులుగా ఉండాలని ఆమె ఆలోచించడం మొదలుపెట్టింది. ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో ఈవిషయాలన్నీ చెప్పింది. నాకు జీవితంలో ఏదైనా చెయ్యాలని అనిపిస్తుందని చెప్పింది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మళ్లీ రీహాబిలిటేషన్ సెంటర్‌కి వెళ్లింది. అక్కడ నిషాకు ఓలివర్ అనే వ్యక్తి కలిశాడు. ఆయన ప్రోద్బలంతో ఆమె క్రీడారంగంవైపు వెళ్లింది. ఆటలే ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆయన చెప్పడంతో ముందుగా స్విమ్మింగ్ నేర్చుకుని, నెమ్మదిగా బాస్కెట్‌బాల్ కూడా నేర్చుకుంది.

ఆమె చిన్ననాటి కల ఎయిర్‌హోస్టెస్ అవడం. కాని ఇటువంటి పరిస్థితుల్లో ఆమె దానిని సాధించలేదు కదా. అలా ఆమె క్రీడల మీద దృష్టిపెట్టి నైపుణ్యాన్ని సాధించింది. ఇప్పుడు ఆమె ఒక టీమ్‌ని కూడా తయారుచేసి పారా అథ్లెట్స్‌గా ఆడుతున్నారు. మహారాష్ట్ర మహిళా వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టీమ్‌ని తయారుచేశారు.

''నేను స్విమ్ చేసేటప్పుడు కేవలం నా చేతులను మాత్రమే ఆడించగలిగేదాన్ని. నేను ఈ పనిచేయడానికి ప్రారంభించినప్పుడు నన్ను చాలామంది నిరుత్సాహపరిచేవారు. కాని నేను నిరుత్సాహపడి ఆగి పోలేదు. ముందుకు సాగి ధైర్యంగా నేర్చుకున్నాను. ఇప్పుడు ప్రతి ఒక్కరు తమ పిల్లలకు నన్ను ఆదర్శంగా చూపిస్తున్నారు. ఇప్పుడు నాకు చాలామంది స్నేహితులు కూడా ఏర్పడ్డారు. వాళ్లు నన్ను కొత్తమార్గాల్లో పయనించడానికి ఎన్నో మార్గాలను చూపిస్తున్నారు. నేను జీవితంలో ఇంకా ఏమేమి చేయగలనో నాకు తెలియజేస్తున్నారు'' అని ఎంతో సంతోషంగా చెబుతుంది నిషాగుప్తా.

'పూజా' ఫలం

యోగా చేసేటప్పుడు ఎవరైనా తాము కూర్చునే దగ్గర క్లాత్ పరచుకోవడం సాధారణమే. కాని ఈ క్లాత్ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే బ్యాక్టీరియా వృద్ధి చెంది ఆ క్లాత్ ద్వారా అది వాడిన వారు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ఈ విషయాన్నే గుర్తించారు పూజా బార్కర్. నిరంతరం సాగే ఈ యోగాసాధనలో బ్యాక్టీరియా వ్యాప్తిచెందని మేడ్‌ఇన్ ఇండియా నేచురల్ యోగా మ్యాట్‌ను తయారుచేసిందామె. ఆ వివరాలు మీకోసం.

పూజా బార్కర్ యోగా చేసేటప్పుడు కూర్చునే మ్యాట్‌ను సరికొత్తగా డిజైన్ చేశారు. ఆమె చిన్నప్పటి నుంచే యోగా శిక్షణలో లేదు. 20సంవత్సరంలోకి వస్తున్న సమయంలో కుటుంబమంతా ఆరోగ్య రక్షణలో భాగంగా యోగా క్లాసులకు హాజరయ్యేవారు. ఆ సందర్భంలో యోగా ప్రాముఖ్యత, దాని శక్తిఏమిటో ఆమెకు తెలిసింది.

యుకెలో ఇంటర్నేషనల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బిఏ హానర్స్‌ను పూర్తి చేసింది. యుఎస్‌లో ఎమ్‌బిఏ చదువుదామనే ఆలోచనలో ఉండగా, అనుకోకుండా ఈ రంగంలోకి రావాల్సి వచ్చింది. 2003లో జరిగిన యాక్సిడెంట్‌లో ఆమె తండ్రి వెన్నెముకకు గాయాలయి బెడ్‌రిడెన్ పరిస్థితికి గురయ్యారు. ఆమె వయసు అప్పుడు 22. ఆ సమయంలో ఆమె తండ్రి బాధ్యతలను చూసుకోవాల్సి వచ్చింది. తండ్రి వ్యాపారం స్కూళ్లకు టెక్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ అందజేయడం. ఎనిమిది సంవత్సరాలు ఆమె టెక్ట్సుబుక్స్ బిజినెస్‌లో నిమగ్నమయ్యింది. ఈ బిజినెస్‌లో ఆమె ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంది. ఆ సమయంలోనే సుదర్శన్ అనే అతనితో పరిచయమయ్యింది. అతనితో వివాహం జరిగింది. ఆ తరువాత టెక్ట్సుబుక్స్ వ్యాపారం మీద ఆసక్తి లేకపోవడంతో సరికొత్తగా ఏదైనా చేద్దామనే ఆలోచన భర్తతో చెప్పింది. ఇద్దరూ ఆలోచించి తక్కువ ఖర్చులో ఇ-లెర్నింగ్ పిల్లలకు ఎలా అందజేయగలమనే అంశం మీద ఇద్దరూ పనిచేశారు. అది అనుకున్నంత అభివృద్ధి సాధించకపోవడంతో మూడు సంవత్సరాలలో దాన్ని మూసివేశారు.

అక్కడ నుండి బెంగళూరుకు మారిపోయారు. ఆ సమయంలోనే పూజ యోగా కోర్సును తిరిగి నేర్చుకుందామని అనుకుంది. అలా ఆమె యోగా సెంటర్‌లో చేరి మంచి యోగా టీచర్‌గా సర్టిఫికెట్ సంపాదించింది. కోర్సు అయిపోయిన తరువాత ఆమె చిన్నగా యోగ క్లాసులు చెప్పడం ప్రారంభించింది. అలా ఆమె నేర్పించేటప్పుడు తను వేసుకున్న మ్యాట్ వలన కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంది. దానితో యోగా చేసేటప్పుడు ఇప్పుడు ఉపయోగించే మ్యాట్‌లు కాకుండా మరింత సౌకర్యంగా ఉండేవి ఏమిటా అని ఆలోచించింది.

ప్రముఖమైన యోగా స్కూళ్లలో ఎటువంటివి మ్యాట్‌లను ఉపయోగిస్తారనే సమాచారాలను కూడా తెలుసుకుంది. ఇప్పటివరకు ఎవరూ కూడా సరికొత్త మ్యాట్‌లను ఆవిష్కరించలేదనేది ఆమె దృష్టికి వచ్చింది. యోగా మ్యాట్‌ను కూడా ప్రకృతి సిద్ధమైన వస్తువులతోనే తయారుచేస్తే ఇంకా సౌకర్యంగా ఉంటుందని ఆమె ఆలోచన. మొదటగా ఆమె పివిసితో తయారుచేసిన మ్యాట్ మీద కూర్చుని యోగ చేయడం ప్రారంభించింది. కాని ఇది యోగాలో ఉపయోగించే వస్తువే కాదని ఆ ప్రయత్నం మానుకుంది. మరింత మెరుగైన మ్యాట్ తయారుచేయాలనే ఉద్దేశ్యంతో యుఎస్‌నుంచి చాలా వస్తువులను దిగుమతి చేసుకుంది. సరిగ్గా ఆ సమయంలోనే మేకిన్ ఇండియా స్లోగన్ మొదలైంది. దీనితో ఆమె మనదేశంలో ఉపయోగించే వస్తువులతోనే దానిని తయారుచేయాలని నిర్ణయించుకుని మెరుగైన మ్యాట్‌కోసం తీవ్రంగా ఆలోచించింది. యోగా ట్రైనింగ్‌లో తన క్లాస్‌మేట్ టోరల్ వాల్‌తో కలిసి చర్చించింది. ఇప్పుడున్న మ్యాట్‌కు మధ్యలో కన్నం పెడితే చాలని సలహా ఇచ్చాడు. ఆ సలహాతో ఆమె సంతృప్తి చెందలేదు.

వినూత్నం





తన పార్ట్‌టైం యోగా టీచింగ్ క్లాసులను నిర్వహిస్తూనే, యోగా స్టూడియోలో కన్సల్టెంట్‌గా కూడా పనిచేసేదామె. ఒక ఐటి సంస్థ యోగా యాప్‌ని ప్రవేశపెట్టాలనుకుంటుంది. ఆ సమయంలోనే ఆమె తయారుచేయాలనుకున్న మ్యాట్ తయారైంది.

యోగాను సీరియస్‌గా చేయాలి

మొదటి సాంపిల్ మ్యాట్ తయారైంది. దానిని జ్యూట్, నేచురల్ రబ్బర్‌తో తయారుచేసింది. అది మందంగా లేదు. కాని యోగా చేసేటప్పుడు స్లిప్ అయిపోయే మ్యాట్ కంటే ఇది ఎంతో ఉపయోగకరమైనది. దాని పేరు జురు మ్యాట్‌గా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టదలిచింది పూజా. ఇది పూర్తిగా దేశీయ భారతీయ వనరులతోనే తయారుచేసింది. వీటిని నెమ్మదిగా ఆమె యోగా క్లాసులలో ఉపయోగించడం మొదలుపెట్టింది. దీనితో ఆ మ్యాట్‌లు విద్యార్థులకు నచ్చి ఇవి ఎక్కడ దొరుకుతాయని అడగడం మొదలుపెట్టారు. వారి ప్రాధాన్యతలను బట్టి వాటిని ఎక్కువగా తయారుచేసి కావలసిన వారికి అమ్మడం మొదలుపెట్టిందామె. అలా ఈ మ్యాట్ వ్యాపారం మొదలైంది. ''జురు మ్యాట్ ధ్యానానికి ఎంతో ఉపయోగకరమైంది. చాలా తేలికగా ఉండడమే కాకుండా ఎలాగైనా మడతపెట్టుకోవచ్చు. రివర్స్‌గా కూడా దీనిని మడతపెట్టవచ్చు. దీనిని రెండు విధాలుగా వాడుకోవచ్చు. దీనిని యోగా మ్యాట్‌గా మాత్రమే కాకుండా జర్నీలో మ్యాట్‌గా కూడా వాడుకోవచ్చు. దీనిమీద కూర్చుంటే మీకు గార్డెన్‌లో గడ్డిమీదగాని ఇసుకమీద గాని కూర్చున్నట్టు సౌకర్యంగా ఉంటుంది. ఇదే కాకుండా ఐదు రకాల కార్క్(బెండుతో)మ్యాట్స్‌ని కూడా తయారుచేయదలిచాము'' అని పూజా చెబుతుంది.

కేవలం మ్యాట్‌లను అమ్మకానికి పెట్టడమే కాకుండా వాటిని ఉపయోగించాక వారి ఫీలింగ్స్‌ను కూడా ఆమె తెలుసుకుంటుంది. వారిచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి సరికొత్త ప్రయోగాలను చేయాలన్న ఆలోచన ఆమెకుంది. సంవత్సరం, సంవత్సరంన్నర వరకు పూజా ప్రత్యక్షంగా లేదా ఆర్డర్లను ఫేస్‌బుక్ ద్వారా తీసుకుని అమ్మకాలు చేసింది. ప్రస్తుతం ఆమెకు ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా చాలా మ్యాట్‌లు కావాలని వినియోగదారుల నుండి ఆర్డర్లు రావడంతో వాటిని తయారుచేసే పనిలో నిమగ్నమైంది. జురు మ్యాట్ తరువాత కార్క్(బెండు) మ్యాట్‌ను తయారుచేసింది. దీనివల్ల కూడా యోగాలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. యోగా ఫెస్టివల్‌లో కార్క్ మ్యాట్‌ను ప్రవేశపెట్టడానికి రెడీ చేసిందామె. దీని గ్రిప్ చాలా అద్భుతంగా ఉంటుంది. దీనిమీద నీళ్లు పడినా ఏమీ కాదు. రివర్స్‌గా మడతపెట్టినా ఇబ్బంది ఉండదు. ప్రతి ఒక్కరు దీనిని రెండువైపులా వాడుకోవచ్చు. రెండు మ్యాట్‌లగా కూడా వాడుకోవచ్చు. దీనిని యాంటీ మైక్రోబియల్, వాషబుల్ సర్ఫేస్‌తో మనమే శుభ్రపరచుకోవచ్చు. అన్నింటికన్నా ప్రత్యేకంగా చెప్పాల్సిందేమింటే దీనిని శుభ్రపరచకపోతే బ్యాక్టీరియా ఏర్పడుతుందనే దిగులు ఏ కోశాన ఉండదని, అలెర్జీలు, ఇన్ఫెక్షన్స్‌వంటివి దగ్గరికే రావని ఆమె చెబుతుంది. పివిసి మ్యాట్స్ ఇష్టంలేనివారు, ప్రాణాయామం చేసేవారందరూ దీనిని తప్పకుండా వాడుతున్నారు. మట్టి వాసన ఎలా ఉంటుందో అలాగే దీని వాసన ఉంటుంది. దీనిని యాంటీ మైక్రోబయాల్‌గా తయారుచేయడం వల్ల ఇది ఈ వాసనను కలిగి ఉంది. పూజ ఈ కార్క్ మ్యాట్‌లను కూడా నెమ్మదిగా యోగా మార్కెట్‌లోకి తీసుకురావడం మొదలుపెట్టింది. చెన్నైకి తిరిగి వెళ్లి జురు యోగా ప్రైవేట్ కంపెనీని 2016లో రిజిస్టర్ చేసింది. ఈ మ్యాట్‌లను అందరికీ అందజేయాలనే ఉద్దేశ్యంతో ఆమె ఇ కామర్స్ వెబ్‌సైట్‌ని కూడా ప్రారంభించింది. అలాగే కొన్ని బ్రాంచీలను రూపొందించుకుని వారికి కావలసిన సూచనలను ఇస్తూ మార్కెట్‌ను పెంపొందించుకుంది. సోషల్‌మీడియా, బ్లాగ్‌ల ద్వారా కూడా ఎన్నో ఆర్డర్లను పొందుతుందామె. ఆమె వ్యాపారం ప్రతినెలా అభివృద్ధి చెందుతూ వస్తోంది. ప్రస్తుతానికి 4000మంది ఈ మ్యాట్‌లను వినియోగిస్తున్నారంటే ఈ మ్యాట్‌లపై ఎంత క్రేజ్ ఉందో గమనించవచ్చు. ఇప్పటివరకు 50 లక్షల వ్యాపారాన్ని వాళ్లు చేశారంటే నమ్మశక్యంగా లేదు కదూ. కేవలం ఇదే కాకుండా ఆరోగ్యపరంగా ప్రకృతికి సంబంధించిన వస్తువులతో మరిన్ని వస్తువులను తయారుచేసి మార్కెట్లోకి తీసుకురావాలన్న సంకల్పంతోనే ఉన్నానని ఎంతో ఉత్సాహంగా చెబుతుంది పూజా.

'ఫోర్బ్స్'కెక్కిన శ్రద్ధా వంట!

చేసే పని పట్ల శ్రద్ధ, ఆసక్తి ఉంటే ఎటువంటి రంగంలోనైనా విజయం సాధించవచ్చునని నిరూపించారు శ్రద్ధాబన్సాలీ. వెరైటీ వంటకాలను విభిన్నంగా తయారుచేస్తూ తక్కువ సమయంలోనే ప్రతిష్టాత్మకమైన ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో పేరు సంపాదించారు. ఆమె ఈ రంగంలోకి రావడానికి గల కారణాలేమిటనేవి తెలుసుకుందాం.



శ్రద్ధా బన్సాలి ముంబయికి చెందినది. ప్రతిష్టాత్మకమైన ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో ఫోర్బ్స్ ఇండియాస్ 30 అండర్ 30-2018 నివేదికలో ఆమె పేరు ఉండడంతో ఈమధ్యకాలం వార్తల్లో మారుమోగుతూ ఉంది. ఆమె వయసు 25 సంవత్సరాలు. చిన్నవయసులోనే ముంబయిలో స్వతంత్రంగా ఒక రెస్టారెంట్‌ను ప్రారంభించి రెండు సంవత్సరాలుగా విజయపథంలో నడుపుతోందామె. ఈ రెస్టారెంట్‌లో వంటకాలు విభిన్నంగా ఉండడంతో తక్కువ సమయంలోనే ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించగలిగింది. ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో విజయవంతమైన మహిళల జాబితాలో ఆమె పేరు నమోదు కావడం విశేషమే. ముంబయిలోనే పుట్టి పెరిగిందామె. ఆమె తండ్రి మంచి వ్యాపారవేత్త. తల్లి గృహిణి. శ్రద్ధా బన్సాలీకి ఎప్పుడూ వెరైటీ వంటలు చేయడమంటే ఎంతో ఆసక్తిగా ఉండేది. అందుకనే తల్లి వంట చేస్తున్నప్పుడు ఆమె ఏవిధంగా చేస్తున్నదనేది వెనుకగానే ఉండి అంతా నేర్చుకునేది. ఆ తరువాత తల్లి ప్రమేయం లేకుండా ఆమే వంటలు చేసేది. ఆమె చేస్తున్న వెరైటీల వంటల రుచి చూసిన తల్లి రెస్టారెంట్ పెడితే బాగుంటుందని సలహా ఇచ్చింది. తల్లి ప్రోత్సాహంతోనే ఆమె ముందుకు కదిలింది. స్కూలు చదువు అయిపోయాక ఆమె ఉన్నత చదువుల కోసం యుఎస్‌కి వెళ్లింది. ఆమె గ్రాడ్యుయేషన్‌ని హాస్పిటాలిటీ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్రమ్ బోస్టన్ యూనివర్శిటీ నుండి 2010-2014లో పొందింది.

గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ఆమె తిరిగి భారతదేశం వచ్చింది. భారతదేశానికి వచ్చిన తరువాత ముందుగా ఫైవ్ స్టార్ హోటల్‌లో పనిచేయడం మొదలుపెట్టింది. కాని ఆమె మనసులో దృఢంగా నిర్ణయించుకుంది ఎప్పటికైనా ఒక రెస్టారెంట్‌ను స్వంతంగా ప్రారంభించాలని. ఇదే ఆమె కల అని తల్లిదండ్రులకు చెప్పింది. ఆమె నిర్ణయానికి వాళ్లు మద్దతును తెలియజేశారు. వాళ్ల అంగీకారంతో ఆమె ఉద్యోగాన్ని వదలిపెట్టి సొంతంగా వ్యాపారం ప్రారంభించింది. ముంబయిలో క్యాండీ అండ్ గ్రీన్, ఇన్ బ్రీచ్ క్యాండీలో ఆమె తన మొదటి రెస్టారెంట్‌ను ప్రారంభించింది. దీనికి కావలసిన మొత్తాన్ని తండ్రి సమకూర్చారు. రెస్టారెంట్‌లో ఏమేమి కావాలనే ప్రతి ఒక్క అంశాన్ని ఆమె స్వయంగా చూసుకునేది. 400 చదరపు అడుగుల ప్రాంతంలో రెస్టారెంట్‌ను ప్రారంభించారు. రెస్టారెంట్ రూఫ్‌కి వెరైటీ వెజిటబుల్స్‌తో అలంకరించారు. ఇది వెజిటేరియన్ రెస్టారెంట్‌ని సింబాలిక్‌గా తెలియడానికి. కాని చైనీస్, ఇటాలియన్, థాయ్ కుషైన్, భారతీయ సాంప్రదాయ రుచులు కూడా ఇక్కడ లభిస్తాయి. ఆమె రెస్టారెంట్ చాలా పరిశుభ్రంగా ఉండేటట్లు ఎంతో జాగ్రత్తలు తీసుకుంటుంది. అంతేకాకుండా సీజన్ బట్టి అక్కడ లభించే ఫుడ్ కూడా మారుతూ ఉంటుంది. ఇన్ని వెరైటీలు, ఇన్ని విశేషాలు ఉన్నాయి కాబట్టే అతి త్వరలోనే అందరి దృష్టి ఈ రెస్టారెంట్ మీద పడింది. శ్రద్ధా బన్సాలీ



వంటల రుచులను ఆ నోటా ఈనోటా విని ఇప్పుడు ఎక్కువగా సినిమాస్టార్లు, ప్రముఖులు, సెలబ్రిటీలు ఈ రెస్టారెంట్‌కు రావడం మొదలుపెట్టారు. వీళ్ల రద్దీ ఎక్కువ కావడంతో సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఇంకొక రెస్టారెంట్‌ను ప్రారంభించాలనే దిశగా ముందుకునడుస్తోంది శ్రద్ధా బన్సాలీ.

మార్చిలో సైరా షెడ్యూల్


చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి టైటిల్ పాత్రలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం సైరా నరసింహారెడ్డి రెండో షెడ్యూల్ చిత్రీకరణ మార్చిలో మొదలుకానున్నట్లు తెలిసింది. ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసుకున్న ఈ చిత్రం కొద్దిరోజుల విరామం తర్వాత రెండో షెడ్యూల్‌కు సమాయత్తమవుతోంది. చారిత్రక కథాంశంతో కూడుకున్న చిత్రం కావడంతో పాత్రలోని మార్పులకు అనుగుణంగా చిరంజీవి తన గెటప్‌ను, బాడీలాంగ్వేజ్‌ను తీర్చిదిద్దుకుంటున్నారు. తొలి షెడ్యూల్లో సన్నివేశాల కోసం గడ్డం, మీసాలు పెంచి కనిపించిన ఆయన ఇప్పుడు రెండో షెడ్యూల్‌లో వయసులో చిన్నగా కనిపించడం కోసం ట్రిమ్‌గా తయారవుతున్నారట. అందుకోసం ఇటీవల ప్రత్యేక వ్యాయామంతో పాటు నేచురోపతి ట్రీట్‌మెంట్ కూడా తీసుకుంటున్నట్లు ప్రచారం జరిగింది. ఇందులో ఓ ముఖ్యపాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ నటిస్తున్నారని చిత్రబృందం మొదట్లోనే తెలియజేసింది. అయితే అమితాబ్ తప్పుకున్నారని ఇటీవల ఊహాగానాలు వెల్లువెత్తాయి. కానీ అమితాబ్ ఈ చిత్రంలో నటిస్తున్నారని మరోసారి స్పష్టమైంది. తాజాగా చిత్ర దర్శకుడు సురేందర్‌రెడ్డి ముంబాయికి వెళ్లి అమితాబ్‌ను కలిశారు. ఆ స్టిల్‌నే సురేందర్‌రెడ్డి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. దాంతో అమితాబ్ నటిస్తున్నారన్న వార్త అధికారికంగా ధృవీకరించినట్లయింది. ఈ చిత్రంలో నరసింహారెడ్డి పాత్రను పోషిస్తున్న చిరంజీవికి గురువు అయిన గోసాయి వెంకన్న పాత్రలో అమితాబ్ నటించనున్నారట. అమితాబ్ పాత్రకు సంబంధించిన స్క్రిప్ట్‌ను పూర్తిగా విశదీకరించడం కోసమే సురేందర్‌రెడ్డి ముంబాయి వెళ్లారట. రెండో షెడ్యూల్లో చిరంజీవితో పాటు అమితాబ్, నయనతార వంటి ప్రధాన తారాగణం పాల్గొంటారని అంటున్నారు.

కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై సురేఖ సమర్పణలో రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో, జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి, నాజర్, రవికిషన్, ముఖేష్‌రుషి, రఘుబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, వి.జయప్రకాష్, రఘు కారుమంచి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కథ, పరుచూరి బ్రదర్స్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, రచనా సహకారం: సత్యానంద్, భూపతిరాజా, డి.ఎస్.కన్నన్, మధుసూదన్, వేమారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వాకాడ అప్పారావు, వి.వై.ప్రవీణ్‌కుమార్.



విజయనిర్మలను భారత ప్రభుత్వం సత్కరించాలి

- కృష్ణ

సీనియర్ నటి, దర్శకురాలు విజయనిర్మల తన 73వ జన్మదినోత్సవాన్ని హైదరాబాద్‌లోని తన నివాసంలో అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయనిర్మల స్పందిస్తూ...ఒకసారి దాసరిగారు మా ఇంటికొచ్చి...నా పుట్టినరోజు వేడుకలకు అభిమానులు రావడం చూసి సంతోషించారు. ఏ స్టార్ హీరోయిన్‌కూ ఈ స్థాయి క్రేజ్ లేదు అని అన్నారు. అదే నాకు పద్మభూషణ్‌తో సమానం ఈ వేడుకకు వచ్చిన అభిమానులందరికీ ధన్యవాదాలను తెలియజేస్తున్నా అని అన్నారు.

ఇదే వేడుకలో పాల్గొన్న సూపర్‌స్టార్ కృష్ణ మాట్లాడుతూ, అక్కినేని నాగేశ్వరరావు, రజనీకాంత్, శివాజీగణేషన్ వంటి స్టార్‌లతో సినిమాలు తీసిన ఏకైక దర్శకురాలు విజయనిర్మల. ఆమె తెరకెక్కిన 44 చిత్రాల్లో సగానికి పైగా సినిమాల్లో నేను నటించడం సంతోషంగా ఉంది. ప్రతీ ఏడాది ఈ విధంగా మా ఇంటికి విచ్చేసి, తమ అభిమానాన్ని చాటుకుంటున్న అభిమానులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. గిన్నిస్ బుక్ వారు గౌరవించిన విజయనిర్మలను భారత ప్రభుత్వం తగిన రీతిలో సత్కరిస్తుందని ఆశిస్తున్నా అని అన్నారు. సీనియర్ నరేష్ మాట్లాడుతూ, మా కుటుంబ సభ్యులందరి పుట్టినరోజులకు ఈ విధంగా అభిమానులు విచ్చేయడం చాలా సంతోషంగా ఉంటుంది. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం అభిమానంతో ఇక్కడికి విచ్చేయడం ఆనందదాయకం అని అన్నారు. నిర్మాత బి.ఎ.రాజు మాట్లాడుతూ, దాసరి, బాపు వంటి టాప్ డైరెక్టర్ల మొదటి చిత్రాల హీరోయిన్ విజయనిర్మలగారే. అలాగే స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన విజయశాంతిని కిలాడికృష్ణుడు చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం చేసింది కూడా విజయనిర్మలగారే అని చెప్పారు. ఇంకా ఈ పుట్టినరోజు వేడుకల్లో అభిమానులతో పాటు పలువురు ప్రముఖ నటీనటులు పాల్గొన్నారు. కాగా తన పుట్టినరోజు సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు విజయనిర్మల 73 వేల రూపాయల చెక్కును అందజేశారు.

త్రిష ఉండాలని కోరుకుంటా

కీర్తిసురేష్



సామి-2 చిత్రంలో త్రిష కూడాఉండాలని కోరుకుంటా. ఆ విషయాన్ని దర్శకుడితో కూడా చెప్పానని కీర్తిసురేష్ అంటోంది. విక్రమ్ కథానాయకుడిగా హరి దర్శకత్వంలో గతంలో వచ్చిన సామి చిత్రం విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంతకాలం గ్యాప్ తర్వాత ఇప్పుడు సామి-2ను తెరకెక్కించేందుకు దర్శకుడు హరి పూనుకున్నారు. సామిలో కథానాయికగా నటించిన త్రిషనే తొలుత సామి-2లో ఒక కథానాయికగా తీసుకుని, ఆ తర్వాత మరో కథానాయికగా కీర్తిసురేష్‌ను ఎంపికచేశారు. అయితే కారణాలు ఏవైనప్పటికీ త్రిష ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. అయితే అందుకు తాను కారణం కానే కాదని కీర్తి చెప్పినట్లు వార్తలొచ్చాయి. ఇదిలావుండగా...ఈ చిత్రంలో త్రిష కూడా ఉండాలని తాను కోరుకుంటానని కీర్తి తాజాగా వెల్లడించింది. సినీరంగంలో ఎవరి అవకాశాలు వారివేనని, వేరేవాళ్ల అవకాశాలను అందిపుచ్చుకోవాలన్న అవసరం తనకు లేదని కీర్తి అంటోంది. ఇక తెలుగులో నేను శైలజ, నేను లోకల్ వంటి హిట్ చిత్రాల తర్వాత అజ్ఞాతవాసి చిత్రంతో హ్యాట్రిక్ కొట్టాలన్న కీర్తి ఆశలు నెరవేరలేదు. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న సావిత్రి బయోపిక్ మహానటి చిత్రంలో టైటిల్ పాత్రలో ఆమె నటిస్తోంది. తమిళంలో విక్రమ్, సూర్య, విజయ్ వంటి హీరోలకు జోడీగా నటించడంతో కోలీవుడ్‌లో ఆమె పేరు మారుమోగుతోంది. విజయ్ 62వ చిత్రంలో విజయ్‌కు నాయికగా నటిస్తున్న ఆమె ఇందులో తాను రెండో హీరోయిన్ అన్న మాటలను కొట్టిపారేశారు. ఇందులో తాను మాత్రమే కథానాయిక అని చెబుతున్నారు. ఇక విక్రమ్‌తో నటిస్తున్న సామి-2 చిత్రం నిర్మాణంలో ఉంది.

గుణశేఖర్ దర్శకత్వంలో


రానా

బాహుబలి, ఘాజీ వంటి చిత్రాలు నటుడు రానాకు మంచి బ్రేక్ ఇచ్చాయి. రానాతో ఎలాంటి ప్రయోగాత్మక సినిమాలు తీయవచ్చనే నమ్మకం కుదిరించాయి. నేనే రాజు నేనే మంత్రి కమర్షియల్ హిట్‌తో హీరోగా కూడా సక్సెస్ అయ్యాడు రానా. తెలుగుతో పాటుగా హిందీ చిత్రాల్లో నటిస్తున్న రానాతో దర్శకుడు గుణశేఖర్ ఓ భారీ చిత్రం తీస్తారని ప్రచారం జరుగుతోంది. హిరణ్యకశిపు అనే టైటిల్ ఇప్పటికే రిజిష్టర్ చేశారు. టైటిల్ పాత్రలో రానాతో నటింపజేస్తారని తెలిసింది. గుణశేఖర్ తీసిన రుద్రమదేవిలో రానా నటించిన విషయం తెలిసిందే. పౌరాణిక పాత్రలకు కూడా రానా పర్సనాలిటీ బాగా నప్పుతుంది. అందుకే హిరణ్యకశిపు సినిమాను ప్లాన్ చేసినట్టు సమాచారం. అన్ని భాషల్లోకి అనువదించేలా తీస్తున్నారు. భారీ బడ్జెట్ కేటాయించినట్టు తెలిసింది. ఈ ఏడాది ద్వితీయార్థంలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలున్నాయి. కొద్ది సంవత్సరాలుగా గుణశేఖర్ హిరణ్యకశపు కథపై కసరత్తు చేస్తున్నారు. అనేక పుస్తకాల నుండి సమాచారం సేకరించారు. చివరకు ఓ రూపం ఇచ్చారు. ఈ చిత్రంలో నటించే ఇతర తారాగణం వివరాలు తెలియాల్సి ఉంది.

వినోదాన్ని పంచే ఊ.పె.కు.హ.

రాజేంద్రప్రసాద్, సాక్షిచౌదరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం ఊ.పె.కు.హ. (ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి). నిధి ప్రసాద్ దర్శకుడు. జె.బి.క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మించిన ఈ చిత్రం నిర్మాణానంతర పనులను సైతం పూర్తిచేసుకుని విడుదలకు సన్నద్ధమవుతోంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు రాజేంద్రప్రసాద్ విడుదలచేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సినిమాలు తీసేవాళ్లలో రెండు రకాలు ఉంటారు. పెద్దగా కష్టపడకుండా సినిమాలు తీసేవాళ్లు ఒక రకమైతే... ప్రేక్షకులకు వినోదాన్ని పంచాలన్న ఏకైక లక్ష్యంతో ఎన్ని కష్టాలనైనా కోరుకుని మరీ సినిమాను అందించేవాళ్లు రెండో రకం. ఈ చిత్ర దర్శకుడు నిధి ప్రసాద్ రెండోరకానికి చెందిన వ్యక్తి. దాదాపు 80 మంది ఆర్టిస్టులతో ఆయన ఈ సినిమాను తీశారు. దీనిని బట్టి ఆయన తనను ఎంత కష్టపెట్టుకున్నారో అర్థమౌతుంది. గతంలో అతని దర్శకత్వంలో అందరూ దొంగలే, మైఖేల్ మదన్ కామరాజు, భాగ్యలక్ష్మి బంపర్ డ్రా వంటి సినిమాలు చేశాను. ఈ సినిమా కామెడీ ఎర్రర్స్‌తో రూపొందింది. నూరుశాతం ప్రేక్షకులకు వినోదాన్ని పంచేవిధంగా ఈ చిత్రం ఉంటుంది అని అన్నారు.


రాజేంద్రప్రసాద్, సాక్షి చౌదరి

దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని ప్రతీ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. ఎక్కువమంది ఆర్టిస్టులతో షూటింగ్ చేయడం కష్టం. అయినా ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు సహకారంతో షూటింగ్ అంతా సజావుగా సాగిపోయింది. ఎడిటర్ శంకర్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, ఛాయాగ్రాహకుడు వాసు తదితర సాంకేతిక నిపుణులు ఈ చిత్రం బాగా వచ్చేందుకు ఎంతో కష్టపడ్డారు అని చెప్పారు.

కథానాయిక సాక్షిచౌదరి మాట్లాడుతూ, రాజేంద్రప్రసాద్ చిత్రంలో అవకాశం రావడం ఆనందదాయకమని, వినోదాత్మక చిత్రాలకు ప్రేక్షకులు ఎప్పుడూ పట్టం కడుతూనే ఉన్నారని అన్నారు.


జె.బి.క్రియేషన్స్ అధినేత విక్రమ్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో హీరోకి ఆరుగురు తమ్ముళ్ళు, హీరోయిన్‌కి ఆరుగురు చెల్లెళ్ళు ఉంటారు. వారందరి మధ్య చక్కటి వినోదాత్మకంగా ఈ చిత్రం సాగుతుంది. ప్రేక్షకుడు టిక్కెట్ రూపంలో పెట్టే డబ్బుకి తగ్గ వినోదాన్ని ఈ చిత్రం అందిస్తుంది అని అన్నారు.

ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు మాట్లాడుతూ, సినిమా బాగా రావాలన్న తపనతో నిధి ప్రసాద్ పనిచేస్తుంటారు. ఆయన తాజాగా తెరకెక్కించిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది అన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

బెల్లంకొండ కొత్త సినిమా

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వంశధార క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. శ్రీనివాస్ దర్శకుడు. నవీన్ పొంటినేని (నాని) నిర్మిస్తున్నారు.

నిర్మాత మాట్లాడుతూ దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్ చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ అద్భుతమైన కథని సిద్ధం చేశారు. చోటా కె.నాయుడు, తమన్ మా చిత్రానికి పనిచేస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో షూటింగ్ మొదలవుతుంది అన్నారు.


బెల్లంకొండ సాయి శ్రీనివాస్

భారత్ - పాక్‌ల యుద్ధభూమి


మోహన్‌లాల్, అల్లు శిరీష్

1971 భారత సరిహద్దుల్లో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన చిత్రం 1971 బియాండ్ బార్డర్స్. మేజర్ రవి దర్శకుడు. గత ఏడాది విడుదలై విజయం సాధించిన ఈ చిత్రాన్ని తెలుగులో ఏయన్. బాలాజీ అనువదిస్తున్నారు. మోహన్‌లాల్, అల్లు శిరీష్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రస్తుతం అల్లు శిరీష్ డబ్బింగ్ చెబుతున్నారని, మార్చిలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. చిత్ర దర్శకుడు నిజజీవితంలో మేజర్ కావడం విశేషం. ఆర్మీలో కీలక ఆపరేషన్స్‌కు ప్రాతినిధ్యం వహించారని నిర్మాత తెలిపారు. 1971 భారత్, పాక్ సరిహద్దుల్లో జరిగిన యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది. మేజర్‌గా మోహన్‌లాల్, సైనికుడిగా అల్లు శిరీష్ కనిపిస్తారు. తెలుగులో కూడా ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం సిద్దార్థ్‌విపిన్, మాటలు ఎమ్. రాజశేఖరరెడ్డి, ఛాయాగ్రాణం సుజీత్ వాసుదేవ్.

అమెరికా వెళ్లిన గూఢచారి

అడవి శేష్ హీరోగా నటిస్తున్న చిత్రం గూఢచారి. పీపుల్ మీడియా పతాకంపై అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శశికిరణ్ తిక్క దర్శకుడు. శోభిత ధూళిపాళ్ళ నాయికగా నటిస్తోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది.

నిర్మాతలు మాట్లాడుతూ కొత్త కాన్సెప్ట్‌తో గూఢచారి చిత్రం తెరకెక్కుతోంది. అడవి శేష్ స్పై పాత్రలో కనిపిస్తారు. అమెరికాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న చిత్రమిది. వేసవికి విడుదల చేస్తాం అని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం షానిల్ డియో, మాటలు అబ్బూరి రవి, సంగీతం శ్రీచరణ్ పాకాల, సహ నిర్మాత వివేక్ కూచిబొట్ల వివేక్.


అడవి శేష్